ఈనాడు

విజయవాడ 27-2-2026 శుక్రవారం సిటీ సంపుటి 52 . సంచిక 198
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 6-50 పేజీలు 14
www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

భారత్, ఇజ్రాయెల్ సంబంధాల్లో.. సరికొత్త శకం

ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యంగా ద్వైపాక్షిక బంధం


జెరూసలెంలో ఒప్పంద పత్రాలపై సంతకాలు చేసిన అనంతరం విలేకరుల సమావేశంలో ప్రధాని మోదీ, విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్.జైశంకర్, ఇజ్రాయెల్ విదేశాంగ మంత్రి గిడియన్ సార్, ప్రధాని నెతన్యాహు


- **నెతన్యాహుతో ప్రధాని మోదీ భేటీ**
- **త్వరలోనే ఎఫ్‌టీఏ కుదుర్చుకోవాలని నిర్ణయం**
- **17 ఒప్పందాలపై రెండు దేశాల సంతకాలు**

జెరూసలెం: భారత్-ఇజ్రాయెల్ సంబంధాల్లో సరికొత్త శకం మొదలైంది. ఎన్నో కాల పరీక్షలకు నిలిచిన తమ బంధాన్ని ఇరు దేశాలూ తాజాగా 'ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యం' స్థాయికి పెంచుకున్నాయి. ఉభయ ప్రయోజనకర స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని (ఎఫ్‌టీఏ) త్వరలోనే కుదుర్చుకోవాలనీ నిర్ణయించుకున్నాయి. ఇజ్రాయెల్ పర్యటనలో భాగంగా ఆ దేశ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహుతో భారత ప్రధాని మోదీ గురువారం భేటీ అయ్యారు. ద్వైపాక్షిక బంధాన్ని మరింత బలోపేతం చేసుకునే దిశగా చర్చలు జరిపారు.

> “సంఘర్షణలకు మానవాళి బలిపశువుగా మారకూడదు. గాజా శాంతి ప్రణాళికకు భారత్ మద్దతు ఉంటుంది. ఉగ్రవాదానికి ప్రపంచంలో చోటు లేదు.
> - ప్రధాని మోదీ

(మిగతా 3లో)

ఎన్సీఈఆర్టీ వివాదాస్పద పాఠ్యపుస్తకంపై సంపూర్ణ నిషేధం



- ముద్రిత, డిజిటల్ రూపంలోని ప్రతులన్నింటినీ తక్షణమే జప్తు చేయండి
- న్యాయవ్యవస్థను కించపరిచే అంశాలను మరే రూపంలోనూ వ్యాప్తి చేయరాదు
- సుప్రీంకోర్టు సీజేఐ ధర్మాసనం ఆదేశం
- సంస్థ డైరెక్టర్, పాఠశాల విద్య కార్యదర్శికి షోకాజ్ నోటీసులు
- వివాదాస్పద పాఠ్యాంశంపై క్షమాపణలు తెలిపిన కేంద్రం

3లో

మద్యం కుంభకోణం నిందితుడు ముప్పిడి అవినాష్‌రెడ్డి అరెస్ట్

- లంచాల నెట్‌వర్క్ నిర్వహణ, మనీ లాండరింగ్‌లో కీలక పాత్ర
- ప్రధాన నిందితుడు రాజ్ కెసిరెడ్డికి తోడల్లుడు
- గతేడాది సిట్ ఏర్పాటైన మరుక్షణమే థాయ్‌లాండ్‌కు పరారు
- సుప్రీంకోర్టు ఆదేశాలతో ఎట్టకేలకు సిట్ విచారణకు హాజరు
- శుక్రవారం వరకూ రిమాండ్
- గుంటూరు జిల్లా జైలుకు తరలింపు

ఈనాడు, అమరావతి: వైకాపా హయాంలో జరిగిన రూ.వేల కోట్ల మద్యం కుంభకోణంలో ఆ ముఠా తరఫున లంచాల వసూళ్ల నెట్‌వర్క్ నిర్వహణ, డొల్ల కంపెనీలను అడ్డం పెట్టుకుని లంచాల సొమ్ము మనీ లాండరింగ్ చేయటంలో అత్యంత కీలకంగా వ్యవహరించిన ముప్పిడి అవినాష్‌రెడ్డి ఎలియాస్ సుమిత్ (ఏ7) ఎట్టకేలకు అరెస్టయ్యారు. ఆయన ఈ కేసులో ప్రధాన (మిగతా 3లో)


అవినాష్‌రెడ్డిని విజయవాడ కోర్టు సముదాయం నుంచి గుంటూరు జైలుకు తరలిస్తున్న పోలీసులు

నేను చెప్పినంత లంచమివ్వాల్సిందే

మద్యం డిస్టిలరీలు, సరఫరా కంపెనీలకు అవినాష్‌రెడ్డి బెదిరింపులు 3లో

రిమాండ్ రిపోర్టులో సిట్ వెల్లడి

రాజ్ కెసిరెడ్డి బెయిల్‌తో ముడిపడటంతోనే..

మద్యం కుంభకోణంలో ప్రధాన నిందితుడైన రాజ్ కెసిరెడ్డి గతేడాది ఏప్రిల్ 21న అరెస్టై జైల్లో ఉన్నారు. ఆయన తర్వాత అరెస్టైనవారికి బెయిల్ వచ్చినా రాజ్ కెసిరెడ్డి బెయిల్ పిటిషన్లు వివిధ కోర్టుల్లో పలుమార్లు తిరస్కరణకు గురయ్యాయి. ఇటీవల సుప్రీంకోర్టు సైతం ఆయనకు బెయిల్ ఇవ్వటానికి నిరాకరించింది. 'ముప్పిడి అవినాష్‌రెడ్డి మీ మనిషే. మీరే ఆయన్ను పారిపోయేలా ప్రోత్సహించారు. ముందు లొంగిపొమ్మని చెప్పండి. ఈ కేసులో అసలైన వ్యక్తి అవినాష్‌రెడ్డే. అతను మీ నీడ. మీరు తరలించిన సొమ్ముకు సంబంధించిన కంపెనీకి ఆయన నేతృత్వం వహిస్తున్నారు. అతను పరారీలో ఉన్నందున ప్రస్తుతం మీకు బెయిల్ మంజూరు చేయటం సరికాదు' అని విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు న్యాయమూర్తులు వ్యాఖ్యానించారు. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో రాజ్ కెసిరెడ్డి తరఫు వారు ఎట్టకేలకు ఆయన్ను రప్పించారు.

వర్షపాతం తగ్గొచ్చు.. ముందే సిద్ధమవుదాం

- 790 టీఎంసీలు నిల్వ ఉన్నాయి
- మే 15కే ఖరీఫ్ సాగు చేయించాలి
- స్వర్ణాంధ్ర విజన్‌లో నీటి భద్రతకు బ్లూప్రింట్
- ఈ ఏడాది జులై నాటికి వెలిగొండ నీళ్లు ఇస్తాం
- పుష్కరాల కన్నా ముందే పోలవరం పూర్తి
- పోలవరం-నల్లమలసాగర్ అనుసంధానం ఎవరికీ నష్టం కాదు
- శాసనసభలో సీఎం చంద్రబాబు



ఈనాడు, అమరావతి: 'ఈ ఏడాది వర్షపాతం తగ్గొచ్చు అన్న సూచనలు ఉన్నాయి. ఇందుకు అనుగుణంగా ముందే సిద్ధమవుదాం. రాష్ట్రంలోని జలాశయాల్లోని మొత్తం నీటి నిల్వ సామర్థ్యం 1,312 టీఎంసీలు కాగా ప్రస్తుతం 790 టీఎంసీలు ఉన్నాయి. మే 15 నాటికే ఖరీఫ్ సాగు ప్రారంభం కావాలి. ఎమ్మెల్యేలు ఇందుకు అందరినీ సన్నద్ధం చేయాలి. ఇబ్బందులు రాకుండా చూసుకోవాలి. 2047 స్వర్ణాంధ్ర విజన్‌లో భాగంగా నీటి భద్రతకు ప్రాధాన్యం ఇస్తున్నాం. ఇందుకోసం బ్లూప్రింట్ సిద్ధం చేస్తున్నాం. ప్రతి ఇంటికీ నికర జలాలు అందించాలి. నదుల అనుసంధానంతో తెలుగుతల్లికి జలహారతి ఇవ్వాలి' అని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. శాసనసభలో గురువారం ఆయన జలవనరుల బడ్జెట్ కేటాయింపులపై జరిగిన చర్చకు సమాధానం ఇచ్చారు. ముఖ్యమంత్రి ప్రసంగంలోని ముఖ్యాంశాలు ఇవీ...

విచిత్రమైన వ్యక్తి.. క్రెడిట్ చోరీ..

1996లో వెలిగొండ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశా. ఆ ప్రాంతానికి వెళ్లినప్పుడల్లా అక్కడి ప్రజలు శ్రీశైలం నుంచి నీళ్లు ఇవ్వాలి అని అడిగేవారు. అలా రూపం దాలుస్తున్నదే వెలిగొండ. ఈ ప్రాజెక్టు పూర్తి చేసి నీళ్లు ఇవ్వాలంటే ఎన్డీయే ప్రభుత్వం వచ్చేసరికి రూ.2,500 కోట్లు ఖర్చు చేయాల్సిన పరిస్థితి. మేం వచ్చిన తర్వాత ఇప్పటికే రూ.500 కోట్లు ఇచ్చాం. అలాంటిది జగన్ ఈ ప్రాజెక్టుకు రిబ్బన్ కత్తిరించి పూర్తి చేసేశామంటూ (మిగతా 10లో)



ఒక్కటైన విజయ్.. రష్మిక

ఉదయ్‌పూర్‌లో ఘనంగా వివాహం

వెండితెరపై విజయవంతమైన జోడీగా అలరించిన విజయ్ దేవరకొండ, రష్మిక నిజ జీవితంలో వివాహబంధంతో ఒక్కటయ్యారు. గురువారం రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో కుటుంబ సభ్యులు, ఇద్దరికీ సన్నిహితులైన సినీ ప్రముఖుల సమక్షంలో రెండు సంప్రదాయ పద్ధతుల్లో పెళ్లి ఘనంగా జరిగింది.

విరోష్... పెళ్లి జోష్

వివరాలు సినిమా లో



చెన్నైలో చమక్

జింబాబ్వేపై భారత్ ఘనవిజయం

టీ20 ప్రపంచకప్ సెమీస్ రేసులో నిలవాలంటే తప్పక గెలవాల్సిన మ్యాచ్‌లో టీమ్‌ఇండియా దుమ్మురేపింది. గురువారం చెన్నైలో జరిగిన మ్యాచ్‌లో అభిషేక్ శర్మ (55), హార్దిక్ పాండ్య (50 నాటౌట్), తిలక్ వర్మ (44 నాటౌట్), ఇషాన్ కిషన్ (38), సూర్యకుమార్ (33) చెలరేగడంతో 72 పరుగుల తేడాతో జింబాబ్వేను చిత్తు చేసింది. హార్దిక్ 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచాడు.

- వివరాలు ఛాంపియన్ లో

పెద్ద విమానాలతో తిరుపతి రన్‌వే కళకళ

- విమానాశ్రయంలో పెరిగిన రద్దీ
- తొలిసారిగా పదిలక్షల మంది ప్రయాణికుల రాకపోకలు
- ఈ ఏడాది 11.5 లక్షల లక్ష్యం
- ఏపీడీ భూమినాథన్ వెల్లడి



ఈనాడు డిజిటల్, తిరుపతి; రేణిగుంట, న్యూస్‌టుడే: తిరుపతి విమానాశ్రయం సరికొత్త రికార్డులు నమోదుచేస్తోంది. తొలిసారిగా ఆర్థిక సంవత్సరం ముగియకముందే (జనవరి నాటికే) 10 లక్షల మంది ప్రయాణికుల రాకపోకల మైలురాయిని దాటింది. చిన్న విమానాల (ఏటీఆర్) స్థానంలో పెద్ద విమానాలు (ఎయిర్‌బస్) అందుబాటులోకి రావడం, భక్తుల రద్దీ పెరగడంతో ఈ ఘనత సాధ్యమైందని ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్ (ఏపీడీ) భూమినాథన్ తెలిపారు. గతేడాది 9.9 లక్షల మంది ప్రయాణించగా, ఈ ఆర్థిక సంవత్సరం(మార్చి) ముగిసేనాటికి 11.5 లక్షలకు చేరే అవకాశముందని అంచనా.

భారీ విమానాలతోనే బూస్ట్

గతంలో 72 సీట్లు ఉండే ఏటీఆర్ విమానాలు ఎక్కువగా నడిచేవి. ఇప్పుడు వాటిస్థానంలో 230 సీట్ల (మిగతా 3లో)

లొంగిపోతానన్న కమాండర్‌ను హత్య చేసిన మావోయిస్టు నాయకుడు

గత నెలలో ఘటన.. ఆలస్యంగా వెలుగులోకి

భువనేశ్వర్: పోలీసుల ముందు లొంగిపోవడానికి సిద్ధపడిన మావోయిస్టు కమాండర్‌ను అతడి నాయకుడు హత్య చేసినట్లు ఒడిశా అధికారులు తెలిపారు. కంధమాల్ జిల్లా ఎస్పీ హరీష్ తెలిపిన ప్రకారం.. ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మాకు చెందిన అన్వేష్ అలియాస్ రేణు మావోయిస్టు డివిజనల్ కమిటీ సభ్యుడిగా, కలహండి-కంధమాల్-బౌధ్-నయాగఢ్ (కేకేబీఎన్) డివిజన్ ప్లటూన్ కమాండర్‌గా ఉండేవాడు. అతడిపై రూ.22 లక్షల రివార్డు కూడా ఉంది. కొద్ది నెలల క్రితం తన వద్దనున్న క్యాడర్‌తో కలిసి ఒడిశా పోలీసుల ముందు లొంగిపోవడానికి అన్వేష్ ప్రయత్నాలు ప్రారంభించాడు. ఇది అతడి నాయకుడు, రాష్ట్ర జోనల్ కమిటీ సభ్యుడు సుక్రు, అనుచరులు సిలా, జగేష్‌లకు నచ్చలేదు. దీంతో గత నెల 29న అన్వేష్‌ను వారందరూ కలిసి హత్య చేసినట్లు ఎస్పీ హరీష్ తెలిపారు. దరింగాబాడీ పోలీస్ స్టేషన్ పరిధిలోని పకారీ రక్షిత అటవీ ప్రాంతంలో ఖననం చేసి ఉన్న అతడి మృతదేహాన్ని బుధవారం బయటకు తీశామని ఎస్పీ వెల్లడించారు. పోలీసుల ముందు లొంగిపోయే విషయంలో మావోయిస్టుల్లో అంతర్గతంగా ఉన్న విభేదాలకు ఈ ఘటన ఉదాహరణగా నిలుస్తోందని యాంటీ నక్సల్ ఆపరేషన్లలో అనుభవం ఉన్న ఉన్నతాధికారులు అభిప్రాయపడ్డారు.

ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు మావోయిస్టుల మృతి



నారాయణ్‌పూర్ జిల్లాలో స్వాధీనం చేసుకున్న భారీ డంప్‌తో భద్రతా బలగాలు

చర్ల, న్యూస్‌టుడే: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లాలో గురువారం ఉదయం జరిగిన ఎన్‌కౌంటర్లో ఇద్దరు మావోయిస్టులు మృతి చెందారు. ఎస్పీ జితేంద్ర కుమార్ యాదవ్ ఎన్‌కౌంటర్ వివరాలను వెల్లడించారు. జిల్లాలోని ఇంద్రావతి నది ప్రాంతంలో భైరమ్‌గఢ్ ఏరియా కమిటీకి చెందిన మావోయిస్టులు ఉన్నారని నిఘా వర్గాలకు సమాచారం అందింది. దీంతో కేంద్ర బలగాలు బుధవారం అక్కడికి వెళ్లగా ఇరువర్గాల మధ్య కాల్పులు చోటు చేసుకున్నాయి. కాల్పులు ఆగిన తర్వాత బలగాలు.. ఇద్దరు మావోయిస్టుల మృతదేహాలతోపాటు ఎస్ఎల్ఆర్, ఇన్సాస్ రైఫిల్స్, ఒక 12బోర్ తుపాకీ, ఇతర ఆయుధ సామగ్రిని స్వాధీనం చేసుకున్నాయి. ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన ఇద్దరినీ హిచామి మద్దా, మంకి పొడియంగా గుర్తించారు. మరోవైపు నారాయణ్‌పూర్ జిల్లాలోని కుమురాడి అడవుల్లోని కొండల్లో మావోయిస్టుల భారీ డంప్‌ను బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. పేలుడు పదార్థాలను నిర్వీర్యం చేశాయి. అబూజ్‌మడ్, ఉత్తర బస్తర్ ప్రాంతంలో [illegible] పనిచేసిన మావోయిస్టుల కీలక నాయకు రాలు(డీవీసీఎం) మాసే బార్సె జిల్లా ఎస్పీ నిఖిల్ రఖేచా ఎదుట తన ఏకే-47 రైఫిల్‌ను అప్పగించి లొంగిపోయారు.

సుఖ ప్రసవాలపై గిరిజన గర్భిణులకు అవగాహన కల్పించాలి

రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ రాయపాటి శైలజ

ఈనాడు, అమరావతి: మన్యం జిల్లాలో టార్చ్‌లైట్ వెలుగులో మహిళ ప్రసవం బాధాకరమని రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ రాయపాటి శైలజ పేర్కొన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో పనిచేసే వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, సుఖ ప్రసవాలపై గిరిజన గర్భిణులకు అవగాహన కల్పించాలని గురువారం ఒక ప్రకటనలో సూచించారు. ప్రభుత్వం గిరిజన ప్రాంతాల్లో అందిస్తున్న ఫీడర్ అంబులెన్సులను వారు వినియోగించుకునేలా చూడాలన్నారు.

క్రమశిక్షణ చర్యల విచారణల్లో ఎందుకీ జాప్యం?

- పెండింగ్ కేసులతో కోర్టులపై పనిభారం
- పరిష్కారమయ్యే వరకూ నిరంతరం పర్యవేక్షిస్తాం
- పురోగతిపై 4 నెలలకోసారి అఫిడవిట్ వేయండి
- సీఎస్‌ను ఆదేశిస్తూ హైకోర్టు కీలక ఉత్తర్వులు

ఈనాడు, అమరావతి: ప్రభుత్వ ఉద్యోగులపై క్రమశిక్షణ చర్యలకు సంబంధించి వివిధ శాఖల వద్ద 5,424 కేసుల విచారణలు ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉండటంపై హైకోర్టు ఆందోళన వ్యక్తంచేసింది. ఈ కేసులన్నీ పరిష్కారమయ్యే వరకు నిరంతర పర్యవేక్షణ (కంటిన్యూయింగ్ మాండమస్) చేస్తామంటూ కీలక ఉత్తర్వులు జారీచేసింది. రాష్ట్ర ప్రభుత్వం గతంలో ఇచ్చిన జీవోల ప్రకారం సాధారణ కేసులను మూడు నెలల్లో, క్లిష్టమైనవి ఆరు నెలల్లో ముగించాల్సి ఉండగా, అలా జరగడం లేదని పేర్కొంది. ఈ జీవోలకు అనుగుణంగా కేసుల విచారణ పురోగతిపై నాలుగు నెలలకోసారి అఫిడవిట్లు వేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి(సీఎస్)ని ఆదేశించింది. తదుపరి విచారణను జూన్ 19కి వాయిదా వేసింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.విజయ్ ఇటీవల ఈ మేరకు కీలక తీర్పు ఇచ్చారు. తనపై ప్రారంభించిన క్రమశిక్షణ చర్యల ప్రొసీడింగ్స్ విచారణలో జాప్యం జరగడాన్ని సవాలు చేస్తూ విజయవాడ ఈఎస్ఐ ఆసుపత్రిలో ప్రత్యేక గ్రేడ్ సివిల్ సర్జన్‌గా పనిచేస్తున్న జి.రవికుమార్ గతేడాది హైకోర్టులో పిటిషన్ వేశారు. ఈ వ్యాజ్యంపై విచారణ జరిపిన న్యాయమూర్తి.. శాఖల వారీగా విచారణలు పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలు సమర్పించాలని, జాప్యానికి కారణాలు చెప్పాలని సీఎస్‌కు సూచించారు.

ఆ శాఖల్లోనే ఎక్కువగా పెండింగ్ కేసులు

సీఎస్ వివరాలను కోర్టు ముందు ఉంచుతూ కొత్త నియామకాలు, బదిలీలు, పదోన్నతులు, పదవీ విరమణ, డేటా అలభ్యం, ఫైళ్లు వేర్వేరు కార్యాలయాల్లో ఉండటం తదితర కారణాలతో క్రమశిక్షణ చర్యల విచారణల్లో జాప్యం జరుగుతోందని నివేదించారు. 'గతేడాది డిసెంబర్ 15 నాటికి పలువురు ఉద్యోగులపై 5,424 క్రమశిక్షణ విచారణలు పెండింగ్‌లో ఉన్నాయి. అత్యధికంగా హోంశాఖలో 1,558, రెవెన్యూ-854, రవాణా, ఆర్అండ్‌బీ-384, పురపాలక, పట్టణాభివృద్ధి-366, పంచాయతీ, గ్రామీణాభివృద్ధి శాఖలో 301 చొప్పున కేసులు పెండింగ్‌లో ఉన్నాయి' అని నివేదించారు.

★ ఈ వివరాలను పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి, 'ప్రభుత్వ శాఖల్లో క్రమశిక్షణ చర్యల కేసులు పెండింగ్‌లో ఉండటం న్యాయస్థానాలపై పనిభారం పెంచుతోంది. విచారణలు తేలకపోవడంతో ఉద్యోగులు హక్కుల కోసం హైకోర్టును ఆశ్రయిస్తున్నారు. మానసికంగానూ వేదనకు గురవుతున్నారన్నారు. విచారణ వేగంగా ముగించుకోవడం ఉద్యోగితో పాటు సంబంధిత శాఖ హక్కు. విచారణలు సత్వరం పూర్తి చేసినట్లైతే తప్పుచేసిన వారికి శిక్ష పడటంతో పాటు నిజాయతీపరులైన ఉద్యోగుల్లో నైతిక స్థైర్యం పెరుగుతుంది' అని పేర్కొన్నారు. న్యాయస్థానం తీర్పులిచ్చి వదిలేస్తే ఆశించిన ఫలితాలు రావని, అందుకే సాధారణ పద్ధతికి భిన్నంగా 'కంటిన్యూయింగ్ మాండమస్' విధానాన్ని అనుసరించడానికి నిర్ణయించామని జడ్జి పేర్కొన్నారు.

మంత్రి లోకేశ్ కృషితో

గ్రంథాలయ వ్యవస్థకు పూర్వ వైభవం

- గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్ కోటేశ్వరరావు
- పరిషత్ రాష్ట్ర పరిపాలనా కార్యాలయం ప్రారంభం



ఏపీ గ్రంథాలయ పరిషత్ రాష్ట్ర కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఛైర్మన్ కోటేశ్వరరావు

తాడేపల్లి, న్యూస్‌టుడే: వైకాపా ప్రభుత్వం నిర్వీర్యం చేసిన గ్రంథాలయ వ్యవస్థకు పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు మంత్రి నారా లోకేశ్ కృషి చేస్తున్నారని ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు అన్నారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని మహేంద్ర ఎన్‌క్లేవ్‌లోని ఎన్నారై బ్లాక్‌లో ఏర్పాటు చేసిన గ్రంథాలయ పరిషత్ రాష్ట్ర పరిపాలనా కార్యాలయాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. కోటేశ్వరరావు మాట్లాడుతూ మంత్రి లోకేశ్ చొరవతో మంగళగిరిలో ఏర్పాటు చేసిన ఆధునిక గ్రంథాలయం ఎంతోమంది నిరుద్యోగులకు, విద్యార్థులకు చిన్నారులకు ఉపయోగపడుతోందని తెలిపారు. ఈ గ్రంథాలయానికి వచ్చి పోటీ పరీక్షలకు సిద్ధమైన అనేకమంది ఉద్యోగాలు సాధించారని వారంతా మంత్రి లోకేశ్‌కు కృతజ్ఞతలు చెబుతున్నారని అన్నారు. రాష్ట్రంలో ఉన్న అన్ని గ్రంథాలయాలను ఆధునికీకరించేందుకు ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. అమరావతి రాజధానిలో ఐదు ఎకరాల్లో ఆధునిక గ్రంథాలయం ఏర్పాటు కాబోతోందన్నారు. గ్రంథాలయాలకు స్థానిక సంస్థల నుంచి రావాల్సిన బకాయిలను ఇప్పించాలని కోరారు. ఈ ఏడాది మార్చి నుంచి ఎప్పటికప్పుడు గ్రంథాలయ సెస్‌ను జమచేయాలని స్థానిక సంస్థలను కోరారు. గతంలో దాదాపు రూ.400 కోట్ల వరకు పాత బకాయిలు రావాల్సి ఉందని పేర్కొన్నారు. గ్రంథాలయ పరిషత్ సంచాలకుడు ఆకేపాటి కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఖరీఫ్‌లో వానలు తక్కువే!

- ఎల్‌నినోతో రుతుపవనాలపై ప్రభావం
- స్కైమెట్ అంచనా

ఈనాడు, అమరావతి, విశాఖపట్నం: ఎల్‌నినో కారణంగా వచ్చే ఖరీఫ్‌లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని ప్రైవేట్ వాతావరణ సంస్థ స్కైమెట్ అంచనా వేసింది. ఈ హెచ్చరికల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు చర్యలకు ఆదేశించింది. ఎల్‌నినో పరిస్థితుల్ని అంచనా వేసి, అందుకు అనుగుణంగా వ్యవసాయ ప్రణాళికలు తయారు చేయాలని అధికారులకు సూచించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు ఇప్పటికే దీనిపై అధికారులతో చర్చించారు. వ్యవసాయ అనుబంధ శాఖలు సన్నద్ధంగా ఉండాలని, రైతులకు అవగాహన కల్పించడంతో పాటు సాగుపై సూచనలు చేయాలని ఆదేశించారు. వ్యవసాయ శాఖ దీనిపై జిల్లాల అధికారులతో శుక్రవారం సమావేశం నిర్వహిస్తోంది. అయితే దీనిపై భారత వాతావరణ విభాగం (ఐఎండీ) నుంచి ఇంకా స్పష్టత రాలేదు. ఏప్రిల్‌లో రుతుపవనాలపై ఐఎండీ నివేదిక విడుదల చేయనుంది.

ప్రభావం ఎప్పుడు ఉండొచ్చు?

మే నుంచి జులై మధ్య లేదా ఆగస్టులో ఎల్‌నినో వచ్చే అవకాశం 50% నుంచి 61% పైనే ఉందని ప్రైవేట్ వాతావరణ సంస్థలు అంచనా వేస్తున్నాయి. అక్టోబరు వరకూ ఇది కొనసాగొచ్చని చెబుతున్నాయి. ఆంధ్రప్రదేశ్ వాతావరణ పరంగా సున్నిత రాష్ట్రం. వర్షాలపై ఆధారపడి అధిక శాతం పంటలు సాగవుతాయి. ఎల్‌నినో ఏర్పడితే రుతుపవనాలు బలహీనపడతాయి. ఫలితంగా వర్షపాతం తగ్గుతుంది. పొడికాలాలు పెరుగుతాయి. వర్షాభావ పరిస్థితులు ఏర్పడితే వ్యవసాయ, ఉద్యాన పంటలపై తీవ్ర ప్రభావం ఉంటుంది. వర్షాధార పంటల ఉత్పత్తి తగ్గుతుంది. రైతులు పెట్టుబడులు కోల్పోతారు. సూక్ష్మసేద్యం ద్వారా ఉద్యాన రైతులు కొంతమేర బయటపడొచ్చు. పండ్లు, కూరగాయలు, వాణిజ్య పంటల ధరలు పెరగొచ్చు.

మార్చిలో వేసవి మంటలు

మరోవైపు మార్చిలో వేడి, ఉక్కపోత మరింత పెరగనుంది. వచ్చే నెల తొలి వారంలో దేశంలోని పలు ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2 నుంచి 6.5 డిగ్రీలు ఎక్కువగా నమోదయ్యే అవకాశముందని ఐఎండీ పేర్కొంది. మన రాష్ట్రంలో మార్చి తొలి రోజుల్లోనే గరిష్ఠ ఉష్ణోగ్రతలు 36 డిగ్రీలు దాటే అవకాశముందని చెప్పింది. కోస్తా జిల్లాల్లో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2 నుంచి 4 డిగ్రీలు పెరుగుతాయని అంచనా వేసింది. గురువారం అత్యధికంగా అనంతపురంలో గరిష్ఠ ఉష్ణోగ్రత 36.6 డిగ్రీలుగా నమోదైంది.

తాగునీరు కలుషితమైతే కమిషనర్లదే బాధ్యత

ప్రామాణిక విధానాలు జారీచేసిన మున్సిపల్ శాఖ

ఈనాడు, అమరావతి: మున్సిపాలిటీల్లో డయేరియా ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా కలుషితం కాని, సురక్షితమైన తాగునీరు ప్రజలకు అందించేలా మున్సిపల్ శాఖ నిర్దిష్ట ప్రామాణిక విధానాలను జారీ చేసింది. ఇవి తక్షణమే అమలయ్యేలా చూడాలని మున్సిపల్‌శాఖ కార్యదర్శి సురేష్‌కుమార్ గురువారం జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. మున్సిపాలిటీల్లో తాగునీరు కలుషితమైనా... డ్రెయిన్ల శుభ్రత విషయంలో అశ్రద్ధ వహించినా ఆయా మున్సిపల్ కమిషనర్లు, క్షేత్రస్థాయి సిబ్బందిని బాధ్యులను చేస్తామని పేర్కొన్నారు. నిర్లక్ష్యంగా ఉంటే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. కొన్ని విధానాలు ఇలా ఉన్నాయి

★ అన్ని మున్సిపాలిటీల్లో తాగునీటి పైపులైన్లను తనిఖీలు చేయాలి.

★ డ్రైనేజీల్లో నీరు నిలవకుండా వెంటనే డీసిల్టింగ్ చేయాలి

★ తాగునీటిపై ఫిర్యాదుల స్వీకరణకు, సీజనల్ వ్యాధులపై 24 గంటలూ పనిచేసేలా కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటుచేయాలి.

★ క్షేత్రస్థాయి తనిఖీల్లో వార్డు, శానిటేషన్ కార్యదర్శులు విధిగా పాల్గొనాలి.

మోసం కేసుల్లో నిందితుడు ఎద్దుల అనిల్‌కుమార్‌రెడ్డి అరెస్టు

- దుబాయ్ నుంచి భారత్‌కు రప్పించిన సీబీఐ
- హైదరాబాద్ విమానాశ్రయంలో ఏపీ పోలీసులకు అప్పగింత



అనిల్‌కుమార్‌రెడ్డి

ఈనాడు, అమరావతి: ఏపీలో నమోదైన పలు కీలక కేసుల్లో నిందితుడు ఎద్దుల అనిల్‌కుమార్‌రెడ్డిని సీబీఐ ఎట్టకేలకు భారత్‌కు రప్పించింది. సీబీఐలోని ఇంటర్నేషనల్ పోలీస్ కోఆపరేషన్ యూనిట్ (ఐపీసీయూ), విదేశీ వ్యవహారాలశాఖ, అబుదాబి నేషనల్ సెంట్రల్ బ్యూరో (ఎన్‌సీబీ-అబుదాబి) సహకారంతో ఈ ప్రక్రియ పూర్తి చేసింది. దుబాయ్ పోలీసులు.. అనిల్‌కుమార్‌రెడ్డిని హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ విమానాశ్రయానికి తీసుకొచ్చి గురువారం సీబీఐకి అప్పగించగా వారు ఏపీ పోలీసుల కస్టడీకి ఇచ్చారు. మోసం, నేరపూరిత విశ్వాస ఘాతుకం, బెదిరింపులు తదితర అభియోగాలకు సంబంధించి నిందితుడిపై రాష్ట్రంలో పలు కేసులున్నాయి. వాటి నుంచి తప్పించుకోవడానికి 2022లో ఆయన విదేశాలకు పారిపోయారు. దీంతో ఏపీ పోలీసుల అభ్యర్థన మేరకు అనిల్‌కుమార్ రెడ్డిపై 2022 సెప్టెంబరు 5న ఇంటర్‌పోల్ ద్వారా సీబీఐ రెడ్‌కార్నర్ నోటీసు జారీ చేసింది.

చియా గింజలను ఇలా ప్రయత్నించండి



చియా గింజలను నీటిలో నానబెట్టి తీసుకోవడం కంటే పెరుగులో నానబెట్టి తీసుకుంటే మరిన్ని ప్రయోజనాలు ఒనగూరుతాయి. పెరుగులోని ప్రొటీన్లు, కొవ్వులు ఆ గింజలకు అతుక్కుని లిపిడ్-ఫైబర్‌గా మారతాయి. దీంతో మీ శరీరం ఎక్కువసేపు ఉత్సాహంగా ఉంటుంది. మీరు తీసుకున్న ఆహారం నిదానంగా జీర్ణం అవుతుంది. త్వరగా ఆకలి వేయకుండా కడుపునిండిన భావన ఎక్కువ సేపు ఉంటుంది.

– అరుణ్ కుమార్, వైద్యుడు

గ్రహం అనుగ్రహం — 27–2–2026 శుక్రవారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; ఉత్తరాయణం; శిశిర రుతువు, ఫాల్గుణ మాసం, శుక్ల పక్షం

ఏకాదశి: రా.10-34 తదుపరి ద్వాదశి; ఆర్ద్ర: ఉ.11-05 తదుపరి పునర్వసు
వర్జ్యం: రా. 10-24 నుంచి 11-54 వరకు; అమృత ఘడియలు: లేవు
దుర్ముహూర్తం: ఉ 8-43 నుంచి 9-29 వరకు తిరిగి మ. 12-35 నుంచి 1-22 వరకు; రాహుకాలం: ఉ. 10-30 నుంచి 12-00 వరకు
సూర్యోదయం: ఉ.6.24; సూర్యాస్తమయం: సా.6.01

వాతావరణం

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
విజయనగరం	17.0	32.0
రాజమహేంద్రవరం	20.0	37.5
హైదరాబాద్	20.4	33.3
విశాఖపట్నం	21.0	32.4
తాడేపల్లిగూడెం	21.0	34.0
తిరుపతి	21.0	35.5
అనంతపురం	21.0	36.2
శ్రీకాకుళం	22.0	31.0
గుంటూరు	22.0	33.5
విజయవాడ	22.1	34.6
ఒంగోలు	23.6	33.7
కర్నూలు	23.8	35.3
నరసాపురం	24.0	34.0
కడప	24.0	36.0
నెల్లూరు	24.5	34.1



రక్తదానం చేస్తున్న వరుడు విరూపాక్షిస్వామి... అతిథులు

వివాహ వేడుకల్లో రక్తదానం

ఆదోని పాత పట్టణం, న్యూస్‌టుడే: కర్నూలు జిల్లా ఆదోని పట్టణంలో జరిగిన ఓ వివాహ వేడుకల్లో వరుడితో పాటు పెళ్లికి వచ్చిన అతిథుల్లో 27 మంది రక్తదానం చేశారు. పట్టణానికి చెందిన విరూపాక్షి స్వామి, వీణ వివాహం గురువారం ఓ ఫంక్షన్ హాల్లో నిర్వహించారు. విరూపాక్షి స్వామి స్నేహితులతో కలిసి జనసేవ సామాజిక సంస్థ ఏర్పాటు చేసి, పదేళ్లుగా రక్తదానం, సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. ఈ క్రమంలోనే వరుడు వివాహ వేడుకల్లోనూ రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఆయనతోపాటు, స్నేహితులు, బంధువులు రక్తదానం చేసి పలువురి మన్ననలు పొందారు.

న్యుమోనియాకు బిట్స్ హైదరాబాద్ ఆచార్యుల కొత్త టీకా!

ఈనాడు, హైదరాబాద్: న్యుమోనియా నియంత్రణకు కొత్త టీకాను కనుగొన్నట్లు బిట్స్ హైదరాబాద్ ఆచార్యులు, పరిశోధకులు యోగేశ్వర్ దేవరకొండ, ఎం.వి.ఎన్. జనార్దన్‌రెడ్డి, అరుణిమ, కీర్తిమాన్ స్యాల్‌లు గురువారం తెలిపారు. "స్ట్రెప్టోకోకల్ న్యుమోనియా కట్టడికి ఏడాది నుంచి పరిశోధనలు చేస్తున్నాం. ప్రస్తుతం దేశ, విదేశాల్లో అందుబాటులో ఉన్న టీకాల పనితీరును పరిశీలించి, వాటికి భిన్నంగా... స్పెక్ట్రోస్కోపీ విధానం ద్వారా ఈ వ్యాక్సిన్‌ను అభివృద్ధి చేశాం. ఇటీవలే ఎలుకలపై ప్రయోగించగా విజయవంతమైంది. మా అధ్యయనం ప్రముఖ అంతర్జాతీయ జర్నల్ రీసెర్చ్‌గేట్‌లో ప్రచురితమైంది. కేంద్ర ప్రభుత్వం నుంచి అనుమతులు తీసుకున్న అనంతరం క్లినికల్ ట్రయల్స్ నిర్వహిస్తాం" అని వివరించారు.

రాష్ట్రానికి రానున్న సీజేఐ జస్టిస్ సూర్యకాంత్

అమరావతిలో జ్యుడిషియల్ అకాడమీ, హైకోర్టు అతిథి గృహ భవనాలకు శంకుస్థాపన

ఈనాడు, అమరావతి: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ రాష్ట్రంలో రెండు రోజులపాటు పర్యటించనున్నారు. శనివారం తిరుమల శ్రీవారిని దర్శించుకుని, ఆదివారం ఉదయం తిరుపతిలోని 16 కోర్టు భవనాల కాంప్లెక్స్ నిర్మాణానికి పునాదిరాయి వేస్తారు. అనంతరం తిరుపతి నుంచి బయలుదేరి విజయవాడ చేరుకుంటారు. మధ్యాహ్నం మూడు గంటల సమయంలో రాజధాని అమరావతి చేరుకొని వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఏపీ జ్యుడిషియల్ అకాడమీ భవనానికి, హైకోర్టు అతిథి గృహ భవనానికి శంకుస్థాపన చేస్తారు. హైకోర్టు న్యాయమూర్తుల నివాస సముదాయాన్ని ప్రారంభిస్తారు. సాయంత్రం విజయవాడలో 'మధ్యవర్తిత్వం'పై నిర్వహించే సదస్సులో ప్రసంగిస్తారు.

నేడు విజయవాడలో సైన్స్ సమగ్ర మహోత్సవ్

రాష్ట్రవ్యాప్త విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

ఈనాడు, అమరావతి: జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ సైన్స్ సిటీ ఆధ్వర్యంలో విజయవాడలోని గాంధీనగర్‌లో శుక్రవారం 'సైన్స్ సమగ్ర మహోత్సవ్ 2026' ముగింపు కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ మహోత్సవంలో రాష్ట్రవ్యాప్తంగా 4,118 పాఠశాలల నుంచి 29,435 మంది విద్యార్థులు పాల్గొన్నారు. జిల్లాకు ఒకరి చొప్పున ఎంపిక చేసిన విజేతలకు ప్రతిభా పురస్కారాలు, సర్టిఫికెట్లు అందజేయనున్నారు. సైన్స్ సమగ్ర మహోత్సవ్ 2కే26 ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్, ఏషియన్ బుక్ ఆఫ్ రికార్డుల్లో స్థానం కోసం ప్రయత్నిస్తున్నట్లు సైన్స్ సిటీ సీఈవో వెంకట్ వెల్లడించారు.

ఉగాదికి లక్ష టిడ్కో ఇళ్ల అప్పగింత

పురపాలకశాఖ ముఖ్యకార్యదర్శి సురేశ్‌కుమార్

ఈనాడు, అమరావతి: రానున్న ఉగాది నాటికి లక్ష టిడ్కో గృహాలను లబ్ధిదారులకు అందించనున్నట్లు పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి సురేశ్‌కుమార్ తెలిపారు. అమరావతిలోని సీఆర్‌డీఏ కార్యాలయంలో గురువారం ఆయన బ్యాంకర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు బ్యాంకుల నుంచి రుణ మంజూరుపై సమీక్షించారు. త్వరితగతిన ఇళ్ల నిర్మాణం పూర్తయ్యేందుకు లబ్ధిదారుల వాటాగా టిడ్కోకు రుణాన్ని అందించాలని కోరారు. మొత్తం 40,500 మంది లబ్ధిదారులకు రూ.1,345 కోట్లు రుణంగా ఇచ్చేందుకు బ్యాంకర్లు సమ్మతించారు.

మద్యం కుంభకోణం నిందితుడు ముప్పిడి అవినాష్‌రెడ్డి అరెస్ట్

(మొదటి పేజీ తరువాయి)

నిందితుడు రాజ్ కెసిరెడ్డికి తోడల్లుడు. మద్యం కుంభకోణం దర్యాప్తు కోసం రాష్ట్ర ప్రభుత్వం గతేడాది ఫిబ్రవరిలో సిట్ ఏర్పాటు చేసిన మరుక్షణమే అవినాష్‌రెడ్డి.. రాజ్ కెసిరెడ్డి ఆదేశాలతో థాయ్‌లాండ్‌కు పారిపోయారు. అప్పటి నుంచి విదేశాల్లోనే ఉన్నారు. సిట్ అన్ని వైపుల నుంచి ఉచ్చు బిగించటంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో సరిగ్గా ఏడాది తర్వాత గురువారం ఉదయం ఆయన సిట్ అధికారుల ఎదుట విచారణకు హాజరయ్యారు. కొంతసేపు అవినాష్‌రెడ్డిని ప్రశ్నించిన దర్యాప్తు అధికారులు ఉదయం 11.30 గంటల సమయంలో ఆయన్ను అరెస్టు చేసి సాయంత్రం విజయవాడలోని ఏసీబీ కోర్టులో హాజరుపరిచారు. శుక్రవారం (ఫిబ్రవరి 27) వరకూ ఆయనకు రిమాండ్ విధిస్తూ ఏసీబీ కోర్టు న్యాయాధికారి భాస్కరరావు ఆదేశాలిచ్చారు. దీంతో అవినాష్‌రెడ్డిని గుంటూరులోని జిల్లా జైలుకు తరలించారు. ఈ కేసులో అరెస్టై, జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న పలువురు నిందితుల రిమాండ్ గడువు శుక్రవారంతో ముగియనుంది. తదుపరి రిమాండ్ కోసం వారంతా శుక్రవారం కోర్టులో హాజరు కావాల్సి ఉంది. ఈ నేపథ్యంలో అవినాష్‌రెడ్డికి శుక్రవారం వరకే రిమాండ్ విధించారు.

బెయిల్ నిరాకరించడంతో గత్యంతరం లేక..

దర్యాప్తు సమయంలో థాయ్‌లాండ్‌కు పారిపోయి అక్కడి నుంచి పలు దేశాలు తిరుగుతూ ఏడాదిపాటు గడిపిన అవినాష్‌రెడ్డిపై సిట్ అధికారులు గతంలోనే లుకౌట్ నోటీసులు జారీ చేశారు. తన అరెస్టు తప్పదని భావించిన ఆయన తొలుత ఏపీ హైకోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్ వేశారు. న్యాయస్థానం నిరాకరించటంతో సుప్రీం కోర్టును ఆశ్రయించారు. సుప్రీంకోర్టు కూడా ముందస్తు బెయిల్ ఇవ్వటానికి నిరాకరించి, లొంగిపోవాల్సిందేనని రెండు రోజుల కిందట స్పష్టమైన ఆదేశాలిచ్చింది. గత్యంతరం లేని పరిస్థితుల్లో అవినాష్‌రెడ్డి గురువారం సిట్ అధికారుల ఎదుట విచారణకు హాజరయ్యారు.

అన్ని వైపుల నుంచి ఉచ్చు బిగించిన సిట్

ముప్పిడి అవినాష్‌రెడ్డిని విదేశాల నుంచి రప్పించే అంశంలో సిట్ అధికారులు వ్యూహాత్మకంగా వ్యవహరించారు. లుకౌట్ నోటీసుల జారీ మొదలుకుని అన్ని వైపుల నుంచి ఉచ్చు బిగించి అతనే విదేశాల నుంచి భారత్‌కు వచ్చే పరిస్థితి సృష్టించారు.

ఎన్సీఈఆర్టీ వివాదాస్పద పాఠ్యపుస్తకంపై

సంపూర్ణ నిషేధం

సుప్రీంకోర్టు సీజేఐ ధర్మాసనం ఆదేశం



- సంస్థ డైరెక్టర్, పాఠశాల విద్య కార్యదర్శికి షోకాజ్ నోటీసులు
- వివాదాస్పద పాఠ్యాంశంపై క్షమాపణలు తెలిపిన కేంద్రం

దిల్లీ: న్యాయవ్యవస్థ గౌరవ, మర్యాదలను దెబ్బతీసేలా పాఠ్యపుస్తకంలో అధ్యాయాన్ని చేర్చడం తమను తీవ్ర నిర్ఘాంతపరిచిందని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ పేర్కొన్నారు. దీనికి బాధ్యులెవరో తేల్చాల్సిన బాధ్యత సుప్రీంకోర్టు అధినేతగా తనపై ఉందని, లోతైన దర్యాప్తు జరగాల్సి ఉందని తెలిపారు. వారిని వదిలిపెట్టబోమని ఆగ్రహం వ్యక్తం చేశారు. జాతీయ విద్యా పరిశోధన, శిక్షణ మండలి (ఎన్సీఈఆర్టీ) ప్రచురించిన 8వ తరగతి సాంఘిక శాస్త్రం కొత్త పాఠ్యపుస్తకంపై సంపూర్ణ నిషేధం విధిస్తూ సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం గురువారం ఆదేశాలిచ్చింది. 'న్యాయవ్యవస్థలో అవినీతి' అనే అధ్యాయాన్ని చేర్చిన 'ఎక్స్‌ప్లోరింగ్ సొసైటీ: ఇండియా అండ్ బియాండ్(వాల్యూమ్-2) పాఠ్యపుస్తకం ప్రతులన్నింటినీ వెంటనే జప్తు చేయాలని, డిజిటల్ వ్యాప్తినీ అడ్డుకోవాలని, ఏ రూపంలోనూ పునర్ముద్రించడానికి వీల్లేదని స్పష్టం చేసింది. వివాదాస్పద పాఠ్యపుస్తకంపై విచారణను సుమోటోగా చేపట్టిన ధర్మాసనంలో జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చి, జస్టిస్ విపుల్ ఎం పంచోలీ సభ్యులుగా ఉన్నారు. వివాదాస్పద అధ్యాయంలోని అంశాలను మారు శీర్షికలతో మరో రూపంలో లేదా ప్రత్యామ్నాయ విధానాల్లో ప్రచురించాలని యత్నించినా, వ్యాప్తిలోకి తీసుకొచ్చినా కోర్టు ధిక్కరణ చర్యలను ఎదుర్కోవాల్సి వస్తుందని ధర్మాసనం హెచ్చరించింది. న్యాయవ్యవస్థ ప్రతిష్ఠను దెబ్బతీసేలా పాఠ్యాంశాన్ని రూపొందించిన వారిపై చర్యలు ఎందుకు తీసుకోరాదో వివరించాలని ఆదేశిస్తూ ఎన్సీఈఆర్టీ డైరెక్టర్, కేంద్ర విద్యాశాఖ కార్యదర్శికి షోకాజ్ నోటీసులు జారీ చేసింది. ఎన్సీఈఆర్టీ డైరెక్టర్ బుధవారం ఇచ్చిన లిఖిత పూర్వక సమాధానం... పాఠ్యపుస్తకంలో ఏఏ అంశాలున్నాయో పునఃపరిశీలించకుండానే బాధ్యతారాహిత్యంగా, నిర్లక్ష్యంగా, కోర్టును ధిక్కరించేలా ఉందని మండిపడింది. పాఠ్యపుస్తక రూపకల్పన, వివాదాస్పద అధ్యాయం చేర్చడానికి సంబంధించి తీసుకున్న నిర్ణయాలు, ఎన్సీఈఆర్టీ సమావేశం వివరాలు, బాధ్యులైన కమిటీ సభ్యుల పేర్లు, అర్హతల సమాచారాన్ని అందజేయాలని ఆదేశించింది. పాఠ్యపుస్తకం అంశాన్ని బాధ్యతాయుతంగా, సకాలంలో తమ దృష్టికి తెచ్చిన మీడియాకు ధర్మాసనం కృతజ్ఞతలు తెలిపింది.

న్యాయవ్యవస్థ కృషి ప్రస్తావనే లేదు

ప్రజాస్వామ్యం, రాజ్యాంగం, పౌరుల హక్కుల పరిరక్షణకు న్యాయవ్యవస్థ చేస్తోన్న గణనీయమైన కృషిని పాఠ్యాంశంలో చేర్చనేలేదని ధర్మాసనం ఆక్షేపించింది. సామాన్యులకూ న్యాయాన్ని చేరువచేయడానికి జరుగుతున్న ప్రయత్నాలు కానీ, సమాజ పరివర్తనలో న్యాయస్థానాల ప్రాధాన్యాన్ని కానీ పుస్తకంలో ప్రస్తావించనేలేదని తెలిపింది. 'న్యాయవ్యవస్థలోని అవినీతి'ని మాత్రమే పాఠ్యాంశం చేయడం దారుణమని పేర్కొంది. న్యాయవ్యవస్థ స్వతంత్రతను, స్వయంప్రతిపత్తిని దెబ్బతీసేలా రూపొందించిన ఈ పుస్తకం తీవ్రపరిణామాలకు కారణమవుతుందని హెచ్చరించింది. ఈ దుష్ప్రవర్తన... కోర్టుధిక్కరణ చట్టం-1971 పరిధిలోకి వస్తుందని స్పష్టం చేసింది. న్యాయవ్యవస్థపై విమర్శలను అడ్డుకోవటం తమ ఉద్దేశ్యం కాదంది. సరైన పాఠ్యాంశాలనే జాతీయ విద్యాప్రణాళికలో చేర్చాలని అభిప్రాయపడింది. తదుపరి విచారణ మార్చి 11న జరగనుంది.

ఆ పుస్తకాలను వెనక్కి తీసుకున్నాం

– సొలిసిటర్ జనరల్

కేంద్ర ప్రభుత్వం తరఫున గురువారం విచారణకు హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా బేషరతుగా క్షమాపణలు తెలిపారు. వివాదాస్పద పాఠ్యపుస్తకం ప్రతులు 32 మాత్రమే మార్కెట్‌లోకి వెళ్లాయని, వాటిని వెనక్కి రప్పించినట్లు ధర్మాసనానికి వివరించారు. మిగిలిన వాటిని పంపిణీచేయబోమన్నారు. వివాదాస్పద పాఠ్యపుస్తకంపై ఎన్సీఈఆర్టీ ఇప్పటికే క్షమాపణలు చెప్పింది. పాఠ్యపుస్తకాన్ని అధికారిక వెబ్‌సైట్ నుంచి తొలగించింది. సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో.. బాధ్యులను గుర్తించే కసరత్తును చేపట్టింది.



"వాళ్లు తుపాకీ తూటా పేల్చారు. న్యాయవ్యవస్థ నెత్తురోడుతోంది. పాఠ్యపుస్తకంలోని విషయాలను ప్రాథమికంగా పరిశీలించి, ఎన్సీఈఆర్టీ డైరెక్టర్ స్పందనతో కలిపి చూసినప్పుడు న్యాయవ్యవస్థ స్వతంత్రతను, స్వయంప్రతిపత్తిని దెబ్బతీసి, దాని గౌరవాన్ని మంటగలపడానికి ప్రణాళికాబద్ధమైన, ఉద్దేశపూర్వకమైన కుట్ర జరిగినట్లుగా కనిపిస్తోంది. ఇది న్యాయవ్యవస్థ పాలనా వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడమే. దీనిని పట్టించుకోకుండా వదిలేస్తే ప్రజలు, యువత మనసుల్లో న్యాయవ్యవస్థ పవిత్రత దెబ్బతినే అవకాశం ఉంది."

– సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్

బాధ్యులపై చర్యలు తీసుకుంటాం

– ధర్మేంద్ర ప్రధాన్

పాఠ్యపుస్తకంలో వివాదాస్పద అధ్యాయంపై కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. బాధ్యులను గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వానికి న్యాయవ్యవస్థపై పూర్తి గౌరవం ఉందన్నారు. మరోవైపు భాజపా కూడా ఈ అంశంపై స్పందించింది. దేశ న్యాయవ్యవస్థను గౌరవిస్తామని, దాని నిష్పాక్షిక పని తీరు పట్ల గర్విస్తున్నామని భాజపా జాతీయ ప్రతినిధి సంబిత్ పాత్ర తెలిపారు.

ఆరెస్సెస్ పాత్రపై విచారణ జరపాలి

– కాంగ్రెస్

పాఠ్యపుస్తకంలో న్యాయవ్యవస్థను కించపరచడంపై సుప్రీంకోర్టు ఆగ్రహం సరైనదేనని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ పేర్కొన్నారు. దశాబ్ద కాలంగా పాఠ్యపుస్తకాల రూపకల్పనలో 'రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్' (ఆరెస్సెస్) ప్రమేయంపై, సాగించిన కుట్రపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

నేను చెప్పినంత లంచమివ్వాల్సిందే

- అప్పుడే మీకు మద్యం సరఫరా ఆర్డర్లు
- ఇదే అంతిమ నిర్ణయం.. దీనికి రాజకీయ అండదండలున్నాయి
- మద్యం డిస్టిలరీలు, సరఫరా కంపెనీలకు అవినాష్‌రెడ్డి బెదిరింపులు
- బలవంతపు వసూళ్లకు ఆయనే ప్రధాన సూత్రదారి
- మద్యం కుంభకోణం అమలుకు ఆర్థిక కేంద్ర బిందువు
- రిమాండ్ రిపోర్టులో సిట్ వెల్లడి

ఈనాడు, అమరావతి: 'ఆంధ్రప్రదేశ్‌లో మీకు మద్యం సరఫరా ఆర్డర్లు లభించాలన్నా, మీరు వ్యాపారం కొనసాగించాలనుకున్నా.. నేను చెప్పినంత లంచమివ్వాల్సిందే. ఇదే అంతిమ నిర్ణయం. దీనికి రాజకీయంగా పూర్తి మద్దతు, అండదండలు ఉన్నాయి' అంటూ మద్యం కుంభకోణం నిందితుడు ముప్పిడి అవినాష్‌రెడ్డి (ఏ7)డిస్టిలరీలు, సరఫరా కంపెనీల యజమానులను బెదిరించి మరీ ముడుపులు వసూలు చేశారని సిట్ నిగ్గు తేల్చింది. అప్పటి ఏపీఎస్‌బీసీఎల్ ఎండీ వాసుదేవరెడ్డి, ప్రత్యేకాధికారి సత్యప్రసాద్‌ల ఆదేశాల మేరకు మద్యం డిస్టిలరీలు, సరఫరా కంపెనీల యజమానులు.. హైదరాబాద్‌లోని పలు హోటళ్లు, ప్రైవేటు భవనాల్లో అవినాష్‌రెడ్డిని కలిసేవారని, వైకాపా మద్యం ముఠా తరఫున లంచాలకు సంబంధించి ఆయనే వారితో బేరసారాలు నడిపేవారని గుర్తించింది. 'మద్యం కుంభకోణంలో భాగంగా ఎవరెవరికి సరఫరా ఆర్డర్లు ఇవ్వాలి? ఎవరికి ప్రత్యేకంగా సరఫరా ఆర్డర్లు జారీ చేయాలి? ఏయే బ్రాండ్లకు ఆర్డర్లు పెంచాలి? ఏయే బ్రాండ్లకు తగ్గించాలి వంటివన్నీ వైకాపా మద్యం ముఠా తరఫున ముప్పిడి అవినాష్‌రెడ్డి పర్యవేక్షించేవారు. ఆయనకు ఎలాంటి అధికారిక హోదా లేకపోయినా ఆంధ్రప్రదేశ్ స్టేట్ బెవరేజస్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీఎస్‌బీసీఎల్)ను పూర్తిగా తన గుప్పిట్లో పెట్టుకున్నారు. మద్యం కుంభకోణం కుట్ర రూపకల్పన, ముడుపుల సొమ్ము నిర్ణయించటం, ఆ సొత్తు చెల్లించిన వారికే సరఫరా ఆర్డర్లు లభించేలా చేయటం, డిస్టిలరీలు, సరఫరా కంపెనీల నుంచి ముడుపుల సొమ్ము వసూలు చేయటం, డొల్ల కంపెనీలను అడ్డం పెట్టుకుని ఆ సొత్తంతా మనీ లాండరింగ్ చేయటం వరకూ ఈ కుంభకోణంలో ప్రతి దశలోనూ అవినాష్‌రెడ్డి కీలక పాత్ర పోషించారు. ఏపీఎస్‌బీసీఎల్ అప్పటి ఎండీ వాసుదేవరెడ్డి (ఏ2), ప్రత్యేకాధికారి సత్యప్రసాద్ (ఏ3) ఇద్దరూ రాజ్ కెసిరెడ్డి (ఏ1) తరఫున అవినాష్‌రెడ్డి చెప్పిన ఆదేశాలను తు.చ. తప్పక పాటించేవారు' అని సిట్ తేల్చింది. ఈ వివరాలన్నీ అవినాష్‌రెడ్డి రిమాండ్ రిపోర్టులో ప్రస్తావించింది.

మనీ లాండరింగ్ ద్వారా ముడుపుల సొత్తు మళ్లింపు

వైకాపా హయాంలో జరిగిన రూ.వేల కోట్ల మద్యం కుంభకోణంలో లంచాల సొమ్మును మనీ లాండరింగ్ ద్వారా మళ్లించటంలో ముప్పిడి అవినాష్‌రెడ్డి ప్రధాన పాత్ర పోషించారు. అందుకోసం ప్యాకేజింగ్, లాజిస్టిక్స్ సహా ఇతరత్రా కార్యకలాపాలు అందిస్తామనే ముసుగులో డొల్ల కంపెనీలు పెట్టించారు. వాటినుంచి ఎలాంటి సరకులు కొనకుండానే, సేవలు పొందకుండానే.. కొన్నట్లు, నకిలీ ఇన్‌వాయిస్‌లు సృష్టించి ముడుపుల సొత్తు మళ్లించుకున్నారు. ఈ అక్రమాల గుట్టు బయటకు రాకుండా నకిలీ ఇన్‌వాయిస్‌ల ఫైల్స్, పేమెంట్ రికార్డులు ఎప్పటికప్పుడు తొలగిస్తూ ఆడిట్ ట్రయల్స్ ధ్వంసం చేశారు.

కుట్ర నుంచి అమలు వరకూ ప్రతి దశలోనూ..

- మద్యం డిస్టిలరీలు, సరఫరా కంపెనీల నుంచి ముడుపుల వసూళ్లకు వీలుగా సరఫరా ఆర్డర్ల జారీ విధానాన్ని మార్చటం, మద్యం కేసు మూల ధర ఆధారంగా ఎంత లంచం వసూలు చేయాలో నిర్ణయించటం, సరఫరా ఆర్డర్ల జారీపై గుత్తాధిపత్యం కోసం వైకాపా మద్యం ముఠా 2019 అక్టోబరు 13న, అంతకు ముందు హైదరాబాద్‌లో నిర్వహించిన అనేక సమావేశాల్లో అవినాష్‌రెడ్డి పాల్గొన్నారు. ఆ సమావేశాల్లోనే మద్యం కుంభకోణం కుట్రకు రూపకల్పన చేశారు.
- ప్రధాన నిందితుడు రాజ్ కెసిరెడ్డి, ముప్పిడి అవినాష్‌రెడ్డిలు కలిసే అరబిందో గ్రూపు నుంచి రుణం తీసుకుని అదాన్ డిస్టిలరీస్ ఏర్పాటు చేశారు. ఈ కంపెనీలో డైరెక్టరైన ముప్పిడి అనిరుధ్‌రెడ్డి.. అవినాష్‌రెడ్డికి సోదరుడే. అదాన్ సంస్థ బ్యాంకు ఖాతాలకు ఏకైక ఆథరైజ్డ్ సిగ్నేటరీగా ఉన్న అవినాష్‌రెడ్డే దాని ఆర్థిక వ్యవహారాలన్నీ చూసేవారు. ఈ కుంభకోణంలో భారీగా లబ్ధి పొందారు.
- అదాన్ డిస్టిలరీస్‌కు అత్యధికంగా మద్యం సరఫరా ఆర్డర్లు లభించాయి. డొల్ల కంపెనీలు పంపించే నకిలీ ఇన్‌వాయిస్‌లను ప్రాసెస్ చేయించి, బోగస్ బిల్లుల ద్వారా దాదాపు రూ.21.6 కోట్లు రూటింగ్ చేశారు. ఈ మొత్తం సొమ్మును అవినాష్‌రెడ్డే వసూలు చేసుకునేవారు.

రాజ్ కెసిరెడ్డితో నిరంతరం సంప్రదింపులు

- మద్యం కుంభకోణానికి సంబంధించి అవినాష్‌రెడ్డి నిరంతరం రాజ్ కెసిరెడ్డితో సంప్రదింపుల్లో ఉండేవారు. వారిద్దరి కాల్ డీటెయిల్ రికార్డులు, లొకేషన్ డేటా, సాక్షుల వాంగ్మూలాలు వంటివి పరిశీలిస్తే.. హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ సహా ఇతర ప్రదేశాల్లో తరచూ కలిసేవారని తేలింది. డిస్టిలరీలు, సరఫరా కంపెనీల నుంచి వసూలు చేసిన ముడుపుల సొమ్ముకు హ్యాండ్లర్లుగా, లాజిస్టిక్స్ కోఆర్డినేటర్లుగా వ్యవహరించే తూకేకుల ఈశ్వర్ కిరణ్‌కుమార్ రెడ్డి (ఏ9), సైఫ్ అహ్మద్ (ఏ10), పైలా దిలీప్ (ఏ30)లను అవినాష్‌రెడ్డే నడిపించేవారు.
- తన తోడల్లుడు కావటంతో రాజ్ కెసిరెడ్డి.. అవినాష్‌రెడ్డికి కీలక బాధ్యతలన్నీ అప్పగించారు. ఈ మొత్తం కుంభకోణాన్ని ముందుండి నడిపించటంలో అవినాష్‌రెడ్డి కీలక పాత్ర పోషించారు. మద్యం ముడుపుల సొమ్ము బలవంతపు వసూళ్లకు ఆయనే ప్రధాన సూత్రధారి. మద్యం కుంభకోణం అమలుకు ఆర్థిక కేంద్ర బిందువుగా వ్యవహరించి, లబ్ధి పొందారు
- విచారణలో అవినాష్‌రెడ్డి నోరు విప్పలేదు. ఈ కుంభకోణానికి సంబంధించి ఏ విషయమూ చెప్పటానికి ఇష్టపడలేదు. దీంతో సిట్ ఆయన్ను అరెస్టు చేసింది.



తిరుపతి విమానాశ్రయంలో ప్రయాణికులు

పెద్ద విమానాలతో తిరుపతి రన్‌వే కళకళ

(మొదటి పేజీ తరువాయి)

సామర్థ్యం గల ఎయిర్‌బస్సులు నడుస్తున్నాయి. సర్వీసుల సంఖ్య రోజుకు 16కు చేరింది. శ్రీవారి దర్శనార్థం వచ్చే భక్తులకు కనెక్టివిటీ పెరగడం, ఉదయం వచ్చి సాయంత్రం వెళ్లే వెసులుబాటు, శ్రీవాణి టికెట్లు అందుబాటులో ఉండటం రద్దీ అనూహ్యంగా పెరగడానికి ప్రధాన కారణాలు. నెలకు సగటున లక్ష మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు.

నష్టాలు అధిగమించేలా..

భారీ టెర్మినల్ భవన నిర్మాణ వ్యయం, తరుగుదల కారణంగా.. ప్రస్తుతం ఈ విమానాశ్రయం ఏటా సుమారు రూ.30 నుంచి రూ.32 కోట్ల నష్టాల్లో ఉంది. నష్టాలు అధిగమించడానికి కమర్షియల్ ఆదాయాన్ని పెంచుకోవాలని ఇటీవల కేంద్రమంత్రి సూచించారు

హోటల్ ఏర్పాటుకు సన్నాహాలు

విమానాశ్రయం సమీపంలో ప్రయాణికులకు సౌకర్యవంతంగా ఉండేలా హోటల్ లేదా రెస్టారెంట్ లేకపోవడం పెద్దలోటు. ఎయిర్‌పోర్ట్ భూములు ప్రభుత్వం ఉచితంగా ఇచ్చినవి కావడంతో, నిబంధనల ప్రకారం అక్కడ వాణిజ్య కార్యకలాపాలు (హోటల్ వంటివి) చేపట్టడంపై కొన్ని ఆంక్షలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో మరోసారి సర్వే నిర్వహించి, అనుమతుల కోసం ప్రతిపాదనలు పంపారు. భద్రతా కారణాలను పరిగణనలోకి తీసుకుని త్వరలో నిర్ణయం వెలువడే అవకాశం ఉంది.

దక్షిణాదిలోనే అతిపెద్ద రన్‌వే

తిరుపతి విమానాశ్రయం రన్‌వే పొడవు 3,800 మీటర్లు.. ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా పరిధిలోని దక్షిణాది విమానాశ్రయాల్లో ఇదే అత్యంత పొడవైనది. చెన్నై, హైదరాబాద్ (శంషాబాద్ మినహా) కంటే ఇది పెద్దదని, ఫ్లోరింగ్ పనులు పూర్తయితే మరింత బలోపేతమవుతుందని ఏపీడీ వెల్లడించారు.

డిజియాత్ర, భద్రత..

కోయంబత్తూరు తరహాలో తిరుపతిలోనూ త్వరలో 'డిజియాత్ర' సేవలు అందుబాటులోకి వస్తాయని ఏపీడీ ఈ సందర్భంగా తెలిపారు. భద్రతపరంగా విమానాశ్రయం పటిష్ఠంగా ఉందని, దాదాపు 800 సీసీ కెమెరాలతో నిరంతర నిఘా ఉందని పేర్కొన్నారు. రాత్రిపూట ల్యాండింగ్ సౌకర్యం కూడా ఉందని.. విమానయాన సంస్థల డిమాండ్ బట్టి 24 గంటల సేవలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని ఆయన స్పష్టం చేశారు.

అంతర్జాతీయ సర్వీసులపై ఆశలు..

సింగపూర్, దుబాయ్ వంటి దేశాల నుంచి తిరుపతికి నేరుగా విమానాలు నడిపే అంశం పరిశీలనలో ఉంది. సింగపూర్ ఎయిర్‌లైన్స్ సానుకూలంగా ఉన్నా విమానాల లభ్యత, పైలట్ల కొరత, మంత్రిత్వశాఖ అనుమతుల వంటి అంశాలపై ఇది ఆధారపడి ఉంది. ప్రైవేట్ జెట్‌లు, చార్టర్డ్ విమానాల కోసం బేగంపేట తరహాలో 'జనరల్ ఏవియేషన్ టెర్మినల్ ఏర్పాటుకు ప్రతిపాదనలు ఉన్నాయి.

ఒక్క సంతకంతో రూ.కోట్లలో లావాదేవీలు

- మద్యం కుంభకోణంలో చక్రం తిప్పిన అవినాష్‌రెడ్డి
- ఏసీబీ కోర్టులో ప్రాసిక్యూషన్ వాదనలు

ఈనాడు, అమరావతి: 'ముప్పిడి అవినాష్‌రెడ్డి మద్యం కుంభకోణంలో చక్రం తిప్పారు. అతని ఒక్క సంతకంతో రూ.కోట్లలో లావాదేవీలు జరిగాయి. లంచాల సొమ్మును కీలక వ్యక్తులకు చేరవేయడంలో ముఖ్యభూమిక పోషించారు' అని ప్రాసిక్యూషన్స్ డీడీ విజయలక్ష్మి వాదించారు. వైకాపా హయాంలో జరిగిన మద్యం కుంభకోణంలో నిందితుడైన అవినాష్‌రెడ్డి (ఏ7)ని గురువారం అరెస్ట్ చేసిన సిట్ అధికారులు సిట్ కార్యాలయంలో ప్రశ్నించారు. వైద్య పరీక్షలు చేయించి, ఏసీబీ కోర్టులో హాజరుపరిచారు. డీడీ తన వాదనలు వినిపిస్తూ..కేసులో రాజ్ కెసిరెడ్డి (ఏ1) కంటే అవినాష్‌రెడ్డి పాత్ర ఏ మాత్రం తీసిపోదన్నారు. కుంభకోణంలో ఆయన పాత్ర గురించి 39 మంది సాక్షులు వాంగ్మూలాలు ఇచ్చారన్నారు. నిందితుణ్ని రిమాండ్ నిమిత్తం విజయవాడ కారాగారానికి పంపొద్దని.. అదే జైలులో అతని తోడల్లుడు రాజ్ కెసిరెడ్డి కూడా ఉన్నాడని గుర్తు చేశారు. ఇద్దరూ ఒకే కారాగారంలో ఉంటే కేసులో సాక్ష్యాలను తారుమారు చేస్తారని వాదించారు. ప్రాసిక్యూషన్ చెబుతున్న అంశాలు రిమాండ్ రిపోర్టులో పేర్కొనలేదని అవినాష్‌రెడ్డి తరఫు న్యాయవాది విష్ణువర్ధన్ వాదించారు. సిట్ అధికారులు తమకు అనుకూలంగా సాక్షుల స్టేట్‌మెంట్లను రూపొందించుకున్నారని అన్నారు. నిందితుడి కాలికి గాయమైందని, రిమాండ్ నిమిత్తం విజయవాడ జైలుకు తరలించేలా ఉత్తర్వులు ఇవ్వాలని అభ్యర్థించారు. రాజమహేంద్రవరం కేంద్ర కారాగారానికి పంపిస్తే ములాఖత్‌ల విషయంలోనూ ఇబ్బందులు తలెత్తుతాయని అన్నారు. నిందితుడిని విజయవాడ కారాగారానికి రిమాండ్ ఇవ్వొద్దని దర్యాప్తు అధికారి శ్రీహరి కోరారు. న్యాయాధికారి భాస్కరరావు ముప్పిడి అవినాష్‌రెడ్డికి రిమాండ్ విధించారు. ఆయన్ను గుంటూరులోని జిల్లా జైలుకు తరలించారు.

భారత్, ఇజ్రాయెల్ సంబంధాల్లో సరికొత్త శకం

(మొదటి పేజీ తరువాయి)

అమెరికా-ఇరాన్ ప్రతిష్టంభన కూడా వారి చర్చల్లో ప్రస్తావనకు వచ్చింది. మోదీ-నెతన్యాహు భేటీ అనంతరం- వాణిజ్యం, వ్యవసాయం, విద్య, ఇంధనం, సైబర్‌స్పేస్, డిజిటల్ చెల్లింపులు తదితర రంగాల్లో దిల్లీ-టెల్‌అవీవ్ మొత్తం 17 కీలక ఒప్పందాలను కుదుర్చుకున్నాయి. సాంకేతికతల బదిలీ ఫ్రేమ్‌వర్క్ ద్వారా మిలిటరీ హార్డ్‌వేర్ సంయుక్త అభివృద్ధి, ఉత్పత్తి చేపడుతూ.. తమ మధ్య ఇప్పటికే ఉన్న సన్నిహిత రక్షణ భాగస్వామ్యాన్ని మరింత విస్తరించుకోవాలని నిర్ణయించుకున్నాయి.



ఇజ్రాయెల్ అధ్యక్షుడు హెర్జోగ్‌తో ప్రధాని మోదీ



జెరూసలెంలో ప్రపంచ హోలోకాస్ట్ (యూదులపై నాజీల మారణహోమం) స్మారక కేంద్రమైన యాద్ వశెమ్ దగ్గర పుష్పగుచ్ఛం ఉంచి నమస్కారం చేస్తున్న ప్రధాని మోదీ. చిత్రంలో ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు ఉన్నారు.

భవిష్యత్ సాంకేతికతల కోసం భాగస్వామ్యం

కృత్రిమ మేధ(ఏఐ), క్వాంటమ్, కీలక ఖనిజాల రంగాల్లో సహకారాన్ని మరింత పెంచుకునేందుకు భారత్-ఇజ్రాయెల్ కీలక, భవిష్యత్ సాంకేతికతల భాగస్వామ్యాన్ని ఏర్పరుచుకుంటున్నట్లు మోదీ ప్రకటించారు. ఇజ్రాయెల్‌లో యూపీఐ వినియోగానికి ఒప్పందం కుదిరిందన్నారు. పశ్చిమాసియాలో శాంతి, స్థిరత్వంతో భారత భద్రతా ప్రయోజనాలు నేరుగా ముడిపడి ఉన్నాయని.. నెతన్యాహుతో భేటీ అనంతరం మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో మోదీ పేర్కొన్నారు. సంఘర్షణలకు మానవాళి బలిపశువుగా మారకూడదంటూ, గాజా శాంతి ప్రణాళికకు భారత మద్దతును పునరుద్ఘాటించారు. ఉగ్రవాదానికి ప్రపంచంలో చోటు లేదన్నారు. ప్రధానుల చర్చల అనంతరం ఇరు దేశాలు ఉమ్మడి ప్రకటనను కూడా విడుదల చేశాయి.

భారత్‌లో పెట్టుబడులు పెట్టండి

ఏఐ, ఆరోగ్య సేవలు, వ్యవసాయం వంటి రంగాల్లో వినూత్న ఆవిష్కరణలను ప్రదర్శిస్తూ జెరూసలెంలో ఏర్పాటుచేసిన ఇన్నోవేషన్ ఎగ్జిబిషన్‌ను మోదీ సందర్శించారు. ఆయా ఆవిష్కరణలను చూసి ముగ్ధులయ్యారు. భారత్‌లో పెట్టుబడులు పెట్టాలని ఇజ్రాయెలీ టెక్నాలజీ కంపెనీలకు ఆయన పిలుపునిచ్చారు.

యాద్ వశెమ్ స్మారకం వద్ద నివాళులు

జెరూసలెంలోని యాద్ వశెమ్ స్మారకాన్ని నెతన్యాహుతో కలిసి మోదీ సందర్శించారు. యూదులపై నాజీల మారణహోమం (హోలోకాస్ట్)లో ప్రాణాలు కోల్పోయినవారికి పుష్పాంజలి ఘటించారు. హోలోకాస్ట్‌లో మరణించినవారి పేర్లు ఉండే హాల్ ఆఫ్ నేమ్స్‌ను కూడా సందర్శించారు. తన సతీమణి సారా బంధువుల పేర్లు అందులో ఉండటాన్ని మోదీకి నెతన్యాహు చూపించారు. మోదీ యాద్ వశెమ్‌ను సందర్శించడం ఇది రెండోసారి.

ఇజ్రాయెల్ అధ్యక్షుడితో భేటీ

ఇజ్రాయెల్ అధ్యక్షుడు ఇసాక్ హెర్జోగ్‌తో మోదీ భేటీ అయ్యారు. విద్య, స్టార్టప్‌లు, నవకల్పనలు, సాంకేతికతలు, అనుసంధానం తదితర రంగాల్లో ఇరు దేశాల మధ్య సహకారాన్ని మరింత పెంచుకోవడంపై చర్చించారు. ద్వైపాక్షిక మైత్రికి చిహ్నంగా మోదీ, హెర్జోగ్ ఓక్ చెట్టును నాటారు. భారత పర్యటనకు రావాలంటూ ఇజ్రాయెల్ అధ్యక్షుణ్ని భారత ప్రధాని ఆహ్వానించారు.

- భారత సంతతికి చెందిన పలువురు యూదు ప్రముఖులు జెరూసలెంలో మోదీతో సమావేశమయ్యారు. ప్రధానిని కలిసినవారిలో రికీ షాహీ, ఇసాక్ థాంగ్జన్ తదితరులు ఉన్నారు. 2023 నాటి లెక్కల ప్రకారం- ఇజ్రాయెల్‌లో భారత సంతతి యూదుల సంఖ్య దాదాపు 85 వేలు.
- గూఢచర్యం నేపథ్యంలో రూపొందించిన ఇజ్రాయెలీ యాక్షన్ థ్రిల్లర్ సిరీస్ 'ఫౌదా' తారాగణంతో మోదీ కొద్దిసేపు ముచ్చటించారు. వారితో తీసుకున్న సెల్ఫీని సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నారు.
- ఇజ్రాయెల్ పర్యటనను ముగించుకొని గురువారమే మోదీ స్వదేశానికి బయలుదేరి వచ్చారు.

ఈనాడు

తాగునీటి కాలుష్యాన్ని అరికట్టలేమా?

స్వచ్ఛమైన నీటిని పొందడాన్ని పౌరుల ప్రాథమిక హక్కుగా అభివర్ణించిన సుప్రీంకోర్టు- దాన్ని సంరక్షించాల్సిన బాధ్యత రాజ్యానిదేనని గతంలోనే స్పష్టీకరించింది. పరిసరాల పరిశుభ్రత, ఆరోగ్యకర వాతావరణం- జీవించే హక్కులో అంతర్భాగాలని కిందటి వారంలోనూ పునరుద్ఘాటించింది. న్యాయపాలిక మహితోక్తులను ప్రభుత్వాలు పెడచెవిన పెట్టడం వల్లే ఇటీవల ఇండోర్‌లో తాగునీరు కలుషితమై, పలువురి మరణాలకు కారణమైంది. బెంగళూరు, గాంధీనగర్, గ్రేటర్ నోయిడాలతో పాటు హైదరాబాద్, ఆదిలాబాద్, విజయవాడ, గుంటూరు, ఆళ్లగడ్డ వంటి చోట్ల కూడా లోగడ తాగునీటి కాలుష్యం పెద్దసంఖ్యలో జనాన్ని ఆస్పత్రుల పాల్జేసింది. ఎంతోమంది ప్రాణాలు తీసింది. మలిన జలాల మూలంగానే కొన్నాళ్లక్రితం విజయనగరం జిల్లాలో డయేరియా విజృంభించింది. తాజాగా శ్రీకాకుళంలోనూ అది కలకలం సృష్టిస్తోంది. దేశీయంగా పలు ప్రాంతాల్లో పగుళ్లుబారిన పురాతన మంచినీటి పైపులైన్లు డ్రైనేజీల్లోంచి వెళ్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నాయి. చాలా చోట్ల బోర్ల చుట్టూ మురుగు, వ్యర్థాలు పేరుకుపోయి దుర్భర పరిస్థితులు తాండవిస్తున్నాయి. ఇంకోవైపేమో ట్యాంకులను శుభ్రపరచడం, నీటి శుద్ధి, క్లోరినేషన్, నాణ్యతా పరీక్షలు ప్రహసనంగా మారాయి. ఇవన్నీ నీటిని విషతుల్యం చేసి ప్రజారోగ్యాన్ని హరించివేస్తున్నాయి!

గడిచిన అయిదేళ్లలో దేశవ్యాప్తంగా దాదాపు 1.54 కోట్ల డయేరియా కేసులు నమోదయ్యాయి. ఏపీలో అవి 3.95 లక్షల మేర వెలుగుచూస్తే, తెలంగాణలో వాటి సంఖ్య 3.29 లక్షలుగా లెక్కతేలింది. 2021లో దేశీయంగా 217 కలరా కేసులు బయటపడితే, నిరుడు అవి అంతకు 22 రెట్లకు పెరిగాయి. లెప్టోస్పైరోసిస్ కేసులూ మూడున్నర రెట్లు అధికమయ్యాయి. నానాటికీ దిగనాసిల్లిపోతున్న తాగునీటి స్వచ్ఛతకు ఈ గణాంకాలు అద్దంపడుతున్నాయి. అపరిశుభ్రమైన నీళ్లు మోసుకొస్తున్న వ్యాధుల మూలంగా ఇండియాలో ఏటా మూడున్నర కోట్ల మంది మంచం పడుతున్నారని అంచనా! దేశీయంగా ప్రతి ఇంటికీ శుద్ధమైన నీటిని అందిస్తే నాలుగు లక్షల అర్ధాంతర మరణాలను నివారించవచ్చని ప్రపంచ ఆరోగ్య సంస్థ మూడేళ్ల కిందటే హితవు పలికింది. దాన్ని ఆలకించని స్థానిక ప్రభుత్వాల అలక్ష్యం జనభారతం ప్రాణాలపైకి తెస్తోంది. నీటి శుద్ధిలో లోపాలు, అరకొర పారిశుద్ధ్య వసతులతో డయేరియా లాంటి వ్యాధులు తరచూ ప్రబలుతున్నాయి. బ్యాక్టీరియా వృద్ధి ఎక్కువగా ఉండే వేసవిలో అవి మరింతగా కోరలుచాస్తుండటం ఏటా రివాజు అవుతున్న నేపథ్యంలో యంత్రాంగం ఇప్పటికైనా చురుకు తెచ్చుకోవాలి!

ప్రపంచంలోని అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా వెలుగొందుతున్న ఇండియా త్వరలో చంద్రమండలానికి మనిషిని పంపేందుకు సిద్ధమవుతోంది. అదే సమయంలో ప్రాణరక్షక వసతుల విస్తరణలో అలక్ష్యం మన పురోగతిని అపహాస్యం చేస్తోంది. దేశీయంగా గృహాలకు సరఫరా అవుతున్న నల్లానీటిని ఇటీవల పరిశీలిస్తే 24శాతం నమూనాలు ప్రమాణాల మేరకు లేవని తేలింది. 485 పట్టణాల్లో కేంద్రం జరిపిన ఒక సర్వేలో 46 చోట్లే శుద్ధ జలాలు అందుతున్నట్లు వెల్లడైంది. ఇవన్నీ కర్తవ్య నిర్వహణలో స్థానిక సంస్థల వైఫల్యాన్ని పట్టిచ్చేవే. స్వచ్ఛతా కార్యక్రమాలకు వెచ్చించే ప్రతి రూపాయి వల్ల ఆరోగ్య వ్యయాలు దిగివచ్చి సమాజానికి నాలుగున్నర రూపాయల చొప్పున లాభం చేకూరుతుందని అధికారిక వర్గాలే స్పష్టం చేస్తున్నాయి. దీన్ని గుర్తించి పంచాయతీలు, మునిసిపాలిటీలు పారిశుద్ధ్య నిర్వహణ, శుద్ధ జలాల సరఫరాకు చిత్తశుద్ధితో కట్టుబడాలి. స్థానిక సంస్థల పాలకవర్గాలు దీన్ని ప్రాధాన్యాంశంగా భావించాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వాటికి అండగా నిలబడటం ప్రజాసంక్షేమం దృష్ట్యా అత్యావశ్యకం.



పొగతాగడం వల్ల దేశంలో ఏటా పది లక్షల మంది ప్రాణాలు కోల్పోతున్నారు. చదువుకున్నవారిలోనూ వ్యసనాల పట్ల అవగాహన ఉండటం లేదు.

– ప్రభాత్ ఝా, ఎపిడెమియాలజిస్టు

సాక్షులున్నారు!

కళ్లు మూసుకుని పాలు తాగుతూ పిల్లి తననెవ్వరూ గమనించడం లేదనుకుంటుందట! అదేవిధంగా మోహంతోనో, ఆవేశంతోనో, అహంకారంతోనో, అధికారంతోనో కళ్లు మూసుకుపోయి ఎవరు చూడొచ్చారులే అనుకుంటూ అధర్మపు పనులు చేయవచ్చు. పట్టుబడితే అబద్ధాలాడి తాత్కాలికంగా తప్పించుకోవచ్చేమో. కానీ, మనం ఆచరించే సమస్త కర్మల మంచీచెడులకు ప్రత్యక్ష సాక్షిగా నిలిచే అంతరాత్మ దృష్టి నుంచి మాత్రం తప్పించుకోలేం.

దుష్యంత మహారాజు కణ్వమహర్షి ఆశ్రమంలో శకుంతలను చూసి, ఆమె సౌందర్యానికి ముగ్ధుడై, గాంధర్వ వివాహం చేసుకుంటాననంటాడు. వివాహం తర్వాత తమకు పుట్టబోయే కొడుకును యువరాజును చేస్తానని హామీ ఇవ్వమంటుంది శకుంతల.



అంతర్యామి

అందుకు అంగీకరించి పెళ్లి చేసుకుని, కొద్ది కాలం అక్కడే గడుపుతాడు దుష్యంతుడు. ఆ తర్వాత రాజధానికి వెళ్తూ 'అంతఃపుర మర్యాదలతో నిన్ను రాజమందిరానికి తీసుకెళ్తాను' అని చెప్పి వెళ్లిన దుష్యంతుడు మళ్లీ తిరిగి రాలేదు, శకుంతలను తీసుకెళ్లలేదు. భర్త పిలుపు కోసం చూసి చూసి, తను రాకపోవడంతో తండ్రి కణ్వమహర్షి సలహా మేరకు కొడుకును తీసుకుని దుష్యంతుడి సభకు వెళ్తుంది శకుంతల. తమ గాంధర్వ వివాహం గురించి, ఆయన చేసిన ప్రతిజ్ఞ గురించి గుర్తుచేస్తుంది. ఆమె ఎవరో తనకు తెలియదంటాడు శాప ప్రభావంతో దుష్యంతుడు. 'రాజును, నేను రహస్యంగా పెళ్లి చేసుకోవడం ఏంటి, ఆ వివాహం జరిగిందనడానికి సాక్షులు ఎవరు? వ్యర్థపు మాటలతో కాలహరణం చెయ్యక వచ్చిన దారిన వెళ్లిపొ'మ్మంటాడు. 'రాజుగా మీరు అసత్యం చెప్పకూడదు. వెయ్యి అశ్వమేధయాగాల కన్నా; సమస్త వేదాలను, శాస్త్రాలను ఆపోశన పట్టిన పండితుడి కన్నా; సమస్త పుణ్యతీర్థాలలో స్నానమాచరించడం కన్నా గొప్పది సత్య వాక్కు. సత్యాన్ని మించిన ధర్మం లేదు. సత్యమే పరమాత్మ. సత్యమే పరబ్రహ్మ. వివాహ సమయంలో మనం ఒంటరిగా ఉన్నామని, అందుకు సాక్ష్యం ఏమీ లేదని మీరు భావిస్తున్నారేమో, పరమాత్మ అందరిలోనూ ఉంటాడు. అంతటా ఉంటాడు. పంచభూతాలు, వేదాలు, సూర్యచంద్రులు, పగలు రేయిలు, ధర్మం, యముడు, ఆకాశం మొదలైన వాటితో పాటు ఆ పరమాత్మ కొలువై ఉన్న మన అంతరాత్మయే మన వివాహానికి ప్రత్యక్ష సాక్షి. కాబట్టి రాజా.. ఆ అంతరాత్మ సాక్షిగా మీరు నాకిచ్చిన మాటను జ్ఞప్తికి తెచ్చుకుని ధర్మాన్ని పాటించండి. మీ భార్యగా నన్ను అంగీకరించి చేసిన ప్రతిజ్ఞ నిలబెట్టుకోండి' అంటూ ప్రకృతిని, అంతరాత్మని తమ గాంధర్వ వివాహానికి సాక్షులుగా చూపిస్తుంది శకుంతల.

మనం ఆచరించే సమస్త కర్మలలో ఏది ఒప్పో ఏది తప్పో మన అంతరాత్మే న్యాయస్థానమై ప్రబోధిస్తూనే, వాటికి సాక్షిగా కూడా నిలబడుతుంది. భగవంతుడికి శరణాగతితో తనని తాను సమర్పించుకుంటూ ఆచరించే సమస్త కర్మలకు, ధర్మమార్గంలో నడిచేవారికి ఆ పరమాత్మే సాక్షిగా, అండగా నిలబడి రక్షణ కల్పిస్తాడన్నది గీతాసందేశం.

– జీవీయస్ ఆచార్యులు

కంటైనర్ల కొరత తీరేదెలా?

సత్వర, సుస్థిర ఆర్థిక ప్రగతికి తయారీ రంగం అత్యంత కీలకం. ప్రస్తుతం దేశ జీడీపీలో తయారీ రంగం వాటా 17శాతం. దీన్ని 25శాతానికి పెంచేందుకు ఉత్పత్తిని ప్రోత్సహించడమే కాకుండా... పారిశ్రామిక, సరకు రవాణా కారిడార్లను విస్తరించాలని ఈ ఏడాది కేంద్ర బడ్జెట్ లక్షిస్తోంది. ఆ గమ్యాన్ని చేరుకోవడంతోపాటు సరకును సురక్షితంగా రవాణా చేయడానికి తగినంత సంఖ్యలో కంటైనర్లు అవసరం. వాటి ఉత్పత్తిలో వెనకబాటుతనం వల్ల భారతదేశానికి రవాణా ఖర్చులు తడిసిమోపెడు అవుతున్నాయి.

దేశంలో కంటైనర్ల ఉత్పత్తి సామర్థ్యం చాలా తక్కువగా ఉంది. వాటికి డిమాండ్ ఏమో చాలా ఎక్కువగా ఉంటోంది. దానివల్ల సరకు రవాణాకు కంటైనర్ల కొరత తప్పడంలేదు. దీంతో ఓవైపు వ్యయం పెరుగుతుంటే, మరోవైపు రవాణాలో జాప్యం కారణంగా సరకుల డిమాండ్ తగ్గిపోతోంది. ఇటువంటి పరిస్థితుల్లో కేంద్రం 2015లో 'సాగరమాల' పథకాన్ని ప్రారంభించింది. దీని ద్వారా పోర్టు ఆధారిత వర్తకాన్ని త్వరితంగా, తక్కువ వ్యయంతో నిర్వహించడం వీలవుతోంది. నేడు దేశంలో విలువపరంగా దాదాపు 70శాతం విదేశీ వాణిజ్యం సముద్ర రవాణా ద్వారానే జరుగుతోంది. దానికి అత్యావశ్యమైన కంటైనర్ల తయారీని పెంచితే, దేశీయ వర్తకంలో విప్లవాత్మక ముందడుగు పడుతుంది. ముఖ్యంగా సరకు ఉత్పత్తి, రవాణా వ్యయాలు బాగా తగ్గుతాయి. 2024 నాటి జల రవాణా శాఖ గణాంకాల ప్రకారం, దేశంలో మూడు లక్షలకు పైగా కంటైనర్ల అవసరముంది. కానీ, మన దగ్గర ఏటా తయారవుతున్నవి పదివేల నుంచి ముప్పైవేల కంటైనర్లే! చైనా అయితే ఏటా సుమారు 30లక్షల కంటైనర్లను ఉత్పత్తి చేస్తోంది. ఆ దేశం నుంచే మనం ఎక్కువగా వాటిని అధిక ధరకు తీసుకుని సరకు రవాణాకు వాడుకుంటున్నాం. దాంతో లాజిస్టిక్స్ వ్యయం పెరిగి, ఎగుమతుల్లో వెనకబడిపోతున్నాం.




చైనా పోటీని తట్టుకోవాలంటే...

ప్రభుత్వ రంగంలోని కంటైనర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా 'మినీ రత్న' హోదా కలిగిన సంస్థ. ఇది బహుళవిధ లాజిస్టిక్స్ సేవలను అందిస్తోంది. ప్రధానంగా కంటైనర్లను ఉత్పత్తి చేయడం ద్వారా వాణిజ్య విస్తరణకు తనవంతుగా దోహదపడుతోంది. భారత్‌లో తయారీలో భాగంగా నిరుడు ఈ సంస్థ మూడు వేల కొత్త కంటైనర్లను తయారు చేసింది. 56వేల కంటైనర్ల ఉత్పత్తి లక్ష్యాన్ని ఇటీవలే చేరుకుంది. కానీ, మన దేశంలో ఒక కంటైనర్ తయారీకి సుమారు 4800 డాలర్ల వరకు ఖర్చవుతోంది. చైనాలో నైతే అది 3500 డాలర్లలోపే ఉంటోంది. దాంతో మనం చైనా వంటి తక్కువ ఖర్చుతో ఎగుమతులు చేపట్టే దేశాలతో పోటీ పడలేకపోతున్నాం. భారీ కంటైనర్ నౌకల రాకపోకల కోసమని కేంద్ర ప్రభుత్వం మహారాష్ట్రలోని పాల్ఘర్ జిల్లాలో వాఢ్వాన్ పోర్టు అభివృద్ధిని చేపట్టింది. ఇక్కడ 2.30లక్షల డెడ్ వాటర్ టన్నేజ్ సామర్థ్యంతో బహుళార్థసాధక కార్గో బెర్తుల ద్వారా సరకును నిర్వహించనున్నారు. 'ఇండియా- పశ్చిమాసియా-ఐరోపా ఆర్థిక నడవా(ఐమెక్)'లో భాగంగా ఈ ఓడరేవు నిర్మాణం చేపట్టారు. అంతర్జాతీయ వాణిజ్యానికి 'ఐమెక్' మరింతగా మార్గం సుగమం చేస్తుంది. చైనా నుంచి పోటీని తట్టుకోవడానికి, ఆ దేశం చేపట్టిన 'బెల్ట్ అండ్ రోడ్ ప్రాజెక్ట్'కూ ఐమెక్ ప్రత్యామ్నాయం కాగలదు. పైగా ఈ మార్గంలో రవాణా ఖర్చులు తగ్గడమే కాకుండా, సరకును త్వరగా గమ్యస్థానాలకు చేరవేసే వీలుంటుంది. ఇది దేశీయ కంటైనర్ రంగానికి పెద్ద ఊతమిస్తుంది కానీ, వాటి ఉత్పత్తిని త్వరితగతిన, పెద్దయెత్తున చేపట్టాల్సి ఉంది. ఎందుకంటే, పోర్టుల ద్వారా ఎగుమతి, దిగుమతుల నిర్వహణకు వేల సంఖ్యలో సాధారణ, ప్రత్యేక కంటైనర్లు కావాలి.

గతంలో మన మొత్తం లాజిస్టిక్స్ వ్యయం జీడీపీలో 13-14శాతంగా ఉండేది. పీఎం గతిశక్తి, పోర్ట్స్, ఈ-వే బిల్లులు తదితరాల వల్ల 2023-24లో అది ఎనిమిది శాతానికి తగ్గింది. అయితే, సరకు రవాణా గిరాకీ ఏడాదికి ఏడెనిమిది శాతం చొప్పున పెరుగుతుందని అంచనా. కాబట్టి, ఉన్న సదుపాయాలను సమగ్రంగా ఉపయోగించుకుంటూ, అవసరమైన కొత్త వనరులను వేగంగా సమకూర్చుకోకపోతే లాజిస్టిక్స్ వ్యయం మళ్లీ అధికం కావచ్చు. ఈ నేపథ్యంలో కేంద్రం ఈసారి బడ్జెట్‌లో కంటైనర్ల తయారీకి అయిదేళ్ల కాలానికి పదివేల కోట్ల రూపాయలను కేటాయించింది. అయితే పారిశ్రామిక ప్రగతి, ఎగుమతి లక్ష్యాలను అందుకునేలా కంటైనర్ల ఉత్పత్తి చేపట్టడానికి ఈ నిధులు సరిపోవు. పైగా ఇటీవలి కాలంలో భారత్ అనేక దేశాలు, కూటములతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు చేసుకుంటోంది. వాటి మూలంగా భారతదేశ ఎగుమతి రంగం మరింతగా జోరందుకోనుంది. ఈ అవకాశాలను సమగ్రంగా అందిపుచ్చుకోవాలంటే కంటైనర్ల కొరతను తప్పించాలి. సమీప భవిష్యత్తులో హైస్పీడ్ రైలు మార్గాలను ఏర్పాటుచేసి, సరకు సత్వర రవాణాకు వీలుకల్పించడమూ ముఖ్యమే!

సాధికారత సాధించాలంటే...

పబ్లిక్-ప్రైవేట్ భాగస్వామ్యంతో కంటైనర్ల తయారీని వేగిరపరచడం తక్షణావసరం. దాంతోపాటు ప్రైవేటు రంగంలో వాటి తయారీని ప్రోత్సహించేందుకు ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహకాలు, రాయితీలను అందించాలి. కంటైనర్ల తయారీకి కావాల్సిన ముడిసరకును తక్కువ ధరకు అందించడంపైనా దృష్టి పెట్టాలి. సాంప్రదాయిక కంటైనర్లతోపాటు చేపలు, రొయ్యలు వంటి సరకుల నాణ్యత క్షీణించకుండా కాపాడేందుకు కోల్డ్ స్టోరేజ్ కంటైనర్ల ఉత్పత్తినీ చేపట్టాలి. ఈ విషయంలో జపాన్, కొరియా వంటి దేశాల సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలి. షిప్పింగ్, కంటైనర్ తయారీ సంస్థలు దీర్ఘకాలిక ఒప్పందాలు కుదుర్చుకోవడం ఉభయతారకం అవుతుంది. ఇటువంటి చర్యలతో పాటు, కంటైనర్ల లీజు రేట్లు తగ్గించేలా చైనాతో మాటామంతీ జరపాలి. కంటైనర్ల లభ్యత గురించి మాత్రమే కాకుండా- ఏ సమయంలో ఎక్కడ వాటి అవసరముందో తెలిసేలా ఏకీకృత లాజిస్టిక్స్ ఇంటర్‌ఫేస్, లాజిస్టిక్స్ డేటాబేస్‌లను నిర్మించాలి. కృత్రిమ మేధ, జీపీఎస్ వంటి ఆధునిక సాంకేతికతల ద్వారా కంటైనర్ల వినియోగాన్ని ఎప్పటికప్పుడు గమనించవచ్చు. మొత్తంగా సంఖ్యాపరంగానే కాకుండా, అత్యాధునిక కంటైనర్ల తయారీలోనూ భారత్ సాధికారత సాధించడం స్వావలంబన సాధనకు అత్యావశ్యకం.



డాక్టర్ పి.ఎస్.ఎస్.మూర్తి

మాజీ డైరెక్టర్, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా





ఓటమి... గెలిపిస్తుంది!

పరీక్షల కాలం వచ్చేసింది. కొందరికి ప్రారంభమైపోయాయి కూడా. సాధారణంగా ఎగ్జామ్ డేట్ దగ్గరపడుతున్న కొద్దీ చాలా మంది విద్యార్థులు తీవ్ర ఒత్తిడికి గురవుతుంటారు. ఇతర పిల్లలతో పోల్చి చూస్తూ ఈ పోటీ ప్రపంచంలో తమ బిడ్డలు ఎక్కడ వెనకబడిపోతారోనని తల్లిదండ్రులూ టెన్షన్ పడుతుంటారు. కానీ నిజానికి ఇది ఇద్దరూ ఆందోళన చెందాల్సిన విషయం కాదు. అమ్మానాన్నలు పిల్లలకు అండగా నిలవాల్సిన సమయం. పరీక్షల్లో ఫెయిలైనా పర్వాలేదు కానీ పిల్లలు జీవితంలో విఫలం కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత పెద్దలదే.

జీవితంలో ప్రతి ఓటమినీ గెలుపునకు పునాదిగా మలచుకోవడం ఎలాగో అబ్రహాం లింకన్ జీవితం చెబుతుంది. ఆయన 1832నుంచి మొదలెట్టి 1861లో అమెరికా 16వ అధ్యక్షుడిగా గెలుపొందే వరకు ఎన్నో ఎన్నికల్లో ఓడిపోయారు. కానీ ఎక్కడా నిరాశానిస్పృహలకు గురికాలేదు. వ్యక్తిగత జీవితంలోనూ, వృత్తిపరంగానూ ఆయన ఎదుర్కొన్న సమస్యలకు, విషాదాలకు లెక్కేలేదు. చిన్నప్పుడే తల్లి చనిపోయింది. ఆస్తులన్నీ వివాదాల్లో ఉండటంతో పేదరికం అనుభవించక తప్పలేదు. చదువంటే ఎంతో ఇష్టం కానీ పద్ధతిగా చదువుకునే అవకాశం లభించలేదు. తండ్రి కొడుకును పనిలో పెట్టి జీతం తను తీసుకునేవాడు. కేవలం చదువు పట్ల తండ్రి వైఖరి నచ్చకే లింకన్ ఆయనకు దూరంగా వెళ్లిపోయారు. పుస్తకాలు కొనుక్కుని తనంతట తాను చదువుకుంటూ లా పూర్తిచేశారు. రకరకాల ఉద్యోగాలు చేశారు. వ్యాపారాలు పెట్టి నష్టపోయారు. ప్రేమించిన అమ్మాయి అనారోగ్యంతో చనిపోయింది. తర్వాత పెళ్లి చేసుకున్న మేరీతో కూడా మొదట నిశ్చితార్థం రద్దు చేసుకుని కొన్నాళ్లకు మళ్లీ మనసు మార్చుకుని పెళ్లాడారు. నలుగురు కొడుకులు పుడితే ముగ్గురు రకరకాల వ్యాధులతో మరణించారు. దాంతో తీవ్ర కుంగుబాటుకు లోనయ్యారు. వీటన్నిటి నేపథ్యంలోనే ఆయన పొలిటికల్ కెరీర్ కొనసాగింది. అద్భుతమైన ప్రసంగాలతో ప్రజలను ఆకట్టుకున్నా ఓట్లు మాత్రం పడేవి కావు. అయినా పట్టువదలని విక్రమార్కుడిలా రెట్టించిన ఉత్సాహంతో మరో ఎన్నికకు సిద్ధమవుతుండేవారు. కాబట్టే అధ్యక్షపదవిని అందుకోగలిగారు. చరిత్రాత్మక విధానాలతో ప్రపంచానికి గుర్తుండిపోయే నేత అయ్యారు.

లింకన్ తన కొడుకును పాఠశాలలో చేర్పించినప్పుడు ఉపాధ్యాయుడికి రాసిన ఒక లేఖ బహుళ ప్రాచుర్యం పొందింది. తల్లిదండ్రులందరూ తెలుసుకోవాల్సిన విషయాలు అందులో ఉన్నాయి. చదువంటే కేవలం మార్కులు కాదనీ విద్యార్థి ఉత్తమ పౌరుడిగా ఎదగడానికి ఉపయోగపడాలని ఆ లేఖలో ఆయన పేర్కొన్నారు. 'ఒక చెట్టును నరకడానికి నాకు ఆరు గంటల సమయం ఇస్తే మొదటి నాలుగు గంటలూ గొడ్డలి పదును పెట్టడానికే ఉపయోగిస్తాను' అని అబ్రహాం లింకన్ అనేవారని చెబుతారు. ఫలితం కన్నా నైపుణ్యాలకు ఎక్కువ ప్రాధాన్యమివ్వాలని చెప్పకనే చెప్పారు. విద్యార్థులు కూడా పరీక్ష ఎలా ఉంటుందో, ఎలా రాస్తామో, ఎన్ని మార్కులు వస్తాయోనన్న ఆందోళన మాని పరీక్షకు సిద్ధమవడం పైనే దృష్టి పెట్టాలి. ప్రణాళిక ప్రకారం చదువుకుని సిద్ధమైనప్పుడు ఒత్తిడి, ఆందోళనలకు అవకాశమే ఉండదు. ఆత్మవిశ్వాసంతో పరీక్షలు బాగా రాయగలుగుతారు.

– మంద రామచంద్రం

దిగుమతులే ఆధారం

నవీన సాంకేతికతలు, శుద్ధ ఇంధనాలు, జాతీయ భద్రతలో రేర్ ఎర్త్ మెటల్స్‌దే కీలక భూమిక. గడిచిన అయిదేళ్లలో చైనా, హాంకాంగ్, జపాన్, అమెరికా, యూకే, రష్యా, జర్మనీ, ఆస్ట్రియా తదితర దేశాల నుంచి భారత్ పెద్దయెత్తున ఆల్కలీ, స్కాండియం, ఇట్రియం, ఇనార్గానిక్, ఆర్గానిక్ రేర్ ఎర్త్ మెటల్స్‌ను దిగుమతి చేసుకుంది. ఆయా ఆర్థిక సంవత్సరాల్లో ఆ దిగుమతులు ఎంత మొత్తంలో ఉన్నాయంటే (టన్నుల్లో)...



2019–20	1,848
2020–21	1,721
2021–22	1,944
2022–23	1,945
2023–24	2,270

(ఆధారం: లోక్‌సభలో కేంద్రం వెల్లడించిన వివరాలు)

కట్టుతప్పితే కొరడా విదిలించాల్సిందే!

కమ్యూనికేషన్, సమాచార సాంకేతిక (ఐటీ) రంగాలు 21వ శతాబ్దంలో భారతదేశ ఆర్థిక ప్రగతికి పట్టుగొమ్మలయ్యాయి. ప్రైవేటు ఎయిర్‌లైన్స్‌తో పౌర విమానయానానికి కొత్త రెక్కలొచ్చాయి. ప్రభుత్వ ప్రోత్సాహం, విధానాలు వాటికి మరింత ఊతమిచ్చాయి. అదే సమయంలో కమ్యూనికేషన్, పౌర విమానయాన రంగాలలో పెరిగిపోయిన పోటీ కొన్ని అవాంఛనీయ ఫలితాలకు దారితీసింది. విమానయానం, టెలికాం రంగాలలో ఆరంభ పెట్టుబడులు భారీగా ఉంటాయి. నిర్వహణ వ్యయమూ ఎక్కువే. అయినా పోటీ లేకుండా చూసుకోవడానికి తమ ఉత్పత్తిని లేదా సేవను అసలు వ్యయంకన్నా బాగా తగ్గించడం సరికాదు. దానివల్ల తాత్కాలికంగా పోటీ తొలగిపోయినా, దీర్ఘకాలంలో లాభాలు చిక్కక వ్యాపార నిర్వహణ కష్టమైపోతుంది. ఇండిగో, ఆర్‌కామ్‌ల విషయంలో జరిగింది ఇదే!





వినియోగదారులను ఆకర్షించేందుకు సంస్థలు ఎన్నో ప్రయత్నాలు చేస్తుంటాయి. రకరకాల పద్ధతుల్లో పోటీ సంస్థల మీద పైచేయి సాధించేందుకు ఆరాటపడుతుంటాయి. ఈ క్రమంలో అవి అనుసరించే అసంబద్ధ విధానాలు తీవ్ర అల్లకల్లోలానికి దారితీస్తాయి. ఈ దురవస్థను నివారించడం ప్రభుత్వాల కర్తవ్యం.

ఎదురుతన్నిన విధానాలు

సమయపాలన, నమ్మకమైన సేవలు, అందుబాటు ధరలు అనే నినాదంతో ఇండిగో ఎయిర్‌లైన్స్ 2006లో కార్యకలాపాలు ప్రారంభించింది. కేవలం ఆరేళ్లలోనే భారతదేశ పౌర విమానయాన మార్కెట్లో అతిపెద్ద వాటా సాధించింది. నిరుడు ఆగస్టు కల్లా ఇండిగో దేశీయ మార్కెట్ వాటా 64.2శాతానికి పెరిగింది. ప్రపంచంలో అతిపెద్ద విమానయాన సంస్థల్లో ఒకటిగా అది అవతరించింది. కానీ, మొన్న డిసెంబరు మొదటివారంలో ఇండిగో సంస్థ చాలా ఫ్లైట్లను రద్దుచేయడంతో ప్రయాణికులు విలవిల్లాడారు. పైలట్ల డ్యూటీ సమయానికి సంబంధించి పౌర విమానయాన డైరెక్టరేట్ జనరల్ 2024 జనవరిలో జారీ చేసిన నిబంధనలను ఇండిగో పాటించకపోవడం వల్లే ఈ దురవస్థ దాపురించింది. ఇండిగో అదనంగా పైలట్లను నియమించుకుని ఉంటే ఈ పరిస్థితి తలెత్తేది కాదు. టికెట్ ధరను రూ.200 నుంచి రూ.300 వరకు పెంచితే అదనపు పైలట్ల నియామకానికి అయ్యే ఖర్చును భరించగలిగేది. అలాకాకుండా ఇండిగో ఉన్న పైలట్లతోనే గొడ్డుచాకిరీ చేయించింది. ధరలను హేతుబద్ధీకరించకుండా ఎదుటి సంస్థలమీద పైచేయి సాధించడానికి యత్నించింది. అవి ఎదురు తన్నడంతో దేశీయ పౌర విమానయానమే కొద్ది రోజుల పాటు అతలాకుతలమైంది.

రిలయన్స్ ఇన్ఫోకామ్ లిమిటెడ్‌గా ప్రారంభమైన సంస్థ 2006లో రిలయన్స్ కమ్యూనికేషన్స్(ఆర్‌కామ్)గా పేరుమార్చుకుంది. సీడీఎంఏ సర్వీసులతో మొదలుపెట్టి, 2008లో జీఎస్ఎంకు మారింది. చవక హ్యాండ్‌సెట్లు, ఉచిత ఇన్‌కమింగ్ కాల్స్‌తో పోటీదారుల మీద పైచేయి సాధించింది. ఎడాపెడా అప్పులు చేసి వ్యాపారాన్ని విస్తరించుకుంది. స్పెక్ట్రమ్ వేలాలు, నెట్‌వర్క్ పెట్టుబడులు తదితరాలతో మొత్తం రుణభారం రూ.45వేల కోట్లకు చేరుకుంది. చేతిలో తగిన పెట్టుబడులు లేకుండా 2జీ, 3జీ నుంచి 4జీకి మారడం ఆర్థికంగా పెనుభారమై ఆర్‌కామ్ పతనానికి దారితీసింది. 2017లో ఆర్‌కామ్ తన వైర్‌లెస్ టవర్లు, ఫైబర్ లైన్లను రూ.24వేల కోట్లకు రిలయన్స్ జియోకు విక్రయించింది. అయినా అప్పులు తీరక 2019లో దివాలా పిటిషన్ వేసింది. ఎస్బీఐ సహా రుణదాతలు రూ.49వేల కోట్లకు పైగా క్లెయిము చేశారు. రుణదాతల కమిటీ రూ.23వేల కోట్లు రికవరీ అయ్యే అవకాశం ఉందని 2020లో అంచనా వేసింది. మిగతా మొత్తానికి నీళ్లొదులుకోవాల్సిందేనన్న మాట! ఆర్‌కామ్ రుణ ఖాతాలు పచ్చి మోసమని స్టేట్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా, బ్యాంక్ ఆఫ్ ఇండియాలు నిరుడు పేర్కొన్నాయి. సీబీఐ ఎఫ్ఐఆర్ దాఖలు చేసింది. ఆర్‌కామ్ సోదర కంపెనీలు అక్రమ ధన చలామణీకి పాల్పడ్డాయంటూ సెబీ, ఈడీలు దర్యాప్తు చేస్తున్నాయి. సరైన ఆడిట్ నివేదిక చూపలేకపోయారంటూ బాంబే హైకోర్టు ఈ దర్యాప్తుపై స్టే విధించింది. ఏతావాతా ఆర్‌కామ్ దివాలా కేసు అంతూపొంతూ లేకుండా సాగుతోంది. బకాయిలు వసూలుకాక బ్యాంకులు సతమతమవుతున్నాయి.

ఉపేక్ష ప్రమాదకరం

ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా ప్రజా ధన రక్షణకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలి. వ్యాపార సౌలభ్యాన్ని పెంచే పేరుతో కంపెనీల పట్ల అతి ఔదార్యం ప్రదర్శించకూడదు. సర్కారీ ఖజానాకు నష్టం కలిగించే కంపెనీలపై కఠిన చర్యలు తీసుకోవాలి. సకాలంలో రుణాలు, రుణవాయిదాలు చెల్లించకపోయినా, ఖాతాదారులకు సేవలు అందించడంలో విఫలమైనా ఉపేక్షించకూడదు. నాణ్యత, అదనపు విలువ జోడింపు తదితరాల మీద సంస్థలు పోటీపడాలి. అంతేగానీ, ధరలను అడ్డగోలుగా తగ్గించడం, అసంబద్ధ రాయితీలూ ఉచితాలు ఇవ్వడం వంటి పద్ధతుల జోలికి పోకూడదు. ప్రభుత్వం ఈ మేరకు కఠిన నిబంధనలను అమలుచేయాలి. నిరర్థక ఆస్తుల రికవరీకి గట్టి చర్యలు తీసుకోవాలి. కోట్లాది మంది భారతీయుల నిత్యజీవితావసరాలతో ముడిపడిన కంపెనీల వ్యాపార పోకడల మీద ప్రభుత్వాలు ఎప్పుడూ ఒక కన్నేసి ఉంచాలి. అప్పుడే ప్రజాప్రయోజనాలను కాపాడుకోగలం!



ఎం.ఆర్. పట్నాయక్

టెలికం రంగ నిపుణులు

దేవా.. టెక్ మేధావి!

హాయ్! బుజ్జీ!!

హలో ఫ్రెండ్స్..! ఈమధ్య ఏఐ గురించి మనం తరచూ ఏదో ఒకటి వింటూనే ఉన్నాం కదా! దానికి సంబంధించి జరిగిన ఓ కార్యక్రమంలో మనలాంటి ఓ నేస్తం.. ఏఐ అభివృద్ధి గురించి చాలా బాగా వివరించాడు. ఇంతకీ తనెవరంటే..

ఉత్తర్ ప్రదేశ్‌కు చెందిన రణ్‌వీర్ సచ్‌దేవాకు ఎనిమిదేళ్లు. తనది మూడో తరగతి చదివే వయసే అయినా ఎంతో అనుభవమున్న కోడర్లు కూడా వివరించలేని విషయాలు అలవోకగా చెప్పేస్తున్నాడు. ఇటీవల దిల్లీలో జరిగిన ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమిట్-2026లో ఏఐ అభివృద్ధినీ అలాగే భారత తత్వశాస్త్రాన్ని పోలుస్తూ దేవా మాట్లాడిన విధానం అక్కడున్న పెద్దవాళ్లందరినీ ఆకర్షించింది. ఆ సమిట్‌లో ప్రసంగించిన అతి చిన్న వయసు వ్యక్తి కూడా మన దేవానే! అంతేకాకుండా తను ఏఐకి సంబంధించిన



కొన్ని విషయాలు మనలాంటి పిల్లలకు సులభంగా అర్థమయ్యేలా 'ఆర్ యూ బోర్న్ విత్ ఏఐ' అనే పుస్తకాన్ని రాశాడు. మూడేళ్ల వయసులోనే అమ్మానాన్నల సాయంతో కోడింగ్ నేర్చుకోవడం ప్రారంభించాడు తను. అయిదేళ్లకు కోడింగ్ వన్ ఆన్ వన్ సెషన్‌లో పాల్గొని.. ఆపిల్ సంస్థ సీఈవో టిమ్ కుక్ నుంచే ఆహ్వానం అందుకున్నాడు. 2022లో ఒక గ్లోబల్ రీడింగ్ ఛాలెంజ్‌లో పాల్గొని 'సూపర్ ప్రెజెంటర్'గా నిలిచి బంగారు పతకాన్ని సొంతం చేసుకున్నాడు. ఆరేళ్ల వయసులో టెక్నాలజీ, ఆవిష్కరణల గురించి టెడ్‌ఎక్స్ వేదిక మీద మాట్లాడి 'యంగెస్ట్ టెడ్‌ఎక్స్ స్పీకర్'గానూ నిలిచాడు. అలాగే బెస్ట్ స్పీకర్‌గా 'ఏషియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్'లో స్థానం సంపాదించుకున్నాడు దేవా. మరో విషయం ఏంటంటే.. మార్స్ మీద అన్వేషణ కోసం ఒక నమూనా రాకెట్‌షిప్‌ను తయారు చేసి, దానికి నాసాకు సంబంధించిన జెట్ ప్రొపల్షన్ ల్యాబొరేటరీ నుంచి గుర్తింపు కూడా సాధించాడు. ప్రస్తుతం కొన్ని సంస్థలకు బ్రాండ్ అంబాసిడర్‌గా ఉన్నాడు దేవా. మరి మనమూ నచ్చిన అంశంలో పట్టు సాధించేలా కష్టపడదామా! ★

దాగున్న పదమేది?

ఇక్కడ ఇచ్చిన ప్రతి పదంలో ఒక వస్తువు పేరు దాగుంది. అదేంటో కనిపెట్టండి.

1. FOOTBALL
2. CHAIRMAN
3. CUPBOARD
4. TEMPLATE
5. POSTBOX
6. SHOEMAKER

జవాబు: 1.BALL 2.CHAIR 3.CUP 4.PLATE 5.BOX 6.SHOE

ముత్యాల రేడు.. మెరిసెను చూడు..



మంగళగిరి శ్రీపానకాల లక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదో రోజు గురువారం శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీనృసింహస్వామిని ముత్యాల పల్లకిలో ఊరేగించారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మేళతాళాలు, కోలాట భజనలతో కోలాహలంగా జరిగిన ఈ వేడుకలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. - మంగళగిరి, న్యూస్‌టుడే

2 పైవంతెనలు.. 14.5 కిలోమీటర్లు!

★ కనకదుర్గ పైవంతెన నుంచి గంగూరు వరకు..
★ నగర ట్రాఫిక్ తగ్గించేలా అప్రోచ్‌లతో నిర్మాణం

1. **హైదరాబాద్ నుంచి మచిలీపట్నం** వెళ్లే ఎన్‌హెచ్ 65పై.. విజయవాడలోని కనకదుర్గ పైవంతెన వద్ద నుంచి.. పీఎన్‌బీఎస్, కృష్ణలంక మీదుగా బెంజిసర్కిల్ వరకు ఐదు కిలోమీటర్ల పైవంతెన.
2. **బెంజిసర్కిల్ నుంచి** పటమట, కానూరు, పెనమలూరు మీదుగా గంగూరు సెంటర్ వరకు 9.5 కిలోమీటర్ల మరో పైవంతెన.



సమావేశంలో ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే బోడే ప్రసాద్, కలెక్టర్ లక్ష్మీశ, జేసీ ఇలక్కియా

విజయవాడలో కలెక్టర్ లక్ష్మీశ, ఎంపీ కేశినేని శివనాథ్ నేతృత్వంలో గురువారం జరిగిన జాతీయ రహదారుల భాగస్వామ్య (స్టేక్ హోల్డర్స్) సదస్సులో ఈమేరకు తీర్మానించారు. ఎన్‌హెచ్-65పై నగర ట్రాఫిక్ రద్దీ నియంత్రణకు ఇదే పరిష్కారమని నిర్ణయించారు. వచ్చే ఆరు దశాబ్దాల ట్రాఫిక్ అవసరాలకు తగ్గట్టుగా.. 14.5 కిలోమీటర్ల పొడవున ఆరు వరుసల్లో రెండు పైవంతెనలు నిర్మించాలని తీర్మానించారు. ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, శ్రీరాం రాజగోపాల్, వసంత కృష్ణప్రసాద్, బోడే ప్రసాద్, రెవెన్యూ, జాతీయ రహదారులు, ఆర్‌అండ్‌బీ, విజయవాడ నగరపాలక సహా అన్ని విభాగాల అధికారులు పాల్గొని సమీక్షించారు.

అప్రోచ్‌లు, అండర్‌పాస్‌లు...

పైవంతెనను కచ్చితంగా నగరంలో కీలక ప్రాంతాల ట్రాఫిక్‌తో అనుసంధానిస్తూ నిర్మించాలనేది ప్రతిపాదన. పీఎన్‌బీఎస్, కృష్ణలంక, రాణిగారితోట, స్క్యూబ్రిడ్జి, బెంజిసర్కిల్, ఎన్టీఆర్ సర్కిల్, పటమట, ఆటోనగర్, కానూరు, పోరంకి, పెనమలూరు అన్ని చోట్లా.. అప్రోచ్‌లు, అండర్‌పాస్‌లు నిర్మించాలని.. ఎన్‌హెచ్ అధికారులకు ఎంపీ, ఎమ్మెల్యేలు సూచించారు.

నెలన్నరలో విజయవాడ బైపాస్...

★ విజయవాడ బైపాస్ మరో నెలన్నరలో పూర్తవుతుందనీ, ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర మంత్రి గడ్కరీ చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు ఎంపీ శివనాథ్ తెలిపారు. ★ ఎన్‌హెచ్-65, విజయవాడ బైపాస్ కలిసేచోట.. హైదరాబాద్ నుంచి అమరావతి వైపు వెళ్లడానికి చుట్టూ తిరగడం ఇబ్బందిగా ఉందనీ.. ఇక్కడ చిన్న ర్యాంప్ వేయాలని ప్రతిపాదించారు. ★ నంది గామ వద్ద జాతీయ రహదారి.. సర్వీసు రోడ్లతో కలిపితే ఎనిమిది వరుసలు ఉందనీ.. అలాగే ఇబ్రహీంపట్నం వరకూ విస్తరిస్తే సరిపోతుందనీ.. 16 వరుసలు అవసరం లేదని తీర్మానించారు.

అనుసంధానంతో సౌలభ్యం

✪ ఎన్‌హెచ్ 65పై.. రాణిగారితోట వద్ద ఆర్‌యూబీ మంజూరవగా.. గురువారం టెండర్లు పిలిచారు. ✪ అమెరికన్, వై.వి.రావు హాస్పిటళ్ల రోడ్లను జాతీయ రహదారితో కలిపేలా ఓ పైవంతెనను ప్రతిపాదించారు. ఇదొస్తే.. బందరు రోడ్డు.. జాతీయ రహదారికి మధ్య అనుసంధానం ఏర్పడి.. ట్రాఫిక్‌కు ఊరట లభిస్తుంది. ✪ చెన్నై-కోల్‌కతా హైవేపై.. సిద్ధార్థ వైద్య కళాశాల నుంచి నిడమానూరు వరకూ ఆరు వరుసల పైవంతెన మంజూరైంది. మెట్రోతో ఆలస్యమైన విషయం ముఖ్యమంత్రికి వివరించామని ఎంపీ తెలిపారు. ✪ గొల్లపూడి-జక్కంపూడి మధ్య నాలుగు కిమీ రహదారి అనుసంధానంగా ఉండడంతో.. దీనిని ఆరు వరుసల రైల్వే స్లిప్ రోడ్డుగా మంజూరు చేయాలని కేంద్రానికి ప్రతిపాదించామని ఎంపీ వివరించారు.

గత మూడింటితో కలిపి ఐదు వంతెనలు...

ఎన్‌హెచ్ 65పై.. ఇబ్రహీంపట్నం రింగ్ వద్ద ఒకటి, విజయవాడ బైపాస్ నుంచి భవానీపురం వరకు మరొకటి, పామర్రు దాటాక నిడుమోలు వద్ద మరో చిన్న వంతెన.. ఈ మూడింటిని గతంలోనే ప్రతిపాదించారు. తాజాగా ప్రతిపాదించిన రెండు పైవంతెనలతో కలిపితే మొత్తం ఐదు వంతెనలు రాబోతున్నాయి. – ఈనాడు, అమరావతి

రంజాన్ వేళలు

ఇఫ్తార్: (శుక్రవారం) సాయంత్రం: 6.18
సహర్: (శనివారం) ఉదయం: 5.09

సీజేఐ పర్యటనకు ఏర్పాట్లు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ మార్చి ఒకటో తేదీన విజయవాడ రానున్నట్లు కలెక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. దక్షిణ భారత్‌లో తొలిసారిగా అత్యంత ప్రతిష్ఠాత్మకంగా మధ్యవర్తిత్వం (మీడియేషన్)పై జరగనున్న సింపోజియంకు విజయవాడ వేదిక కానుంది. ఈ కార్యక్రమంలో సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తులతో పాటు అన్ని జిల్లాల నుంచి ప్రతినిధులు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. ఈక్రమంలో ఏర్పాట్లపై నగరంలోని కలెక్టరేట్ నుంచి న్యాయ శాఖ, ప్రోటోకాల్, పోలీస్, రెవెన్యూ అధికారులతో గురువారం వర్చువల్‌గా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. కార్యక్రమం జరగనున్న అంతర్జాతీయ కన్వెన్షన్ సెంటర్ వద్ద పటిష్ఠ ఏర్పాట్లు చేయనున్నట్లు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న వేదికలో.. ఎక్కడా ఎలాంటి లోటుపాట్లు లేకుండా అధికారులు భాగస్వాములు కావాలని కలెక్టర్ సూచించారు.

నీట్‌గా నిర్వహించేలా..

ఎన్టీఆర్ కలెక్టరేట్: జిల్లాలో నీట్-2026 పరీక్షకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ జి. లక్ష్మీశ తెలిపారు. పరీక్ష నిర్వహణపై నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) డైరెక్టర్ జనరల్ గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్ హాజరై.. పరీక్షా కేంద్రాలను సిద్ధంగా ఉంచడం, భద్రతా చర్యలు, సిబ్బంది నియామకం తదితర అంశాలపై వివరించారు. ఆయన మాట్లాడుతూ.. పరీక్షను సీసీటీవీల ద్వారా పర్యవేక్షించేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. పారదర్శకంగా, నిష్పాక్షికంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. జిల్లా నీట్ సమన్వయకర్త గోపీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ముక్కలై నాలుగేళ్లు.. మోక్షానికి ఎన్నేళ్లు?



మైలవరం మండలంలోని చిలుకూరివారిగూడెం వద్ద బుడమేరు వాగుపై ఉన్న వంతెన వైకాపా హయాంలో ముక్కలవ్వగా కనీస మరమ్మతులు చేపట్టలేదు. చిన్న వాహనాలు సైతం ప్రస్తుతం ఆ వంతెనపై వెళ్లాలంటే ప్రమాదకరంగా మారింది. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక సుమారు 110 మీటర్ల పొడవున నూతన వారధి నిర్మాణానికి రూ. 7.50 కోట్లతో ప్రతిపాదనలు పంపారు కానీ ఇంకా ఆమోదం రాలేదు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి నిధులు మంజూరు చేసి వంతెన వీలైనంత త్వరగా నిర్మించి తమ కష్టాలు తీర్చాలని ప్రజలు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, మైలవరం

జనసేనకు పెరుగుతున్న ప్రజాదరణ



కృష్ణలంకలో పార్టీ సభ్యత్వం నమోదు చేయిస్తున్న మంత్రి మనోహర్

కృష్ణలంక, న్యూస్‌టుడే: పవన్ కల్యాణ్ ఆశయ సాధనకు నిస్వార్థంగా పనిచేస్తున్న జనసేన కార్యకర్తలే తమ బలం అని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి అమ్మిశెట్టి వాసు ఆధ్వర్యంలో కృష్ణలంక 20వ డివిజన్‌లో గురువారం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి మనోహర్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభమైన సభ్యత్వ నమోదు కార్యక్రమం మార్చి 10వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. పార్టీ ఆవిర్భావం నుంచి సభ్యత్వాల సంఖ్య అనూహ్యంగా పెరుగుతూ వస్తోందని.. మొదటి ఏడాది 90వేలతో మొదలై గతేడాదికి 13 లక్షలకు పెరిగినట్లు చెప్పారు. విజయవాడ తూర్పు నియోజకవర్గంలో గతం కంటే అధికంగా సభ్యత్వాలు పెరగడం పార్టీపట్ల ప్రజల ఆదరణకు నిదర్శనమన్నారు. నరసాపురం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్ తదితరులు పాల్గొన్నారు.





సరిలేరు.. మాకెవ్వరు..!

'ఏపీ స్టేట్ లెజిస్లేటివ్ స్పోర్ట్స్ మీట్ 2026' .. ప్రజాప్రతినిధుల జోష్‌కు వేదికైంది. గురువారం విజయవాడ ఇందిరాగాంధీ స్టేడియంలో వీరంతా మెరుపు వేగంతో ఆద్యంతం హుషారెత్తించారు. క్రీడాస్ఫూర్తిని చాటారు. క్రికెట్, కబడ్డీ, టేబుల్ టెన్నిస్ తదితర ఆటల్లో ఉత్సాహంగా మేటి ప్రతిభతో సరిలేరు మాకెవ్వరు అనేలా దూసుకెళ్లారు. -ఈనాడు, అమరావతి



ఆలకించాలి.. ఆదుకోవాలి

రవాణా, హమాలీ ఛార్జీలు ఏవీ? ✪ రూ.47 కోట్ల బకాయిలు

ఈనాడు, అమరావతి, నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే

ధాన్యం కొనుగోళ్ల నేపథ్యంలో చెల్లించాల్సిన రవాణా, హమాలీ ఛార్జీల బకాయిలు పేరుకుపోయాయి. గత రబీ వరకు సవ్యంగా చెల్లింపులు జరిగినా 2025-26 ఖరీఫ్ సీజన్‌లో చెల్లించాల్సిన మొత్తాలు మాత్రం సీజన్ ముగుస్తున్నా చెల్లించలేదు. ఫలితంగా అన్నదాతలపై ఆర్థిక భారం పడుతోంది.



వాహనాల్లో ధాన్యం తరలింపు

1,15,427 మంది నిరీక్షణ

★ ఉమ్మడి జిల్లాలో 9.08 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసింది. 1,15,427 మంది రైతులకు రూ. 2 వేల కోట్లు చెల్లించేశారు. ధాన్యాన్ని వాహనాల ద్వారా రవాణా చేయడం.. ఇందుకు వాహనంలో లోడింగ్, అన్‌లోడింగ్ మొత్తాన్ని ముందుగా రైతులు చెల్లిస్తారు. ఆపై ధాన్యం సొమ్ము చెల్లింపుతో ఈ మొత్తాన్ని జమచేయాలి. కానీ ఇప్పటి వరకు చెల్లింపుల ఊసేలేదు. ✪ హమాలీ ఛార్జీలు రూ.20.5 కోట్లు, రవాణాకు రూ.26.5 కోట్లు బకాయిలు ఉన్నాయి. ఒక్కో రైతుకు ధాన్యం రవాణా మేరకు రూ.5-10 వేల బకాయిలు రావాలి. వారు కార్యాలయాల చుట్టూ తిరిగినా ఫలితం లేదు. నిధుల విడుదలలో ఆలస్యంతో బకాయిలు పేరుకున్నట్లు తెలుస్తోంది.

రూ.6 వేలు రావాలి

9 ఎకరాల్లో వరి సాగు చేశా. మాగల్లు నుంచి మునగచర్లకు ట్రాక్టర్లలో ధాన్యం తరలించా. రెండు ట్రాక్టర్ల లోడుకు రవాణా, హమాలీ ఛార్జీలు రూ.6 వేలు రావాలి. రెండు నెలలైనా నగదు జమ కాలేదు. అధికారులను అడిగినా ఫలితం లేదు.

- తాళ్లూరు కృష్ణ, మాగల్లు

ఉన్నతాధికారుల దృష్టికి..

✪ రైతులకు హమాలీ, రవాణా ఛార్జీలు రావాల్సింది వాస్తవమే. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. త్వరలో రైతుల ఖాతాల్లో జమ చేస్తామని తెలిపారు.

- ఇలక్కియా, జేసీ

చిట్టూరిలో జాతీయ సైన్స్ దినోత్సవం నేడు

గాంధీనగర్, న్యూస్‌టుడే : గవర్నమెంట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, సైన్స్ సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో చిట్టూరి పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవం, సైన్స్ సమగ్ర మహోత్సవ 2కే 26 నిర్వహిస్తున్నట్లు పాఠశాల కార్యదర్శి డి.సుజాత తెలిపారు. గురువారం పాఠశాలలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. సైన్స్ సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా 4500 పాఠశాలల నుంచి 30వేల మంది విద్యార్థులతో ఒకే సమయంలో సైన్స్ పోటీలు నిర్వహించారని తెలిపారు. వీటిలో తుది దశకు ఎంపికైన 30 ప్రాజెక్టులను శుక్రవారం పాఠశాలలో ప్రదర్శించనున్నట్లు వెల్లడించారు. మంత్రి బీసీ జనార్దనరెడ్డి, ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు, ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎం.టి.కృష్ణబాబు, కలెక్టర్ లక్ష్మీశ, జేసీ ఇలక్కియా తదితరులు పాల్గొంటారని వివరించారు. ప్రిన్సిపల్ పి.హారిక మాట్లాడుతూ.. విద్యార్థుల్లో సృజనాత్మకత, సాంకేతిక నైపుణ్యాలు పెంచాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వివరించారు. సమావేశంలో మాడుగుల వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పార్కింగ్ దందాకు.. అడ్డుకట్ట!

దుర్గగుడికి అప్పగించాలని నిర్ణయం

ఈనాడు, అమరావతి

ఇంద్రకీలాద్రి దిగువన కెనాల్ రోడ్డు నుంచి బొడ్డుబొమ్మ సెంటర్ వరకు రహదారి పక్కన పెయిడ్ పార్కింగ్ దందాకు అడ్డుకట్ట పడబోతోంది. నగరపాలికకు చెందిన ఈ పార్కింగ్‌లో ప్రైవేటు వ్యక్తులు భక్తులను నిలువునా దోచేస్తున్నారు. దుర్గగుడి చెంతనే ఉన్నా.. పార్కింగ్‌పై దేవస్థానానికి అధికారం లేక, నగరపాలిక పర్యవేక్షణ కొరవడి.. ప్రైవేటు వ్యక్తులు పేట్రేగారు.



ప్రైవేటు వసూళ్లకు నెలవైన పార్కింగ్

ఆగ్రహించిన భక్తులు పలుమార్లు గోడు వెలిబుచ్చగా.. స్పందించిన జిల్లా యంత్రాంగం.. పార్కింగ్‌ను దేవస్థానానికి అప్పగించాలని నిర్ణయించింది. ప్రైవేటు గుత్తేదారులకు బదులు.. తమకే కేటాయిస్తే ఆ సొమ్ము చెల్లిస్తామని దేవస్థానం ప్రతిపాదించింది. కలెక్టర్ లక్ష్మీశ, ఎమ్మెల్యే సుజనా కూడా పార్కింగ్‌ను దేవస్థానానికి ఇవ్వాలని నగరపాలిక అధికారులను ఆదేశించారని తెలిసింది.

విమర్శలున్నా ప్రైవేటుకు సై...

ఈ పార్కింగ్‌ను మళ్లీ ప్రైవేటు గుత్తేదారుకు ఏడాదికి రూ. 41లక్షలకు కేటాయిస్తూ.. పాలికలోని వైకాపా పాలకవర్గం ఇటీవల కౌన్సిల్‌లో ఆమోదించింది. తీవ్ర విమర్శలున్నా.. పట్టించుకోకుండా దోపిడీకి పచ్చజెండా ఊపేసింది. దీనిపై నగరపాలికకు వచ్చేది.. గుత్తేదారు చెల్లించే రూ.41 లక్షలే. వాటిని దుర్గగుడి నుంచే ఇస్తామన్నప్పుడు.. ఆనందంగా వారికి ఇవ్వవచ్చు. కానీ.. కొందరు తెర వెనుక ఉండి.. మళ్లీ ప్రైవేటుకు అప్పగించడానికి అధికారులపై తీవ్రఒత్తిడి తెచ్చారు. మార్చి 18తో వైకాపా పాలకపక్షం గడువు పూర్తవుతుంది. ఈలోపే చివరి కౌన్సిల్‌లో 165 అంశాలను పెట్టి.. ఐదు రోజుల కిందట ఆమోదించుకున్నారు. ప్రభుత్వానికి విషయం తెలిపి.. తీర్మానం రద్దు చేసి.. దుర్గగుడికి అప్పగించాలని అధికారులు నిర్ణయించినట్లు తెలిసింది.

విచ్చలవిడిగా దోచుడే...

గుత్తేదారులు పాలికకు చెల్లించే దానికి 2-3 రెట్లు అధికంగా వసూళ్లు చేస్తున్నారు. అందుకే పోటీపడి మరీ దీనిని దక్కించుకుంటున్నారు. వైకాపా హయాంలో పాలికకు చెల్లించే రుసుమూ.. భారీగా తగ్గించేశారు. ఓ ప్రజాప్రతినిధి తన బినామీకి కట్టబెట్టి విచ్చలవిడిగా దోచేశారు. నేటికీ అదే పరిస్థితి. ఏకంగా బైక్, కారు, బస్సులకు రూ.50, రూ.100, రూ. 200 బాదేస్తున్నారు. అందుకే ఈ పార్కింగ్ కోసం.. నాయకులు బాహాబాహీకి దిగిన ఉదంతాలు అనేకం ఉన్నాయి.

కట్టబెడితే మీరు.. కష్టమింక తీరు..!

దరిచేరని నున్న ఆసుపత్రి ✪ 40 వేల మంది ఎదురుచూపులు

విజయవాడ రూరల్ మండలంలోని ఎన్టీఆర్ జిల్లాలో ఉన్న గ్రామాల్లో సుమారు 40 వేలమంది ప్రజలు అనారోగ్యానికి గురయితే పెద్ద ఆసుపత్రి లేదా..కొత్తూరు తాడేపల్లి సామాజిక ఆసుపత్రికి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా నున్న, అంబాపురం, పి.నైనవరం, పాతపాడు ప్రాంతాల ప్రజలు దగ్గర్లో ఆసుపత్రులు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో వారి కష్టాలు తీర్చేందుకు నున్న గ్రామంలో ఐదెకరాల స్థలంలో పది పడకల ఆసుపత్రి ఏర్పాటు చేయాలని 2014-19 మధ్య కాలంలో అప్పటి తెదేపా ప్రభుత్వం అవసరమైన డీపీఆర్ సిద్ధం చేయించి.. రూ. రెండున్నర కోట్లతో పనులు కూడా ప్రారంభించింది. కానీ 2019లో అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం నిధులు విడుదల చేయకుండా 2014-19లో తెదేపా ప్రభుత్వం ఇచ్చిన నిధులతో పనులు చేసి మిగిలినవి గాలికొదిలేసింది. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.



అసంపూర్తిగా సామాజిక ఆసుపత్రి భవనం

- న్యూస్‌టుడే, నున్న

ఖాకీ ఉచ్చులో... కంత్రీ రాజేష్

★ ఎండీఎంఏ కేసులో గతంలో పట్టుబడిన నిందితుడు
★ మాచవరం స్టేషన్ నుంచి అప్పట్లో కారులో పరారీ



ఈనాడు - అమరావతి, న్యూస్‌టుడే - పటమట: రెండు నెలలుగా తప్పించుకు తిరుగుతూ.. పోలీసులను ముప్పుతిప్పలు పెడుతున్న.. ఎండీఎంఏ కేసులో నిందితుడు రాజేష్ దొరికాడు. దేశమంతా తిరిగిన నిందితుడు ఎట్టకేలకు ఖాకీల వలకు చిక్కాడు. రెండు నెలల కిందట విజయవాడలో ఓ హోటల్‌లో డ్రగ్స్ తీసుకుంటూ పట్టుబడిన రాజేష్.. దొరికినట్లే దొరికి పరారయ్యాడు. ఎట్టకేలకు నిందితుడిని మాచవరం పోలీసులు గురువారం అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా న్యాయాధికారి రిమాండ్ విధించారు.

దొరికినట్లే దొరికి...

నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాలేనికి చెందిన రాజేష్.. బెంగళూరులో హోటల్ మేనేజ్‌మెంట్ చదువుతూ మధ్యలో ఆపేశాడు. అక్కడ ఎండీఎంఏ అలవాటైంది. స్నేహితులతో కలిసి తరచూ డ్రగ్స్ పార్టీలకు వెళ్లేవాడు. నిరుడు డిసెంబరు 21న మాచవరంలో ఓ హోటల్‌లో స్నేహితులతో ఎండీఎంఏ తీసుకుంటూ పోలీసులకు దొరికాడు. నిందితులను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. కారు సరిగా పార్క్ చేయమని పోలీసులు అతనికి తాళాలు ఇవ్వగా.. వాహనంతో పరారయ్యాడు. తర్వాత ఎగ్జిక్యూటివ్ క్లబ్‌లో కారును వదిలేసి వెళ్లిపోయాడు. ప్రత్యేక బృందాలతో గాలించినా జాడలేదు.

2 నెలలు.. 9 ప్రాంతాలు

విజయవాడ నుంచి బస్సులో తెనాలి వెళ్లి.. అక్కడ రైలెక్కి నెల్లూరు చేరుకున్నాడు. స్నేహితులను కలిసి.. నగదు తీసుకున్నాడు. క్యాబ్ మాట్లాడుకుని నేరుగా పాండిచ్చేరి వెళ్లాడు. అక్కడే స్నేహితుడి వద్ద మూడు రోజులున్నాడు. తొలుత పోలీసులకు పట్టుబడినప్పుడు నిందితుడి ఫోన్‌ను వారు స్వాధీనం చేసుకున్నారు. దీంతో పాండిచ్చేరిలో కొత్త మొబైల్, సిమ్ కొన్నాడు. కారు ప్రమాదానికి గురైందని చెప్పి.. ఫ్రెండ్ నుంచి డబ్బులు తీసుకుని కేరళలో కొచ్చి చేరుకున్నాడు. అక్కడ వారం రోజులుండి బెంగళూరు వెళ్లాడు. తర్వాత దిల్లీకి.. ఆపై హిమాచల్‌ప్రదేశ్‌కెళ్లి.. నెల రోజులున్నాడు. తర్వాత గోవా వెళ్లి.. 20 రోజులు గడిపాడు. చివరగా బెంగళూరు వెళ్లి.. ఒక రోజు ఉండి విజయవాడ వచ్చాడు.

ఇన్‌స్టాలో చాటింగ్.. స్నేహితులకు ఫోన్లు..

బెంగళూరులో రాజేష్ స్నేహితురాలి ఫోన్లు, సామాజిక మాధ్యమాలపై పోలీసులు నిఘా పెట్టారు. ఫోన్, ఇన్‌స్టాగ్రామ్‌లో స్నేహితులతో సంభాషిస్తున్నాడు. రాజేష్ స్నేహితులకు కొత్త నంబర్ నుంచి కాల్స్ రావడం గమనించి వాటిపై నిఘా ఉంచడంతో రాజేష్ కొత్త జాడ దొరికింది. ఆ నంబరుకు రాజేష్ స్నేహితులతో పోలీసులు మాట్లాడించారు. నిందితురాలైన గ్రీష్మ ముందస్తు బెయిల్‌కు దరఖాస్తు చేయగా బెయిల్ వచ్చిందనీ.. నువ్వూ వచ్చి పిటిషన్‌పై సంతకం పెడితే బెయిల్ వస్తుందని చెప్పించారు. నిజమని నమ్మి బెజవాడ వచ్చి పోలీసులకు దొరికిపోయాడు. ఇంజినీరింగ్ విద్యార్థిని గ్రీష్మ ముందస్తు బెయిల్ కోర్టులో తిరస్కరణకు గురవగా.. ఆమె కూడా పరారీలోనే ఉంది.

సజావుగా ఇంటర్ పరీక్షలు

మాచవరం, న్యూస్‌టుడే : జిల్లాలోని 98 కేంద్రాల్లో ఇంటర్ పబ్లిక్ పరీక్షలు సజావుగా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఇంటర్ విద్యాశాఖాధికారి బి.ప్రభాకరరావు తెలిపారు. బుధవారం ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఆంగ్ల పరీక్ష నిర్వహించగా.. 504 మంది గైర్హాజరయ్యారు. 37,083 మందికి గాను 36,579 మంది హాజరయ్యారని ఆయన చెప్పారు. ఎక్కడా మాల్‌ప్రాక్టీసు కేసు నమోదు కాలేదని వివరించారు.

పూర్వవైభవం తీసుకురావడానికి సన్నద్ధం

కొండపల్లి, ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే

రాజాధిరాజా.. రాజమార్తాండ.. శ్రీశ్రీశ్రీ.. అని అనేక మంది రాజులకు స్వాగతం పలికిన కొండపల్లి కోటకు రాజబాట పడనుంది. రాచరికపు మార్గాలు తిరిగి తెరచుకోనున్నాయి. నేటి తరం వారికి తెలియని రాళ్ల మార్గం తిరిగి వినియోగంలోకి తీసుకు వచ్చేందుకు పర్యాటక శాఖ తమ వంతు ప్రయత్నాలను చేస్తోంది. దాంతో పాటే ఐరన్ ఓర్ ఘాట్ రోడ్డును తిరిగి వినియోగంలోకి తీసుకు వచ్చి వాహనాల రాకపోకలను పునరుద్ధరించేందుకు సమాలోచనలను అధికారులు చేస్తున్నారు.

పరిశీలించిన కలెక్టర్

పలు కార్యక్రమాల నిర్వహణలో భాగంగా కొండపల్లి కోటకు వెళ్లిన జిల్లా కలెక్టర్ లక్ష్మీశ, పర్యాటక, పురావస్తు శాఖ అధికారులు రాళ్ల మార్గాన్ని గతంలో పరిశీలించారు. దాన్ని వినియోగంలోకి తీసుకు రావాలని భావించారు. అదే సమయంలో కలెక్టర్ లక్ష్మీశ స్వయంగా కొండపల్లి నుంచి ట్రెక్కింగ్ పేరిట ఔత్సాహికులను వెంట బెట్టుకొని కోటను చేరుకున్నారు. టీవీ టవర్ ఘాట్ రోడ్డు లేని సమయంలో అటుగానే స్థానికులు రాకపోకలు సాగించారని తెలుసుకున్నారు.



అధ్వానంగా కొండపల్లి మెట్ల మార్గం

అనుకున్నదే తడవుగా..

రాచరికపు చరిత్రలు, కొయ్య బొమ్మల కళలు.. కొండపల్లి కోటకు ముడిపడి ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఆ రెండింటిని వెలుగులోకి తేవాలంటే కొండపల్లి రాళ్ల మార్గాన్ని పునరుద్ధరించాలని అధికారులు భావించారు. ముందుగా బొమ్మల వైభవాన్ని ప్రచారం చేయాలని కార్యోన్ముఖులయ్యారు. అందులో భాగంగానే కొయ్య బొమ్మల ప్రాచుర్యాన్ని పర్యాటకులకు తెలిపేందుకు ఒక కేంద్రం ఏర్పాటు చేయాలనుకొన్నారు. అనుకొన్నదే తడవుగా ఎక్స్‌పీరియన్స్ సెంటర్ ఏర్పాటు చేసి మెరుగులు దిద్దారు. కొయ్య బొమ్మల వీక్షణకు వచ్చే పర్యటకులు కోటను చేరుకోవడానికి తిరిగి 15 కి.మీ వెళ్లకుండా అక్కడి నుంచే కోటకు చేరుకోవడానికి మార్గాలు కావాలని నిర్ణయించుకున్నారు. మెట్ల మార్గం, ఐరన్ ఓర్ ఘాట్ రోడ్డును వినియోగంలోకి తేవాలని ఆకాంక్షించారు.

వినియోగంలోకి తెస్తాం

కొండ ఎదుట భాగంలో ఉన్న ఏసుక్రీస్తు శిలువ పక్కన మెట్ల మార్గాన్ని ముందుగా వినియోగంలోకి తెస్తాం. టెండర్లు ఆహ్వానించి ప్రణాళిక మేరకు దాన్ని సిద్ధపరుస్తాం. ఐరన్ ఓర్ ఘాట్ రోడ్డును కూడా వినియోగంలోకి తీసుకు రావాల్సిన అవసరం ఉంది. నిధుల లభ్యత మేరకు వాహన రాకపోకలకు అనువుగా దాన్ని ఏర్పాటు చేస్తాం.

\- డా.లక్ష్మీశ, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్

దుర్గమ్మ సేవలో ఏపీ అడ్వకేట్ జనరల్

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: ఇంద్రకీలాద్రిపై కొలువైన జగన్మాత దుర్గమ్మను ఏపీ అడ్వకేట్ జనరల్ (ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్ కుటుంబ సభ్యులతో కలిసి గురువారం దర్శించుకున్నారు. దేవస్థానం అధికారులు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించారు. ఆశీర్వచన మండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేశారు. దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ రంగారావు, ఏఈవో వెంకటరెడ్డి వారికి అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.



దమ్మాలపాటి శ్రీనివాస్‌కు అమ్మవారి చిత్రపటం అందిస్తున్న రంగారావు, వెంకటరెడ్డి

ఈవీఎం గోదాముకు పటిష్ఠ భద్రత

గొల్లపూడి, న్యూస్‌టుడే : గొల్లపూడిలోని ఈవీఎం, వీవీ ప్యాట్‌లను భద్రపరిచిన గోదామును కలెక్టర్ లక్ష్మీశ గురువారం పరిశీలించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలు, మార్గదర్శకాల ప్రకారం అధికారులు, రాజకీయ నాయకుల సమక్షంలో ఆయన తనిఖీ చేశారు. గోదాము వద్ద సీసీ కెమెరాల పనితీరు, అగ్నిమాపక పరికరాలను చూసి, రికార్డులను పరిశీలించి సంతకం చేశారు. గోదాము వద్ద పటిష్ఠమైన భద్రత ఏర్పాటు చేయాలని ఆదేశించారు. డిప్యూటీ సీఈవో ఆంజనేయులు, డీఆర్వో ఎం. లక్ష్మీనరసింహం, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.



రికార్డు పరిశీలిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

ధర వరలు

వంకాయలు-17/18, టమాటా-13, బెండ-20, పచ్చిమిర్చి-36, కాకర-28, బీర-26/24, క్యాలీ ఫ్లవర్-15/20, క్యాబేజి-14, క్యారెట్-26, దొండ-26, బంగాళదుంప-21, ఉల్లిపాయలు-22, గోరుచిక్కుళ్లు-22, దోస-24, సొర-8/7, పొట్ల-25, అరటికాయ-5/6, చామదుంప-22, అల్లం-72, మునగ-10/8, ఆకు కూరలు (కట్ట)-2.50, కంద-40, బీట్ రూట్-24, కీరదోస-35, బీన్స్-52, క్యాప్సికమ్-58, చింతకాయలు-65, నిమ్మ (డజను)- 36/48, కొత్తిమీర-5/10, పుదీనా -5/15, పచ్చిమామిడి-20/25/30. (నిన్నటివి). నగరంలోని రైతుబజార్లలో ఈ ధరలు (రూ.ల్లో) వర్తిస్తాయి.

\- న్యూస్‌టుడే, విజయవాడ రైతుబజారు

నలుగురి జీవితాల్లో నూతన వెలుగులు

బ్రెయిన్‌డెడ్ అయిన ప్రసాదంపాడువాసి ★ మణిపాల్ వైద్యశాలలో అవయవ దానం

తాడేపల్లి, న్యూస్‌టుడే: బ్రెయిన్‌డెడ్ అయిన ఓ వ్యక్తి అవయవదానం చేసి నలుగురి జీవితాల్లో నూతన వెలుగులు నింపారు. పలువురికి స్ఫూర్తిప్రదాతగా నిలిచారు. గురువారం మణిపాల్ వైద్యశాల వైద్యులు ఈ వివరాలు వెల్లడించారు. విజయవాడ గ్రామీణం ప్రసాదంపాడుకు చెందిన నీరుకొండ అజయ్‌కుమార్(48) ఈ నెల 23వ తేదీ రాత్రి గుణదల బస్ స్టాప్ వద్ద బస్సు దిగుతుండగా ప్రమాదానికిగురయ్యారు. ఈ ఘటనలో అతడి తలకు గాయం అయ్యింది. దీంతో స్థానికంగా ఉన్న వైద్యశాలలో చికిత్స చేయించారు. ఆరోగ్య పరిస్థితిలో ఎలాంటి మార్పు కనిపించకపోవడంతో 24వ తేదీ రాత్రి మణిపాల్ వైద్యశాలకు తీసుకొచ్చారు. అజయ్‌కుమార్‌కు వైద్యులు పలు వైద్య పరీక్షలు చేసినప్పటికీ ఎలాంటి మార్పు కనిపించలేదు. అనంతరం 25వ తేదీ సాయంత్రం బ్రెయిన్ డెడ్‌గా నిర్ధారించారు. అతని సోదరుడు సాంబశివరావు, కుటుంబ సభ్యుల అంగీకారంతో ఏపీ జీవన్‌ధాన్ ఛైర్మన్ డాక్టర్ రాంబాబు, మణిపాల్ వైద్యశాల డైరెక్టర్ రామాంజనేయరెడ్డి ఆధ్వర్యంలో అజయ్‌కుమార్ అవయవాలు దానం చేశారు. కాలేయం, ఒక కిడ్నీ మణిపాల్ వైద్యశాలకు కేటాయించగా.. విజయవాడలో అవసరమైన వారికి ట్రాన్స్‌ప్లాంటేషన్ చేశారు. మరో కిడ్నీ విజయవాడ కామినేని వైద్యశాలకు, కార్నియాను ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆసుపత్రికి తరలించారు. అవయవదానానికి ముందుకొచ్చిన దాత కుటుంబానికి మణిపాల్ వైద్యశాల కృతజ్ఞతలు తెలిపింది.



అజయ్‌కుమార్ (పాత చిత్రం)



విజయవాడలోని గోల్డెన్ ఈవెంట్స్ కన్వెన్షన్‌లో జరిగిన ఏపీ రెరా ఛైర్మన్ శివారెడ్డి కుమారుడు వరుణ్‌కుమార్ రెడ్డి, సుస్మితల వివాహానికి హాజరైన సీఎం చంద్రబాబు

నా కుమార్తె మృతిపై సమగ్ర విచారణ చేపట్టండి

మంత్రికి వినతిపత్రం ఇచ్చిన వైద్య విద్యార్థిని దీపిక తండ్రి

భవానీపురం, న్యూస్‌టుడే: ఇటీవల చనిపోయిన సిద్ధార్థ మెడికల్ కళాశాల వైద్య విద్యార్థిని బి.దీపిక మృతిపై సమగ్ర విచారణ జరిపించాలని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌ను బాధితురాలి తండ్రి బత్తుల కోదండరామిరెడ్డి కోరారు. సచివాలయంలో మంత్రిని ఆయన గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. కోదండరామిరెడ్డి మాట్లాడుతూ.. 'ఈ నెల 4న వెళ్లిన కుమార్తె కొద్దిసేపటికే అచేతనంగా పడి ఉండటం అర్ధరాత్రి నా కుమార్తె దీపిక చనిపోయినట్లు సమాచారం వచ్చింది. కుమార్తె మృతితో మా కుటుంబం కోలుకోలేని పరిస్థితికి చేరింది. చనిపోయిన సమయంలో ప్రభుత్వం అండగా ఉంటుందని, న్యాయం చేస్తామని మంత్రి సత్యకుమార్ హామీ ఇచ్చారు. విచారణ వేగవంతం చేసి మృతికి కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలి. 4వ తేదీ అర్ధరాత్రి విద్యుల్లేక ... అనుమానాస్పద ... [illegible]' అని పేర్కొన్నారు.



మంత్రి సత్యకుమార్‌తో మాట్లాడుతున్న దీపిక తండ్రి కోదండరామిరెడ్డి

ఆర్‌జేడీ బాధ్యతల స్వీకరణ

గొల్లపూడి, న్యూస్‌టుడే: వ్యవసాయ మార్కెటింగ్ శాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ ఎం.దివాకర్ గొల్లపూడిలోని శాఖ కార్యాలయంలో గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు పలువురు అధికారులు, ఉద్యోగులు ఆయన్ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

నార్త్ ఏసీపీగా సత్యానందం..

విజయవాడ నేరవార్తలు : ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్ నార్త్ ఏసీపీగా సత్యానందం బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్ర వ్యాప్త బదిలీల్లో భాగంగా ఇన్‌ఛార్జి నార్త్ ఏసీపీగా పని చేస్తున్న భానుప్రకాశ్‌రెడ్డి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ సత్యానందంను నియమించగా.. గురువారం బాధ్యతలు స్వీకరించారు.

మహాసభల విజయవంతానికి పిలుపు

గాంధీనగర్, న్యూస్‌టుడే : మార్చి 3, 4 తేదీల్లో ... [illegible] ... హాల్‌లో నిర్వహించనున్న పీడీఎస్‌యూ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం జాతీయ కన్వీనర్ ఎం.రామకృష్ణ పిలుపునిచ్చారు. గురువారం ప్రెస్ క్లబ్‌లో కార్యక్రమ గోడపత్రిక ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. మహాసభలను సీపీఐ(ఎంఎల్) కేంద్ర కమిటీ సభ్యుడు పి. ప్రసాద్ ప్రారంభిస్తారని, సామాజిక విశ్లేషకులు జి. లక్ష్మీనరసయ్య, ఏపీ విద్యా పరిరక్షణ కమిటీ కన్వీనర్ రమేష్ పట్నాయక్ పాల్గొంటారని తెలిపారు. బడ్జెట్‌లో విద్యారంగానికి నిధులు కేటాయించకపోవడం విచారకరమని, జీవో 77ని రద్దు చేయాలని కోరుతున్నా ప్రభుత్వాలు స్పందించడం లేదని విమర్శించారు. విద్యారంగ సమస్యలపై చర్చించి, భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు రూపాశంకర్, శ్రీను, హేమ తదితరులు పాల్గొన్నారు.

డే కేర్ సెంటర్ నిర్వాహకుల నిర్లక్ష్యం

చిన్నారికి గాయాలు

భవానీపురం, న్యూస్‌టుడే: విద్యాధరపురంలోని ఓ డే కేర్ సెంటర్ నిర్వాహకుల నిర్లక్ష్యం కారణంగా చిన్నారికి గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి.. విద్యాధరపురంలోని పిల్లి జక్కయ్య వీధిలో బాలిక(4) తల్లిదండ్రులు అమల, మణికంఠలతో కలిసి ఉంటుంది. బాలికను స్థానికంగా ఉన్న నేషనల్ ప్లే డే కేర్ సెంటర్‌లో ఇటీవల చేర్పించారు. ఈ నెల 23వ తేదీన బాలిక అక్కను ఇంటికి వెళ్లి దుస్తులు తీసుకు రావాలని డే కేర్ సెంటర్ నిర్వాహకులు కోరారు. ఆ ప్రకారం బాలిక అక్క ఇంటికి వెళ్లి దుస్తులు ఇవ్వాలని తల్లిని కోరింది. దీంతో తల్లికి అనుమానం వచ్చి డే కేర్ సెంటర్‌కు రాగా బాలిక శరీరంపై గాయాలు ఉన్నాయి. నిర్వాహకులను ప్రశ్నించగా.. పొంతన లేని సమాధానాలు చెప్పారు. వెంటనే భవానీపురం పోలీసులకు సమాచారం ఇవ్వగా వచ్చి విచారణ చేపట్టారు. పోలీసుల విచారణలో.. బాలిక మరుగుదొడ్లు శుభ్రం చేసే ద్రావకాన్ని పడేసి అందులో కూర్చున్నట్లు తెలిసింది. వెంటనే శరీరాన్ని శుభ్రం చేసినట్లుగా తెలిపారు. అయితే బాలిక వంటికి ఉన్న డైపర్ తీయకపోవడంతో గాయాలైనట్లు వెల్లడించారు. ఈ క్రమంలో బాలికను నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతోంది. తల్లి అమల ఫిర్యాదు మేరకు భవానీపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బ్రాయిలర్ ధరలు
(కిలో 1కి రూ.లలో)

నెస్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -135 రిటైల్ ధర 162 చికెన్ విత్ స్కిన్ - 235 చికెన్ స్కిన్‌లెస్ - 267.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 154, 169, 174 చికెన్ విత్ స్కిన్ - 290 చికెన్ స్కిన్‌లెస్ - 300.

హోటల్‌లో వ్యభిచారం గుట్టురట్టు

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : గవర్నర్‌పేట ప్రకాశం రోడ్డులోని హోటల్ అలనా టౌన్ హౌస్‌లో గుట్టుగా జరుగుతున్న వ్యభిచారాన్ని పోలీసులు రట్టు చేశారు. ఇతర రాష్ట్రాల నుంచి మహిళలను తీసుకువచ్చి వ్యభిచారం చేయిస్తున్నట్లు పక్కా సమాచారం రావడంతో గవర్నర్‌పేట సీఐ అడపా నాగమురళి తన సిబ్బందితో దాడి చేశారు. హోటల్ మేనేజర్ భూషణ్‌తో పాటు స్మైల్ రాజ్ అనే వ్యక్తిని పట్టుకున్నారు. వీరిద్దరూ కర్ణాటక, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, పశ్చిమబెంగాల్ రాష్ట్రాల నుంచి మహిళలను రప్పిస్తున్నట్లు గుర్తించారు. నిర్వాహకులిద్దరినీ అరెస్టు చేశారు. నలుగురు మహిళలను రక్షించి, సంరక్షణ గృహానికి తరలించారు.

తిరువూరు

• తిరువూరు • మైలవరం

'బకాయిలు చెల్లించకపోతే విధులు బహిష్కరిస్తాం'



ఎన్టీటీపీఎస్ పరిపాలన కార్యాలయం ఎదుట ఒప్పంద కార్మికుల ఆందోళన

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే : గతంలో పెంచిన వేతన బకాయిల విడుదలలో ఒప్పంద కార్మికులకు అన్యాయం జరుగుతోందని కార్మిక సంఘ సభ్యులు వాపోయారు. సర్వీస్ ఇన్సెంటివ్, 2 శాతం పెరిగిన వేతన బకాయిలు విడుదల చేయాలని సంస్థ పరిపాలన భవనం వద్ద గురువారం ఆందోళన చేశారు. వేతనాలు పెంచి చెల్లించేందుకు గతంలో యాజమాన్యంతో కార్మిక సంఘాలతో చర్చలు జరిగాయని గుర్తు చేశారు. బకాయిలు చెల్లించడంతో పాటు 20 సంవత్సరాలు విధుల్లో కొనసాగిన వారికి సర్వీస్ ఇన్సెంటివ్ ఇవ్వడానికి ప్రభుత్వం, విద్యుత్తు సంస్థల యాజమాన్యాలు అంగీకారం తెలిపాయి. అయితే అవి నామమాత్రంగానే జరిగాయన్నారు. రెండ్రోజుల్లో కార్మికులకు రావాల్సిన బకాయిలు చెల్లించకపోతే విధులు బహిష్కరించి ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామన్నారు.

జనసేన సభ్యత్వాల నమోదు ప్రారంభం



కరపత్రాలు ప్రదర్శిస్తున్న నాయకులు

గంపలగూడెం, న్యూస్‌టుడే : మండలంలోని తోటమూల జనసేన కార్యాలయంలో గురువారం క్రియాశీల సభ్యత్వ నమోదు ప్రక్రియను పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఎం.శ్రీనివాసరావు, మండల అధ్యక్షుడు సీహెచ్.వెంకట కృష్ణారావు ప్రారంభించారు. గాదెవారిగూడెం సర్పంచి సీహెచ్.శ్రీనివాసరావు, ఏఎంసీ డైరెక్టర్ పి.మాధవరావు, ప్రధాన కార్యదర్శి వి.కృష్ణ, నాయకులు పాల్గొన్నారు.

క్షేత్ర స్థాయి సహాయకుడిపై ఫిర్యాదు

తిరువూరు, న్యూస్‌టుడే : తిరువూరు మండలం కోకిలంపాడు గ్రామంలో ఉపాధి పనులకు సంబంధించి రూ.5 లక్షల నిధుల స్వాహా చేసిన క్షేత్ర స్థాయి సహాయకుడిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు గ్రామస్థులు తెలిపారు. గ్రామంలో చేపట్టిన ఉపాధి పనుల్లో ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా నిధులు దుర్వినియోగం జరిగిందన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు చేసినవారు, వేరే ప్రాంతాల్లో స్థిరపడ్డ వారు, వ్యాపారాలు చేసుకునే వారి పేర్ల మీద మస్టర్లు వేసి నిధులు కాజేశారన్నారు. వారి ఖాతాల్లో నగదు జమ చేయించి నిధులు స్వాహా చేసినట్లు ఆరోపించారు. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

శిక్షణను పరిశీలించిన అధికారులు

మైలవరం, న్యూస్‌టుడే : మండలంలోని వెల్వడంలో చంద్రాల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని వెల్వడం ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో సిబ్బందికి నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని రాష్ట్రీయ కిశోర స్వాస్థ్య అధికారి డాక్టర్ కిరణ్, జిల్లా అధికారులు మాధవి గురువారం పరిశీలించారు. పాఠశాల పిల్లల్లో పోషకాహార లోపం, రక్తహీనత, ఏనిమియా, రుతు పరిశుభ్రత వంటి పలు అంశాలపై నిర్వహిస్తున్న అవగాహన చర్యలపై ఆరా తీసి తెలుసుకున్నారు.

యువత భాగస్వామ్యంతో డ్రగ్స్ నియంత్రణ

కీసర(కంచికచర్ల), న్యూస్‌టుడే : డ్రగ్స్ వినియోగంతో విద్యార్థులు, యువత ఆర్థికంగా, శారీరకంగా, సామాజికంగా కుంగుబాటుకు గురవుతారని గ్రామీణ డీసీపీ లక్ష్మీనారాయణ అన్నారు. కీసర బీటీటీ కళాశాలలో గురువారం నిర్వహించిన డ్రగ్స్‌పై దండయాత్ర అవగాహన సదస్సులో ఆయన పాల్గొన్నారు. మత్తు పదార్థాల వినియోగించడం నేరమని, అటువంటి వారిని సమాజంలో చులకనగా చూస్తారన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తిరువూరు: 98853 28820 మైలవరం: 80085 74705

స్పందన: ★ తిరువూరు 9వ వార్డులోని డ్రైనేజీ వ్యర్థాలు పేరుకున్నాయని స్థానికుడు శివప్రసాద్ సమస్యను 'ఈనాడు' 'మేమున్నాం..మీకు తోడుగా' ద్వారా అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన మున్సిపల్ శానిటరీ అధికారి విజయ్ పారిశుద్ధ్య కార్మికులను పంపి పూడిక తీయించారు. ★ తిరువూరు 5వ వార్డులోని రోడ్డు పై చెత్త నిలిచిన చెట్టు కొమ్మలను తొలగించడం లేదని స్థానికుడు బాజీ 'మేమున్నాం..మీకు తోడుగా' ద్వారా సమస్యను అధికారులకు తెలిపారు. స్పందించిన శానిటరీ అధికారి పారిశుద్ధ్య కార్మికులను పంపి వాటిని తొలగింపజేశారు. **- న్యూస్‌టుడే, తిరువూరు** ★ రెడ్డిగూడెం పంచాయతీ గౌడ్ బజార్‌లోని డ్రెయిన్లలో పూడిక పేరుకుందని స్థానికులు 'మేమున్నాం...మీకు తోడుగా' ద్వారా సమస్యను అధికారులకు తెలిపారు. పంచాయతీ ఇన్‌ఛార్జ్ కార్యదర్శి ఎస్.నాగబాబు స్పందించి పారిశుద్ధ్య కార్మికులను పంపి పూడిక తీయించి సమస్య పరిష్కరించారు. **- న్యూస్‌టుడే, రెడ్డిగూడెం**

లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం



కిట్లను కత్తిరిస్తున్న వెంకటేశ్వరరావు, అరుణ కుమారి

విస్సన్నపేట, న్యూస్‌టుడే : సమాజానికి లయన్స్ క్లబ్ అందిస్తున్న సేవలు అమోఘమని లయన్ డాక్టర్ ఎన్వీ వెంకటేశ్వరరావు అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ విస్సన్నపేట ఆధ్వర్యంలో గురువారం కంటి శిబిరం ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని క్లబ్ అధ్యక్షురాలు లయన్ రాయల అరుణ కుమారితో కలిసి ఆయన ప్రారంభించారు. పలువురు క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

దాటాలంటే దడే.. అన్నీ చిక్కులే

ప్రతిపాదనలకే పరిమితమైన వారధుల నిర్మాణం



మైలవరం నారాయణనగర్ వద్ద వాగులో మట్టి దారి

మైలవరం, తిరువూరు, న్యూస్‌టుడే

వాగులపై ప్రయాణం ప్రజలకు చిక్కులు తెచ్చి పెడుతోంది. ప్రజా రవాణాతో పాటు వ్యవసాయ ఉత్పత్తుల తరలింపునకు ఆటంకాలు ఏర్పడుతున్నాయి. కాలిన వంతెనలకు దీర్ఘకాలంగా మరమ్మతులు లేక, అవసరం ఉన్న చోట నిర్మాణాలకు నిధులు మంజూరు కాక ఇబ్బందులు కొనసాగుతున్నాయి. పదే పదే ప్రతిపాదనలు అందినా పెద్దగా ప్రయోజనం కనిపించడం లేదు. మైలవరం నియోజకవర్గ పరిధిలో బుడమేరు తదితర వాగులు ప్రవహిస్తున్నాయి. ఈ క్రమంలో రవాణాకు ఆటంకాలు ఏర్పడకుండా దశాబ్దాల కిందటే వాగులపై పలు వంతెనలు నిర్మించారు. కానీ మైలవరం, జి.కొండూరు, రెడ్డిగూడెం మండలాల పరిధిలో ప్రవహించే బుడమేరు ప్రధాన నీటి వనరు కాగా ప్రస్తుతం కొన్ని చోట్ల వంతెన లేక ఇబ్బందులు తప్పడం లేదు. వాగులో వేసిన మట్టి రోడ్డే ఎండాకాలంలో వారికి ఆధారమవుతోంది.

★ మైలవరంలోని నారాయణనగర్ వద్ద బుడమేరు వాగు దాటాలంటే రైతులకు ఎంతో కష్టంగా మారుతోంది. ★ రెడ్డిగూడెం మండలం రుద్రవరం వద్ద రూ.1.10 కోట్లతో నరుకుళ్లపాడు వద్ద నాగసాని వాగుపై రెండు వంతెనలు కలిపి సుమారు రూ.6.5 కోట్లతో అంచనాలు పంపి ఆమోదానికి ఎదురు చూస్తున్నారు. ★ మైలవరం, జి.కొండూరు మండలాల్లోని గ్రామాల నుంచి అనం సందానంగా ఉన్న హెచ్.ముత్యాలంపాడు వద్ద బుడమేరు వాగుపై వంతెన కూలి నాలుగేళ్లవుతోంది. అప్పటి నుంచి శాశ్వత వంతెనకు పంపుతున్న ప్రతిపాదనలు అంచనాలు పెరుగుతున్నాయి తప్ప మంజూరు కావడం లేదు. రవాణా ఇబ్బందులతో తాజాగా రూ.1.50 కోట్లతో పనులు చేపట్టారు, వంతెనకు తాత్కాలిక పనులు చేయిస్తున్నారు. ★ తిరువూరు మండలంలోని రాజుగూడెం, ఎర్రమాడు, చౌటపల్లి, కొత్తూరు తదితర గ్రామాలకు వెళ్లే మార్గాల్లోని వంతెనలు ప్రమాదకరంగా మారాయని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాటికి పగుళ్లు ఏర్పడి ఎప్పుడు కూలుతాయో అన్నట్లు ఉన్నాయని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ట్రాఫిక్ అవస్థలు తగ్గించేలా..

నబ్ డివిజన్ పరిధిలో ప్రధానమైన వంతెనల కోసం గతంలోనే ప్రతిపాదనలు పంపాము. స్థానిక ఎమ్మెల్యే వీటిని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లారు. అందులో భాగంగానే హెచ్.ముత్యాలంపాడు వంతెన వద్ద ట్రాఫిక్ అవస్థలు తగ్గించేలా తాత్కాలిక పనులు చేయిస్తున్నాం.

- అప్పారావు, ర.భ. డీఈ, మైలవరం

డొంక రోడ్ల అభివృద్ధికి ఏఎంసీ నిధులివ్వండి



ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే కృష్ణప్రసాద్

మైలవరం, న్యూస్‌టుడే : దీర్ఘకాలంగా అభివృద్ధికి దూరంగా ఉన్న గ్రామాల్లోని డొంక రోడ్లను బాగు చేయడానికి వ్యవసాయ మార్కెట్ కమిటీల నిధులను వినియోగించుకునే అవకాశం ఇవ్వాలని మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ కోరారు. అసెంబ్లీలో ఆయన గురువారం మాట్లాడారు. గతంలో వచ్చిన ఆదాయంతో ఆయా పాలకవర్గాలతోనే పనులు చేయించేవారని గుర్తు చేశారు. కానీ చేతి నిండా నిధులున్నా వినియోగించే అధికారం లేక డొంక రోడ్ల అభివృద్ధి సాధ్యం కావడం లేదన్నారు. గడచిన ఏడేళ్లలో ప్రకృతి వైపరీత్యాలతో పలు రోడ్లు ధ్వంసమయ్యాయని వివరించారు.

ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలి



కలెక్టర్ లక్ష్మీశతో చర్చిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

తిరువూరు, న్యూస్‌టుడే : ముఖ్యమంత్రి అధ్యక్షతన త్వరలో జరగబోయే ప్రజాప్రతినిధులు, అధికారుల సమావేశానికి ముందుగా తిరువూరు నియోజకవర్గ సమస్యలను స్థానిక ఎమ్మెల్యే కొలికపూడి.శ్రీనివాసరావు గురువారం కలెక్టర్ లక్ష్మీశ దృష్టికి తీసుకొచ్చారు. కలెక్టర్ కార్యాలయంలో ప్రత్యేకంగా సమావేశమై నియోజకవర్గానికి సంబంధించిన పలు అంశాలను చర్చించారు. పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు పూర్తి చేయాలని, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రం అందజేత.. నెమలి (గంపలగూడెం): నెమలి వేణుగోపాల స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలకు హాజరు కావాలని దేవాలయ సహాయ కమిషనర్ ఎన్.సంధ్య గురువారం కలెక్టర్ జి.లక్ష్మీశకు ఆహ్వాన పత్రం అందజేశారు. ఈ నెల 28 నుంచి మార్చి 5 వరకు ఆలయ బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు, 2న రాత్రి స్వామి వారి కల్యాణం జరుగుతుందని ఆమె కలెక్టర్‌కు వివరించారు.

ద్విచక్ర వాహనదారులకు శిరస్త్రాణం తప్పనిసరి



చోదకులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై సతీష్ కుమార్

జి.కొండూరు, న్యూస్‌టుడే : ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా శిరస్త్రాణం ధరించాలని జి.కొండూరు ఎస్సై సతీష్ కుమార్ సూచించారు. గురువారం స్థానిక వై-జంక్షన్ సమీపంలో వాహనదారులతో ఆయన మాట్లాడారు. భారీ వాహనాలు నడిపే డ్రైవర్లు మద్యం తాగి నడపవద్దని, మైనర్లకు ద్విచక్ర వాహనాలు ఇవ్వకూడదని హెచ్చరించారు. అనంతరం జాతీయ రహదారిపై శిరస్త్రాణం ధరించాలని తెలిపే అవగాహన ఫ్లెక్సీలను ఏర్పాటు చేయించారు.

పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ఠ బందోబస్తు

విస్సన్నపేట, న్యూస్‌టుడే : మండల కేంద్రంలో గురువారం ఇంటర్ ద్వితీయ సంవత్సర ఆంగ్ల పరీక్ష ప్రశాంతంగా జరిగింది. మొత్తం నాలుగు కేంద్రాల్లో 1503 మందికి గాను 1468 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 35 మంది గైర్హాజరయ్యారని కస్టోడియన్ అధికారి రెబ్బ మురళీకృష్ణ తెలిపారు. స్థానిక ఎస్సై అర్జునరావు ఆధ్వర్యంలో పటిష్ఠ పోలీసు బందోబస్తు నిర్వహించారు.

ఎ.కొండూరు, న్యూస్‌టుడే : కంభంపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన పరీక్షకు మొత్తం 130 మంది గాను 128 మంది హాజరు అయ్యారని ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ ప్రసాద్ తెలిపారు.

నాణ్యమైన నిరంతర విద్యుత్తు సరఫరానే లక్ష్యం



జూపూడి: భూమిపూజ చేస్తున్న మైలవరం ఎమ్మెల్యే

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే : గ్రామీణ ప్రాంతాలకు నాణ్యమైన నిరంతర విద్యుత్తు సరఫరా చేయాలనే లక్ష్యంతో విద్యుత్తు ఉప కేంద్రాల ఏర్పాటుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ తెలిపారు. ఇబ్రహీంపట్నం గ్రామీణ మండలం జూపూడిలో 33- 11 కేవీ విద్యుత్తు ఉప కేంద్రం నిర్మాణ పనులకు ఆయన గురువారం భూమి పూజ చేశారు. వేసవి దృష్ట్యా తాగు, సాగునీటికి విద్యుత్తు సరఫరాలో అంతరాయం లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. వ్యవసాయ విద్యుత్తు సరఫరాకు ప్రత్యేక ఫీడర్లు ఏర్పాటు చేయాలన్నారు. ఎంపీపీ పాలడుగు జ్యోత్స్న, సర్పంచి దేవమాత, కూటమి నాయకుడు అఖిల గాంధీ, విద్యుత్తు శాఖ అధికారులు టి.రవిచంద్ర, గురుకిరణ్, వెంకన్న పాల్గొన్నారు.

విస్సన్నపేట, న్యూస్‌టుడే : స్థానిక కమ్మవారి కాలనీలో ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) ఆధ్వర్యంలో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను కూటమి నాయకులు శంకుస్థాపన చేశారు. బద్దె వెంకటేశ్వరరావు, చలసాని వెంకటేశ్వరరావు, గాదుల సుబ్బారావు, షేక్ యాసిన్, వైభవ్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



విస్సన్నపేటలో సీసీ రోడ్డు నిర్మాణానికి..

✦**ఎల్‌ఓసీ పత్రాలు పంపిణీ.. గొల్లపూడి:** అనారోగ్యంతో బాధపడుతున్న పలువురు ఆసుపత్రిలో చికిత్స చేయించుకునేందుకు వీలుగా ప్రభుత్వం మంజూరు చేసిన ఎల్‌ఓసీ పత్రాలను ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ గొల్లపూడిలోని కార్యాలయంలో గురువారం అందించారు.

సర్పంచులకు ఘన సన్మానం



స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో మండలంలోని గ్రామాల సర్పంచులను ఘనంగా సన్మానించారు. పాలకవర్గాల పదవీ కాలం మరో నెలలో పూర్తి కావొస్తున్నందున చివరి సమావేశానికి హాజరైన వారిని సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ప్రసన్నరాణి, ఎంపీడీవో అనురాధ తదితరులు పాల్గొన్నారు. **- న్యూస్‌టుడే, మైలవరం**

అడ్డదిడ్డ ప్రయాణం.. ప్రమాదాలకు కారణం



విజయవాడ బైపాస్ రహదారి ప్రమాదకరంగా మారింది. ఆ రోడ్డుపై వాహన చోదకులు ఇష్టం వచ్చినట్లు ప్రయాణం చేస్తున్నారు. కొందరు వ్యతిరేక మార్గంలో వెళ్తు ఉండటంతో అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి వ్యతిరేక మార్గంలో వెళ్లే వాహన చోదకులపై తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. **- న్యూస్‌టుడే, గొల్లపూడి**

కుక్కల బెడద.. జనాలకు వెత



గొల్లపూడి, రాయనపాడు గ్రామాల్లో కుక్కల బెడద ఎక్కువగా ఉంది. రహదారులపై గుంపులుగా ఇవి స్వైరవిహారం చేస్తున్నాయి. దీంతో పాదచారులు, వాహన చోదకులు హడలిపోతున్నారు. ముఖ్యంగా రాత్రి సమయంలో నివాసాలకు వెళ్లే వారి వెంట పడుతున్నాయి. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి శునకాల బారి నుంచి కాపాడాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. **- న్యూస్‌టుడే, గొల్లపూడి**

పాఠశాలల్లో ముందస్తు తనిఖీలు

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే : పది తుది పరీక్షలు నిర్వహించనున్న మండలంలోని పలు పాఠశాలలను ఎంఈవో పి.రమేష్ బాబు గురువారం సందర్శించారు. దీనికి సంబంధించిన ఏర్పాట్లను ప్రధానోపాధ్యాయులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పరీక్షల సమయం సమీపిస్తున్నందున కేంద్రాలకు కావాల్సిన సౌకర్యాలను సమకూర్చుకోవాలని వారికి సూచించారు.

యోగా సాధనతో జ్ఞాపక శక్తి మెరుగు



విద్యార్థులతో ఆసనాలు వేయిస్తున్న జనార్దన్

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే : విద్యార్థులు క్రమం తప్పకుండా యోగా సాధన చేస్తే జ్ఞాపక శక్తి పెరుగుతోందని శాంతివన్ యోగా ఫౌండేషన్ అధ్యక్షుడు, యోగా గురువు అంకె జనార్దన్ తెలిపారు. మూలపాడు జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించిన యోగా అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. బాల్యం నుంచి యోగా నేర్చుకుని సాధన చేస్తే అన్ని రంగాల్లో ఉన్నత స్థితికి చేరుకోవచ్చని సూచించారు. హెచ్ఎం డేవిడ్ రాక్‌ఫెల్లర్, వ్యాయామ ఉపాధ్యాయుడు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నాగులూరులో ఇరువర్గాల ఘర్షణ

ఎనిమిది మందికి తీవ్ర గాయాలు



మైలవరం ఆసుపత్రిలో వివరాలు సేకరిస్తున్న పోలీసులు

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే : పాత కక్షల నేపథ్యంలో మండలంలోని నాగులూరులో ఇరువర్గాల మధ్య కొట్లాట తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. ఎస్సై శ్రీను తెలిపిన వివరాల ప్రకారం.. నాగులూరులో సమీప బంధువులైన మట్టకొయ్య రుషారావు, కట్టా జమలయ్య, అబ్రహాం మధ్య కొంతకాలంగా ఆస్తి వివాదం నడుస్తోంది. బుధవారం రాత్రి ఆ విషయమై మొదలైన వాదన కాస్తా ఇరువర్గాలు కత్తులు, కర్రలు తీసుకొని కొట్టుకునే వరకు వెళ్లింది. ఈ క్రమంలో పరస్పరం దాడులు చేసుకున్నారు. దీంతో పలువురి తలలకు తీవ్రగాయాలు కాగా 108లో తొలుత వారిని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రుషారావు, జమలయ్యల వేర్వేరు ఫిర్యాదులతో ఇరువర్గాలపై రెండు కేసులు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. రుషారావుకు సంబంధించి అయిదుగురు, జమలయ్యకు సంబంధించి ముగ్గురిని మెరుగైన వైద్యం కోసం విజయవాడ తరలించినట్లు వివరించారు.

అవీ ఇవీ

శివాలయంలో దక్షిణామూర్తి విగ్రహ ప్రతిష్ఠ

గొల్లపూడి: గొల్లపూడిలోని శివాలయంలో దక్షిణామూర్తి విగ్రహ ప్రతిష్ఠ గురువారం జరిగింది. గ్రామానికి చెందిన ఆలపాటి సుబ్బారావు, లక్ష్మి దంపతుల సహకారంతో దక్షిణామూర్తి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో హోమం, పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నసంతర్పణ జరిగింది.

ఆలయాల అభివృద్ధి పనులకు విరాళం

జి.కొండూరు, న్యూస్‌టుడే : కవులూరులోని శ్రీకాళికామాత దుర్గాదేవి ఆలయం, కొండపల్లి శివారు శాంతినగర్‌లోని రామాలయంలో పలు అభివృద్ధి పనుల నిమిత్తం రూ.2 లక్షలను ప్రముఖ పారిశ్రామికవేత్త కోగంటి సత్యనారాయణ విరాళంగా అందిస్తానని ప్రకటించారు. ఆయన గురువారం ఆయా గ్రామాల్లోని ఆలయాలను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ నిర్వాహకులు ఆయన్ను సన్మానించారు. పినపాక మాజీ సర్పంచి గరికపాటి జైపాల్, సీహెచ్ ప్రసాద్, నాగభూషణాచారి, శివకోటేశ్వరరావు, ఆంజనేయచారి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి అవకాశాలపై అవగాహన

గొల్లపూడి, న్యూస్‌టుడే : యువతకు స్వయం ఉపాధి అవకాశాలపై అవగాహన కార్యక్రమం గొల్లపూడిలోని షాదీఖానాలో గురువారం నిర్వహించారు. పరిశ్రమల స్థాపన, బ్యాంకు రుణాలు, ప్రభుత్వ పథకాలను ఇండస్ట్రియల్ ప్రమోషన్ అధికారి ఆర్.రవికుమార్, డీఆర్‌డీఏ అధికారులు వివరించారు.

శ్మశానాల్లో మౌలిక వసతులు కల్పిస్తాం

ఇబ్రహీంపట్నం: కొండపల్లి పురపాలికలోని అన్ని శ్మశాన వాటికలను అభివృద్ధి చేయనున్నామని ఛైర్మన్ చిట్టిబాబు తెలిపారు. ఇబ్రహీంపట్నం సహాయమాత పాఠశాల పరిసరాల్లోని ఎస్సీ శ్మశాన వాటికను పుర అధికారులతో కలసి ఆయన గురువారం పరిశీలించారు. కంపెనీల సామాజిక నిధులతో శ్మశానాల్లో మౌలిక వసతులు కల్పించడంతో పాటు రక్షణ గోడలు నిర్మించనున్నామని చెప్పారు. స్థానిక కౌన్సిలర్లు, సహాయక ఇంజినీర్ మౌస్మీ తదితరులు పాల్గొన్నారు.

స్పందించారు.. బారికేడ్లు తొలగించారు

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం- ఛత్తీస్‌గఢ్(30), విజయవాడ- హైదరాబాద్(65) జాతీయ రహదారులపై ప్రమాదాల నివారణకు కొన్ని నెలల కిందట ట్రాఫిక్ సిబ్బంది పలు చోట్ల బారికేడ్లను ఏర్పాటు చేశారు. కొన్ని రోజుల నుంచి వీటిని గుర్తించక అనేక మంది వాటిని ఢీకొని ప్రమాదాలకు గురయ్యారు. దీంతో 'బారికేడ్లను గుర్తించక.. మృత్యువుకు చేరిక..' శీర్షికన 'ఈనాడు'లో బుధవారం ప్రచురితమైన కథనానికి ఎస్సైలు కృష్ణ, లక్ష్మణరావు స్పందించారు. జాతీయ రహదారులపై ఉన్న బారికేడ్లను తీయించారు.

గ్రామాల్లో అభివృద్ధి పనులకు ప్రాధాన్యం



చిలుకూరులో డ్రెయినేజీ నిర్మాణ పనులు పరిశీలిస్తున్న జ్యోత్స్న, శకుంతల

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే : గ్రామాల్లో అభివృద్ధి పనులకు ప్రాధాన్యం మేరకు నిధులు కేటాయిస్తూ వాటిని పూర్తి చేస్తున్నట్లు ఎంపీపీ పాలడుగు జ్యోత్స్న తెలిపారు. కేతనకొండలోని మైనార్టీ బజార్లో సీసీ డ్రెయిన్ల నిర్మాణానికి ఆమె గురువారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీని గ్రామస్థులు ఘనంగా సత్కరించారు. ఎంపీడీవో శకుంతల, సర్పంచి నళిని ఆశాలత, ఎంపీటీసీ సభ్యుడు సువర్ణరాజు, తెదేపా నాయకుడు వెంకట్రావు పాల్గొన్నారు. ◆ చిలుకూరులో మండల పరిషత్తు నిధులతో చేపట్టిన డ్రెయిన్ల నిర్మాణాన్ని ఎంపీపీ పరిశీలించారు. ఎంపీడీవో శకుంతల, సర్పంచి గొంది సురేష్, ఇంజినీరింగ్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

పదిలో ప్రతిభ చాటితే నగదు బహుమతులు



దాత సత్యనారాయణరెడ్డిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

గంపలగూడెం, న్యూస్‌టుడే : సత్యాలపాడు జడ్పీ ఉన్నత పాఠశాలలో పది చదువుతున్న విద్యార్థులు తుది పరీక్షల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన వారికి ప్రోత్సాహకంగా రూ.50 వేలు, రూ.30 వేలు చొప్పున అందజేస్తానని గ్రామానికి చెందిన ప్రవాసాంధ్రుడు కామసాని సత్యనారాయణ రెడ్డి ప్రకటించారు. గురువారం పాఠశాలను సందర్శించిన ఆయన పది పరీక్షలకు సిద్ధమవుతున్న వారితో మాట్లాడారు. గతేడాది కూడా దాత విద్యార్థులకు ఆర్థిక ప్రోత్సాహకం అందజేశారు. ఈ మేరకు హెచ్ఎం సతీష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు సత్యనారాయణరెడ్డిని సత్కరించారు.

పారిశుద్ధ్య లోపం.. స్పందన శూన్యం

తిరువూరు, న్యూస్‌టుడే

తిరువూరు పట్టణంలోని ఆర్టీసీ బస్‌స్టాండ్‌లో తీవ్ర పారిశుద్ధ్య లోపం కారణంగా ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. బస్‌స్టాండ్ ప్రాంగణంలో అపరిశుభ్ర వాతావరణం నెలకొనడంతో వేచి ఉండలేని పరిస్థితులు ఏర్పడ్డాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా బస్‌స్టాండ్‌లోని మరుగుదొడ్లపై మూతలు లేకపోవడంతో భరించలేని దుర్గంధం వ్యాపించి ఉండలేక పోతున్నామని వాపోతున్నారు. ఈ క్రమంలో అక్కడ పందుల సంచారం కూడా ఎక్కువగా ఉండడంతో అనారోగ్య సమస్యలు ఎదుర్కొనే ప్రమాదం ఉందని ఆవేదన చెందుతున్నారు. బస్‌స్టాండ్‌లో పారిశుద్ధ్య పనులు నిర్వహించే గుత్తేదారు నిర్లక్ష్యంతోనే ఇటువంటి పరిస్థితులు తలెత్తుతున్నాయని ఆరోపిస్తున్నారు.



అధ్వానంగా బస్టాండ్‌లోని మరుగుదొడ్ల పరిసరాలు

ఇష్టం వచ్చినట్లు నిలుపుదల..

ప్రయాణికులు వేచి ఉండడానికి సరైన కుర్చీలు ఉండవు. ఇక ఫ్యాన్లు అయితే ఉంటాయి కానీ ఎప్పుడు తిరగడం చూడలేదని పలువురు చెబుతున్నారు. కొందరు ఇష్టం వచ్చినట్లు ద్విచక్ర వాహనాలు, కార్లు పార్కింగ్ ఏరియాలో కాకుండా బస్సులు నిలిపే ప్రాంతంలో పెడుతున్నారని అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఆయా సమస్యలపై సంబంధిత అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా స్పందించి తగు చర్యలు తీసుకోవాలని, సమస్యలు పరిష్కరించేలా చొరవ చూపాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

పెట్టుబడుల్లో నిలకడ ఉండాలి



'ఫండ్లలో పెట్టుబడులు పెట్టినప్పుడు గతంలో ఇచ్చిన రాబడులను చూస్తుంటాం. కానీ, కొన్నిసార్లు మన జీవితంలో చేసే అతి ఖరీదైన ఫండ్‌గా మిగిలిపోతుంది. రాబడి వెంట పరుగులు తీయడం బాగానే ఉన్నప్పటికీ, అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోతుంది. నిలకడగా పెట్టుబడులు పెట్టడం విసుగు తెప్పించేలా ఉన్నా, అది ఎంతో ప్రభావవంతంగా పనిచేస్తుంది.' అని సూచిస్తున్నారు ఎడిల్‌వైజ్ మ్యూచువల్ ఫండ్ ఎండీ, సీఈఓ రాధికా గుప్తా. ఫండ్ల పెట్టుబడుల తీరుపై పలు సూచనలు చేశారు. అవేమిటంటే..

మార్కెట్లలో వచ్చే దిద్దుబాట్లు బోర్డు ఎగ్జామ్స్ లాంటివి. అవి కొంత కష్టంగానే అనిపిస్తాయి. కానీ, అద్భుతమైన గురువుల్లా పనిచేస్తాయి. మనకు పెట్టుబడుల విధానాన్ని నేర్పుతుంటాయి. రిటెయిల్ మదుపరులు ఈ విషయంలో పెద్దగా ఆందోళన చెందాల్సిన అవసరం ఉండదు.

వ్యక్తిగత పెట్టుబడి ప్రణాళిక: ముందుగా మీ ఆర్థిక పరిస్థితి అవసరాలను అంచనా వేసుకొని, ఒక ప్రణాళికను రాసుకోండి. ఇందులో ప్రధానంగా నాలుగు అంశాలు ఉండాలి. 1) ఆదాయం-ఖర్చులు
2) ప్రస్తుత పెట్టుబడులు-అప్పులు
3) భవిష్యత్తు లక్ష్యాలు, వాటికి పట్టే సమయం
4) నష్టభయం భరించే సామర్థ్యం.

తొందరపాటు తగదు: షేర్లలో నేరుగా పెట్టుబడి పెట్టేందుకు పోర్ట్‌ఫోలియోను నిర్మించాలా? వెండి కొనాలా? పోర్ట్‌ఫోలియో మేనేజ్‌మెంట్ సర్వీసెస్ (పీఎంఎస్) వైపు వెళ్లాలా? అని తొందరపడి ఆర్థిక నిర్ణయాలు తీసుకోవద్దు. మార్కెట్లలో మీరు పూర్తిగా నిలదొక్కుకునే వరకూ ఈ నిర్ణయాలన్నింటినీ వాయిదా వేసుకోండి.

siri@eenadu.net

అవగాహన పెంచుకోండి: చాలా మంది కనీస ఆర్థిక అవగాహన లేకుండా ఫండ్లు కొనుగోలు చేయాలనుకుంటారు. ఈత రాకుండా నీటిలో దూకడం ఎలాంటిదో ఇదీ అలాంటిదే. ముందుగా పెట్టుబడుల విషయంలో ప్రాథమిక విషయాలు నేర్చుకోండి.

నిపుణుల సలహాలు తీసుకోండి: మీ వ్యక్తిగత పెట్టుబడి ప్రణాళికతో మంచి వ్యక్తిగత ఆర్థిక నిపుణుడిని సంప్రదించండి. అవసరమైతే పలువురితో మాట్లాడి, మీకు తగిన, సౌకర్యంగా అనిపించే వ్యక్తిని ఎంచుకోండి.

ఇప్పుడే ప్రారంభించండి: ఇంకా పెట్టుబడులు ప్రారంభించని వారికి ఇదే సరైన సమయం. ఇప్పటికే మొదలుపెట్టి, తప్పులు చేసి ఉంటే, ఆందోళన చెందకండి. 2008 ఆర్థిక సంక్షోభం కూడా కొందరు మేధావులు చేసిన తప్పుల వల్లే వచ్చింది. మీరూ కొన్ని తప్పులు చేయొచ్చు. వాటి నుంచి పాఠాలు నేర్చుకొని, ముందుకు సాగండి.

భయాందోళనలు వద్దు: మార్కెట్లు అస్థిరంగా ఉన్నప్పుడు భయంతో నిర్ణయాలు తీసుకోవద్దు. గత నెలరోజులుగా ఈక్విటీలు, డెట్, కమొడిటీ మార్కెట్ల కదలికలు మదుపరుల సహనానికి పెద్ద పరీక్షగా నిలిచాయి. ఇలాంటి తుపాను సమయంలో అనవసర వార్తలకు దూరంగా ఉండండి. ముందుగా ఆస్తుల కేటాయింపు విషయాన్ని చూడండి. ఆందోళనతో తీసుకునే చర్యలు నష్టాన్ని మిగులుస్తాయి.

చిన్న కంపెనీల్లో

దేశంలోని చిన్న కంపెనీలలో పెట్టుబడులు పెట్టడం ద్వారా, దీర్ఘకాలంలో సంపదను సృష్టించే లక్ష్యంతో అబాకస్ స్మాల్ క్యాప్ ఫండ్ అందుబాటులోకి వచ్చింది. బలమైన వ్యాపార నమూనా ఉండి, భవిష్యత్తులో మల్టీ-బ్యాగర్లుగా మారే సామర్థ్యం ఉన్నప్పటికీ మార్కెట్లో ఇంకా గుర్తింపు పొందని చిన్న కంపెనీలను ఎంచుకొని, ఇది మదుపు చేస్తుంది. సమర్థమైన యాజమాన్యం, లాభాలను ఆర్జించే సామర్థ్యం, మంచి వృద్ధిని అందించే సంస్థలను మాత్రమే ఇది ఎంచుకుంటుంది. కేవలం వేగంగా పెరగడమే కాకుండా, మార్కెట్ హెచ్చుతగ్గులను తట్టుకోగల కంపెనీలపై దృష్టి పెడుతుంది. ప్రధానంగా ఎలక్ట్రానిక్స్ తయారీ, డిఫెన్స్, సెమీకండక్టర్, ట్రావెల్ వంటి రంగాలకు ప్రాధాన్యం ఇస్తుంది. మార్చి 12 వరకూ ఎన్‌ఎఫ్‌ఓ కొనసాగుతుంది. కనీస పెట్టుబడి రూ.500. స్మాల్ క్యాప్ షేర్లలో సహజంగానే నష్టభయం ఎక్కువగా ఉంటుంది. మార్కెట్ పెరిగేటప్పుడు ఎంత వేగంగా లాభాల్లోకి వస్తాయో.. పడిపోయేప్పుడు అంతే వేగంగా నష్టాల్లోకి వెళ్లిపోతాయి. కాబట్టి, దీన్ని తట్టుకునే వారికే ఇవి నప్పుతాయి. అదే సమయంలో అధిక రాబడికీ వీలుంటుంది. కనీసం 7 ఏళ్లకు మించి మదుపు చేయాలని అనుకున్నప్పుడే ఇలాంటి ఫండ్లను పరిశీలించాలి.

ప్రమాదంలో ఆర్థిక రక్ష

దేశంలో పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలను దృష్టిలో పెట్టుకొని, టాటా ఏఐజీ జనరల్ ఇన్సూరెన్స్.. 'యాక్సిడెంట్ సూపర్ గార్డ్ ప్లస్' పేరుతో వ్యక్తిగత ప్రమాద బీమా పాలసీని తీసుకొచ్చింది. ఈ పాలసీ ప్రమాదవశాత్తూ మరణం, శాశ్వత పూర్తి వైకల్యం సంభవించినప్పుడు పాలసీదారులకు ఆర్థిక రక్షణ కల్పిస్తుంది. ప్రమాదం వల్ల ఆసుపత్రిలో చేరినప్పుడు అయ్యే వైద్య ఖర్చులను చెల్లిస్తుంది. అనుకోని ప్రమాదాల సమయంలో వ్యక్తుల రుణ భారాన్ని తగ్గించేందుకు ఈఎంఐ ప్రొటెక్షన్, లోన్ షీల్డ్ వంటి అదనపు కవరేజీలు ఇందులో ఉన్నాయి. పిల్లల భవిష్యత్తు (చదువులు, పెళ్లి) ఖర్చులకు ఇది ఆర్థిక రక్షణ కల్పిస్తుంది. ఈ పాలసీని వ్యక్తిగతంగానూ, జీవిత భాగస్వామి, పిల్లలతో కలిసి తీసుకోవచ్చు. 1-5 ఏళ్ల కాలపరిమితితో అందుబాటులో ఉంది. ఉద్యోగులకు ప్రీమియంలో ప్రత్యేక రాయితీ ఉంటుంది.

వైవిధ్యంగా ఉండేలా

కొత్త పథకం

ఈక్విటీలు, డెట్, బంగారం/వెండి, రీట్స్ ఇలా వివిధ తరహా పెట్టుబడుల్లో వైవిధ్యంగా మదుపు చేసే వినూత్నమైన పథకం.. క్యాపిటల్ మల్టీ అసెట్ అలకేషన్ ఫండ్ అందుబాటులోకి వచ్చింది. మార్కెట్ హెచ్చుతగ్గులు ఉన్నప్పుడు నష్టభయం తగ్గుతుంది. స్థిరమైన రాబడి వచ్చే అవకాశమూ ఉంటుంది. క్వాంటిటేటివ్ మోడల్స్‌పై ఆధారపడి ఈ ఫండ్ పెట్టుబడి వ్యూహం ఆధారపడి ఉంటుంది. మార్కెట్ పరిస్థితులను బట్టి, ఏ అసెట్ క్లాస్‌లలో ఎంత పెట్టుబడి పెట్టాలో నిర్ణయించుకుంటుంది. కనీసం రూ.5,000 (సిప్ రూ.1,000)తో మదుపు ప్రారంభించవచ్చు. ఎన్ఎఫ్ఓ మార్చి 9 వరకూ అందుబాటులో ఉంటుంది. కనీసం 3-5 ఏళ్లపాటు పెట్టుబడి కొనసాగించే వారికి ఇది అనుకూలం.

బ్యాంకు ఖాతా ఫ్రీజ్ అయ్యిందా?

రాత్రికి రాత్రే బ్యాంకు ఖాతా బ్లాక్ (ఫ్రీజ్) అయ్యిందనుకోండి. మీ ఆర్థిక లావాదేవీలు పూర్తిగా స్తంభించిపోతాయి. అప్పుడు ఆందోళన సహజం. అసలు ఖాతా ఎందుకు ఆగిపోయిందో తెలుసుకుంటే, దాన్ని మళ్లీ పునరుద్ధరించుకోవడం చాలా సులభం.



ప్రధానంగా మూడు కారణాల వల్ల ఖాతాలను బ్యాంకులు నిలిపివేస్తుంటాయి. మీ ఖాతాదారు గురించి తెలుసుకోండి (కేవైసీ) పెండింగ్‌లో ఉండటం, అనుమానాస్పద లావాదేవీలు, చట్టపరమైన ఆదేశాలు.. తదితరాలు ఇందుకు కారణం కావచ్చు. సమస్యను బట్టి, పరిష్కారం ఉంటుంది.

ముందుగా మీ బ్యాంకు మొబైల్ యాప్ లేదా నెట్ బ్యాంకింగ్ పోర్టల్‌ను పరిశీలించండి. అందులో మీ ఖాతాను నిలిపివేయడానికి కారణాలను పేర్కొంటుంది. ఒకవేళ విషయం స్పష్టంగా తెలియకపోతే, బ్యాంకు వినియోగదారుల సేవా కేంద్రానికి ఫోన్ చేయండి. దగ్గర్లో ఉన్న బ్యాంకు శాఖను సందర్శించండి. ఖాతా ఎందుకు నిలిపివేయాల్సిన విషయాన్ని బ్యాంకులు విభాగాల వారీగా నమోదు చేస్తాయి. కాబట్టి, కేవలం సాంకేతిక సమస్యలాంటి సాధారణ సమాధానాలతో సరిపెట్టుకోవద్దు. సరైన కారణం తెలుసుకుంటేనే అందుకు తగిన చర్యలు తీసుకునేందుకు వీలవుతుంది.

కేవైసీ సమస్య: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) నిబంధనల ప్రకారం మీ ఖాతాదారు గురించి తెలుసుకోండి (కేవైసీ) పత్రాలు సరిగా లేకపోతే, ఖాతాలను బ్యాంకులు నిలిపివేస్తాయి. పాన్-ఆధార్ అనుసంధానం చేయకపోవడం, ఆధార్ వెరిఫికేషన్ పెండింగ్‌లో ఉండటం, మారిన చిరునామా, ఫోన్ నంబర్లను అప్‌డేట్ చేయకపోవడం వీడియో లేదా సెల్ఫీ వెరిఫికేషన్ అసంపూర్తిగా ఉండటం దీనికి ప్రధాన కారణాలు. నిబంధనలు మారితే, ఎంత పాత ఖాతాలనైనా బ్యాంకులు నిలిపివేసే అవకాశం ఉంది.

పరిష్కారం: కేవైసీ సమస్య ఉంటే, ఏ పత్రాలు అవసరమో బ్యాంకును అడిగి తెలుసుకోండి. వారు అడిగిన పత్రాలను సమర్పించి, రసీదు తీసుకోండి. పత్రాలను ఆమోదించిన తర్వాత 2 నుంచి 5 పనిదినాల్లో ఖాతా పునరుద్ధరణ జరుగుతుంది.

లావాదేవీల్లో అనుమానం: గత లావాదేవీల సరళికి విరుద్ధంగా.. అకస్మాతుగా భారీ మొత్తంలో నగదు ఖాతాలో జమ కావడం, పదేపదే అధిక విలువగల బదిలీలు జరగడం వంటివి అనుమానాస్పద లావాదేవీలుగా పరిగణించి ఖాతాలను బ్లాక్ చేస్తారు. ఫ్రీలాన్సర్లు, ట్రేడర్లు, చిన్న వ్యాపార యజమానులు తరచుగా ఈ సమస్యను ఎదుర్కొంటారు.

పరిష్కారం: ఇలాంటి సందర్భాల్లో వెంటనే స్పందించి, నిధుల మూలాన్ని, ఉద్దేశాన్ని స్పష్టంగా బ్యాంకుకు తెలియజేయాలి. ఇన్వాయిస్‌లు, సేల్ డీడ్‌లు, శాలరీ స్లిప్పుల వంటి ఆధారాలను సమర్పించాలి. బ్యాంకులు మీ లావాదేవీల పట్ల స్పష్టతను కోరుకుంటాయి. కాబట్టి, అస్పష్టమైన సమాధానాలు ఇవ్వడం లేదా జాప్యం చేయడం వల్ల ఖాతా నిలిపివేత మరింత కాలం కొనసాగొచ్చు.

చట్టపరమైన ఆదేశాలు: ఆదాయపు పన్ను నోటీసు, కోర్టు ఆదేశాలు లేదా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆర్డర్ కారణంగా ఖాతా బ్లాకైతే, బ్యాంకు దానంతట అదే ఆంక్షలను తొలగించలేదు. ఖాతాలోని మొత్తం బ్యాలెన్స్‌ను లేదా కొంత మొత్తాన్ని మాత్రమే (ఉదాహరణకు, రికవరీ చేయాల్సిన మొత్తం) బ్లాక్ చేశారా అనేది చూసుకోండి. చాలాసార్లు వివాదాస్పద భాగాన్ని మాత్రమే ఫ్రీజ్ చేస్తారు. సంబంధిత అధికారుల నుంచి అనుమతి వచ్చాకే బ్యాంకు మీ ఖాతాను పునరుద్ధరిస్తుంది. ఇది కొంత సమయం తీసుకుంటుంది.

ఏం చేయాలి?

మీ ప్రాథమిక ఖాతా బ్లాక్ అయినప్పుడు, ప్రత్యామ్నాయంగా మీకున్న రెండో ఖాతాను ఉపయోగించండి

- ✦ తాత్కాలికంగా మీ వేతనాన్ని వేరే ఖాతాకు బదిలీ చేయమని మీ సంస్థను కోరండి
- ✦ మీరు మరో ఖాతాను తెరవడానికి లేదా నిర్వహించేందుకు అనుమతి ఉందో లేదో బ్యాంకును అడిగి తెలుసుకోండి.
- ✦ అన్ని నిబంధనలనూ పూర్తి చేసినప్పటికీ, బ్యాంకు ఖాతాను నిర్ణీత గడువు లోపు పునరుద్ధరించకపోతే, లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయాలి. అవసరాన్ని బట్టి, బ్యాంకింగ్ అంబుడ్స్‌మన్‌ను ఆశ్రయించాలి.

చాలా సందర్భాల్లో ఖాతా ఫ్రీజ్ కావడం అనేది నిబంధనలలో భాగమే కానీ, శిక్ష కాదు. సరైన కారణాన్ని గుర్తించి, కచ్చితమైన సమాచారాన్ని అందిస్తే.. ఖాతా వేగంగానే అందుబాటులోకి వస్తుంది.

సుబ్రమణి దొరికితేనే.. కేసు కొలిక్కి!

నేడు లొంగిపోనున్నట్లు సంకేతాలు ★ ఇంకా దొరకని ఆకాశ్ జాడ

ఈనాడు - అమరావతి: కీలక సూత్రధారిగా భావిస్తున్న సుబ్రమణి రాజా వెంకట్ (ఏ5) దొరికితేనే అద్దె ఖాతాల కేసు ముందుకు కదులుతుంది. ఇప్పటికే విజయవాడ సైబర్ పోలీసుల ప్రత్యేక బృందం. చెన్నైలోని తిరువొత్తియూర్‌లో నిందితుడి ఇంటికెళ్లింది. అతని కుటుంబ సభ్యులకు పోలీసులు నోటీసులు ఇచ్చారు. యనమలకుదురులో ప్రధాన నిందితులను పోలీసులు అరెస్టు చేయగానే.. చెన్నైలో అజ్ఞాతంలోకి వెళ్లాడు. నిందితుడిని తీసుకుని తాము శుక్రవారం విజయవాడ వస్తామని అతని న్యాయవాది.. పోలీసులకు చెప్పాడు. ఈమేరకు నిందితుడు వస్తే.. అరెస్టు చేసేందుకు కసరత్తు చేస్తున్నారు.

అన్ని వేళ్లూ అతడివైపే..: ఇప్పటి వరకు అరెస్టయిన నిందితులను పోలీసులు మూడు రోజులు కస్టడీకి తీసుకుని విచారించినా వీరు కీలక అంశాలను వెల్లడించలేదు. తాము కేవలం పాత్రధారులమనీ.. చెన్నై నుంచి వచ్చిన ఆదేశాల మేరకు నడుచుకున్నామని రవికుమార్, స్టీవెన్‌లు చెప్పారు. ఈనేపథ్యంలో ఏ5 కీలకంగా మారాడు. సుబ్రమణి, మరో సూత్రధారుడు ఆకాశ్ కూడా దొరికితే కీలక అంశాలు తేలే వీలుంది. ఇప్పటి వరకు సాగిన దర్యాప్తులో అసలు సూత్రధారులు, వారి పాత్ర వెలుగుచూడలేదు.

ఆ ఖాతాల నుంచి ఎక్కడికి?: చెన్నై వెళ్లిన విజయవాడ పోలీసులకు ఆకాశ్ జాడ తెలియలేదు. వీరి వెనుక ఇంకా ఎందరున్నారు? వారు ఈ ఖాతాలను ఏయే నేరాల లావాదేవీలకు వాడారనేది పరారీలోని నిందితులు దొరికితేనే తెలుస్తుంది. విజయవాడ నుంచి ఏ1, ఏ2 నిర్వహించిన నగదు బదిలీ అంతిమంగా ఎవరి ఖాతాలకు వెళ్లాయన్నది తమిళనాడుకు చెందిన 113 ఖాతాల వివరాలు వస్తేనే బయటపడుతుంది. వీరు ఈ ఖాతాలను దేశంలోనే ఉన్న పైఅంచెలో ఉన్న వారికి ఇచ్చారా? దేశం దాటించారా? అనేది తేలాల్సి ఉంది. తమిళనాడులో ఉన్న ఈ బ్యాంకుల జోనల్ కార్యాలయాలకు పోలీసులు లేఖలు రాశారు. వివరాలు వస్తే.. గొలుసుకట్టు నగదు బదిలీల గుట్టు వీడుతుంది.

సెంథిల్‌కు రెండు రోజుల కస్టడీ

ఈనాడు - అమరావతి: నకిలీ మద్యం కేసులో నిందితుడు సెంథిల్ (ఏ22)ను కోర్టు కస్టడీకి ఇచ్చింది. తన కంపెనీ నుంచి నిందితుడు సీసాలను సరఫరా చేశాడనీ, నిందితుడి నుంచి మరిన్ని వివరాలు రాబట్టాల్సి ఉందనీ.. ఐదు రోజుల కస్టడీకి ఇవ్వాలని ఇటీవల ఎక్సైజ్ అధికారులు పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విజయవాడలోని ఎక్సైజ్ కోర్టు ఉత్తర్వులిచ్చింది. నిందితుడిని మార్చి 1, 2 తేదీల్లో కస్టడీకి ఇస్తూ న్యాయాధికారి ఉత్తర్వులు జారీ చేశారు. ఇదే కేసులో ఎక్సైజ్ అధికారులు జోగి సోదరుల బెయిల్ రద్దు పిటిషన్ ఏడో ఏడీజే కోర్టులో విచారణకు వచ్చింది. నిందితులకు నోటీసుల నిమిత్తం శుక్రవారానికి వాయిదా వేశారు.

పతకాల విల్లు.. ప్రశంసల జల్లు

న్యూస్‌టుడే- విజయవాడ క్రీడలు

అంతర్జాతీయ వేదికపై సత్తా చాటడమే లక్ష్యంగా సాధన చేస్తున్నారు నగరంలోని ఇరువురు ఆర్చరీ క్రీడాకారిణులు. ఈ నెల 21 నుంచి 24వ తేదీ వరకు నగరంలో జరిగిన అస్మిత ఖేలో ఇండియా జాతీయ మహిళా ర్యాంకింగ్ పోటీలో మెరుగైన ప్రతిభను ప్రదర్శించి పతకాలు కైవసం చేసుకున్నారు. ఓల్గా ఆర్చరీ అకాడమీలో శిక్షణ పొందుతూ జాతీయ స్థాయిలో రాణిస్తున్న వీరిపై 'న్యూస్‌టుడే' కథనం.

ప్రియమైన విజయాలు



కానూరుకు చెందిన బాణావత్ సాయి శ్రీనివాస్ నాయక్, వరలక్ష్మి దంపతుల పెద్ద కుమార్తె **ప్రియ వైష్ణవి** 2022లో నగరంలోని ఓల్గా ఆర్చరీ అకాడమీలో చేరింది. కోచ్ చెరుకూరి సత్యనారాయణ పర్యవేక్షణలో రోజూ 6 గంటల పాటు సాధన చేస్తూ భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించడమే లక్ష్యంగా సాధన సాగిస్తోంది. ఈ నెల 19 నుంచి 21 వరకు దిల్లీలో జరిగిన జాతీయ ట్రైబల్ గేమ్స్ సెలక్షన్ ట్రయల్స్ ఫేజ్-2లో పసిడి పతకం, ఈ నెల 21 నుంచి 24 వరకు నగరంలో జరిగిన అస్మిత ఖేలో ఇండియా పోటీల్లో జూనియర్ కాంపౌండ్ మహిళా వ్యక్తిగత విభాగంలో కాంస్య పతకం కైవసం చేసుకుంది. భోల్‌పూర్‌లో జరిగిన అస్మిత ఖేలో ఇండియా పోటీల్లో తలపడి కాంపౌండ్‌లో 4వ స్థానం, గత ఏడాది ఏప్రిల్‌లో దిల్లీలో జరిగిన ఖేలో ఇండియా మహిళా ఛాంపియన్‌షిప్‌లో పోటీపడి 7వ ర్యాంకు సాధించింది. 2023లో రాజస్థాన్‌లో జరిగిన జాతీయ జూనియర్ పోటీల్లో కాంపౌండ్ రాష్ట్ర జట్టుకు 4వ స్థానం, 2024 జనవరిలో రాయపూర్‌లో జరిగిన జాతీయ సబ్ జూనియర్ పోటీల్లో రాష్ట్ర జట్టుకు 3వ స్థానం సాధించిపెట్టింది.

ర్యాంకుల రిషి



ఎస్‌డీఎం సిద్ధార్థ మహిళా జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న రామవరప్పాడుకు చెందిన **రిషి కీర్తన** ఓల్గా ఆర్చరీ అకాడమీలో అకాడమీ చీఫ్ కోచ్ సత్యనారాయణ, కోచ్ నవీన్‌కుమార్ పర్యవేక్షణలో రోజూ 6 గంటలు సాధన చేస్తోంది. తండ్రి కామినేని వంశీధర్ శాప్‌లో అథ్లెటిక్స్ కోచ్ కాగా.. తల్లి రాధిక గృహిణి. ఈ నెల 21 నుంచి 24వ తేదీ వరకు నగరంలో జరిగిన అస్మిత ఖేలో ఇండియా జాతీయ ర్యాంకింగ్ పోటీలో కాంపౌండ్ వ్యక్తిగత విభాగంలో రజత పతకాన్ని కైవసం చేసుకుంది. 2025 పోటీలు ముగిసేసరికి రాష్ట్ర స్థాయిలో సీనియర్స్‌లో మొదటి, జూనియర్స్, సబ్ జూనియర్స్‌లో 3వ ర్యాంకులో నిలిచింది. 2024లో గుజరాత్‌లో జరిగిన జాతీయ స్కూల్ గేమ్స్ అండర్-17 కాంపౌండ్ పోటీల్లో పసిడి పతకం కైవసం చేసుకుంది. రాజస్థాన్‌లో జరిగిన జాతీయ సబ్ జూనియర్ పోటీల్లో కాంస్య పతకాన్ని తన ఖాతాలో జమ చేసుకుంది. పలు రాష్ట్ర స్థాయి పోటీల్లో సుమారు 15 పతకాలు సొంతం చేసుకుంది.

బాలిక పట్ల అసభ్య ప్రవర్తన

అరెస్టయిన రెండు రోజులకే బయటికి వచ్చిన నిందితుడు

భవానీపురం, న్యూస్‌టుడే: బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తికి స్థానికులు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. వివరాలిలా ఉన్నాయి.. భవానీపురంలోని ఓ ప్రాంతానికి చెందిన బాలిక(6) కుటుంబ సభ్యులతో కలిసి నివాసం ఉంటుంది. ఈ నెల 22న బాలిక వీధిలో వెళ్తుండగా అదే ప్రాంతానికి చెందిన మహ్మద్ ఇస్లాం అసభ్యంగా ప్రవర్తించాడు. బాలికను అసభ్యంగా తాకుతూ వ్యాన్‌లో తీసుకువెళ్లేందుకు ప్రయత్నించాడు. ఆ విషయాన్ని స్థానికులు గుర్తించి ప్రశ్నించడంతో అక్కడ నుంచి పారిపోయాడు. స్థానికులు అతడి కోసం వెతకగా వీధి చివరన ఒక చోట కనిపించాడు. వెంటనే అతడిని పట్టుకుని కరెంటు స్తంభానికి కట్టేసి దేహశుద్ధి చేశారు. వెంటనే భవానీపురం పోలీసులకు సమాచారం ఇచ్చి అప్పగించారు. భవానీపురం పోలీసులు మహిళా పోలీసుస్టేషన్‌కు వారికి సమాచారం ఇవ్వడంతో పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బయటకు ఎలా పంపారో..?

నిందితుడు మహ్మద్ ఇస్లాం మరుసటి రోజే వీధిలో కనిపించడంతో స్థానికులు ఆశ్చర్యానికి గురయ్యారు. తాము ఎంతో ధైర్యం చేసి నిందితుడిని పట్టుకుని పోలీసులకు అప్పగిస్తే వారు కేసును నీరుగార్చేలా చేస్తున్నారంటూ ఆరోపిస్తున్నారు. బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిని ఏవిధంగా బయటకు పంపుతారని ప్రశ్నిస్తున్నారు. భవానీపురం, మహిళా పోలీసుస్టేషన్ చుట్టూ అనేక సార్లు తిరిగామని అయినప్పటికీ నిందితుడి పట్ల పోలీసులు కఠినంగా వ్యవహరించకపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నాణ్యమైన సేవలతో ప్రభుత్వ సంకల్పం నెరవేర్చండి

విద్యుత్తు ఉద్యోగులకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ సూచన



అతిథిగృహ శంకుస్థాపన కార్యక్రమంలో విజయానంద్ తదితరులు

కరెన్సీనగర్ (విజయవాడ), న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రజలకు నాణ్యమైన, నమ్మకమైన, నిరంతర విద్యుత్తు సేవలందిస్తూ ప్రభుత్వ సంకల్పాన్ని నెరవేర్చాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ విద్యుత్తు శాఖ ఉద్యోగులకు సూచించారు. నగరంలోని గుణదలలో ఏపీఎస్ఈబీ ఇంజినీర్ల సంఘం అతిథి గృహానికి గురువారం ఉదయం ఆయన శంకుస్థాపన చేశారు. విజయానంద్ మాట్లాడుతూ సమగ్ర ప్రణాళికతో నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ అతిథి గృహ నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలన్నారు. రాష్ట్ర విభజన తర్వాత విద్యుత్తు శాఖలో సంస్థాగత మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం దృఢమైన చర్యలు తీసుకుందన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, ఉన్నత ఇంజినీరింగ్ ప్రమాణాలతో అభివృద్ధి చేసిన విద్యుత్తు సౌధ శాఖ ఆధునికీకరణ, సంస్థ అభివృద్ధికి ప్రతీకలుగా నిలుస్తాయన్నారు. ఏపీ జెన్కో ఇన్‌ఛార్జి ఎండీ, సీపీడీసీఎల్ సీఎండీ పి.పుల్లారెడ్డి మాట్లాడుతూ భవన రూపకల్పనలో సీనియర్ అధికారులు, సాంకేతిక నిపుణులు ఇంజినీర్ల అవసరాలను దృష్టిలో ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీ ట్రాన్స్‌కో డైరెక్టర్లు ఏకేవీ.భాస్కర్, జె.వి.రావు, ఎన్.వి.రమణమూర్తి, ఏపీ జెన్కో డైరెక్టర్లు సుజయకుమార్, పి.అశోక్ కుమార్ రెడ్డి, వి.ఉష, ఇతర డైరెక్టర్లు కె.శ్రీనివాసరావు, ఎ.మురళీకృష్ణ యాదవ్, ఎస్.వెంకటేశ్వర్లు, టీవీఎస్ఎన్ మూర్తి, ఏపీఎస్ఈబీ అధ్యక్షులు ఎన్.శామ్యూల్, ప్రధాన కార్యదర్శి నాగప్రసాద్, సంఘం అధ్యక్షులు కె.వెంకట రామారావు, అదనపు కార్యదర్శి డి.నాగరాజులు పాల్గొన్నారు.

'కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో పింఛనుదారులకు నష్టం'



మాట్లాడుతున్న వరప్రసాద్. వేదికపై శాస్త్రి, రామారావు తదితరులు

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ఆర్థిక బిల్లు-2025లో భాగంగా సెంట్రల్ సివిల్ సర్వీసెస్ పెన్షన్ వ్యాలిడేషన్ క్లాజ్‌ను చేర్చి ఆమోదించిందని.. ఇది పింఛనర్ల హక్కులను కాలరాసే చర్య అని ఫోరం ఆఫ్ సివిల్ పెన్షనర్స్ అసోసియేషన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ క్లాజ్‌ను రద్దు చేయాలని కోరుతూ గురువారం గవర్నర్‌పేటలోని రామ్మోహన్ గ్రంథాలయంలో వివిధ పెన్షనర్ సంఘాల ఐక్య సమావేశం నిర్వహించారు. ఫోరం అధ్యక్షుడు వి.వరప్రసాద్ మాట్లాడుతూ. . కేంద్రం తెచ్చిన నూతన క్లాజ్‌తో పాత, కొత్త పింఛనర్లుగా విడగొడతారన్నారు. భవిష్యత్తులో వేతన సవరణ జరిగితే.. పాత పెన్షనర్లకు పెన్షన్ సవరణ ఉండదని, కొత్త పింఛనర్లు మాత్రమే వేతన సవరణ పొందుతారని చెప్పారు. కేంద్రం నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ.. నేషనల్ కోఆర్డినేషన్ కమిటీ ఆఫ్ పెన్షనర్స్ ఆధ్వర్యంలో 14 సివిల్ పెన్షనర్ల సంఘాలు ఐక్య సంఘంగా ఏర్పడ్డాయని తెలిపారు. 1982లో నకార వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో సుప్రీంకోర్టు పెన్షనర్లంతా సమానమే అని ప్రకటించిందన్నారు. ఉద్యోగ విరమణ తేదీ ఆధారంగా వర్గీకరిస్తే.. అది వివక్ష, రాజ్యాంగ విరుద్ధం అవుతుందని తెలిపారు. ఇది పౌర పింఛనర్ల మెడపై కత్తిలా వేలాడుతుందన్నారు. దీన్ని తక్షణం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ పెన్షనర్ సంఘాల నాయకులు జి.వి.ఎన్.శాస్త్రి, ఎన్.రామారావు, ఎన్.నాగేశ్వరరావు, పి.అశోక్‌బాబు, ఎం.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీ వర్గీకరణ కోరుతూ వినూత్న ప్రదర్శన



అర్ధనగ్న ప్రదర్శనలో సంఘం నాయకులు తదితరులు

గాంధీనగర్, న్యూస్‌టుడే : ప్రత్యేక యానాది కార్పొరేషన్‌తో పాటు ఎస్టీ వర్గీకరణ చేయాలని డిమాండ్ చేస్తూ యానాది సంఘం నాయకులు గురువారం విజయవాడ ధర్నా చౌక్‌లో అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించి, తమ నిరసనలు తెలియజేశారు. ఈ సందర్భంగా యానాది సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.సి.పెంచలయ్య మాట్లాడుతూ.. దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వానికి వినతి పత్రాలు సమర్పించినా ఇప్పటి వరకు స్పందన లేదన్నారు. వాటిని పరిష్కరించని పక్షంలో రాష్ట్ర వ్యాప్త ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు లోకనాథం, కేవీపీఎస్ అధ్యక్షుడు ఆండ్ర మాల్యాద్రి, గిరిజన సంఘం నాయకులు ఈగ శ్రీనివాసరావు, పొట్లూరి లక్ష్మయ్య తదితరులు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు పి.శ్రీనివాసరావు, చేవూరి సుబ్బారావు, నీలం సరేంద్ర, కావలి రామలక్ష్మయ్య, వి.సుధాకర్, అంకమ్మ, కె.రుక్మిణమ్మ, ఉష, కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

పంట కాల్వలకు నీటి విడుదల పెంపు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : కృష్ణా డెల్టాలోని పంట కాల్వలకు నీటి విడుదల పెంచారు. నగరంలోని ప్రకాశం బ్యారేజీ నుంచి గురువారం 4,165 క్యూసెక్కులు విడుదల చేశారు. వీటిలో కృష్ణా తూర్పు ప్రధాన కాల్వకు 1,502, కృష్ణా పశ్చిమ ప్రధాన కాల్వకు 2,519, గుంటూరు ఛానల్‌కు 144 క్యూసెక్కుల మేర ఇస్తున్నారు. కృష్ణా తూర్పు ప్రధాన కాల్వ నుంచి రైవస్‌కు 1,000, కేఈబీ 302, బందరు కాల్వలకు 200 క్యూసెక్కుల చొప్పున వదిలారు. తాగునీరు, తదితర అవసరాల దృష్ట్యా రైవస్ కాల్వకు నీటి విడుదలను గురువారం పునరుద్ధరించారు.

'సోము వీర్రాజుపై ప్రణాళిక ప్రకారమే దూసుకెళ్లారు'

భవానీపురం, న్యూస్‌టుడే: ఏపీ శాసనమండలి సమావేశంలో ఎమ్మెల్సీ సోము వీర్రాజుపైకి వైకాపా ఎమ్మెల్సీలు దూసుకెళ్లడం ప్రణాళిక ప్రకారం జరిగిందని భాజపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దయాకర్‌రెడ్డి, అధికార ప్రతినిధి జయప్రకాష్ నారాయణ విజయవాడలో ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వైకాపా అధ్యక్షుడు జగన్ ఆదేశాల మేరకే సోము వీర్రాజును వైకాపా ఎమ్మెల్సీలు లక్ష్యంగా చేసుకున్నారని తెలిపారు. వైకాపా నాయకులకు ప్రతి దాడులు ఏవిధంగా ఉంటాయో చూపించడం భాజపా వారికి తెలుసని.. ప్రజాస్వామ్య పద్ధతిలో తాము వెళ్లడం వల్ల ఆ విధంగా చేయడం లేదన్నారు. ప్రజా సమస్యలపై ప్రస్తావించడం వైకాపా వారికి నచ్చకపోవడం కారణంగానే ఆ విధంగా ప్రవర్తించారని తెలిపారు.

ఏప్రిల్ 4 నుంచి శాప్ లీగ్ రాష్ట్ర స్థాయి సైక్లింగ్ పోటీలు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: శాప్ లీగ్ క్రీడా పోటీల్లో భాగంగా ఈ నెల 28 నుంచి ఎన్టీఆర్ జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో జరగాల్సిన రాష్ట్ర స్థాయి సైక్లింగ్ పోటీలను ఏప్రిల్ 4, 5 తేదీల్లో నిర్వహిస్తామని శాప్ కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొంది. విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలు జరుగుతున్న దృష్ట్యా పలువురి అభ్యర్థన మేరకు సైక్లింగ్ పోటీల తేదీలను మార్చాల్సి వచ్చిందన్నారు. మాస్టర్స్ టెన్నిస్ పురుషుల(40+), బ్యాడ్మింటన్ స్త్రీ, పురుషుల (35+, 40+), అథ్లెటిక్స్ పురుషుల (35+, 45+)కు నేరుగా రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహిస్తామన్నారు. ఆసక్తిగల అథ్లెట్లు శాప్ వెబ్‌సైట్ sports.ap.gov.in లో నేరుగా నమోదు చేసుకోవచ్చన్నారు. వీటిపై మరిన్ని వివరాలకు సంబంధిత జిల్లాల డీఎస్ఏ కార్యాలయంలో జిల్లా క్రీడాభివృద్ధి అధికారిని సంప్రదించాలన్నారు.

వసుంధర

vasundhara@eenadu.in

ఏం చూస్తున్నారు..?



వీకెండ్‌లో తప్ప వీక్ డేస్‌లో ఒకరికి ఒకరు సమయం కేటాయించే అవకాశమే లేని జీవన శైలి ఇప్పుడందరిదీ. అందుకే శని ఆదివారాలు వస్తే... ఒకటే హంగామా. ఇంటిని సినిమా థియేటర్‌గా మార్చి... నచ్చిన సినిమాలు చూస్తూ క్వాలిటీ సమయాన్ని గడుపుతున్నారు. మీరూ అదే చేస్తున్నారా? అయితే ఎలాంటి సినిమాలు చూస్తున్నారు. ఓటీటీ వేదికలు వచ్చాక... భాషాభేదాలు లేకుండా ప్రతి సినిమానీ ఆస్వాదిస్తున్నారు. అయితే ఏం చూడాలనే ఎంపిక మహిళలదీ, అమ్మాయిలదీ అయినప్పుడు మాత్రం ఆపాతమధురాల్ని చూడటానికే ఇష్టపడతున్నారట. కుటుంబ కథా, మహిళా ప్రాధాన్యమున్న చిత్రాల్ని చూస్తున్నారట. దీనికి నోస్టాల్జీ అంటూ ట్యాగ్‌లైన్లనూ జోడించి ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్‌ల్లో పంచుకుంటున్నారు కూడా. ఇవే ఎందుకు అంటే... ఈ గజిబిజి జీవనశైలిలో కొరవడిన భావోద్వేగాలు మళ్లీ చిగురించాలన్నా, అమ్మాయిలు పడుతున్న ఇబ్బందులు, వేధింపులు, ఎదుర్కొంటున్న పరిస్థితులు తెలియాలన్నా ఇవే మంచి ఎంపిక అంటున్నారు. పైగా అప్పటి సినిమాల్లో మహిళా పాత్రలకు ఇచ్చిన ప్రాధాన్యత, సమస్యలన్నీ దాటుకుని వాళ్లు బయటికి వచ్చిన వైనాలు, ముఖ్యంగా అప్పటి సంగీతానికి ఏదీ సాటిరాదంటున్నారు. అందుకే వారానికి ఒకసారైనా ఈ తరహా సినిమాలు చూడటానికి ఇష్ట పడుతున్నారట. ఇంతకీ మీరేం చూస్తున్నారు?

ప్రపంచ పోటీలో... మన రీమా



మధ్యతరగతి అమ్మాయి. అందులోనూ మోడలింగ్ వైపు ఆకర్షితురాలైంది. అంతా కష్టమన్నా... ప్రయత్నించింది. తాజాగా ఎకో ఇంటర్నేషనల్ ఇండియా కిరీటాన్ని గెలిచింది... షేక్ రీమా!

ఆసక్తి, కష్టపడే మనస్తత్వం ఉంటే ఏ రంగంలోనైనా విజయం సాధించొచ్చు అంటుంది రీమా. ఈమెది వైఎస్సార్ కడప జిల్లాలోని సుండుపల్లె. తల్లి షేక్ షహీనా, తండ్రి జహుద్ బాషా వ్యాపారి. ప్లస్ టూ వరకూ కర్నూల్‌లో హాస్టల్‌లో ఉండి చదువుకుంది. ఆ సమయంలోనే టీవీ, దినపత్రికల్లో వివిధ రంగాల్లో మహిళల విజయాలను చూసి, తనూ ఏదైనా సాధించాలి అనుకుంది రీమా. అందుకు ఏం చేయాలి అని ఆలోచిస్తున్న ఆమెను మోడలింగ్ రంగం ఆకర్షించింది. దానిలోకి వెళదామనుకుంటే బంధువులు, స్నేహితులు 'కష్టం, అక్కడ నువ్వు రాణించలేవ'న్నారు. ఆమె తల్లిదండ్రులకు 'కూతురికి పెళ్లి చేసి పంపించండ'న్న సలహాలూ వచ్చాయి. కానీ అమ్మానాన్నలు ఆమె వెన్నంటే నిలిచారు 'నీకు నచ్చింది చెయ్యి' అంటూ ప్రోత్సహించారు. వాళ్ల తోడ్పాటుతో నచ్చిన రంగంవైపు అడుగులు వేసింది రీమా. చదువుతోపాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేది. అవసరమైన నైపుణ్యాలూ పెంచుకుంది. బీబీఏ కోసం బెంగళూరుకి వెళ్లింది రీమా. 2024లో జైపుర్‌లో జరిగే అందాల పోటీల గురించి తెలిసి పాల్గొంది. టీన్ ఏపీ కిరీటం సాధించింది. ఆ విజయం ఇచ్చిన ఆత్మవిశ్వాసంతో గత ఏడాది అక్కడే నిర్వహించిన ఎకో ఇంటర్నేషనల్ ఇండియా పోటీల్లో పాల్గొంది. విజేతగానూ నిలిచింది. అంతేకాదు, ఈ ఏడాది లండన్‌లో జరగనున్న ప్రపంచస్థాయి అందాల పోటీల్లో దేశానికి ప్రాతినిధ్యం వహించే అవకాశాన్ని అందుకుంది. 'ప్రపంచవేదికపైనా విజయం సాధించి, దేశ ప్రతిష్ఠను పెంచాలన్నది నా కోరిక. కుటుంబ మద్దతు, అందించిన స్వేచ్ఛతోనే ఇక్కడి వరకూ రాగలిగా' అంటోంది రీమా.

– కాకి పృథ్వీ, కడప

ఇదేం సమస్య?

నాదో వింత సమస్య. బయట కాస్త అపరిశుభ్రమైన టాయిలెట్ వాడానంటే చాలు. జననాంగాల వద్ద దురద, మంట, చిన్న దద్దుర్లు వస్తాయి. మూత్రం పోసేటప్పుడూ విపరీతమైన మంట. ఈ సమస్య తగ్గాలంటే ఏం చేయాలి?

– ఓ సోదరి

డియర్ వసుంధర



డా. చీపురుపల్లి వసుంధర
గైనకాలజిస్ట్

యూరినరీ ట్రాక్ట్ ఇన్‌ఫెక్షన్లు... పబ్లిక్ టాయిలెట్‌ల వల్లే వస్తాయని చాలా మంది నమ్మకం. కానీ అది తప్పు. వాటివల్ల వచ్చేది అయిదు శాతమే. మిగిలినవన్నీ మన శరీరతత్వం వల్లే వస్తాయి. వ్యక్తిగత అపరిశుభ్రత, ఇమ్యూనిటీ తగ్గడం, ఇన్‌ఫెక్షన్లకు ఎక్కువగా లోనయ్యే తత్వం, అనారోగ్యకరమైన లైంగిక పద్ధతులు ఇలా ఇంకా కారణాలున్నాయి. డయాబెటీస్, పోస్ట్ మెనోపాజ్‌లో ఉన్నవారిలోనూ ఇవి కనిపిస్తాయి. వీళ్లలో ఇమ్యూనిటీ తగ్గడం, హార్మోనుల్లో మార్పులు వంటివీ కారణాలే. దద్దుర్లు వస్తున్నాయంటే మాత్రం యూరినరీ ట్రాక్ట్ ఇన్‌ఫెక్షనే! మీరు ముందు ఎక్కువగా నీళ్లు తాగండి. అప్పుడే శరీరంలోని మలినాలన్నీ మూత్రం రూపంలో బయటకు పోతాయి. శరీరమూ హైడ్రేటెడ్‌గా ఉంటుంది. ఇన్‌ఫెక్షన్ సోకింది అంటే దురద, దద్దుర్లు, మంట వంటివి సహజంగానే వస్తాయి. ముందు మీ సమస్యకు కారణం కనుక్కోండి. టాయిలెట్లే కారణమనిపిస్తే... టాయిలెట్ స్ప్రేలు, డిస్పోజబుల్ టిష్యూలు దొరుకుతాయి. వాటిని వాడండి. వీలైనంతవరకూ అపరిశుభ్రమైన వాటిని వాడకండి లేదా కనీస జాగ్రత్తలైనా తీసుకోండి. అంతేకానీ, మూత్రం ఆపుకోవడానికి నీళ్లు తాగకుండా మాత్రం ఉండొద్దు. ఇంకొందరు టాయిలెట్ సీట్‌మీద కూర్చోకుండా ఉండటానికి వివిధ విన్యాసాలు చేస్తుంటారు. దీని వల్ల కండరాలు పట్టేయడం, మూత్రాశయం పూర్తిగా ఖాళీ అవ్వకపోవడం వంటి సమస్యలుంటాయి. అలా కూడా చేయొద్దు.

మీకు తెలుసా!

ఫార్ములా పాలు తాగిన పిల్లలతో పోలిస్తే తల్లిపాలు తాగిన చిన్నారులు ఘనాహారం తినేటప్పుడు కొత్త రుచులు... కాయగూరలు, పండ్లు వంటివి తినడానికి మారాం చేయరట. దీనికి కారణం తల్లి పాల ద్వారా ఆ రుచులు ముందుగానే వాళ్లకు అలవాటై ఉంటాయట.

బంగారం - వెండి

26న ముగింపు

	బంగారం (24క్యా)	ఆర్నమెంట్ (22క్యా)	వెండి (కిలో)
హైదరాబాద్	1,62,920	1,48,000	2,68,582
విజయవాడ	1,59,350	1,48,200	2,77,800
ప్రొద్దుటూరు	1,57,300	1,44,720	2,72,000
రాజమహేంద్రవరం	1,61,020	1,47,600	2,95,000
విశాఖపట్నం	1,61,020	1,47,600	2,69,000
తమిళనాడు	-----	1,49,200	2,95,000

ఒకప్పుడు...

మహిళలు ఎక్కువగా వంటగదులకే పరిమితమైనా... అదే వారికి జిమ్... ఇంటి వరండాలే వాకింగ్ ట్రాక్.. విసుర్రాయి, రుబ్బురోలు వంటివే డంబెల్స్... ఇవన్నీ కలిపి ఒంటికి శ్రమనందించేవి. దాంతో సహజంగానే వాళ్లు ఆరోగ్యంగా, దృఢంగా ఉండేవారు.

ఇప్పుడు...

సౌకర్యాలు పెరిగాయి. చిటికెలో పనులు పూర్తిచేసే గ్యాడ్జెట్లు, మెషీన్లు ఎన్నో వచ్చాయి. దాంతో శారీరక శ్రమ తగ్గింది. అనారోగ్యాలు పెరిగాయి. ఫలితంగా ఫిట్‌నెస్ కోసం... జిమ్‌లకు, యోగా సెంటర్లకు వెళ్లి వేల రూపాయలు ఖర్చు చేస్తున్నాం. రకరకాల వ్యాయామాలను సాధన చేస్తున్నాం. అయితే, వాటిని ఎప్పుడైనా శ్రద్ధగా గమనించారా? మన అమ్మమ్మలు, నానమ్మలు అలవోకగా చేసిన ఇంటి పనులే అవన్నీ. ఎందుకిలా? ఇంతకీ ఆ పనులు అందించే ఫలితాలేంటి? ఇప్పుడు వాటినెలా చేయొచ్చు? తెలుసుకుందామా...

ఒకప్పటి ఇంటి పనులే నేటి వ్యాయామాలు


మహిళ ఆరోగ్యంగా ఉంటే కుటుంబమూ ఆరోగ్యంగా ఉంటుంది. వ్యాయామం అంటే జిమ్‌లో చెమటోడ్చడం మాత్రమే కాదు... మన శరీరాన్ని చురుగ్గా ఉంచుకోవడం. ఇందుకు పాతకాలం ఇంటి పనుల్లో దాగి ఉన్న సైన్స్‌ను అర్థం చేసుకుంటే, ఆరోగ్యం మన చేతుల్లోనే ఉంటుంది. అందుకే, ఇప్పుడవి... యోగా మ్యాట్‌పైన, జిమ్ ఫ్లోర్‌పైన, డాన్స్ స్టేజ్‌పైన కొత్త రూపంలో కనిపిస్తున్నాయి.

ఇంతకీ అవేంటో తెలుసా...

1 తిరగలి విసరడం



పూర్వం పొలం నుంచి నేరుగా తెచ్చిన ధాన్యపు గింజలు, కందులు, పెసలు, మినుములు వంటివాటిని తిరగలితో విసిరేవారు. వాటిని పప్పులుగా, పిండిగా మార్చేవారు. ఇందుకోసం కాళ్లు చాచి కూర్చుని, బలమంతా ఉపయోగించి తిరగలిని గుండ్రంగా తిప్పేవారు. దీన్నే 'చక్కీ చలనాసనం' అని పిలుస్తున్నాం. ఇది పొట్ట దగ్గర కొవ్వును తగ్గించి, వెన్నెముకను దృఢంగా ఉంచుతుంది. అదే పిండి రుబ్బడానికి బదులుగా కోర్ రొటేషన్/ఆబ్లిక్ ట్విస్ట్స్ వంటివాటిని ఎంచుకుంటున్నాం. ఈ పని నడుము చుట్టూ ఉన్న కొవ్వుని కరిగిస్తుంది. వెన్నెముక ఫ్లెక్సిబిలిటీని పెంచుతుంది.



2 దంచడం



అమ్మమ్మల తరంలో ఇంటిల్లిపాదికి అవసరమైన ఆహారం కోసం.. రోట్లో పప్పులు, వడ్లు వంటివి వేసి దంచేవారు. ఇందుకోసం బరువైన రోకలిని పైకెత్తి సులువుగా కిందకు దించేవారు. ఈ పనులకు కనీసం గంటైనా సమయం పట్టేది. ఇవి చేతులు, భుజాలకు మంచి వ్యాయామాన్ని అందించేవి. వీటినే ఇప్పుడు వెయిట్ లిఫ్టింగ్ కసరత్తులు అంటున్నారు. స్ట్రెచెస్, బాటిల్ రోప్స్, డంబెల్ ఓవర్‌హెడ్స్ ప్రెస్... వంటివి చేతులు, భుజాల కండరాల దృఢత్వం కోసం చేస్తున్నారు.



3 ఊడ్చడం- ముగ్గులు పెట్టడం



ఒకప్పుడు మహిళల దినచర్య... తెల్లవారుజామునే లేచి ఇల్లూ వాకిలీ ఊడ్చడంతోనే మొదలయ్యేది. ఆపై గుమ్మం ముందు కళ్లాపి చల్లి ముగ్గులు పెట్టేవారు. ఇది ఒకరకంగా 'మలాసనం' లాంటిదే. ఇది జీర్ణక్రియకు నడుము కింది భాగాన్ని, కాళ్లను దృఢంగా మారుస్తుంది.



4 బట్టలు ఉతకడం



ఇప్పుడంటే వాషింగ్ మెషీన్లు వచ్చాయి కానీ... ఒకప్పుడు అందరం దుస్తుల్ని చేత్తోనే ఉతికేవాళ్లు. ముఖ్యంగా వాటిని బలంగా ఎత్తి బండకేసి కొట్టడం, చేతులతో రుద్దడం, వంగి దుస్తుల్ని నీళ్లల్లో జాడించడం, గట్టిగా పిండి ఆరేయడం వంటి పనులన్నీ శ్రమను కలిగించేవే. ఇలానే 'ఉత్తానాసనం' చేతుల కండరాలకు బలాన్నీ, ఇతర శరీర భాగాలకు స్ట్రెచ్‌నీ ఇస్తుంది.



మరికొన్ని..: స్క్వాట్స్, సిటప్స్‌కి బదులుగా తడిబట్ట పెడితే... కాళ్లు, తుంటి భాగం బలపడతాయి. అలానే ఇప్పుడు నీళ్లు తోడటానికి బావులు లేవు కదా! అందుకే కాసేపు డెడ్‌లిఫ్ట్స్, లాట్ పుల్ డౌన్... వంటివి చేయండి. వెన్నెముక, భుజాల బలంతోపాటు కోర్ స్టెబిలిటీ మెరుగవుతుంది.

అలాగని... 'ఈ రోజుల్లో మహిళలు ఇంట్లో పనులు చేయడం మానేశారు' అనకండి. స్త్రీలకు కొత్త బాధ్యతలు వచ్చి చేరాయి. పైగా చిన్న కుటుంబాలు... ప్రతి పనికీ గ్యాడ్జెట్ తప్పనిసరి. దాంతో ఫ్లెక్సిబిలిటీ తగ్గి, బరువూ పెరుగుతున్నారు. కాబట్టి ఆ పనులు చేయలేనప్పుడు ఈ వ్యాయామాలు చేయాల్సిందే కదా!



వేణ్నీళ్లతో వద్దు..!

బంగారం ఎంత విలువైనదో ప్రత్యేకించి చెప్పనక్కర్లేదు. కానీ, రోజూ పెట్టుకోవడం వల్ల దుమ్మూ, చెమట పట్టి మెరుపు తగ్గుతుంది. అందుకే...

- కప్పు వినెగర్‌లో పది నిమిషాలు బంగారు నగల్ని నాననివ్వండి. ఆపై వాటిని మృదువైన బ్రష్‌తో రుద్దితే మురికీ వదులుతుంది. కొత్తవాటిలా తళతళలాడతాయి. అయితే, ఈ విధానంలో రాళ్ల నగల్ని శుభ్రం చేయకూడదు. అవి నల్లగా మారిపోయే అవకాశం ఉంది.
- కుంకుడు కాయ రసంలో నగల్ని నానబెట్టి శుభ్రం చేసినా మంచిదే. కాస్త బూడిదలో లిక్విడ్ సోప్ వేసి కూడా రుద్దొచ్చు.
- రాళ్లూ, నవరత్నాల నగల్ని వేణ్నీళ్లతో శుభ్రం చేయకూడదు. ఇలా చేస్తే అవి వాటి రంగూ, రూపు కోల్పోయే ప్రమాదం ఉంది. బదులుగా చల్లటి నీటిలో రెండు చుక్కల సోప్ వేసి తడి, పొడి వస్త్రాలతో తుడిస్తే సరి.
- ఆభరణాల్ని శుభ్రం చేశాక అలానే గాలికి వదిలేయకండి. పాలిష్ పెట్టినట్లుగా మెరిసిపోవాలంటే మైక్రోఫైబర్ క్లాత్‌తో వాటిని అద్దుతూ తడి లేకుండా చేయాలి. ఆపై ఆరనివ్వాలి. తర్వాతే మెత్తటి, వెల్వెట్ వస్త్రంలో చుట్టి భద్రపరిస్తే ఎప్పుడు తీసినా కొత్త వాటిలా మెరుస్తాయి.

నాకెందుకు కనిపించవు...!



అరె... నేను ఒకటికి రెండుసార్లు చదివాను. నాకు తప్పులేవీ కనిపించలేదు. ఇంకొకరు చదివితే కానీ తెలియట్లేదు నేను రాసిన దాంట్లో అన్ని తప్పులున్నాయని. ఇది పెద్దవాళ్లతోపాటు తరచూ విద్యార్థుల నుంచీ వింటుంటాం కదా! దీన్నే 'కాగ్నెటివ్ బయాస్' అంటున్నారు నిపుణులు. అంటే మనం చదవాలనుకున్న అక్షరం లేదా పదం, వాక్యం మనకు తెలుసు కాబట్టి మన మెదడు దాన్ని ముందుగానే ఊహించి చదువుతుందట. అంతేకాదు, అక్షరాలను విడివిడిగా కాకుండా పదాన్ని కలిపి చూస్తుందట. దీంతోపాటు చదివేటప్పుడు మన బ్రెయిన్ సమాచారాన్ని వేగంగా అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తుందట. ఆ ప్రయత్నంలోనే తప్పులున్నప్పటికీ ఇలా గుర్తించలేకపోతారట. చదవడం కొత్తగా నేర్చుకుంటున్నప్పుడు, పరీక్షల సమయంలో వేగంగా చదవడం, నిద్రలేమి, అలసట వల్ల కూడా ఇలా జరుగుతుందట. ఇవేకాదు, పనులు వేగంగా పూర్తి చేయాలి, తొందరగా నిర్ణయాలు తీసుకోవాలి అనుకునే క్రమంలో బ్రెయిన్‌లోని లాజికల్ భాగాలు లోతుగా ఆలోచిస్తాయట. అంటే ఫాస్ట్ థింకింగ్, స్లో థింకింగ్... ఈ రెండిటిని ఏకకాలంలో చేస్తుందట. అందువల్లే ఇలా జరుగుతుందని కాహ్నెమాన్ సర్వేలో వెల్లడైంది. అయితే దీనికి పరిష్కార మార్గాలూ ఉన్నాయి. మనం రాసిన అంశాన్ని ఐదూపది నిమిషాలాగి చదవడం, అక్షరాల్ని విడివిడిగా పైకి చదవడం, రాసింది మరొకరికి చదివి వినిపించడం చేయాలంటున్నారు నిపుణులు.

తెలుపుకి... రంగుల జోడి!

ఫ్యాషన్ ఫ్యాషన్



హోలీ వచ్చేస్తోంది. ఈ రంగుల సంబరాన్ని మెచ్చనిది ఎవరు చెప్పండి? ఎంతగా రంగుల్లో మునిగితే అంత ఆనందం. అందుకే తెగ ఆడేస్తాం. అయితే మరకలు పడతాయని తెలిసీ ఇక్కడ చాలామంది ఎంపిక మాత్రం తెలుపే! సంప్రదాయ నమ్మకాలు ఒకవైపైతే... ప్రశాంతత ఇస్తుందని కొంత, ఉత్సాహాన్ని రెట్టింపు చేస్తుందనీ వేడిని తట్టుకోవడానికనీ... ఇలా ఎన్నో కారణాలతో ధవళ వర్ణానికే ఓటేస్తుంటారు. కేవలం రంగులతో ఆటలేనా? ఫొటో క్లిక్‌లూ ఉంటాయిగా! అలాంటప్పుడు ఏదో ఒకటి అని సంతృప్తి పడలేం కదా! కాబట్టి, షరారా, అనార్కలీ, పలాజో... అంటూ బోలెడు రకాలు ప్రయత్నిస్తాం. ఎంత మెచ్చేదైనా సాదాసీదాగా పైనుంచి కిందకి ఒకే వర్ణంలో ఉంటే ఏం వేస్తాం చెప్పండి? బోర్ కొట్టేయదూ! అలాగని తెలుపుకి మించిన క్లాసీ కలర్ లేదంటే కాదనీ చెప్పలేం. మరి అలాంటిదాన్ని ఇంకా ఎలివేట్ చేస్తే? అందుకే వర్ణాలద్దేద్దాం... చున్నీ రూపంలో. ఏంలేదు తెలుపు డ్రెస్‌కి కాంట్రాస్ట్‌గా రంగుల చున్నీని జత చేయడమే. ఇక్కడ మ్యాజిక్ ఏంటంటే... తెలుపుకి ఏ రంగైనా నప్పేస్తుంది. ఒకే రంగు ముదురు చున్నీనైనా ఎంచుకోవచ్చు. హరివిల్లు వర్ణాలన్నీ చుట్టేసినట్లుగా భిన్న రంగుల మేళవింపుతో ఉన్నవైనా జత చేసుకోవచ్చు. పేస్టల్ రంగులవి ఎంచుకుంటే మోడరన్ లుక్‌నీ తెచ్చేసుకోవచ్చు. కాటన్, తేలికపాటి చున్నీలను తెచ్చుకుంటే ఆడటమూ సులువుగా ఉంటుంది. హోలీ షాట్లతో వస్తున్నవీ బోలెడే! ఇంకేం రంగుల కేళికి స్టైల్‌గా సిద్ధమైపోండి.






రగ్బీనే చిరునామాగా మార్చుకుని..!







పుస్తకాలతో కాకుండా... బతుకు పోరాటల మధ్య పెరిగిన అమ్మాయి మీరారాణి హెంబ్రమ్. మట్టి దారుల్లో పరుగెడుతూ ఎప్పటికైనా జాతీయ జెర్సీని ధరించాలని కలలు కంది. సౌకర్యాలు, మద్దతు లేకపోయినా... ఉన్న కొద్దిపాటి ప్రోత్సాహంతోనే అంతర్జాతీయ స్థాయిలో మెరిసి తన ప్రతిభను చాటుకుందీమె. ఒడిశా రగ్బీ రాణిగా గుర్తింపు తెచ్చుకున్న మీరా గురించి తెలియాలంటే...

అది 2007... రగ్బీ టూర్‌ఎయిడ్ నేషన్స్ కప్‌ను గెలవాలన్న ఆశయంతో అండర్-14 కేటగిరీలో, 12 మంది గిరిజన ఆటగాళ్లతో... దేశాలు దాటింది టీమ్ ఒడిశా. అంతటా విమర్శలే. కనీస సహాయం లేదు. అయినా ప్రతిభ మీద నమ్మకంతో బరిలోకి దిగింది. ప్రత్యర్థి దేశాన్ని చిత్తు చేసి కప్‌ను సాధించింది. రికార్డు సృష్టించింది. ఆ విజయాన్నీ, వేడుకల్నీ, వాళ్ల కష్టాన్నీ టీవీలో కథలు కథలుగా చెబుతుంటే చూసి ప్రేరణ పొందింది చిన్నారి మీరా. అప్పుడే నిర్ణయించుకుంది తనూ రగ్బీ క్రీడాకారిణి కావాలని. కోరుకుంటే సరిపోతుందా... సరైన శిక్షణ, ఆహారం, వసతులు ఉండాలిగా! వీటన్నింటికీ నోచుకోని పరిస్థితి మీరాది. కనీసం మూడుపూటలా తిండి దొరకడం కూడా కష్టమయ్యేదట.

ఒడిశా, కియోంఝర్ జిల్లాలోని గోపాల్‌పుర్ గ్రామంలో పుట్టిందీమె. మీరాకు మూడేళ్ల వయసున్నప్పుడే తల్లి అనారోగ్యంతో మరణించింది. తండ్రి దుర్గా హెంబ్రమ్ సన్నకారు రైతు. 'మేం ఐదుగురం సంతానం. నాన్నకు మా ఆలనా పాలనా చూసుకోవడం కష్టమయ్యింది. దాంతో మమ్మల్ని అనాథాశ్రమంలో చేర్పించాలని నిశ్చయించుకున్నారు. స్థానిక ఆశ్రమంలో చేర్పించారు. అక్కడా కష్టాలే. తిండి, బట్ట, మౌలిక వసతులు కూడా సరిగ్గా ఉండేవి కాదక్కడ. కానీ చదువు మాత్రం బాగా చెప్పేవాళ్లు. దాంతో అక్కడే ఉండిపోయాం. కొన్నాళ్లకు నన్ను దత్తత తీసుకోవడానికి ఓ కుటుంబం వచ్చింది. ఏవో కారణాల వల్ల అదీ జరగలేదు. ఇలా ఎవరో పెంచి పోషిస్తారని ఆశ పడకుండా చదువుకుంటే నా కాళ్ల మీద నేను నిలబడొచ్చు కదా అనుకున్నా' అనే మీరా పదేళ్ల వయసులోనే కళింగ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ (కేఐఎస్ఎస్)లో సీటు సంపాదించింది.

ఆ మలుపుతో...

'అక్కడ చదువుపైనే ధ్యాసంతా. ఈ క్రమంలోనే టీవీలో రగ్బీ ప్రపంచ కప్ చూశా. అది నన్ను ఎంతగానో ఆకర్షించింది. నేనూ రగ్బీ క్రీడాకారిణి కావాలనుకున్నా. కానీ నా పరిస్థితులు అందుకు సహకరించలేదు. ఇన్‌స్టిట్యూట్ గ్రౌండ్‌లో ఒక్కదాన్నే పరుగులు పెడుతుండేదాన్ని. ఈ క్రమంలోనే కోచ్ రుద్రకేశ్ జెనాతో పరిచయం ఏర్పడింది. అతనితో మాటల్లో రగ్బీ పట్ల నా ఇష్టం చెప్పా. ఆయన కొన్ని పరీక్షలు పెట్టి... కాస్త శిక్షణ ఇస్తే నేను రగ్బీలో రాణించగలనని అన్నారు. ఆ రోజు నా ఆనందానికి అవధుల్లేవు' అనే మీరాకు అప్పటికి పన్నెండేళ్లే. ఆరో తరగతి చదువుతోంది. ఇక అప్పటినుంచి ఉదయం స్కూల్, సాయంత్రం శిక్షణ. 2010లో న్యూదిల్లీలో జరిగిన జాతీయ టోర్నమెంట్ మీరా మొదటి ఆట. అందులో పాల్గొని స్వర్ణం సాధించిందీమె. అది మొదలు వెనుదిరగలేదు. 2012లో భారత జట్టుకూ ఎంపికైంది. నేషనల్ గేమ్స్‌కు సిద్ధమవుతున్నప్పుడే మీరా తండ్రి చనిపోయారు. తండ్రి కడసారి చూపునకు కూడా నోచుకోలేదు మీరా. 'ఆ దుఃఖం జీవితాంతం నన్ను వెంటాడుతునే ఉంటుంది' అనే మీరా అప్పటినుంచి 2021 వరకూ దాదాపు 12సార్లు అంతర్జాతీయ ఆటల్లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించింది. జకార్తా, లావోస్, సింగపూర్, కొలంబో, ఫిలిప్పిన్స్ జట్లతో జరిగిన ఆసియా టోర్నమెంట్లలోనూ పాల్గొంది. బెస్ట్ ప్లేయర్‌గా కితాబునూ అందుకొంది.

క్రీడా ఉపాధ్యాయురాలిగా...

ఆటల్లో పడి చదువును పక్కన పెట్టేయలేదు మీరా. 2019లో బీపీఈడీ డిగ్రీని పూర్తిచేసింది. అంతా సజావుగా జరుగుతుంది అనుకునేలోపే ఓ ప్రమాదం మీరాను ఆటకు దూరం చేసింది. అయినా పరిస్థితులతో రాజీ పడకుండా ఫిట్‌నెస్‌కి ప్రాధాన్యం ఇచ్చి అనతి కాలంలోనే గాయాల నుంచి కోలుకుంది మీరా. ప్రస్తుతం భువనేశ్వర్‌లోని ఆదర్శ్ విద్యాలయంలో క్రీడా ఉపాధ్యాయినిగా పనిచేస్తోంది. యువ అథ్లెట్లకు, వెనకబడిన వర్గాల బాలికలకు క్రీడల్లో శిక్షణ ఇస్తోంది. అంతేకాదు, ఒడిశా మహిళా జట్టుకు రగ్బీలో మెలకువల్నీ నేర్పుతోందీమె.



మండలిని కుదిపేసిన లడ్డూ ప్రసాదం!

- అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య వాగ్వాదాలు
- సవాళ్లు, ప్రతి సవాళ్లలో హోరెత్తిన మండలి
- ఛైర్మన్, మంత్రి కేశవ్ మధ్య ఆసక్తికర సంభాషణ
- చివరకు చర్చ లేకుండానే వాయిదా

ఈనాడు, అమరావతి: తిరుపతి లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వినియోగం అంశం శాసనమండలిని కుదిపేసింది. అధికార, ప్రతిపక్ష సభ్యుల రాజకీయ సవాళ్లకు వేదికైంది. పోటాపోటీ నినాదాలు, పోడియంలోకి చొచ్చుకువెళ్లి నిరసనలు తెలపడంతో మండలి హోరెత్తింది. తన ప్రమేయం లేకుండానే తన పేరిట కమ్యూనికేషన్ ఎలా వచ్చిందంటూ ఛైర్మన్ మోషేనురాజు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. తిరుపతి లడ్డూ ప్రసాదం అంశంపై మండలిలో లఘు చర్చ గురువారం ఉంటుందని.. ఆ అంశానికి సంబంధించి సమగ్ర సమాచారం తెలుగు, ఇంగ్లిష భాషలో 150 కాపీలు సెక్రటేరియట్‌కు కావాలని ఛైర్మన్ పేరిట కమ్యూనికేషన్ ఎలా ఇచ్చారంటూ అధికార పక్షం పేర్కొంది. తన ప్రమేయం లేకుండా కమ్యూనికేషన్ ఎలా వెళ్లిందని ఛైర్మన్ ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశారు. లడ్డూ ప్రసాదం అంశంపై ఎలాంటి స్టేట్‌మెంట్ ప్రభుత్వం నుంచి లేదని ఛైర్మన్ చెప్పారంటూ మండలిలో ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. లఘు చర్చకు అనుమతించే విషయమై మంత్రి, ఛైర్మన్, ప్రతిపక్ష నేతల మధ్య ఆసక్తికర సంభాషణ చోటు చేసుకుంది. చర్చకు సంబంధించి అధికార, ప్రతిపక్ష సభ్యులు ఎవరికి వారు వ్యూహాత్మకంగా వ్యవహరించారు. సభ్యుల మధ్య ఉద్రిక్తతలతో సభను అప్పటికే పలుమార్లు వాయిదా వేస్తూ వచ్చిన ఛైర్మన్.. ఆ తర్వాతా కొనసాగించలేని స్థితిలో శుక్రవారానికి వాయిదా వేశారు.


సభ వాయిదా వేయడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తున్న కూటమి సభ్యులు

మూడు ప్రశ్నలు.. నాలుగు వాయిదాలు

గురువారం ఉదయం మండలి ప్రారంభమైన తర్వాత ప్రశ్నోత్తరాల సమయంలోనే వైకాపా నిరసనలతో పలుమార్లు వాయిదా పడింది. 1.07 గంటలకు సభ సమావేశమైన తర్వాత ప్రశ్నోత్తరాలను తిరిగి కొనసాగించాలని తెదేపా సభ్యులు పట్టుబట్టారు. మిగిలిన ప్రశ్నలకు సమాధానం ఇచ్చినట్లుగా భావించాలని సభలో ప్రకటించిన తర్వాత అనుమతించే ప్రసక్తి లేదని ఛైర్మన్ తిరస్కరించారు. దీనికి నిరసనగా తెదేపా ఎమ్మెల్సీలు పోడియంలోకి వెళ్లి కొద్దిసేపు నినాదాలు చేశారు. ఆ తర్వాత నేరుగా తిరుపతి లడ్డూ ప్రసాదం అంశంపై లఘు చర్చకు ఛైర్మన్ అనుమతించడం.. తొలుత వైకాపా సభ్యుడు చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడేందుకు ప్రయత్నించడం సుదీర్ఘ వాదనకు దారి తీసింది. చర్చ జరిగే అవకాశం లేక సభను శుక్రవారానికి ఛైర్మన్ వాయిదా వేశారు.

ఈ సందర్భంగా సభలో జరిగిన ఆసక్తికర సంభాషణలు..

మంత్రి కేశవ్: సభ వాయిదా వేసి వెళ్తూ మిగిలిన ప్రశ్నలకు సమాధానం చెప్పినట్లుగా భావించాలని మీరు (ఛైర్మన్) అన్నారు. దీనివల్ల సభ్యుల్లో ఆందోళన ఉంది. అందుకే ప్రశ్నోత్తరాలు కొనసాగించాలని అడుగుతున్నారు. ఇవ్వాలా లేదా? అనేది మీ ఇష్టం. అలా కాకుండా ఛైర్‌లో కూర్చుని మెంబర్లకు ఏదో యాట్రిబ్యూట్ చేయడమనేది మంచిది కాదు.

ఛైర్మన్ మోషేనురాజు: మీరు శాసనసభ వ్యవహారాల మంత్రి కూడా. మీకు నిబంధనలన్నీ తెలుసు. ఒకసారి ప్రశ్నలకు సమాధానం చెప్పినట్లు భావించాలని ప్రకటించిన తర్వాత మళ్లీ ప్రశ్నోత్తరాలు జరపాలని ఎలా అడుగుతున్నారు? తిరిగి సమావేశమైన తర్వాత నేను ఇప్పటి వరకు సభలో కార్యకలాపాలు ప్రారంభించలేదు. నేను సభ కార్యకలాపాలు ప్రారంభించిన తర్వాత సభ్యులుగా మీకు కావాల్సిన అంశం గురించి డిమాండ్ చేసే అధికారం ఉండొచ్చు. ప్రశ్నలకు సమాధానం చెప్పినట్లుగా భావించాలని ఛైర్మన్‌గా ప్రకటించాను. తర్వాత 'లడ్డూ ప్రసాదం'పై లఘు చర్చకు అనుమతిస్తున్నా. దీనికి సంబంధించి శాసనమండలి బీఏసీ సమావేశంలో ఇరు పార్టీలు నిర్ణయం తీసుకున్నాయి.

కేశవ్: (లఘు చర్చ జరపాలంటూ వైకాపా సభ్యులు నినాదాలు చేయడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తూ) సభ ఎలా జరపాలో కూడా ప్రభుత్వానికి నిర్దేశిస్తారా? అది నిర్ణయించాల్సింది ప్రభుత్వం. ప్రభుత్వం చెప్పేది వినడానికి వైకాపా సభ్యులు ఎందుకు సిద్ధంగా లేరు; సభను ఆర్డర్‌లో ఉంచేలా ఛైర్మన్ చర్యలు తీసుకోవాలి. లడ్డూ ప్రసాదం అంశంపై ఎంతసేపైనా సమాధానం చెప్పడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. వినడానికి వైకాపా సభ్యులు ఓపికగా ఉండాలి. రోజూ మాదిరే వాకౌట్ చేసి వెళ్లొద్దు. సభ సంప్రదాయం ప్రకారం సంబంధిత మంత్రి మాట్లాడతారు. తర్వాత ఎంతసేపైనా మీరు మాట్లాడొచ్చు. ఆ తర్వాత ప్రభుత్వం సమాధానం ఇస్తుంది.


బొత్స సత్యనారాయణ


మంత్రి పయ్యావుల కేశవ్


ఛైర్మన్ మోషేనురాజు

ఛైర్మన్: ఆర్థిక మంత్రి చెప్పేది వాస్తవం కాదు. లఘు చర్చలో సంబంధిత మంత్రి స్టేట్‌మెంట్ చేయాలన్న నిబంధన లేదు. మీరు స్టేట్‌మెంట్ ఇవ్వాలనుకుంటే ప్రభుత్వానికి హక్కు ఉంది. దానికి వేరే ఫార్మాట్‌లో రావాలి. అప్పుడు ప్రభుత్వానికి కచ్చితంగా అవకాశం ఇస్తా. లఘు చర్చలో మాత్రం ప్రకటన ఇవ్వడానికి మంత్రికి అధికారం లేదు. తొలుత చర్చ ప్రారంభించే అవకాశం ప్రతిపక్షానికే ఉంది. కాబట్టి అవకాశం ఇచ్చా.

కేశవ్: ప్రభుత్వ వాదన వినకపోతే ఎలా? ఛైర్మన్‌గా మీరు ఒక అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఒక అంశంపై ప్రకటన చేయడానికి ప్రభుత్వానికి అనుమతి ఇవ్వను అని అన్నారు.

ఛైర్మన్: నేను ప్రభుత్వానికి అనుమతి ఇవ్వను అని చెప్పడం లేదు. లఘు చర్చలో ప్రకటన చేసేందుకు ప్రభుత్వానికి అవకాశం ఇవ్వనని మాత్రమే అన్నా.

కేశవ్: లఘు చర్చలో ప్రభుత్వానికి ప్రకటన చేసే అవకాశం ఇవ్వనని అంటున్నారు. అయితే, మీరు కమ్యూనికేషన్ ఎందుకు ఇచ్చినట్లు. తిరుపతి లడ్డూ అంశంపై గురువారం లఘు చర్చ ఉంటుంది. ఆ అంశానికి సంబంధించి సమగ్ర సమాచారం తెలుగు, ఇంగ్లిష భాషలో 150 కాపీలు సెక్రటేరియట్‌కు కావాలి' అని మీరు (ఛైర్మన్) కోరినట్లు కమ్యూనికేషన్ ఎవరు ఇచ్చారు? స్టేట్‌మెంట్ ఇవ్వమని కౌన్సిల్ నుంచి ప్రభుత్వానికి చెప్పి.. ఇప్పుడు వీల్లేదని అనడమేంటి? ఇది మీరు ఇచ్చిన సమాచారమే.

ఛైర్మన్: అది తప్పుడు పత్రం. నా నోటీసులో లేదు. నా అనుమతితో చేసింది కాదు.

కేశవ్: మీరు చూడకుండా.. చదవకుండా తప్పుడు పత్రం అని ఎలా అంటారు?

ఛైర్మన్: లఘు చర్చకు వెళ్దామా? లేదా? తేల్చండి.

కేశవ్: లఘు చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ఈ రోజు లడ్డూ ప్రసాదం అంశంపై చర్చించడానికి మేం సిద్ధం. శాంతిభద్రతల అంశంపై ఇదే సభలో ప్రభుత్వం ప్రకటన ఇచ్చింది. వ్యవసాయంపై నిన్న జరగాల్సిన లఘు చర్చ జరగలేదు. ఈ రోజు అంశానికి అడ్డుపడటమేంటి?

ఛైర్మన్: అవన్నీ ప్రభుత్వం ఇచ్చే సమాధానం తప్పించి ప్రకటన కాదు. (అని ఇంకా మాట్లాడుతుండటంతో)

కేశవ్: మీకు వినడానికి ఓపిక లేదు. ఎందుకంత డిఫెన్స్‌లోకి వెళ్తారు?

ఛైర్మన్: మీరు సభను ఎందుకు డిఫెన్స్‌లో పెడుతున్నారు?

కేశవ్: మీరు ఇచ్చిన లెటర్‌ను కూడా కాదనడమేంటి? తెల్లవారుజామున రెండు గంటల వరకు ఉండి కల్తీ నెయ్యి అంశంపై సమాధానం చెప్పడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని అంటుంటే.. వినేందుకు వారు (వైకాపా సభ్యులు) ఎందుకు భయపడుతున్నారు? వారు చేసిన అవినీతిని, హిందూ వ్యతిరేక విధానాలు వెలుగులోకి వస్తాయనా? ఎందుకు భుజాలు తడుముకుంటున్నారు? దయచేసి వాకౌట్ చేయవద్దు. మంత్రి రామనారాయణ రెడ్డి నిన్న శాసనసభలో లడ్డూ ప్రసాదం అంశంపై మాట్లాడారు. ఈ రోజు మండలిలో ప్రకటన ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారు. ఆ తర్వాత మీరు (వైకాపా సభ్యులు) ఎన్ని గంటలు మాట్లాడినా మేం చర్చిస్తాం. ప్రతిపక్షంగా మీకు ప్రభుత్వాన్ని శాసించే హక్కు లేదు.

ఛైర్మన్: విచిత్రంగా ఉంది. చర్చించడానికి ప్రభుత్వం, ప్రతిపక్షం రెండూ సిద్ధంగా ఉన్నామంటున్నాయి. కానీ సభలో చర్చ మాత్రం జరగడం లేదు.

ప్రభుత్వం చెప్పేది సత్యదూరమైన మాటలు: బొత్స సత్యనారాయణ

తిరుపతి లడ్డూ ప్రసాదం అంశంపై ప్రభుత్వం చెప్పేవన్నీ సత్యదూరమైన మాటలని బొత్స ఆరోపించారు. 'ఈ అంశంపై మంత్రి (కేశవ్) మాట్లాడారు. స్టేట్‌మెంట్ ఇవ్వడానికి ప్రభుత్వం నుంచి ఏమైనా పత్రాలు మీ దగ్గరకు వచ్చాయా? అని నేను ముందే మిమ్మల్ని (ఛైర్మన్‌ను) అడిగా. అలాంటివి ఏమీ రాలేదని మీరు చెప్పారు. దోపిడీ కప్పిపుచ్చడానికి ప్రభుత్వం ఇలా చేస్తోంది. దేవదేవుడిపై అపవాదు సృష్టించి, వారి లాభం కోసం ఇదంతా చేస్తున్నారు' అని చర్చలో జోక్యం చేసుకుని ఆవేశంతో మాట్లాడారు.

మంత్రి స్టేట్‌మెంట్ ఇచ్చే సంప్రదాయం లేదా?

- మరి వైకాపా నోటీసివ్వకుండానే చర్చకు ఎలా అనుమతించారు?
- ఛైర్మన్ వద్దంటే ప్రభుత్వం ఇక సమాచారమివ్వదు
- మంత్రి పయ్యావుల కేశవ్
- 'తిరుపతి లడ్డూ'పై 4న మండలిలో ప్రభుత్వం స్టేట్‌మెంట్

ఈనాడు, అమరావతి: తిరుమల లడ్డూ వ్యవహారంపై మార్చి 4న శాసనమండలిలో రాష్ట్ర ప్రభుత్వం స్టేట్‌మెంట్ ఇస్తుందని ఆర్థిక, శాసనసభా వ్యవహారాల శాఖల మంత్రి పయ్యావుల కేశవ్ ప్రకటించారు. వైకాపా సభ్యులకు ఈ అంశంపై అల్లరి చేయాలన్న ఉద్దేశం తప్ప, చర్చించాలన్న ఆసక్తి లేదని ఆయన గురువారం శాసనసభ మీడియా పాయింట్‌లో ధ్వజమెత్తారు. ఆ అంశంపై చర్చకు వైకాపా నోటీసు కూడా ఇవ్వలేదన్నారు. లడ్డూ వ్యవహారంపై శాసనమండలిలో దేవాదాయశాఖ మంత్రి స్టేట్‌మెంట్ ఇవ్వకుండా అడ్డుకున్న ఛైర్మన్.. వైకాపా సభ్యులు అసలు నోటీసే ఇవ్వనప్పుడు ఏ నిబంధన ప్రకారం చర్చకు అనుమతించారని ప్రశ్నించారు. 'శాసనసభలో ప్రతిపక్షం లేకపోయినా లడ్డూ కల్తీ అంశంపై ప్రజలకు వాస్తవాలు తెలియాలన్న ఉద్దేశంతో దానిపై మంత్రి స్టేట్‌మెంట్ ఇవ్వాలని, సభలో చర్చించాలని, సీఎం సమాధానం ఇవ్వాలని బీఏసీలో నిర్ణయించాం. చర్చ చేపట్టాలని తెదేపా సభ్యుడు ధూళిపాళ్ల నరేంద్ర నోటీసిచ్చారు. అన్ని విషయాలూ సభ ముందుంచాం. శాసనసభలో ప్రతిపక్షం లేకపోయినా మేం సంప్రదాయాల్ని తు.చ. తప్పక పాటిస్తున్నాం. బీఏసీలో వైకాపా కోరితేనే లడ్డూ అంశంపై మండలిలో ప్రభుత్వం చర్చ చేపట్టింది. దానిపై సంబంధిత మంత్రి స్టేట్‌మెంట్ ఇస్తుంటే ఆ సంప్రదాయం లేదని ఛైర్మన్ అన్నారు. మరి చర్చకు చేపట్టే అంశాలపై నోట్ పంపాలంటూ సంబంధిత మంత్రులకు లేఖలు ఎందుకు వెళ్లాయి? ప్రభుత్వం బాధ్యతాయుతంగా ముందుకొచ్చి సమాచారం పంచుకుంటుంటే వద్దనడం దేశ చరిత్రలోనే మొదటిసారి. రేపటి నుంచి సభకు ఏ సమాచారం అవసరం లేదని ఛైర్మన్ అనుకుంటే ప్రభుత్వం ఇవ్వదు. ఛైర్మన్ కాస్త ఓపికగా.. ముందు మంత్రి స్టేట్‌మెంట్ ఇస్తారని, ఆ తర్వాత ప్రతిపక్ష సభ్యులు మాట్లాడాలని చెప్పాల్సింది' అని కేశవ్ పేర్కొన్నారు.

వాకౌట్ అండ్ టాకౌట్ పార్టీలా వైకాపా

'ఈ రోజు శాసనమండలిలో వైకాపా సభ్యుల అసలు రూపం బయటపడింది. వారు సభకు వచ్చి, బట్టకాల్చి ముఖాన వేసి, వెళ్లిపోవాలన్న ధోరణిని అనుసరిస్తున్నారు. వాస్తవాలు కళ్లముందు కనబడుతుంటే తట్టుకోలేక వైకాపా సభ్యులు అల్లరి చేసి వెళ్లిపోతున్నారు. వైకాపా వాకౌట్ అండ్ టాకౌట్ పార్టీగా మారిపోయింది. ఆ పార్టీ నిజస్వరూపం రాయలసీమ ప్రజలందరికీ తెలిసిపోయింది. రాయలసీమ ఎత్తిపోతలపై మండలిలో ప్రశ్న వేసి చివరకు వైకాపానే ఇరకాటంలో పడింది. 2020లో వైకాపా హయాంలో ఆగిపోయిన ప్రాజెక్టుకూ, మాకూ లింకు పెట్టాలని చూశారు. కానీ జలవనరులశాఖ మంత్రి చెప్పిన సమాధానంతో ఆ పార్టీ సభ్యులు విలవిల్లాడిపోయారు' అని కేశవ్ ఎద్దేవా చేశారు.

లేఖ రాసిన విషయం ఛైర్మన్‌కు తెలియదంటే ఎలా?

'తిరుపతి లడ్డూ అంశంపై సమగ్ర, వివరణాత్మక నోట్ కావాలని, అదీ 150 కాపీలు కావాలని శాసనసభ సెక్రటరీ జనరల్ నుంచి సంబంధిత శాఖకు లేఖ వెళ్లింది. లేఖ విషయం తనకు తెలియదని ఛైర్మన్ అంటే ఇంకేం చెప్పాలి? శాసనసభ వ్యవహారాలకు సంబంధించి బీఏసీలో తీసుకున్న నిర్ణయాలపై సెక్రటరీ జనరల్ కార్యాలయం నుంచి ఆయా శాఖల కార్యదర్శులకు లేఖలు వెళతాయి. సంబంధిత సెక్షన్ అధికారి స్థాయిలోనే లేఖలు రాసేస్తారు. అదంతా రొటీన్‌గా జరిగే వ్యవహారం' అని తెలిపారు.

చేతికి కట్టుతో ఎమ్మెల్సీ శ్రీకాంత్.. ఊతకర్రతో ఎమ్మెల్యే పార్థసారథి

ఈనాడు, అమరావతి: ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల క్రీడా పోటీల్లో గాయపడ్డ ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ చేతికి కట్టుతో, కాలికి గాయమైన ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి చేతికర్ర సాయంతో గురువారం శాసనసభ ఆవరణలో ఒక్కసారే కార్లు దిగారు. వారిని చూసి ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు.. క్రీడల్లో దెబ్బతగిలిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు దివ్యాంగుల కోటాలో పింఛను ఇవ్వాల్సిందిగా సీఎం ముందు ప్రతిపాదన పెడదామని సరదాగా వ్యాఖ్యానించారు. చట్టసభల సభ్యులు కాబట్టి అవసరమైతే అత్యవసర బిల్లు పెట్టిద్దామని చమత్కరించారు. బిల్లు పెడితే సగం మందికి పథకం వర్తించేలా ఉందని తోటి సభ్యులు కొందరు వ్యాఖ్యానించారు. ఆటవిడుపు కోసం ఆటలాడమంటే ప్రతిఒక్కరూ కుర్రాళ్లలా ఫీలై ఇలా దెబ్బలు తగిలించుకుంటున్నామని శ్రీకాంత్ నవ్వుతూ వ్యాఖ్యానించారు.

ఎమ్మెల్సీ వీర్రాజుపై దాడికి వైకాపా సభ్యుల యత్నం

- మద్దతుగా వెళ్లిన తెదేపా ఎమ్మెల్సీలు, మంత్రులు
- మా వాళ్లపై చెయ్యి వేస్తే ఏం జరుగుతుందో చూస్తారని లోకేశ్ ఆగ్రహం
- మండలిలో కొద్దిసేపు ఉద్రిక్తత

ఈనాడు, అమరావతి: శాసనమండలిలో భాజపా ఎమ్మెల్సీ సోము వీర్రాజుపైకి వైకాపా ఎమ్మెల్సీలు దాడికి ప్రయత్నించారు. వెంటనే తెదేపా ఎమ్మెల్సీలు, మంత్రులు ఆయనకు మద్దతుగా పోడియంలోకి వెళ్లారు. మంత్రి గొట్టిపాటి రవికుమార్ జోక్యం చేసుకుని ఇరు వర్గాలను సర్దుబాటు చేశారు. మండలిలో ప్రశ్నోత్తరాలు నిర్వహిస్తున్న సమయంలో వైకాపా ఎమ్మెల్సీలు పదేపదే పోడియంలోకి చొచ్చుకువచ్చి సభ నిర్వహణకు ఇబ్బంది కలిగిస్తున్నారు. దీనివల్ల సభ్యుల ప్రశ్నలు చర్చకు రావడం లేదంటూ సోము వీర్రాజు పోడియం దగ్గరకు వెళ్లి ప్రశ్నోత్తరాలు సజావుగా నిర్వహించాలని చేతులు జోడించి ఛైర్మన్‌ను అడిగారు. అప్పటికే పోడియంలో నిరసన తెలుపుతున్న వైకాపా ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయెల్ ఒక్కసారిగా వీర్రాజుపైకి దూసుకొచ్చారు. 'మేం సభలో నిరసన తెలుపుతున్నాం. అప్పుడే మీరు ఎందుకు పోడియంలోకి వస్తున్నారు? నిన్న కూడా ఇలాగే మేం నిరసన తెలిపే సమయంలో చేతులు జోడించి నిలబడ్డారు' అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయనతో పాటే కొందరు వైకాపా ఎమ్మెల్సీలు ముందుకు వచ్చారు. ఆయనతో మీకెందుకని ఛైర్మన్ మోషేనురాజు వారిస్తున్నా వైకాపా సభ్యులు వెనక్కు తగ్గలేదు. దీంతో వీర్రాజుకు మద్దతుగా తెదేపా ఎమ్మెల్సీలు కావలి గ్రీష్మ, రాంగోపాల్‌రెడ్డి, కొందరు మంత్రులు వెళ్లారు. దీంతో కొద్దిసేపు సభలో గందరగోళ వాతావరణం నెలకొంది. 'మా సభ్యులు ఎవరి మీదైనా చెయ్యి వేసి చూడండి.. ఆ తర్వాత ఏం జరుగుతుందో తెలుస్తుంది' అంటూ సభలో ఉన్న మంత్రి లోకేశ్ వ్యాఖ్యానించారు. మంత్రి సంధ్యారాణి వీర్రాజు దగ్గరకు వచ్చి.. 'మీరు ముందుకెళ్లండి. మద్దతుగా మేం ఉంటాం. భయపడొద్దు' అని చెప్పారు. రెండు వర్గాలు ఆగ్రహంగా ఉండటంతో మంత్రి గొట్టిపాటి రవికుమార్ మధ్యలోకి వెళ్లి సర్దుబాటు చేశారు. ఘర్షణ వాతావరణం లేకుండా సభ నిర్వహణకు సహకరించాలని ఛైర్మన్ పదే పదే విజ్ఞప్తి చేసినా వైకాపా సభ్యుల తీరు మారకపోవడంతో సభను కొద్దిసేపు వాయిదా వేశారు.

దాడి చెయ్యలేదు: బొత్స సత్యనారాయణ

'ఎమ్మెల్సీ సోము వీర్రాజుపై మా సభ్యులెవ్వరూ దాడి చెయ్యలేదు. ఈ ప్రచారం తప్పు. అలాంటిది జరిగితే మా సభ్యులందరి తరఫున నేను క్షమాపణ చెబుతున్నా' అని శాసనమండలిలో ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ వ్యాఖ్యానించారు. సోము వీర్రాజుపై వైకాపా సభ్యులు దాడికి దిగారట అని మీడియా పాయింట్‌లో గురువారం ఓ విలేకరి అడిగిన ప్రశ్నకు బొత్స స్పందించారు. 'ఇలాంటి దుష్ప్రచారం సరికాదు. సభ గౌరవం దెబ్బతీసేలా మాట్లాడొద్దు. తిరుమల లడ్డూ, నెయ్యి సరఫరాపై మండలిలో చర్చ జరిగేవరకూ పట్టుబడతాం' అని బొత్స వ్యాఖ్యానించారు.

ఆవు నెయ్యి రూ.329 అంటూ డ్రామాలాడే.. వైకాపా వారిని దేవుడు క్షమించడు

- ప్రశ్నలకు అవకాశం ఇవ్వాలంటే.. నామీద దాడికి ఉసిగొల్పుతారా?
- మండలిలో భాజపా పక్షనేత సోము వీర్రాజు ధ్వజం



ఈనాడు, అమరావతి: 'ఇంట్లో వాడే నాణ్యమైన నెయ్యి రూ.2 వేలు ఉంటే.. వేంకటేశ్వరస్వామికి ప్రసాదం తయారీకి రూ.329కి నెయ్యి వస్తుందా? దీనికి మాజీ సీఎం సమాధానం చెప్పాలి' అని శాసనమండలి భాజపా పక్ష నేత సోము వీర్రాజు ప్రశ్నించారు. అసెంబ్లీ ఆవరణలో మీడియా పాయింట్‌లో గురువారం ఆయన మాట్లాడారు. 'కలియుగ దైవం వేంకటేశ్వర స్వామికి తక్కువ రేటుకు నెయ్యి కొని భక్తుల మనోభావాలు దెబ్బతియ్యాలనే ప్రయత్నం జరుగుతోంది. నిన్న చిట్‌చాట్‌లో గతంలో రూ.329 నెయ్యి కొంటే.. ఇప్పుడు రూ.658కి కొంటారా అని కామెంట్ చేసిన వారికి సరైన అవగాహన లేదు. తక్కువకు కొంటే అది నెయ్యి అవుతుందా..? దీన్ని జగన్ గుర్తించాలి. రూ.359కి ఆవు నెయ్యి కొనాలంటూ డ్రామాలు ఆడితే వైకాపా వారిని దేవుడు క్షమించడు. దేవాలయాల్లో వాడే నెయ్యి, లడ్డూ విషయాల్లో భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా చర్యలు తీసుకోవాలి. దీనిపై చర్చ జరగాలి' అని వ్యాఖ్యానించారు.

విన్నవిద్దామని వెళ్తే.. దాడి చేస్తారా..?

'ఇప్పటికే ఐదు రోజులు సభ సరిగ్గా జరగలేదు. బడ్జెట్‌పై చర్చ జరగలేదు. సమస్యలను సీరియస్‌గా తీసుకోకుండా వాయిదా వేస్తున్నారు. సభ సజావుగా జరగడంలేదనే ఆవేదనతో ఛైర్మన్‌కు రిక్వెస్ట్ చేద్దామని వెళ్లాను. ప్రశ్నలు వాయిదా వేయవద్దని అడిగానని నామీదకు దాడికి ఉసిగొల్పుతున్నారు. సభ్యులు అడిగిన ప్రశ్నలకు అధికారులు శ్రమకోర్చి సమాధానాలు తయారుచేస్తే.. దాన్ని ఆషామాషీగా తీసుకోకూడదని ఛైర్మన్‌కు నమస్కారం పెట్టి మరీ చెప్పడానికి ప్రయత్నిస్తే.. సోము వీర్రాజు అస్తమానూ ఎందుకు వస్తున్నాడని ప్రతిపక్షం వారు అడుగుతున్నారు. రూ.1.70 లక్షల జీతం తీసుకుంటున్నాం. ప్రశ్నించే అవకాశం రాకపోతే బాధనిపిస్తోంది. సభ్యులంతా అలా హుందాగా ప్రవర్తించాలనే ఉద్దేశంతో వెళ్లిన నాపై దాడి చేయడం ఎంతవరకు సబబు?' అని సోము వీర్రాజు ప్రశ్నించారు.

అవి ప్రశ్నలా.. ప్రసంగాలా..?

ఈ రోజు సభలో తొలి ప్రశ్నకు ప్రతిపక్షానికి 20 నిమిషాలు మాట్లాడడానికి అవకాశం ఇవ్వడం ఏమిటి..? ఇది ప్రశ్న కాదు. ప్రసంగంలా ఉంది. మంత్రికి మాత్రం ఏడు నిమిషాలు సమయం ఇచ్చారు' అని సోము వీర్రాజు అన్నారు.

విశాఖలో 30 ఏళ్లుగా రోడ్ల విస్తరణ లేదు

- భోగాపురం విమానాశ్రయం మొదలైతే ట్రాఫిక్ నరకం
- భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు



ఈనాడు, అమరావతి: విశాఖపట్నంలో 30 ఏళ్లుగా రోడ్ల విస్తరణ జరగలేదని.. అప్పటికి, ఇప్పటికి జనాభా, వాహనాలు భారీగా పెరిగాయని, ఈ ఏడాది జూన్‌లో భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ఆరంభమైతే నగర ట్రాఫిక్ నరకాన్ని తలపిస్తుందని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తెలిపారు. శాసనసభలో గురువారం ఆయన శూన్యగంటలో విశాఖలో ట్రాఫిక్ సమస్యపై మాట్లాడారు. విశాఖకు గూగుల్, ఇతర ఐటీ కంపెనీలు వస్తున్నాయని, వచ్చే నాలుగైదేళ్లలో కనీసం లక్ష మంది ఉద్యోగులు వస్తారని, వారి వాహనాలతో ట్రాఫిక్ మరింత దారుణంగా మారుతుందని తెలిపారు. ఈ సమస్యపైనా వివిధ శాఖల అధికారులతో సీఎం సమీక్షించి తగిన పరిష్కారం చూపాలని గంటా శ్రీనివాసరావు కోరారు.

రాయలసీమ ద్రోహి నువ్వే కదా జగన్?

- రాయలసీమ ఎత్తిపోతల ఆగిపోయింది మీ హయాంలోనే
- సీమకు ఖర్చు చేసింది రూ.2,000 కోట్లే
- పోలవరం, వెలిగొండ నిర్వాసితులను పట్టించుకోలేదు
- శాసనసభలో మంత్రి నిమ్మల రామానాయుడు

ఈనాడు, అమరావతి: 'రాయలసీమ ఎత్తిపోతల పథకం వైకాపా హయాంలోనే ఆగిపోయింది. మళ్లీ ఆ పనులు ప్రారంభించనే లేదు. హంద్రీనీవా వెడల్పు పనులూ చేయలేదు. గాలేరు-నగరిలో చేసిందేమీ లేదు. గోరకల్లు జలాశయం మరమ్మతులకు నిధులు కావాలంటే ఇవ్వలేదు. గోరకల్లు నుంచి అవుకు, గండికోట, చిత్రావతి బ్యాలెన్సింగ్ జలాశయం, అక్కడినుంచి పులివెందులకు నీళ్లు వెళ్లాలి. శ్రీశైలం మరమ్మతులను పట్టించుకోలేదు. మరి రాయలసీమ ద్రోహివి కాదా జగన్?' అని జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు నిలదీశారు. శాసనసభలో గురువారం జలవనరులశాఖ బడ్జెట్ కేటాయింపులపై జరిగిన చర్చకు మంత్రి సమాధానం ఇచ్చారు. వైకాపా హయాంలో ఏం జరిగిందో, ప్రస్తుత ఎన్డీయే ప్రభుత్వ హయాంలోని 20 నెలల్లో ఏం చేశారో వివరించారు.



◆ 2014-19 మధ్య రాష్ట్రంలో మొత్తం బడ్జెట్ రూ.7లక్షల కోట్లయితే రాయలసీమలో సాగునీటి ప్రాజెక్టులకు ఖర్చుచేసింది రూ.12,000 కోట్లు. జగన్ ప్రభుత్వంలో ఐదేళ్లలోనూ మొత్తం బడ్జెట్ దాదాపు రూ.7లక్షల కోట్లే ఉన్నా రాయలసీమ సాగునీటి ప్రాజెక్టులకు ఖర్చు చేసింది రూ.2,000 కోట్లే.

◆ రాయలసీమ ఎత్తిపోతలపై మాట్లాడే నైతిక అర్హత జగన్‌కు, వైకాపా నాయకులకు లేదు. ఎన్జీటీ ఆ పనులు ఆపింది 2020 మే నెలలో. అప్పుడు ముఖ్యమంత్రి ఎవరు? ఎవరి హయాంలో ఈ ఎత్తిపోతల ఆగింది? రాయలసీమ ఎత్తిపోతలలో చేసిన పని ఎంత? మట్టిపనులే చేశారు. మోటార్లు పెడితే 90% బిల్లులు తీసుకోవచ్చని ఆ పని చేశారు. రూ.900 కోట్లు ఖర్చుచేసి సీమకు చుక్క నీరు ఇచ్చారా?

◆ అప్పటి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అసలు నీళ్లు లేకుండానే, మూడు రిజర్వాయర్ల నిర్మాణం అంటూ మట్టి తవ్వేశారు. రైతులకు పరిహారం, పునరావాసం లేకుండానే భూములు లాగేసుకున్నారు. ఆ డబ్బులు మీ జేబులో వేసుకునేందుకు కాదా? పర్యావరణ మంత్రిగా పెద్దిరెడ్డి ఉన్నా పర్యావరణ అనుమతులు తీసుకోకుండా రిజర్వాయర్ల నిర్మాణం చేపట్టడం దారుణం కాదా? హరిత ట్రైబ్యునల్ రూ.100 కోట్ల జరిమానా వేసింది. ఈ జరిమానా పెద్దిరెడ్డి జేబులోంచి కడతారా?

◆ జగన్ హయాంలో ఒక్క ప్రాజెక్టుకూ మరమ్మతులు చేయలేదు. మేం శ్రీశైలం, ధవళేశ్వరం కాటన్ బ్యారేజి, గోరకల్లు, సోమశిల మరమ్మతులకు నిధులు మంజూరు చేశాం. పనులు చేయిస్తున్నాం. తుంగభద్రలో గేట్లు పాడైపోయినా జగన్ పట్టించుకోలేదు. మేం 33 గేట్లు మార్పిస్తున్నాం. తుంగభద్ర గేటు కొట్టుకుపోతే నీళ్లు ఉండగానే స్టాప్‌లాగ్ గేటు పెట్టించిన ఘనత మా ప్రభుత్వానిది. హంద్రీనీవాలో రూ.3,850 కోట్లతో పనులు చేసి కుప్పం నీళ్లు తీసుకువెళ్లాం. చింతలపూడి ఎత్తిపోతలకు రూ.430 కోట్లు కేటాయించాం.

వైకాపా ఎమ్మెల్యేలే వెలిగొండకు నిధులు కావాలంటున్నారు

జగన్ 2024లో వెలిగొండ ప్రాజెక్టు పూర్తయిందని జాతికి అంకితం చేశారు. మరోవైపు ఇప్పుడు వైకాపా ఎమ్మెల్యేలు ఫోన్లు చేసి వెలిగొండకు బడ్జెట్ కేటాయింపులు పెంచాలని అడుగుతున్నారు. అంటే జగన్ అంకితం చేసిన వైనాన్ని వైకాపా ఎమ్మెల్యేలే వ్యతిరేకిస్తున్నారుగా... వారిని అదే అడుగుతున్నాను.

రాయలసీమ ఎత్తిపోతల కేవలం తాగునీటి ప్రాజెక్టుగా జీవో ఇచ్చిందీ మీరే

ఈనాడు, అమరావతి: రాయలసీమ ఎత్తిపోతల పథకం పనుల్లో సులువుగా బిల్లులు చేసుకునేందుకు వీలున్న మట్టి, ఎలక్ట్రోమెకానికల్ పనులు మాత్రమే గత వైకాపా ప్రభుత్వం చేసిందని జలవనరుల శాఖ మంత్రి రామానాయుడు విమర్శించారు. ఈ పథకం సాగునీటి కోసం కాదు, తాగునీటి కోసం మాత్రమేనని నాడు ఉత్తర్వులు ఇచ్చింది వాస్తవం కాదా అని నిలదీశారు. రూ.3,825.83 కోట్లతో ప్రతిపాదించిన ఈ ప్రాజెక్టుకు వైకాపా ప్రభుత్వం ఖర్చుచేసింది రూ.922.93 కోట్లు మాత్రమేనని, ఇంకా 77.17 శాతం పనులు మిగిలి ఉన్నాయని పేర్కొన్నారు. చెన్నైలోని ఎన్జీటీ ఆదేశాల మేరకు 2020 అక్టోబరు 29న అప్పటి ప్రభుత్వం ఈ ప్రాజెక్టు పనులు నిలిపేసిందని, ఎన్జీటీ ఇచ్చే తదుపరి ఆదేశాల మేరకు తమ ప్రభుత్వం వ్యవహరిస్తుందని చెప్పారు. శాసనమండలిలో గురువారం వైకాపా ఎమ్మెల్సీలు అడిగిన ప్రశ్నలకు మంత్రి రామానాయుడు సమాధానాలిచ్చారు. రాయలసీమ ప్రాజెక్టు నిలిపేయాలని కోరితే ఏపీ సీఎం చంద్రబాబు అంగీకరించారంటూ తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల ఆ రాష్ట్ర అసెంబ్లీలో ప్రస్తావించిన అంశం వాస్తవమేనా? దానిపై ప్రభుత్వం వివరణ ఇవ్వాలంటూ ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ పట్టుబట్టారు. దీనిపై మంత్రి స్పందిస్తూ, ఈ పథకంపై ఎన్జీటీకి వెళ్లి తామే నిలిపివేయించినట్లు 2020లో అప్పటి తెలంగాణ మంత్రి హరీశ్‌రావు, భారాస నాయకులు చెప్పింది వాస్తవం కాదా అని నిలదీశారు.

వర్షపాతం తగ్గొచ్చు.. ముందే సిద్ధమవుదాం

(మొదటి పేజీ తరువాయి)

జాతికి అంకితం చేశారంటే నవ్వాలో ఏడ్వాలో అర్థం కావడం లేదు. ● ఆయనొక విచిత్రమైన వ్యక్తి. ఇది కూడా క్రెడిట్ చోరీ ప్రయత్నమే. కుప్పం కాలువకు నీళ్లు ఇస్తున్నట్లు కూడా అప్పట్లో ఇలాగే సెట్టింగ్ వేశారు. పట్టిసీమ నిర్మిస్తే ఇదెందుకు అని ప్రశ్నించారు. అలాంటిది ఏడాదికి 100 టీఎంసీలు గోదావరి వరద జలాలు కృష్ణా డెల్టాకు తెచ్చి.. శ్రీశైలం నుంచి పూర్తిగా రాయలసీమకు నీళ్లు ఇచ్చాం. ● వెలిగొండ ప్రాజెక్టు నుంచి ఈ ఏడాది జులైలోనే నీళ్లు ఇస్తాం. ఇక 14 వారాల సమయం ఉంది. ప్రతి వారం పనుల పురోగతిపై నివేదిక ఇమ్మన్నా. ఆర్థిక ఇబ్బందులున్నా ఈ ప్రాజెక్టు పూర్తి చేస్తాం. మార్కాపురం, ప్రకాశం జిల్లాలు సస్యశ్యామలం అవుతాయి. ఉత్తరాంధ్రలో 11 ప్రాజెక్టులు పూర్తి చేయాల్సి ఉంది. రూ.2,000 కోట్లు ఖర్చు చేసి రెండేళ్లలో ఆ ప్రాజెక్టులన్నీ పూర్తి చేస్తాం. చింతలపూడి ఎత్తిపోతలను జగన్ సర్కార్ వదిలేసింది. అది కూడా పూర్తి చేసి ఉమ్మడి పశ్చిమగోదావరి మెట్ట ప్రాంతాలు, కృష్ణా జిల్లా ప్రాంతాలకు నీళ్లు అందిస్తాం.

పోలవరం ప్రాజెక్టుకు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు..

● పోలవరం ప్రాజెక్టులోనూ జగన్ విధ్వంసం చేశారు. డయాఫ్రం వాల్ దెబ్బతింది. ఆ విషయాన్ని ఆలస్యంగా గుర్తించారు. ఎన్డీయే ప్రభుత్వం పోలవరాన్ని గాడిలో పెట్టింది. గోదావరి పుష్కరాల కన్నా ముందే పోలవరం పూర్తి చేస్తాం. ఇంత పెద్ద ప్రాజెక్టును సమీప భవిష్యత్తులో దేశంలో ఎక్కడా నిర్మించే అవకాశమే లేదు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను ఈ ప్రాజెక్టు వద్దకు తీసుకువెళ్లి నిర్మాణ పనులు చూపించే ఏర్పాట్లు శాసనసభ సభాపతి చేయాలి. ● 2014-19లో సాగునీటి ప్రాజెక్టులపై రూ.68 వేల కోట్లు ఖర్చు చేశాం. కూటమి ప్రభుత్వంలో ఇప్పటికే రూ.20 వేల కోట్లు ఖర్చు చేశాం. హంద్రీనీవాలో కాలువను వెడల్పు చేసి అవసరమైన చోట లైనింగ్ చేసి 738 కి.మీ వరకు నీళ్లు తీసుకెళ్లాం. ● సాగునీటి నిర్వహణ సాగునీటి సంఘాలకే అప్పజెప్పాం. అంతే కాదు ఇప్పుడు కొత్త ఆలోచన చేస్తున్నాం. ఒక ప్రాంతమంతా సాగునీటి సంఘాలకు అప్పజెప్పి అక్కడి నీటి సంరక్షణ బాధ్యతలు కూడా వారికే ఇస్తాం. భూగర్భజలాలు పెంచాలి. ఒక మీటరు జలాలు పెరిగితే రూ.వందల కోట్ల విద్యుత్తు ఛార్జీలు ఆదా అవుతాయి. పచ్చదనం పెంచాలి. తిరుమలలో 89.5% పచ్చదనం ఉంది. ఒకప్పుడు కొండలన్నీ రాళ్లతో ఉండేవి. రాళ్ల మధ్య కూడా పచ్చదనం పెంచొచ్చు అని నిరూపించాం.

టీ20 ధమాకా ప్రపంచకప్ ఫిబ్రవరి 7 - మార్చి 8

ఛాంపియన్స్

256 జింబాబ్వేపై భారత్ స్కోరు. టీ20 ప్రపంచకప్ చరిత్రలో ఇది రెండో అత్యధిక జట్టు స్కోరు. శ్రీలంక 260 (2007లో కెన్యాపై) పరుగులతో అగ్రస్థానంలో ఉంది.

చెపాక్‌లో చితక్కొట్టేశారు..!

ఫామ్‌పై ఆందోళనకు చెక్ పెడుతూ అభిషేక్ చెలరేగిపోయాడు. హార్దిక్ అదరగొట్టాడు. తిలక్ జోరందుకున్నాడు. మిగతా వాళ్లూ బ్యాట్లకు పని చెప్పారు. టీ20 ప్రపంచకప్‌లో ఎట్టకేలకు మన బ్యాటర్ల నుంచి ఓ సాధికారిక ప్రదర్శన. బ్యాటర్లు సమష్టిగా చెలరేగిన వేళ, కొండంత స్కోరు చేసిన టీమ్‌ఇండియా.. సెమీఫైనల్ ఆశలు సజీవంగా ఉండాలంటే తప్పక నెగ్గాల్సిన సూపర్-8 మ్యాచ్‌లో జింబాబ్వేను చిత్తుగా ఓడించింది. మరోవైపు వెస్టిండీస్‌పై దక్షిణాఫ్రికా నెగ్గడంతో సెమీస్ రేసులో భారత్‌పై ఒత్తిడీ తగ్గింది. అయితే టీమ్‌ఇండియా బౌలింగ్ మాత్రం ఆశించిన స్థాయిలో లేదు.

జింబాబ్వేపై భారత్ ఘనవిజయం

కసిగా కొట్టేశారు..

- మెరిసిన అభిషేక్, హార్దిక్, తిలక్



అభిషేక్ 55



హార్దిక్ 50 నాటౌట్

చెన్నై

టీమ్‌ఇండియా అదరగొట్టింది. సెమీఫైనల్ అవకాశాలను నిలబెట్టుకుంటూ.. గురువారం గ్రూప్-1 సూపర్ 8 మ్యాచ్‌లో 72 పరుగుల తేడాతో జింబాబ్వేపై ఘనవిజయం సాధించింది. అభిషేక్ శర్మ (55; 30 బంతుల్లో 4×4, 4×6), 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' హార్దిక్ పాండ్య (50 నాటౌట్; 23 బంతుల్లో 2×4, 4×6), తిలక్ వర్మ (44 నాటౌట్; 16 బంతుల్లో 3×4, 4×6) చెలరేగడంతో మొదట భారత్ 4 వికెట్ల నష్టానికి 256 పరుగులు చేసింది. ఇషాన్ కిషన్ (38; 24 బంతుల్లో 4×4, 1×6), సూర్యకుమార్ (33; 13 బంతుల్లో 3×4, 2×6) కూడా రాణించారు. ఛేదనలో జింబాబ్వే 6 వికెట్లకు 184 పరుగులు చేసింది. బెనెట్ (97 నాటౌట్; 59 బంతుల్లో 8×4, 6×6) టాప్ స్కోరర్. మిగతా బౌలర్లు పెద్దగా రాణించకపోయినా.. అర్ష్‌దీప్ సింగ్ (3/24) అద్భుతంగా బౌలింగ్ చేశాడు.

మెరిసిన బెనెట్: జింబాబ్వే ఛేదనలో భారత్ విజయంపై ఏ దశలోనూ అనుమానాలు లేవు. ఎందుకంటే ప్రత్యర్థి ముందుంది భారీ లక్ష్యం. సాధించాల్సిన రన్‌రేట్ క్రమంగా పెరుగుతూ పోయింది. కానీ భారత బౌలర్ల ప్రదర్శన మాత్రం గొప్పగా లేదు. అర్ష్‌దీప్ ఒక్కడు ఆకట్టుకున్నాడు. బుమ్రా పొదుపుగా బౌలింగ్ చేసినా వికెట్లు తీయలేకపోయాడు. స్పిన్నర్లు వరుణ్ చక్రవర్తి (1/35), అక్షర్ పటేల్ (1/35) బ్యాటర్లను పెద్దగా ఇబ్బంది పెట్టలేకపోయారు. శివమ్ దూబె రెండు ఓవర్లలో ఏకంగా 46 పరుగులు సమర్పించుకున్నాడు. వెస్టిండీస్‌తో కీలక మ్యాచ్ నేపథ్యంలో మన బౌలింగ్ చాలానే మెరుగుపడాల్సివుంది. ఛేదనలో పవర్ ప్లే ముగిసే సమయానికి జింబాబ్వే 44/0తో నిలవగా.. ఏడో ఓవర్లో మరుమాని (20)ని అక్షర్ ఔట్ చేశాడు. మరో ఓపెనర్ బెనెట్ మాత్రం ధాటిగా బ్యాటింగ్ చేశాడు. అక్షర్ తర్వాతి ఓవర్లో రెండు సిక్స్‌లు, ఫోర్ బాదేశాడు. 10వ ఓవర్లో మయర్స్ (6) ఔటయ్యేటప్పటికి జింబాబ్వే స్కోరు 72. ఆ తర్వాత సికందర్ రజా (31)తో కలిసి బెనెట్ ఇన్నింగ్స్‌ను నడిపించాడు. కానీ జింబాబ్వే మాత్రం ఓటమి దిశగానే సాగింది. బెనెట్ ఆట ఓటమి అంతరాన్ని తగ్గించడానికే. 17వ ఓవర్లో జట్టు స్కోరు 144 వద్ద రజా ఔటయ్యాడు. ఆ తర్వాత మున్యోంగా, ముసెకివా కూడా వెనుదిరిగారు.. కడదాకా క్రీజులో నిలిచిన బెనెట్.. శతకానికి మూడు పరుగుల దూరంలో ఆగిపోయాడు.



తిలక్ వర్మ 44 నాటౌట్

అభిషేక్ ధనాధన్: అనారోగ్యంతో ఇబ్బంది పడి, బ్యాటుతో ఘోరంగా విఫలమై విమర్శలు ఎదుర్కొన్న ఓపెనర్ అభిషేక్ ఎట్టకేలకు అదరగొట్టాడు. చక్కని షాట్లతో అలరించాడు. ఫామ్‌ను అందుకుంటూ చెపాక్‌లో చెలరేగిపోయాడు. సంజు శాంసన్ (24)ను జట్టులోకి తీసుకుని అతడితో పాటు ఓపెనింగ్‌కు పంపడం సత్ఫలితాన్నిచ్చింది. ఇద్దరు మంచి ఆరంభాన్నిచ్చారు.

భారత్ టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగగా.. రెండో బంతికే శాంసన్ సిక్సర్ మెరిపించాడు. ముజరబాని బౌలింగ్‌లో మరో సిక్స్ కొట్టాడు. మపోసా వేసిన ఇన్నింగ్స్ మూడో ఓవర్లో అభిషేక్ ఫోర్, సిక్స్ బాదేశాడు. అయితే భారీ షాట్ ఆడే ప్రయత్నంలో శాంసన్ ఔట్ కావడంతో 48 పరుగుల వద్ద తొలి వికెట్ భాగస్వామ్యానికి తెర పడింది. కానీ జోరు కొనసాగించిన అభిషేక్.. ఇషాన్ కిషన్‌తో కలిసి మరో విలువైన భాగస్వామ్యాన్ని (72) నెలకొల్పాడు. ఇషాన్ కూడా బ్యాట్ ఝుళిపించడంతో స్కోరు బోర్డు పరుగులు పెట్టింది. బెనెట్ బౌలింగ్‌లో ముందుకొచ్చి సిక్స్ బాదిన అభిషేక్.. రజా బౌలింగ్‌లో సింగిల్‌తో అర్ధశతకం (26 బంతుల్లో) పూర్తి చేశాడు. 11వ ఓవర్లో ఇషాన్‌ను ఔట్ చేసిన రజా.. జింబాబ్వేకు ఉపశమనమిచ్చాడు. సూర్యకుమార్ వస్తూనే బాదుడు మొదలెట్టాడు. తొలి బంతికే ఫోర్ కొట్టిన సూర్య.. కొన్ని బంతుల తర్వాత సిక్స్ బాదాడు. 13వ ఓవర్లో స్కోరు 150కి చేరుకున్నా.. అభిషేక్ ఔటయ్యాడు. కొన్ని బంతుల తర్వాత సూర్యను కూడా పెవిలియన్ పంపిన జింబాబ్వే.. పరుగుల సునామీ తమను ముంచెత్తకుండా ఉపశమనం పొందింది. కానీ ఆఖర్లో విధ్వంసం సృష్టించిన హార్దిక్, తిలక్ వర్మ జోడీ టీమ్‌ఇండియాకు కొండంత స్కోరును అందించింది.

ఆ ఇద్దరు అదరహో..: 15వ ఓవర్లో సూర్య ఔటయ్యేటప్పటికి భారత్ స్కోరు 172. ఆ దశలో హార్దిక్, తిలక్ విరుచుకుపడ్డారు. జింబాబ్వే బౌలింగ్‌ను తుత్తునియలు చేస్తూ.. ఇన్నింగ్స్‌కు మెరుపు ముగింపునిచ్చారు. ఎవాన్స్ ఓవర్లో ఫోర్ బాదిన హార్దిక్.. ముజరబాని బౌలింగ్‌లో సిక్స్ దంచేశాడు. తిలక్ మరింతగా విరుచుకుపడ్డాడు. ఎవాన్స్ బౌలింగ్‌లో ఎక్స్‌ట్రా కవర్ మీదుగా భారీ సిక్స్ కొట్టిన అతడు.. ముజరబాని ఓవర్లో ఓ సిక్స్, ఎవాన్స్ బౌలింగ్‌లో వరుసగా రెండు సిక్స్‌లు దంచేయడంతో స్టేడియం హోరెత్తింది. ఇన్నింగ్స్ ఆఖరి రెండు బంతులను హార్దిక్ సిక్స్‌లుగా మలచడంతో ప్రేక్షకుల ఆనందం రెట్టింపయింది. చివరి 5 ఓవర్లలో భారత్ 80 పరుగులు రాబట్టింది. తిలక్, హార్దిక్ జంట అజేయమైన ఐదో వికెట్‌కు 31 బంతుల్లో 84 పరుగులు జోడించింది.



అర్ష్‌దీప్ 3/24

35 టీ20 ప్రపంచకప్‌లో అర్ష్‌దీప్ తీసిన వికెట్లు. పొట్టి కప్పులో భారత్ తరఫున అత్యధిక వికెట్లు పడగొట్టిన బౌలర్‌గా అర్ష్‌దీప్ నిలిచాడు. అతడు బుమ్రా (33)ను అధిగమించాడు.

భారత్ ఇన్నింగ్స్: సంజు శాంసన్ (సి) బర్ల్ (బి) ముజరబాని 24; అభిషేక్ శర్మ (సి) సికందర్ రజా (బి) మపోసా 55; ఇషాన్ కిషన్ (సి) ఎంగరవ (బి) రజా 38; సూర్యకుమార్ యాదవ్ (సి) ముసెకివా (బి) ఎంగరవ 33; హార్దిక్ నాటౌట్ 50, తిలక్ వర్మ నాటౌట్ 44; ఎక్స్‌ట్రాలు 12 **మొత్తం:** (20 ఓవర్లలో 4 వికెట్లకు) **256; వికెట్ల పతనం:** 1-48, 2-120, 3-150, 4-172; **బౌలింగ్:** ఎంగరవ 4-0-62-1; ముజరబాని 4-0-43-1; మపోసా 2-0-40-1; ఎవాన్స్ 4-0-52-0; సికందర్ రజా 3-0-29-1; బెనెట్ 2-0-16-0; ర్యాన్ బర్ల్ 1-0-10-0

జింబాబ్వే ఇన్నింగ్స్: బెనెట్ నాటౌట్ 97; మరుమాని (సి) ఇషాన్ (బి) అక్షర్ 20; మయర్స్ (సి) తిలక్ (బి) వరుణ్ 6; రజా (సి) అభిషేక్ (బి) అర్ష్‌దీప్ 31; బర్ల్ ఎల్బీ (బి) అర్ష్‌దీప్ 0; మున్యోంగా (బి) అర్ష్‌దీప్ 11; ముసెకివా (సి) శాంసన్ (బి) దూబె 7; ఇవాన్స్ నాటౌట్ 1; **ఎక్స్‌ట్రాలు** 11; **మొత్తం:** (20 ఓవర్లలో 6 వికెట్లకు) **184; వికెట్ల పతనం:** 1-44, 2-72, 3-144, 4-144, 5-162, 6-173; **బౌలింగ్:** అర్ష్‌దీప్ 4-0-24-3, పాండ్య 3-0-21-0, బుమ్రా 3-0-21-0, వరుణ్ 4-0-35-1, అక్షర్ 4-0-35-1, దూబె 2-0-46-1

17 టీమ్‌ఇండియా బాదిన సిక్సర్లు. టీ20 ప్రపంచ కప్‌లో ఓ ఇన్నింగ్స్‌లో అత్యధిక సిక్సర్లు కొట్టిన జట్టుగా రెండో స్థానంలో ఉంది. వెస్టిండీస్ 19 సిక్సర్ల (జింబాబ్వేపై)తో ముందుంది.

బ్యాటర్లు భళా...


మన బ్యాటింగ్ అదిరింది. ఈ ప్రపంచ కప్‌లో గత మ్యాచ్‌ల్లో అస్థిర ప్రదర్శన చేసిన భారత బ్యాటింగ్ దళం కీలక సమయంలో పుంజుకుంది. జింబాబ్వేపై సమష్టిగా సత్తాచాటింది. బ్యాటర్లు తలో చేయి వేయడంతో టీమ్‌ఇండియా భారీ స్కోరు చేయగలిగింది. భారీ ఇన్నింగ్స్‌లు లేకపోయినా.. బ్యాటర్లంతా పరుగుల బాట పట్టడం వెస్టిండీస్‌తో ముఖ్య సమరానికి ముందు సంతోషాన్నిచ్చే విషయమే. వరుస వైఫల్యాలతో ఆందోళన కలిగించిన ఓపెనర్ అభిషేక్ శర్మ మెరుపు అర్ధశతకంతో మళ్లీ గాడినపడ్డాడు. కాస్త నియంత్రణనూ పాటించి ఇన్నింగ్స్‌కు బలమైన పునాది వేశాడు. అభిషేక్ బ్యాటు ఫ్లో, చురుకైన పాదాల కదలిక, కంటి చేతి సమన్వయం తిరిగొచ్చాయి. ఫామ్‌ను కొనసాగిస్తూ హార్దిక్ మరింతగా అదరగొట్టడం భారత్‌కు మరో సానుకూలాంశం. జట్టు భారీ లక్ష్యాన్ని నిర్దేశించడంతో అతడు కూడా ప్రధాన పాత్ర పోషించాడు. ఇక ఈ టోర్నీలో పరుగులు చేసినా, ఎప్పటిలా దూకుడుగా ఆడలేకపోయిన కెప్టెన్ సూర్య.. ఆ కొరతను తీరుస్తూ మంచి స్ట్రైక్‌రేట్‌తో పరుగుల వేట సాగించాడు. తిలక్ కూడా అంతే. గత కొన్ని మ్యాచ్‌ల్లో సాధికారికంగా బ్యాట్ ఝుళిపించలేకపోయిన అతడు.. ఈసారి స్వేచ్ఛగా చెలరేగిపోయాడు. లయను అందుకుంటూ ఇన్నింగ్స్‌కు మెరుపు ముగింపునిచ్చాడు. ఆత్మవిశ్వాసంతో ఆడిన తిలక్.. తన ఫామ్‌పై జట్టు మేనేజ్‌మెంట్ బెంగను పోగొట్టాడు. గత రెండు మ్యాచ్‌ల్లో విఫలమైన ఇషాన్ కిషన్ కూడా విలువైన పరుగులు చేశాడు. మరోవైపు సంజు శాంసన్ తక్కువకే ఔటైనా... ఆరంభంలో జింబాబ్వే బౌలర్లపై అతడు చూపిన ఆధిపత్యం ఇన్నింగ్స్‌కు ఊపునిచ్చింది. మిగతా బ్యాటర్లకు మార్గాన్ని చూపింది. ఇతర జట్లలాగే జింబాబ్వే బౌలర్లు.. బ్యాటర్లను స్లో బంతులతో ఇబ్బంది పెట్టడానికి ప్రయత్నించారు. అయితే గత మ్యాచ్‌లతో పోలిస్తే మన బ్యాటర్లు ఈసారి స్లో బంతులను సమర్థంగానే ఎదుర్కొన్నారు.

వెస్టిండీస్‌ను ఓడిస్తే చాలు..

సూపర్-8 తొలి మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా చేతిలో చిత్తుగా ఓడిన టీమ్‌ఇండియా సెమీస్ చేరడంపై జింబాబ్వే మ్యాచ్ ముందు ఎంతో చర్చ జరిగింది. భారీ విజయాలు సాధిస్తే గానీ టీమ్ ఇండియా ముందంజ వేయడం కష్టంగా కనిపించింది. కానీ దక్షిణాఫ్రికా భారీ తేడాతో వెస్టిండీస్‌ను ఓడించడంతో ఈ గ్రూపులో సమీకరణాలు తేలికయ్యాయి. ఆ తర్వాత జింబాబ్వేపై భారత్ విజయం సాధించడంతో దక్షిణాఫ్రికా సెమీస్ బెర్తు ఖరారైంది. 4 పాయింట్లతో ఆ జట్టు సెమీస్ చేరుకుంది. రెండు మ్యాచ్‌ల్లో ఓడిన జింబాబ్వే సెమీస్ రేసు నుంచి నిష్క్రమించింది. ఆదివారం భారత్, వెస్టిండీస్ మధ్య క్వార్టర్‌ఫైనల్ లాంటి మ్యాచ్‌తో మరో సెమీస్ బెర్తు తేలుతుంది. ఆ మ్యాచ్‌లో గెలిచిన జట్టు ముందంజ వేస్తుంది. ప్రస్తుతానికి రన్‌రేట్‌తో పనిలేదు. కానీ ఆదివారం మ్యాచ్ వర్షం కారణంగా తుడిచిపెట్టుకుపోతే మాత్రం రన్‌రేట్‌దే కీలకపాత్ర. అప్పుడు 3 పాయింట్లతో భారత్, వెస్టిండీస్ సమానంగా నిలుస్తాయి. కానీ మెరుగైన రన్‌రేట్ కలిగిన వెస్టిండీస్ (1.791) ముందంజ వేస్తుంది. భారత్ (-0.100) నిష్క్రమిస్తుంది.



శాంట్నర్



బ్రూక్

రాత్రి 7 నుంచి

కివీస్‌కు సవాల్

ఇంగ్లాండ్‌తో మ్యాచ్ నేడు

కొలంబో: టీ20 ప్రపంచకప్‌లో సెమీఫైనల్ బెర్తుపై న్యూజిలాండ్ గురిపెట్టింది. శుక్రవారం జరిగే సూపర్ 8 పోరులో ఇంగ్లాండ్‌తో కివీస్ తలపడనుంది. గ్రూపు-2 నుంచి ఇప్పటికే ఇంగ్లాండ్ సెమీస్ చేరుకోగా.. రెండో బెర్తును సొంతం చేసుకోవాలని కివీస్ కృతనిశ్చయంతో ఉంది. మంచి ఫామ్‌లో ఉన్న హ్యారీ బ్రూక్ సేనను మిచెల్ శాంట్నర్ సారథ్యంలోని కివీస్ ఏమేరకు అడ్డుకుంటుందో చూడాలి. ఇక ఈ మ్యాచ్‌లో గెలిస్తే కివీస్ నేరుగా సెమీస్‌కు అర్హత సాధిస్తుంది. ఒకవేళ ఓడినా ఆ జట్టుకు అవకాశం ఉంటుంది. పాయింట్ల పట్టికలో రెండో స్థానంలో ఉన్న కివీస్ (3 పాయింట్లు) భారీ తేడాతో ఓడిపోకుండా ఉంటే చాలు. మెరుగైన నెట్ రన్‌రేట్ (3.050) ఉండటమే ఇందుకు కారణం. శనివారం గ్రూపు-2లో చివరి సూపర్-8 మ్యాచ్‌లో పాకిస్థాన్ (1)తో శ్రీలంక (0) తలపడనుంది. ఇంగ్లాండ్ చేతిలో కివీస్ ఓడినా.. శ్రీలంక (-2.800)పై పాక్ (-0.461) ఘనవిజయం సాధించకుంటే సెమీస్ బెర్తు న్యూజిలాండ్ సొంతమవుతుంది.



మార్‌క్రమ్ 82 నాటౌట్

సెమీస్‌లో దక్షిణాఫ్రికా


- చిత్తుగా ఓడిన వెస్టిండీస్
- చెలరేగిన మార్‌క్రమ్

అహ్మదాబాద్

టీ20 ప్రపంచకప్‌లో దక్షిణాఫ్రికాకు ఎదురు లేకుండా పోయింది. అజేయ రికార్డును కొనసాగిస్తూ సూపర్ 8లో వరుసగా రెండో ఘనవిజయాన్నందుకున్న ఆ జట్టు.. సెమీఫైనల్లో అడుగుపెట్టింది. గురువారం జరిగిన గ్రూప్-1 మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా 9 వికెట్ల తేడాతో వెస్టిండీస్‌ను చిత్తు చేసింది. రొమారియో షెపర్డ్ (52 నాటౌట్; 37 బంతుల్లో 3×4, 4×6), హోల్డర్ (49; 31 బంతుల్లో 4×4, 3×6) మెరవడంతో మొదట వెస్టిండీస్ 8 వికెట్ల నష్టానికి 176 పరుగులు చేసింది. ఎంగిడి (3/30), రబాడ (2/22), బోష్ (2/31) ఆ జట్టుకు కళ్లెం వేశారు. మార్‌క్రమ్ (82 నాటౌట్; 46 బంతుల్లో 7×4, 4×6) చెలరేగడంతో లక్ష్యాన్ని దక్షిణాఫ్రికా 16.1 ఓవర్లలో ఒక వికెట్ మాత్రమే కోల్పోయి అలవోకగా ఛేదించింది. డికాక్ (47; 24 బంతుల్లో 4×4, 4×6), రికెల్టన్ (45 నాటౌట్; 28 బంతుల్లో 4×4, 2×6) కూడా ధనాధన్ ఇన్నింగ్స్ ఆడారు. టోర్నీలో విండీస్‌కు ఇదే తొలి ఓటమి. గ్రూప్-1 నుంచి రెండు కంటే ఎక్కువ జట్లు నాలుగు కంటే ఎక్కువ పాయింట్లు సాధించే అవకాశం లేనందున దక్షిణాఫ్రికాకు సెమీస్ బెర్తు ఖరారైంది.

అలవోకగా కొట్టేశారు..: లక్ష్యం మరీ చిన్నదేమీ కాకపోయినా.. మార్‌క్రమ్, ఇతర బ్యాటర్ల విధ్వంసంతో అలవోకగా ఛేదించింది దక్షిణాఫ్రికా. ఇన్నింగ్స్ తొలి బంతినే బౌండరీ దాటించడం ద్వారా తన ఉద్దేశాన్ని చాటాడు మార్‌క్రమ్. మరోవైపు డికాక్ కూడా స్వేచ్ఛగా బ్యాట్ ఝుళిపించాడు. వాళ్లపై విండీస్ బౌలర్లు ఎలాంటి ప్రభావం చూపలేకపోయారు. బ్యాటర్లిద్దరూ ఎడాపెడా ఫోర్లు, సిక్స్‌లు బాదడంతో 7 ఓవర్లకే 84/0తో నిలిచింది దక్షిణాఫ్రికా. తర్వాతి ఓవర్లోనే డికాక్ ఔటైనా.. సఫారీ జట్టుకు పెద్దగా కంగారు పడాల్సిన అవసరం లేకపోయింది. 27 బంతుల్లోనే అర్ధశతకం పూర్తి చేసిన మార్‌క్రమ్.. జోరు కొనసాగించాడు. డికాక్ స్థానంలో రికెల్టన్ కూడా విరుచుకుపడడంతో దక్షిణాఫ్రికా.. లక్ష్యం దిశగా వడివడిగా సాగింది. ఎలాంటి నాటకీయతకు అవకాశం ఇవ్వకుండా 23 బంతులు మిగిలి ఉండగానే పని పూర్తి చేసింది. మార్‌క్రమ్, రికెల్టన్ జంట అభేద్యమైన రెండో వికెట్‌కు 50 బంతుల్లోనే 82 పరుగులు జోడించింది. ఒక్క విండీస్ బౌలర్ కూడా ప్రభావం చూపలేకపోయాడు. ఆ జట్టు ఏ దశలోనూ పోటీలో లేదు.

ఆదుకున్న హోల్డర్, షెపర్డ్: 83/7. అంతకుముందు వెస్టిండీస్ పరిస్థితిది. దక్షిణాఫ్రికా బౌలర్ల ధాటికి కష్టాల్లోకి కూరుకుపోయిన ఆ జట్టు.. 176 పరుగులు చేయడం ఏమాత్రం ఊహించనిదే. షెపర్డ్, హోల్డర్‌ల అద్భుత పోరాటం విండీస్‌కు మెరుగైన స్కోరును అందించింది. ఆ జట్టును పోటీలో నిలిపింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన విండీస్.. క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోయింది. మూడో ఓవర్లో హోప్ (16), ఫామ్‌లో ఉన్న హెట్‌మయర్ (2)ను ఔట్ చేయడం ద్వారా ఆ జట్టును రబాడ గట్టి దెబ్బతీశాడు. తర్వాతి ఓవర్లోనే బ్రెండన్ కింగ్ (21), చేజ్ (2)లను ఎంగిడి ఔట్ చేయడంతో వెస్టిండీస్ 43/4తో కష్టాల్లో చిక్కుకుంది. ఆ తర్వాత బోష్ విజృంభించాడు. రూథర్‌ఫర్డ్ (12), రోమన్ పావెల్ (9), ఫోర్డ్ (11) కూడా పెవిలియన్‌కు క్యూ కట్టడంతో కరీబియన్ జట్టు కుప్పకూలడం ఖాయమనిపించింది. కానీ షెపర్డ్, హోల్డర్ ఆ జట్టును ఆదుకున్నారు. కాసేపు జాగ్రత్తగా ఆడిన ఈ జంట ఆ తర్వాత విధ్వంసక షాట్లతో విరుచుకుపడింది. ఫోర్లు, సిక్స్‌ల మోతతో స్కోరు బోర్డును పరుగులు పెట్టించింది. హోల్డర్ రెండు సిక్స్‌లు, రెండు ఫోర్లు బాదడంతో 18వ ఓవర్లో యాన్సెన్ ఏకంగా 23 పరుగులు సమర్పించుకున్నాడు. హోల్డర్, షెపర్డ్ ఎనిమిదో వికెట్‌కు 57 బంతుల్లోనే 89 పరుగులు జోడించారు. హోల్డర్ ఆఖరి ఓవర్లో ఔటయ్యాడు. చివరి అయిదు ఓవర్లలో వెస్టిండీస్ 58 పరుగులు రాబట్టింది.



ఎంగిడి 3/30

వెస్టిండీస్ ఇన్నింగ్స్: బ్రెండన్ కింగ్ (సి) డికాక్ (బి) ఎంగిడి 21; షైహోప్ (సి) డికాక్ (బి) రబాడ 16; హెట్‌మయర్ (సి) కేశవ్ (బి) రబాడ 2; పావెల్ (సి) బ్రెవిస్ (బి) ఎంగిడి 9; రోస్టన్ చేజ్ (బి) ఎంగిడి 2; రూథర్‌ఫోర్డ్ (సి) డికాక్ (బి) బోష్ 12; జేసన్ హోల్డర్ రనౌట్ 49; మాథ్యూ ఫోర్డ్ (సి) రికెల్టన్ (బి) బోష్ 11; రొమారియో షెపర్డ్ నాటౌట్ 52; మోటీ నాటౌట్ 0; **ఎక్స్‌ట్రాలు** 2; **మొత్తం** (20 ఓవర్లలో 8 వికెట్లకు) **176; వికెట్ల పతనం:** 1-29, 2-31, 3-41, 4-43, 5-60, 6-71, 7-83, 8-172; **బౌలింగ్:** కేశవ్ మహరాజ్ 4-0-43-0; మార్కో యాన్సెన్ 4-0-50-0; రబాడ 4-0-22-2; ఎంగిడి 4-0-30-3; కార్బిన్ బోష్ 4-0-31-2

దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్: మార్‌క్రమ్ నాటౌట్ 82; డికాక్ (సి) హోల్డర్ (బి) చేజ్ 47; రికెల్టన్ నాటౌట్ 45; **ఎక్స్‌ట్రాలు** 3; **మొత్తం** (16.1 ఓవర్లలో వికెట్ నష్టానికి) **177; వికెట్ల పతనం:** 1-95; **బౌలింగ్:** మాథ్యూ ఫోర్డ్ 3-0-30-0; రొమారియో షెపర్డ్ 2-0-22-0; జేసన్ హోల్డర్ 3.1-0-31-0; షమర్ జోసెఫ్ 2-0-24-0; మోటీ 2-0-24-0; రోస్టన్ చేజ్ 4-0-46-1

పాయింట్ల పట్టిక సూపర్-8 గ్రూప్-1

జట్టు	మ్యా	గె	ఓ	ఫ.తే	పా	నె.రన్‌రేట్
దక్షిణాఫ్రికా	2	2	0	0	4	2.890
వెస్టిండీస్	2	1	1	0	2	1.791
భారత్	2	1	1	0	2	-0.100
జింబాబ్వే	2	0	2	0	0	-4.475

మ్యా: మ్యాచ్‌లు, గె: గెలిచినవి, పా: పాయింట్లు, ఫ.తే: ఫలితం తేలనివి

అల్మేరియా క్లబ్‌లో రొనాల్డోకు వాటా

అల్మేరియా: ఫుట్‌బాల్ దిగ్గజం క్రిస్టియానో రొనాల్డో స్పానిష్ క్లబ్‌కు చెందిన జట్టులో వాటా సొంతం చేసుకున్నాడు. సెకండ్ టైర్ క్లబ్ యూడీ అల్మేరియాలో 25 శాతం వాటా కొనుగోలు చేశాడు. "ఫుట్‌బాల్ క్రీడకు నా వంతు సహకరించాలనేది నా సుదీర్ఘ కోరిక. అల్మేరియా మంచి సామర్థ్యం ఉన్న క్లబ్" అని క్రిస్టియానో అన్నాడు. అల్మేరియా క్లబ్‌కు ప్రస్తుతం సౌదీ అరేబియాకు చెందిన వ్యక్తి యజమానిగా ఉన్నాడు.

శ్రీకాంత్ ఓటమి

ముల్హీమ్ అన్ డెర్ రుహర్ (జర్మనీ): జర్మన్ ఓపెన్ సూపర్ 300 టోర్నీలో భారత్ ప్రయాణం ముగిసింది. పురుషుల సింగిల్స్ రెండో రౌండ్లో కిదాంబి శ్రీకాంత్ 14-21, 9-21తో లిన్ చున్ (చైనీస్ తైపీ) చేతిలో ఓడిపోయాడు. ఈ టోర్నీలో శ్రీకాంత్ మాత్రమే భారత్ నుంచి రెండో రౌండ్ చేరాడు.



గుకేశ్

గుకేశ్ తొలి గేమ్ డ్రా

ప్రేగ్: ప్రేగ్ అంతర్జాతీయ చెస్ ఫెస్టివల్ మాస్టర్స్ విభాగంలో దొమ్మరాజు గుకేశ్ గేమ్‌ను డ్రా చేసుకున్నాడు. తొలి రౌండ్లో హ్యాన్స్ నీమన్ (అమెరికా)తో పాయింట్ పంచుకున్నాడు. గుకేశ్ (0.5 పాయింట్) అయిదో స్థానంలో ఉన్నాడు. డిఫెండింగ్ ఛాంపియన్ అరవింద్ చిదంబరం.. అబ్దుసత్తారోవ్ (ఉజ్బెకిస్థాన్) చేతిలో ఓడిపోయాడు. ఛాలెంజర్స్ విభాగంలో మహిళల ప్రపంచకప్ విజేత దివ్య దేశ్‌ముఖ్ టాప్ సీడ్ బెంజమిన్ గ్లెడురా (హంగేరి)తో పోరును డ్రా చేసుకుంది.

ఉ. 9.20 నుంచి

నిలవాలంటే గెలవాలి

ఆసీస్‌తో భారత్ రెండో వన్డే నేడు



శ్రీచరణి

హోబర్ట్: ఆస్ట్రేలియా మహిళల జట్టుతో వన్డే సిరీస్‌లో కీలక పోరుకు భారత్ సిద్ధమైంది. తొలి వన్డేలో ఓడిన భారత్.. సిరీస్‌పై ఆశలు నిలవాలంటే గెలవాల్సిన పరిస్థితిలో శుక్రవారం రెండో వన్డేలో అమీతుమీ తేల్చుకోనుంది. ఇప్పటికే టీ20 సిరీస్‌ను 2-1తో కైవసం చేసుకున్న హర్మన్‌ప్రీత్ కౌర్ సేన.. తొలి వన్డేలో అంచనాలకు తగ్గట్లు రాణించలేకపోయింది. బ్రిస్బేన్ మ్యాచ్‌లో బ్యాటర్లు విఫలమవడంతో 214 పరుగులకే కుప్పకూలింది. వైస్ కెప్టెన్ స్మృతి మంధాన (58), హర్మన్ (53), కాశ్వీ గౌతమ్ (43) మినహా ఎవరూ క్రీజులో నిలదొక్కుకోలేకపోయారు. క్రమశిక్షణతో కూడిన ఆసీస్ బౌలింగ్‌ను ఎదుర్కోవాలంటే భారత టాప్, మిడిలార్డర్ బ్యాటర్లు సత్తాచాటాల్సిందే. బౌలింగ్‌లో శ్రీచరణి (2/41) మెరిసినా.. మిగిలిన బౌలర్ల నుంచి సరైన సహకారం లభించలేదు. పవర్ ప్లేలో పేసర్లు రేణుక సింగ్, క్రాంతి గౌడ్.. మధ్య ఓవర్లలో దీప్తిశర్మ, కాశ్వీ ప్రత్యర్థిని కట్టడి చేయడం అత్యంత కీలకం.

పట్టుబిగించిన జమ్మూకశ్మీర్

కర్ణాటక 220/5.. రంజీ ట్రోఫీ ఫైనల్


హుబ్బళి: కర్ణాటకతో రంజీ ట్రోఫీ ఫైనల్లో జమ్మూకశ్మీర్ స్ఫూర్తిమంతమైన ప్రదర్శన కొనసాగుతోంది. బ్యాటింగ్‌లో అదరగొట్టిన ఆ జట్టు.. బౌలింగ్‌లోనూ సత్తాచాటుతోంది. పేసర్ ఆకిబ్ నబి (3/32) విజృంభించడంతో మ్యాచ్‌పై జమ్మూకశ్మీర్ పట్టుబిగించింది. ఓవర్‌నైట్ స్కోరు 527/6తో గురువారం ఉదయం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన జమ్మూకశ్మీర్ 584 పరుగులకు ఆలౌటైంది. సాహిల్ లోత్రా (72; 138 బంతుల్లో 8×4), యుధ్‌వీర్ సింగ్ (30) రాణించారు. కర్ణాటక పేసర్ ప్రసిద్ధ్ కృష్ణ (5/98) మెరిశాడు. అనంతరం బ్యాటింగ్‌లో కర్ణాటక తడబడింది. మూడో రోజు ఆట ముగిసే సమయానికి ఆ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 5 వికెట్లకు 220 పరుగులు చేసింది. ఓపెనర్ కేఎల్ రాహుల్ (13), కెప్టెన్ దేవ్‌దత్ పడిక్కల్ (11), కరుణ్ నాయర్ (0), రవిచంద్రన్ స్మరణ్ (0) విఫలమవగా.. మరో ఓపెనర్ మయాంక్ అగర్వాల్ (130 బ్యాటింగ్; 207 బంతుల్లో 17×4) ఒంటరి పోరాటం చేస్తున్నాడు. ఒకదశలో 57 పరుగులకే 4 వికెట్లు కోల్పోయిన కర్ణాటకకు మయాంక్, శ్రేయస్ గోపాల్ (27; 83 బంతుల్లో 1×4) అండగా నిలిచారు. అయిదో వికెట్‌కు 105 పరుగులు జోడించి ఆదుకున్నారు. అనంతరం మయాంక్, కృతిక్ కృష్ణ (27 బ్యాటింగ్; 75 బంతుల్లో 2×4) ఆరో వికెట్‌కు అజేయంగా 58 పరుగులు జతచేసి జట్టు స్కోరును 200 దాటించారు. మరో రెండ్రోజుల ఆట మిగిలివున్న ఈ మ్యాచ్‌లో జమ్మూకశ్మీర్ స్కోరుకు కర్ణాటక మరో 364 పరుగుల దూరంలో ఉంది. తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించి.. మ్యాచ్ డ్రాగా ముగిసినా రంజీ ట్రోఫీ టైటిల్ జమ్మూకశ్మీర్ సొంతమవుతుంది.



ఆకిబ్ నబి 3/32

కునో పార్కులో చీతాలు తిన్న మేకల ఖర్చు రూ.1.27 కోట్లు

మధ్యప్రదేశ్‌లోని కునో జాతీయ పార్కుకు విదేశాల నుంచి తీసుకొచ్చిన చీతాలు 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.1.27 కోట్ల విలువైన మేకలను ఆరగించినట్లు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ అసెంబ్లీకి తెలిపారు. మూడేళ్ల కిందట తెచ్చిన ఈ చీతాల పునరావాసం, సంరక్షణ కోసం ఇప్పటివరకు రూ.100 కోట్లకు పైగా ఖర్చు అయినట్లు ప్రభుత్వ గణాంకాలు వెలుగు చూశాయి. రాష్ట్ర బడ్జెట్ సమావేశాల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యే అడిగిన ప్రశ్నకు సీఎం ఈ మేరకు లిఖిత పూర్వక సమాధానం ఇచ్చారు. చీతాల ఆహారం కోసం ప్రత్యేకంగా ఎలాంటి కేటాయింపులు లేవని.. వాటి సంరక్షణ, నిర్వహణ నిధుల నుంచే మేకలను కొనుగోలు చేస్తున్నామని వివరించారు. భారత్‌లో చీతాల సంతతిని పునరుద్ధరించే లక్ష్యంతో దక్షిణాఫ్రికా, నమీబియాల నుంచి వీటిని తీసుకురాగా.. ప్రస్తుతం ఈ పార్కులో మొత్తం 38 చీతాలు ఉన్నాయి.



ఆటగదరా నీకు.. ఐశ్వర్య కారకా!

మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయినికి 52 కి.మీ.ల దూరాన ఉన్న జవాసియాలోని బడ్డేశ్వర్ మహాదేవ్ ఆలయ విశేషాలు ఇవి. శివరాత్రి వేళ ఈ ఆలయాన్ని భక్తులు ప్రత్యేకంగా అలంకరించి, వేలాదిగా భక్తులు తరలివచ్చి పూజలు చేయడం రివాజుగా వస్తోంది. రూ.1.31 కోట్ల కరెన్సీ నోట్లతో చేసిన ఈ అలంకరణకు రెండు రోజుల సమయం పట్టింది. భక్తులు సమర్పించిన ఈ డబ్బును పూజలు ముగిశాక మళ్లీ లెక్క ప్రకారం వెనక్కు ఇచ్చేస్తారు. ఇంత పెద్ద మొత్తంతో అలంకరణ చేసినా ఆలయం వద్ద కాపలాగా పోలీసులు కానీ, మరే ఇతర సిబ్బంది కానీ లేకపోవడం విశేషం. అంతా ఆ శివయ్యే చూసుకుంటాడని భక్తుల నమ్మకం. ఏటా జరిగే ఈ అలంకరణకు భక్తుల నుంచి సేకరించిన రొక్కం రూ.కోటి దాటడం ఇదే మొదటిసారి అని ఆలయ పూజారి మహేశ్ శర్మ తెలిపారు.



ప్రధాని మోదీ ఇన్‌స్టా @ 10 కోట్లు

అత్యధిక ఫాలోవర్లున్న ప్రపంచ నేతగా రికార్డు

దిల్లీ: సామాజిక మాధ్యమాల్లో ప్రధాని మోదీ హవా కొనసాగుతోంది. తాజాగా ఇన్‌స్టాగ్రామ్‌లో ఆయన ఫాలోవర్ల సంఖ్య 10 కోట్లను దాటింది. దీంతో ఇన్‌స్టాలో అత్యధిక మంది అనుసరిస్తున్న ప్రపంచ నేతగా ఆయన రికార్డు సృష్టించినట్లు అధికారులు గురువారం



ప్రకటించారు. 2014 నుంచి మోదీ ఇన్‌స్టాగ్రామ్ ఖాతాను వినియోగిస్తున్నారు. మరో సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ఇప్పటికే ఆయనను అనుసరించే వారి సంఖ్య 10 కోట్లు దాటింది. కాగా.. ఇన్‌స్టాలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కంటే.. మోదీ ఫాలోవర్ల సంఖ్య రెండు రెట్లు ఎక్కువ. 4.3 కోట్ల మంది ఫాలోవర్లతో ట్రంప్ రెండో స్థానంలో ఉన్నారు. ట్రంప్ సహా ఆ తర్వాతి 4 స్థానాల్లో ఉన్న ఇండోనేసియా, బ్రెజిల్, తుర్కియే, అర్జెంటీనా అధ్యక్షుల ఇన్‌స్టా ఫాలోవర్ల సంఖ్య మొత్తం కలిపినా మోదీ ఫాలోవర్ల సంఖ్య కంటే తక్కువగానే ఉంటుంది.

ఎన్సీపీ అధ్యక్షురాలిగా సునేత్ర పవార్



ముంబయి: నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ) జాతీయ అధ్యక్షురాలిగా సునేత్ర పవార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం జరిగిన పార్టీ జాతీయ కార్యవర్గ సమావేశంలో ఆమెను అధ్యక్షురాలిగా ఎన్నుకున్నారు. నెల కిందట పార్టీ అధ్యక్షుడు అజిత్ పవార్ విమాన ప్రమాదంలో మరణించడంతో ఆయన సతీమణి అయిన సునేత్ర ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు.

ఇరాన్‌పై ట్రంప్ సందిగ్ధం!

- దాడికి దిగితే విధ్వంసం తప్పదనే భయం
- దిగకపోతే ప్రతిష్ఠకు దెబ్బనే ఆందోళన

జెనీవా, వాషింగ్టన్: ఇరాన్‌పై దాడుల విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ డోలాయమానంలో ఉన్నారు. దాడులకు దిగితే ఒక తంటా.. దిగకపోతే మరో తంటాలా ఆయన పరిస్థితి ఉంది. ఇరాన్‌తో జెనీవాలో జరుగుతున్న పరోక్ష చర్చలు విఫలమైతే దాడులకు దిగుతామని అంటున్నారు. ఆ మాటను ఆయన గట్టిగా చెప్పలేకపోతున్నారు. [illegible] అప్రతిష్ఠ తప్పదని ఆయన ఆందోళన చెందుతున్నారు. మరోవైపు చర్చలూ ఎడతెగకుండా సాగుతున్నాయి. ఒమన్ మధ్యవర్తిత్వంతో స్విట్జర్లాండ్‌లోని జెనీవాలో జరుగుతున్న పరోక్ష చర్చలూ ఫలవంతమయ్యే అవకాశం కనిపించడం లేదు. అణు కార్యక్రమాన్ని ఆపాలని అమెరికా హెచ్చరిస్తుండగా.. ఆపేది లేదని ఇరాన్ అంటోంది.

మరోవైపు దౌత్య మార్గాల్లో చర్చలు కొనసాగుతూనే ఉన్నాయి. పశ్చిమాసియా ప్రత్యేక దూత విట్‌కాఫ్, ట్రంప్ అల్లుడు జేర్డ్ కుష్నర్‌లు జెనీవాలో చర్చలు జరుపుతూనే ఉన్నారు. ట్రంప్‌నకు ఇరాన్ కొన్ని ప్రతిపాదనలు చేయొచ్చని తెలుస్తోంది. వాటినే ఆయన ఘన విజయంగా ప్రచారం చేసుకునే అవకాశముంది. యురేనియం శుద్ధితోపాటు ఆయుధ గ్రేడ్ పదార్థాల నిల్వలపై కొంత దిగివచ్చేందుకు ఇరాన్ అంగీకరిస్తోంది. క్షిపణుల అభివృద్ధి విషయంలో అది అంగీకరించకపోవచ్చు. మరోవైపు ట్రంప్‌నకూ దేశంలో రాజకీయ పరిమితులున్నాయి. ఒబామా హయాం నాటి అణు నియంత్రణలకు ఆయన అంగీకరించకపోవచ్చు. సైనిక, పౌర నష్టానికి సిద్ధమై ట్రంప్. యుద్ధానికి దిగే అవకాశమూ లేకపోలేదు.

- అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ఇరాన్‌కు గట్టి హెచ్చరికలు చేశారు. సైనిక చర్యకు సంబంధించి తమ బెదిరింపులను ఆ దేశం సీరియస్‌గా తీసుకోవాలని సూచించారు.
- అమెరికా ప్రజల్లోనూ ట్రంప్‌పై అనుమానాలున్నాయి. ఇరాన్ అణు కార్యక్రమం అమెరికాకు పెద్ద ప్రమాదమేనని వారు అభిప్రాయపడ్డారు. అదే సమయంలో యుద్ధం విషయంలో ట్రంప్ నిర్ణయంపై వారు సందిగ్ధంగానే ఉన్నారు.



చర్చల్లో తేలిందేంటి?

చర్చల్లో రెండు దేశాలు దాపరికంలేని విధంగానే ఉన్నాయని, కొత్త, సృజనాత్మక సానుకూల ఆలోచనలతో ఉన్నాయని చర్చలకు మధ్యవర్తిత్వం వహిస్తున్న ఒమన్ విదేశాంగ మంత్రి బదర్ అల్‌బుసైది తెలిపారు. విట్‌కాఫ్, కుష్నర్‌లతో [illegible] ఆయన మాట్లాడారు. చర్చల ఫలితం ఏంటి అని అడగ్గా.. [illegible] చూపించారు. మరోవైపు ఒప్పందం అవకాశాలపై మాత్రం అనిశ్చితి నెలకొంది.

పాకిస్థాన్‌పై అఫ్గానిస్థాన్ దాడులు

కాబుల్: తమపై పాకిస్థాన్ చేసిన వైమానిక దాడులకు ప్రతీకారంగా ఆ దేశంపై అఫ్గానిస్థాన్ విరుచుకుపడుతోంది. గురువారం రాత్రి డ్యూరాండ్ సరిహద్దుల్లో తీవ్ర ఘర్షణలు ప్రారంభమయ్యాయని అఫ్గాన్ తూర్పు ప్రాంత సైనిక కోర్ మీడియా కార్యాలయం ఒక ప్రకటనలో వెల్లడించింది. నంగార్హార్, పక్తియా ప్రావిన్సులపై పాక్ దాడులకు ప్రతీకారంగా ఈ దాడులు చేపట్టినట్లు తెలిపింది. పాక్ సైనిక స్థావరాలు, కేంద్రాలే లక్ష్యంగా దాడులకు దిగామని అఫ్గాన్ ప్రభుత్వ అధికార ప్రతినిధి జబీ హుల్లా వెల్లడించారు. ఖైబర్ జిల్లా సరిహద్దులో ఘర్షణలు ప్రారంభమయ్యాయని, నాలుగు జిల్లాలకు విస్తరించాయని పాకిస్థాన్ స్థానిక అధికారులు తెలిపారు. పాక్, అఫ్గాన్‌ల మధ్య 2,611 కిలోమీటర్ల డ్యూరాండ్ సరిహద్దు ఉంది. అయితే దానిని అఫ్గానిస్థాన్ గుర్తించడం లేదు.

త్వరలో గ్రేడ్ ఆధారిత డ్రైవింగ్ లైసెన్సులు

- పాయింట్లు తగ్గితే సస్పెన్షన్, రద్దు
- కేంద్ర మంత్రి గడ్కరీ వెల్లడి

దిల్లీ: బాధ్యతాయుతమైన డ్రైవింగ్‌ను ప్రోత్సహించడంతో పాటు రోడ్డు ప్రమాదాలను నివారించడానికి గ్రేడ్ ఆధారిత డ్రైవింగ్ లైసెన్సుల వ్యవస్థను ప్రవేశపెట్టాలని భావిస్తున్నామని రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. రోడ్డు భద్రతపై భారతీయ పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) గురువారం దిల్లీలో నిర్వహించిన జాతీయ కాంక్లేవ్‌లో ఆయన ప్రసంగించారు. 'మేం గ్రేడ్ ఆధారిత డ్రైవింగ్ లైసెన్సుల వ్యవస్థను తీసుకురావాలనుకుంటున్నాం. ఈ విధానంలో ట్రాఫిక్ ఉల్లంఘనలకు కొన్ని పాయింట్లు తగ్గుతాయి. అలా మొత్తం పాయింట్లు తగ్గితే డ్రైవింగ్ లైసెన్సును 6 నెలలపాటు సస్పెండు చేయడంగానీ, పూర్తిగా రద్దు చేయడంగానీ చేస్తాం. త్వరలో ఈ విధానాన్ని ప్రారంభిస్తాం' అని గడ్కరీ తెలిపారు.





చిన్న ప్రయత్నాలతోనే విజయం సాకారం

గెలుపు అనేది రాత్రికి రాత్రే రాదు. ప్రతిరోజూ చేసే చిన్న ప్రయత్నాలతోనే సాధ్యమవుతుంది. బయట నుంచి చూసేవారికి అకస్మాత్తుగా వచ్చినట్లు కనిపిస్తుంది. ఫలితం వెంటనే కనిపించనప్పుడు చాలామంది తమ ప్రయత్నాలను వదిలిపెట్టేస్తారు. అందుకు భిన్నంగా ముందుకుసాగితే విజయం వరిస్తుంది.

– కేయ్, కంటెంట్ క్రియేటర్




విమాన టికెట్ తీసుకున్న 48 గంటల్లో మార్పులు ఉచితం

- రద్దు చేసుకున్నా అదనపు రుసుములు ఉండవు: డీజీసీఏ

దిల్లీ: విమాన టికెట్లు తీసుకున్నవారు 48 గంటల్లోగా దానిని రద్దు చేసుకున్నా, కొన్ని మార్పులు చేసుకున్నా అదనపు రుసుములు లేకుండా విమానయాన సంస్థలు అనుమతించేలా పౌర విమానయాన డైరెక్టరేట్ జనరల్ (డీజీసీఏ) వెసులుబాటు కల్పించింది. కొన్ని షరతులకు లోబడి మార్పుల్ని అంగీకరించేలా 'టికెట్ సొమ్ము వాపసు నిబంధనల్ని' సవరించింది. మార్చి 26 నుంచి ఇవి అమల్లోకి వస్తాయి. ప్రయాణ తేదీ ఏడు రోజుల కంటే తక్కువ ఉన్న దేశీయ ప్రయాణాలకు, 15 రోజులకంటే తక్కువ ఉన్న విదేశీ ప్రయాణాలకు మాత్రం ఇవి వర్తించవు. పేరులో ఏమైనా తప్పులు దొర్లినట్లు ప్రయాణికులు గుర్తించి, టికెట్ బుక్‌చేసిన 24 గంటల్లోపు చెబితే మార్పులకు ఎలాంటి ఛార్జీలు వేయరు. విమానయాన సంస్థల వెబ్‌సైట్ నుంచి, వాటి ఏజెంట్ల/ పోర్టల్ నుంచి టికెట్లు కొంటే రిఫండ్ ప్రక్రియను 14 పనిదినాల్లో పూర్తిచేయాలని డీజీసీఏ ఆదేశించింది. ప్రయాణ సమయంలో ఒకే పీఎన్ఆర్ ఉన్న ప్రయాణికుల్లో ఎవరికైనా వైద్యపరమైన అత్యవసర పరిస్థితి తలెత్తి ఆసుపత్రిలో చేరాల్సి వస్తే, టికెట్ రద్దు చేసుకుంటే సొమ్ము వాపసు చేయాలని, లేదంటే ఆ డబ్బును క్రెడిట్ షెల్‌లో ఉంచాలని, తర్వాత వాడుకునే అవకాశం కల్పించాలని స్పష్టం చేసింది. ప్రయాణికుడి ఆరోగ్య పరిస్థితిని విమానయాన సంస్థ ఏరోస్పేస్ వైద్య నిపుణుడు ధ్రువీకరించి రిఫండ్ ఇవ్వాలన్నారు. టికెట్ రిఫండ్ సొమ్ము సకాలంలో రావడం లేదని పెద్దఎత్తున ఫిర్యాదులు వస్తుండడంతో ప్రభుత్వం ఈ చర్యలు చేపట్టింది. టికెట్ బుక్ చేసుకున్న తర్వాత 48 గంటల సమయాన్ని 'లుక్-ఇన్ ఆప్షన్'గా ఇవ్వాలని డీజీసీఏ ఆదేశించింది. ఆ వ్యవధిలో టికెట్ రద్దుకు, మార్పులకు అదనపు రుసుములు పడవు. మార్పును కోరుతున్న తేదీకి విమాన టికెట్ ధర ఎంత ఉందో అంత చెల్లిస్తే సరిపోతుంది. టికెట్ తీసిన 48 గంటల తర్వాతైతే మార్పులకు రుసుం చెల్లించాలి.

కెనడాలో హింసకు, భారత్‌కు సంబంధం లేదు

- నేటి నుంచి మార్క్ కార్నీ భారత పర్యటన నేపథ్యంలో ప్రకటించిన కెనడా ప్రభుత్వం



మార్క్ కార్నీ

దిల్లీ, అటావా: గతంలో తమ దేశంలో చోటు చేసుకున్న హింసకు, భారత్‌కు సంబంధం లేదని కెనడా ప్రభుత్వం ప్రకటించింది. రెండు దేశాల మధ్య దెబ్బతిన్న దౌత్య సంబంధాలు పురోగతి సాధిస్తున్నాయని వెల్లడించింది. కెనడా ప్రధాని మార్క్ కార్నీ శుక్రవారం నుంచి నాలుగు రోజుల పాటు భారత్‌లో పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో మాజీ ప్రధాని జస్టిన్ ట్రూడో హయాంలో భారత్‌పై చేసిన ఆరోపణలపై అక్కడి ప్రభుత్వం వివరణ ఇచ్చింది. ఆ ఆరోపణలపై విచారణలు, ఇతర కార్యకలాపాలను కొనసాగించడం లేదని సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. ఖలిస్థాన్ ఉగ్రవాది హర్‌దీప్‌సింగ్ నిజ్జర్ హత్యలో భారత ప్రభుత్వ ఏజెంట్ల హస్తం ఉందని 2023లో అప్పటి ప్రధాని జస్టిన్ ట్రూడో ఆరోపణలు చేశారు. ఫలితంగా రెండు దేశాల సంబంధాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. రెండు దేశాలు దౌత్యవేత్తలను బహిష్కరించుకోవడంతో దౌత్య వివాదం పెద్దదైంది. మార్క్ కార్నీ అధికారంలోకి వచ్చాక సంబంధాలు మళ్లీ గాడినపడ్డాయి. కెనడా ప్రధాని పర్యటనలో వాణిజ్యం, ఇంధనం, టెక్నాలజీ, పెట్టుబడులు, కీలక ఖనిజాలు, వ్యవసాయం, విద్య, పరిశోధన, ఆవిష్కరణ, ప్రజల మధ్య సంబంధాలే ప్రధానంగా చర్చలు సాగనున్నాయి. తొలుత ఆయన ముంబయికి చేరుకుంటారు. అక్కడ రెండు దేశాలకు చెందిన కార్పొరేట్ దిగ్గజాలు, ఆర్థిక నిపుణులు, ఆవిష్కర్తలతో భేటీ అవుతారు. ఆదివారం కార్నీ దిల్లీకి చేరుకుంటారు. సోమవారం ఇద్దరు ప్రధానులు కీలక చర్చలు జరుపుతారు.


డిజిటల్ వేదికలు వాటి కంటెంట్‌కు బాధ్యత వహించాల్సిందే: అశ్వినీ వైష్ణవ్



దిల్లీ: డిజిటల్ వేదికలు తాము అందుబాటులో ఉంచే కంటెంట్‌కు పూర్తి బాధ్యత వహించాలని గురువారం కేంద్ర ఐటీ, సమాచార, ప్రసార శాఖల మంత్రి అశ్వినీ వైష్ణవ్ స్పష్టం చేశారు. అవి కేవలం సమాచార పంపిణీ వేదికలుగానే మిగిలిపోకూడదని, తాము ప్రచురించే కంటెంట్ విషయంలో పిల్లలు, పౌరుల భద్రతను పరిరక్షించాలని ఆయన అన్నారు. దీంతోపాటు తమకు కంటెంట్ అందిస్తున్న వార్తా సంస్థలు, స్వతంత్ర కంటెంట్ క్రియేటర్లు, ఇన్‌ఫ్లుయెన్సర్లు, ప్రొఫెసర్లు, పరిశోధకులతో ఆదాయాన్ని న్యాయమైన పద్ధతిలో పంచుకోవాలని పేర్కొన్నారు. అలా చేయకపోతే సృజన, ఆవిష్కరణలపై ప్రతికూల ప్రభావం పడుతుందన్నారు. ఈ దిశగా స్వచ్ఛందంగా చర్యలు తీసుకోకపోతే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. దిల్లీలో గురువారం జరిగిన డిజిటల్ న్యూస్ పబ్లిషర్స్ అసోషియేషన్ సదస్సులో ఆయన ప్రసంగించారు. కృత్రిమ మేధ(ఏఐ) వాడకంపై నియంత్రణ అవసరమని, సంబంధిత వ్యక్తుల అనుమతి లేకుండా వారి రూపం, గాత్రం, వ్యక్తిత్వాన్ని పోలిన ఏఐ కంటెంట్‌ను రూపొందించకూడదని ఆయన నొక్కి చెప్పారు. దీన్ని మానవ సమాజంలో ఒక ప్రాథమిక అవసరంగా పేర్కొన్నారు. నమ్మకం అనే పునాదులపైనే ఈ సమాజం ఏర్పడిందని చెబుతూ ఆయన మీడియా పాత్రను ఉదాహరణగా ప్రస్తావించారు. సమాచారాన్ని ధ్రువీకరించి మాత్రమే ప్రచురించడం, పాక్షికత లేకుండా వ్యవహరించడం, బాధ్యత వహించడం వంటి విలువల వల్లే మీడియాకు విశ్వసనీయత ఉందని, ఇదే ధోరణిని డిజిటల్ వేదికలూ అనుసరించాలన్నారు.

జస్టిస్ వర్మపై విచారణ కమిటీ పునర్వ్యవస్థీకరణ

- గడువునూ పొడిగించిన స్పీకర్ ఓం బిర్లా



ఓం బిర్లా

దిల్లీ: ఇంట్లో కాలిన నోట్ల కట్టలు లభించాయని ఆరోపణలను ఎదుర్కొంటున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మపై ప్రవేశపెట్టిన అభిశంసనకు సంబంధించి ఏర్పాటు చేసిన విచారణ కమిటీని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా పునర్వ్యవస్థీకరించారు. గురువారంతో ముగిసిన కమిటీ గడువునూ మరో 3 నెలలపాటు పొడిగించారు. జడ్జిని అభిశంసించాలని కోరుతూ పలు పార్టీలు నోటీసు ఇచ్చిన నేపథ్యంలో గత ఏడాది ఆగస్టు 12వ తేదీన విచారణకు కమిటీని స్పీకర్ ఏర్పాటు చేశారు. దానిని పాక్షికంగా పునర్వ్యవస్థీకరిస్తూ మార్చి 6వ తేదీ నుంచి అమల్లోకి వచ్చేలా ఆయన తాజాగా నిర్ణయం తీసుకున్నారు. దీనిపై లోక్‌సభ సెక్రటరీ జనరల్ ఉత్పల్ కుమార్ బుధవారం నోటిఫికేషన్ జారీ చేశారు. దాని ప్రకారం.. కమిటీలో సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ అరవింద్ కుమార్, బాంబే హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రశేఖర్, కర్ణాటక హైకోర్టు సీనియర్ న్యాయవాది బి.వి.ఆచార్య ఉన్నారు. ఇందులో జస్టిస్ అరవింద్ కుమార్, ఆచార్య గత కమిటీలోనూ ఉన్నారు. గత కమిటీలో ఉన్న మద్రాస్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ మణీంద్ర మోహన్ శ్రీవాస్తవ మార్చి 5వ తేదీన పదవీ విరమణ చేస్తున్నారు. ఆయన స్థానంలో జస్టిస్ చంద్రశేఖర్‌ను స్పీకర్ నియమించారు. ఈ కమిటీకి మరో న్యాయవాది సాయమూ తీసుకుంటామని కేంద్ర న్యాయశాఖ వెల్లడించింది.

క్యూబా సరిహద్దుల్లోకి ప్రవేశించేందుకు యత్నం

సైన్యం కాల్పుల్లో నలుగురి మృతి

హవానా: దేశ సరిహద్దుల్లో చొరబడేందుకు ప్రయత్నించిన దుండగుల్లో నలుగురు తమ భద్రతా బలగాలు జరిపిన దాడిలో మరణించారని క్యూబా ప్రభుత్వం గురువారం ప్రకటించింది. అమెరికాలో నివసిస్తున్న క్యూబా దేశస్థులైన వీరు...తమ దేశంలోకి చొరబడి ఉగ్రవాదాన్ని పురిగొల్పేందుకు యత్నించారని తెలిపింది. వీరికి నేరపూరిత చరిత్ర ఉందని, దుండగుల్లో ఇద్దరు వాంటెడ్ వ్యక్తులని తెలిపింది. ఫ్లోరిడాకు చెందిన పడవలో బుధవారం 10 మంది దుండగులు తమ దేశ ప్రాదేశిక జల్లాలోకి ప్రవేశించి...తొలుత సైన్యంపై కాల్పులకు తెగబడ్డారని క్యూబా అధికారులు తెలిపారు. ఈ దాడిలో ఓ అధికారి తీవ్రంగా గాయపడినట్లు చెప్పారు. ప్రతిగా భద్రతా దళాలు జరిపిన దాడిలో నలుగురు దుండగులు మృతిచెందగా...మరో ఆరుగురు గాయపడ్డారు. ఈ ఘటనపై తమకు ముందే సమాచారమందిందని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో పేర్కొన్నారు. వారంతా అమెరికా పౌరులా? లేదా క్యూబా జాతీయులా? అని తెలుసుకునేందుకు సమాచారం సేకరిస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

9 ఏళ్ల బాలికకు కార్డియాక్ అరెస్ట్

జైపుర్: రాజస్థాన్‌లో విషాదకర ఘటన చోటుచేసుకుంది. స్కూల్‌లో ఆడుకుంటున్న 9 ఏళ్ల బాలిక కార్డియాక్ అరెస్ట్ కారణంగా కుప్పకూలి ప్రాణాలు కోల్పోయింది. మూడు రోజుల కిందట జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రాజస్థాన్‌లోని నాగౌర్ జిల్లా గోటన్‌కు చెందిన రాజేంద్ర బపేడియా కుమార్తె 9 ఏళ్ల దివ్య స్థానికంగా ఉన్న ఓ స్కూల్‌లో 5వ తరగతి చదువుతోంది. ఈ నెల 23న ఆ బాలిక స్కూల్ గ్రౌండ్‌లో ఆడుకుంటున్న సమయంలో ఉన్నట్టుండి కుప్పకూలింది. పాఠశాల సిబ్బంది వెంటనే ఆ చిన్నారిని దగ్గర్లోని ఆసుపత్రికి తరలించారు. అయితే, అప్పటికే ఆ బాలిక మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. బాలిక శరీరంపై ఎలాంటి గాయాలు లేవని, కార్డియాక్ అరెస్ట్ వల్లే మరణించి ఉంటుందని వైద్యులు పేర్కొన్నారు. కాగా.. కొన్ని నెలల క్రితం దివ్య అన్న అభిషేక్ కూడా ఇలాగే మరణించినట్లు తెలుస్తోంది. గతేడాది సెప్టెంబరులో ఆ బాలుడు ఇంట్లో ఆడుకుంటూ కుప్పకూలాడు. ఆసుపత్రికి తీసుకెళ్లేసరికే ప్రాణాలు కోల్పోయాడు.

ఎప్‌స్టీన్ గురించి నాకేమీ తెలీదు: హిల్లరీ



వాషింగ్టన్: బాలికల్ని నేతలకు, ఇతర ప్రముఖులకు ఎరగావేసి వారి నుంచి కీలక సమాచారం, ఇతర ప్రయోజనాలు రాబట్టిన లైంగిక నేరగాడు ఎప్‌స్టీన్ వ్యవహారంపై అమెరికా విదేశాంగ శాఖ మాజీ మంత్రి హిల్లరీ క్లింటన్ గురువారం దేశ పార్లమెంటు (కాంగ్రెస్) సభ్యుల కమిటీ సమక్షంలో సాక్ష్యం చెప్పారు. ఎప్‌స్టీన్ నేరాలను గురించి తనకేమీ తెలియదని, అతణ్ని ఏనాడూ కలవలేదని హిల్లరీ స్పష్టం చేశారు. రెండు రోజుల పాటు సాగే ఈ విచారణ ప్రక్రియలో భాగంగా ఆమె భర్త, అమెరికా మాజీ అధ్యక్షుడు బిల్‌క్లింటన్ కూడా సభ్యుల సమక్షంలో సాక్ష్యం చెప్పనున్నారు.

భారత నైతిక స్థాయిని తగ్గించారు

మోదీపై కాంగ్రెస్ ఆగ్రహం

దిల్లీ: ఇజ్రాయెల్ పార్లమెంటును ఉద్దేశించి ప్రధాని మోదీ బుధవారం చేసిన ప్రసంగంపై కాంగ్రెస్ పార్టీ విమర్శలు గుప్పించింది. గాజా మారణహోమం విషయంలో ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహును ఆయన నిస్సిగ్గుగా వెనకేసుకొచ్చారని.. తద్వారా భారత నైతిక స్థాయిని తగ్గించారని పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ 'ఎక్స్'లో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇజ్రాయెల్‌ను భారత్ అధికారికంగా గుర్తించిన రోజే తాను (మోదీ) జన్మించానంటూ ప్రధాని చేసిన వ్యాఖ్యను ఎద్దేవా చేశారు.

ఆరావళి నిర్వచనంపై సందిగ్ధతలు తొలగాలి

- కమిటీకి నిపుణుల్ని సూచించండి: సుప్రీంకోర్టు

దిల్లీ: ఆరావళి పర్వత శ్రేణుల్ని నిర్వచించే కమిటీలో సభ్యులుగా నియమించేందుకు నిపుణుల పేర్లు సూచించాల్సిందిగా సుప్రీంకోర్టు గురువారం పర్యావరణ శాఖను, సంబంధిత ఇతర వర్గాలను కోరింది. ఆరావళి శ్రేణులకు ఏకరూప నిర్వచనం ఇవ్వడంపై తలెత్తిన వివాదాన్ని గత డిసెంబరు 29న పరిగణనలోకి తీసుకున్న కోర్టు అందుకు సంబంధించి తాను నవంబరు 20న వెలువరించిన ఆదేశాలను పక్కన పెట్టడంతోపాటు ఆరావళి శ్రేణుల్లో ఖనిజ తవ్వక కార్యకలాపాలను నిలిపివేసింది. ఈ అంశంపై సందిగ్ధతల్ని తొలగించాల్సిన అవసరం ఉందని కోర్టు ఆనాడు పేర్కొంది. సుప్రీంకోర్టు ఆదేశాల కారణంగా ఆరావళి ప్రాంతంలో ఖనిజ తవ్వకాల హక్కును కోల్పోయిన సంస్థ దాఖలు చేసిన వ్యాజ్యంపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చీ, జస్టిస్ విపుల్ ఎం. పంచోలీల ధర్మాసనం తాజా విచారణ చేపట్టింది. వ్యాజ్యకర్త గతంలో న్యాయపోరాటం ద్వారా ఖనిజ తవ్వకానికి లైసెన్సు సాధించారని, కోర్టు ఆదేశం కారణంగా ఆ హక్కు కోల్పోయారని పిటిషనర్ తరఫు న్యాయవాది ముకుల్ రోహత్గీ అన్నారు. దీనికి ధర్మాసనం స్పందించింది. "న్యాయబద్ధమైన ఖనిజ తవ్వకాలను మాత్రమే మేం అనుమతిస్తాం. నిపుణులు ఆరావళి నిర్వచనాన్ని ఖరారు చేయనివ్వండి. వంతెనలన్నిటినీ దాటి గమ్యస్థానం చేరుతాం" అని సీజేఐ అన్నారు. ఈ విచారణలో తమకు సహకారం అందించాల్సిందిగా న్యాయవాది జయ్ చీమాను ధర్మాసనం కోరింది. తదుపరి విచారణ జరిగేనాటికి నిపుణుల కమిటీని నియమించి ఈ అంశంలో నిగ్గుతేల్చాల్సిన విషయాల జాబితాను సిద్ధం చేస్తామని తెలిపింది. గత నవంబరు 20న సుప్రీంకోర్టు ఆరావళి కొండలు, శ్రేణులకు ఏకరూప నిర్వచనాన్ని ఆమోదించి దిల్లీ, హరియాణా, రాజస్థాన్, గుజరాత్‌లలో ఆరావళి శ్రేణులున్న ప్రాంతాల్లో తాజా మైనింగ్ లీజుల జారీని నిలిపివేసింది. కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల శాఖ సిఫార్సును ఆమోదించింది.



ట్రైబ్యునళ్లు భారంగా మారాయి

- వాటి పనితీరుపై సుప్రీంకోర్టు పెదవి విరుపు

దిల్లీ: దేశంలో ట్రైబ్యునళ్ల పనితీరుపై సుప్రీంకోర్టు గురువారం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. అవి భారంగా, గందరగోళంగా మారాయని, జవాబుదారీతనం ఏమాత్రం లేకుండా పోయిందని పేర్కొంది. ఒక ఆర్థిక ట్రైబ్యునల్‌కు చెందిన సాంకేతిక సభ్యులైతే ఏకంగా తీర్పులు రాసే ప్రక్రియను కూడా ఇతరులకు అప్పగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రభుత్వం ఏర్పాటు చేసిన వ్యవస్థలైన ట్రైబ్యునళ్లలో జవాబుదారీతనం పూర్తిగా కొరవడిందని, ఎవరి అదుపాజ్ఞలూ లేని ప్రదేశాలుగా అవి మారిపోయాయని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్ మల్యా బాగ్చీ, జస్టిస్ విపుల్ ఎం.పంచోలిల ధర్మాసనం పేర్కొంది. 2021నాటి ట్రైబ్యునళ్ల సంస్కరణ చట్టాన్ని గత సంవత్సరం కోర్టు కొట్టివేసిన దరిమిలా ట్రైబ్యునల్ సభ్యులు, ఛైర్‌పర్సన్ల పదవీ కాలాన్ని పొడిగించాల్సిందిగా కోరుతూ దాఖలైన వ్యాజ్యంపై విచారణ సందర్భంగా న్యాయస్థానం ఈ అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. ఖాళీల తక్షణ భర్తీకి ఏర్పాట్లు చేయాలని అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణిని ఆదేశించింది. టీడీశాట్ ట్రైబ్యునల్‌కు ప్రస్తుతం ఛైర్‌పర్సన్‌గా పనిచేస్తున్న వ్యక్తి పదవీ విరమణ చేశాక అందులోని సాంకేతిక సభ్యుల్లో ఒకరు తాత్కాలిక ఛైర్‌పర్సన్‌గా నియమితులవుతారని తీర్మానించింది. "అటార్నీ జనరల్ గారూ! ట్రైబ్యునళ్లను సృష్టించింది మీరు (కేంద్రం). అవి మీకు తలనొప్పిగా, మాకు భారంగా మారాయి. వెలువరిస్తున్న తీర్పుల నేపథ్యంలో వాటిని భారంగా పేర్కొనాల్సి వస్తోంది" అని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ అన్నారు.

బెంగాల్‌లోని పోస్టాఫీసులకు బాంబు బెదిరింపులు

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్‌లోని పలు పోస్టాఫీసులకు బాంబు బెదిరింపులు కలకలం సృష్టించాయి. కోల్‌కతాలోని హౌరాలో పాస్‌పోర్టు సేవలందించే మహాత్మాగాంధీ రోడ్ పోస్టాఫీస్ సహా పశ్చిమ బర్ధమాన్ జిల్లాలోని ఆసన్‌సోల్, తూర్పు బర్ధమాన్ జిల్లాలోని కత్వా పోస్టాఫీసులకు ఈ-మెయిల్ ద్వారా గురువారం బెదిరింపులు వచ్చాయి. సమాచారం అందుకున్న పోలీసులు తక్షణమే కార్యాలయాలను ఖాళీ చేయించి తనిఖీలు నిర్వహించారు. బాంబు నిర్వీర్య దళాలు, జాగిలాలు ఘటనా స్థలాన్ని సోదా చేశాయి. అనుమానాస్పదంగా ఏదీ లభించలేదని, నిందితులను పట్టుకునేందుకు దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు తెలిపారు. మరోవైపు, వారణాసిలోని జిల్లా, సెషన్స్ కోర్టుకు బాంబు బెదిరింపులు వచ్చాయి నెలరోజుల్లో కోర్టుకు ఇటువంటి బెదిరింపులు రావడం ఇది నాలుగోసారి. కోర్టు ప్రాంగణంలో సోదాలు నిర్వహిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

చిదంబరంపై విచారణ వేగవంతం..

అనుమతి పత్రాన్ని కోర్టుకు సమర్పించిన ఈడీ

దిల్లీ: కాంగ్రెస్ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి పి.చిదంబరంపై విచారణను వేగవంతం చేయాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ భావిస్తోంది. ఎయిర్‌సెల్-మ్యాక్సిస్ ఒప్పందం, ఐఎన్ఎక్స్ మీడియా ఒప్పందాల్లో నగదు అక్రమ చలామణి కోణంలో ఆయన్ని విచారించడానికి తాము పొందిన అనుమతి పత్రాన్ని గురువారం ప్రత్యేక న్యాయస్థానంలో సమర్పించింది. మొదటి కేసులో 2018లో, రెండో కేసులో 2020లో అభియోగపత్రాలను ఈడీ దాఖలు చేసింది. ఈ కేసులలో తామెలాంటి తప్పు చేయలేదని, భాజపా నేతృత్వంలోని కేంద్ర సర్కారు తమను రాజకీయంగా వేధిస్తోందని చిదంబరం, ఆయన కుమారుడు కార్తీ చిదంబరం చెబుతూ వస్తున్నారు.



2027 జనగణనకు సాంకేతిక హంగులు

32 లక్షల సిబ్బందికి డిజిటల్ పరికరాలు

దిల్లీ: జనగణన-2027లో భాగంగా క్షేత్ర స్థాయిలో నిర్వహించే జనాభా లెక్కల సేకరణ ప్రక్రియను అధికార వర్గాలు రియల్ టైమ్‌లో (లైవ్‌లో) ఎప్పటికప్పుడు పర్యవేక్షించనున్నాయి. ఇందుకోసం సెన్సస్ మేనేజ్‌మెంట్ అండ్ మానిటరింగ్ సిస్టమ్ (సీఎంఎంఎస్) అనే డిజిటల్ పోర్టల్‌ను వినియోగించనున్నారు. ఈమేరకు వివరాలతో అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల చీఫ్ సెక్రటరీలకు రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా (ఆర్‌జీఐ) మృత్యుంజయ్ కుమార్ నారాయణ్ సర్క్యులర్ జారీ చేశారు. ఈసారి జనాభా లెక్కలను డిజిటల్ విధానంలోనే సేకరించనున్నట్లు తెలిపారు. ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌తో కూడిన డిజిటల్ పరికరాలను జనాభా లెక్కలను సేకరించే 32 లక్షల మంది క్షేత్రస్థాయి సిబ్బంది, ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లకు అందిస్తామన్నారు. వీటిలోనే ప్రజలు, కుటుంబాల జనాభా, ఆర్థిక, సామాజిక వివరాలన్నీ నమోదు చేస్తారని మృత్యుంజయ్ కుమార్ నారాయణ్ చెప్పారు. జనాభా లెక్కల సేకరణ ప్రక్రియ 2027లో జరుగుతుంది. అంతకంటే ముందు ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి సెప్టెంబరు 30 వరకు గృహ జాబితా బ్లాకుల (హెచ్ఎల్‌బీ)ను నమోదు చేసే ప్రక్రియ జరుగుతుంది. ప్రతి రాష్ట్రం/కేంద్ర పాలిత ప్రాంతం ఇందుకోసం ఏదైనా 30 రోజుల వ్యవధిని కేటాయించాల్సి ఉంటుంది.



సింహాసనంపై ఆశీనులైన నూతన మఠాధిపతి వీరధర్మజ వెంకటాద్రిస్వామి

వీరబ్రహ్మేంద్రస్వామి మఠాధిపతిగా వెంకటాద్రిస్వామికి పట్టాభిషేకం

బ్రహ్మంగారిమఠం, న్యూస్‌టుడే: వైఎస్సార్ కడప జిల్లా పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి మఠాధిపతిగా వీరధర్మజ వెంకటాద్రిస్వామికి వేదపండితులు, మఠాధిపతులు గురువారం పట్టాభిషేకం నిర్వహించారు. మఠాధిపతి నియామక విషయంలో కొన్నేళ్ల కిందట వారసుల మధ్య విభేదాలు తలెత్తాయి. దీనిపై కొందరు న్యాయస్థానానికి వెళ్లారు. దీంతో సమస్య ఐదేళ్లపాటు న్యాయస్థాన పరిధిలో ఉంది. ఇటీవల వెంకటాద్రిస్వామికి అనుకూలంగా తీర్పు రావడంతో భక్తులు, వేదపండితుల మధ్య మఠాధిపతిగా బాధ్యతలు స్వీకరించారు.

అతిసారం మరణాలపై వైకాపా శవరాజకీయాలు


- తక్షణ స్పందనతో సమస్య అదుపులోకి
- శ్రీకాకుళంలో కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు



కంద్రవీధిలో కాలువలో ఉన్న కుళాయిని పరిశీలిస్తున్న కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, ఎమ్మెల్యే గొండు శంకర్ తదితరులు

శ్రీకాకుళం (కలెక్టరేట్), న్యూస్‌టుడే: వైకాపా నేతలకు శవ రాజకీయాలు చేయడం అలవాటుగా మారిందని కేంద్ర పౌరవిమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు విమర్శించారు. అతిసారం మరణాలపై తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. ఆ పార్టీ నేత జగన్‌మోహన్‌రెడ్డి సహా నేతలందరికీ ఇదే అలవాటని మండిపడ్డారు. శ్రీకాకుళం నగరంలోని అతిసార బాధిత ప్రాంతాల్లో గురువారం మంత్రి పర్యటించారు. వ్యాధిబారిన పడి మృతిచెందిన సురేష్ కుటుంబాన్ని, ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నగరంలో అతిసారం అదుపులోనే ఉందని స్పష్టం చేశారు. కేసులు వెలుగు చూసిన వెంటనే అధికార యంత్రాంగం స్పందించి ముమ్మరంగా చర్యలు చేపట్టి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చిందన్నారు. తాగునీటి నమూనాలు సేకరించి పరీక్షలు చేయిస్తున్నామన్నారు. వాస్తవ పరిస్థితులు తెలుసుకునేందుకు పర్యటించినట్లు తెలిపారు. బాధితుల్లో భరోసా కల్పించామన్నారు.

చేతులు లేవని చిన్నా.. ఆగిపోకు కన్నా!



చదువుకోవాలన్న తపన ఉండాలే కానీ అంగవైకల్యం అడ్డుకాదని నిరూపించాడు పార్వతీపురం మన్యం జిల్లా వీరఘట్టానికి చెందిన కె.కార్తిక్. ప్రస్తుతం గుమ్మలక్ష్మీపురం వృత్తి విద్యా కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. మూడో తరగతి చదువుతున్న సమయంలో విద్యుదాఘాతానికి గురవడంతో రెండు చేతులూ కోల్పోయాడు. అయినా ఎవరి సహాయం అవసరం లేకుండా పెన్నుతో రాయడాన్ని అభ్యసించాడు. ప్రస్తుతం ఇంటర్ పరీక్షల సందర్భంగా సమాధానాలు తనే రాసుకుంటున్నాడు.

– న్యూస్‌టుడే, గుమ్మలక్ష్మీపురం

క్షేత్రస్థాయి పర్యటనలకు మీరు వెళతారా... నేను రావాలా?

- ప్రజల్లోకి వెళ్లి మాట్లాడితేనే సమస్యలు తెలుస్తాయి
- గదుల్లో కూర్చుంటే వాస్తవాలు తెలియవు
- రాజమహేంద్రవరం, శ్రీకాకుళం ఘటనలపై సమీక్షలో 2జిల్లాల కలెక్టర్లపై సీఎం ఆగ్రహం
- ప్రజల ప్రాణాలు పోవడానికి కారకులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశం

ఈనాడు, అమరావతి: నీటి కాలుష్యం కారణంగా శ్రీకాకుళంలో డయేరియా, రాజమహేంద్రవరంలో కల్తీ పాల కారణంగా పలువురు మృతిచెందిన ఘటనలపై నిర్వహించిన సమీక్షలో రెండు జిల్లాల కలెక్టర్లపై సీఎం చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టర్లు నిత్యం ప్రజల్లో ఉండాలని, అప్పుడే అనుకున్న మార్పు రాష్ట్రస్థాయిలో చూపించగలమని అన్నారు. ఘటన జరిగాక స్పందిస్తే ఉపయోగం ఉండదని, ముందస్తు పర్యవేక్షణ, అప్రమత్తతతో ఈ తరహా ఘటనలు జరగకుండా చూడాలని సీఎం సూచించారు. అసెంబ్లీలోని తన ఛాంబర్‌లో వైద్య ఆరోగ్య, పురపాలక శాఖలపై గురువారం నిర్వహించిన సమీక్షలో సీఎం చంద్రబాబు కలెక్టర్ల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. బాధితులకు అందుతున్న వైద్యంపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. బాధ్యులపై కఠినచర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఆకస్మిక తనిఖీలు చేయాలి

'జిల్లా కలెక్టర్లు అధికారులతో కలిసి ఆకస్మిక తనిఖీలు చేయాలి. కిందిస్థాయి యంత్రాంగాన్ని యాక్టివేట్ చేసేందుకు ప్రతి అధికారీ క్షేత్రస్థాయిలో పర్యటించాలి. ఒక్కోసారి ఒక్కో శాఖపై ఆకస్మిక తనిఖీకి కలెక్టర్లు వెళ్తే మంచి ఫలితాలొస్తాయి. శ్రీకాకుళంలో తాగునీరు కలుషితమైన ఘటనలో ముందస్తు పర్యవేక్షణ, తనిఖీలు చేసి ఉంటే సమస్య వచ్చేది కాదు' అని సీఎం అభిప్రాయపడ్డారు.

> 'ఆకస్మిక తనిఖీలకు, క్షేత్రస్థాయి పర్యటనలకు మీరు వెళతారా? నేను మొదలుపెట్టాలా? గదుల్లో కూర్చుంటే వాస్తవాలు తెలియవు. క్షేత్రస్థాయికి వెళ్లండి. ప్రజలను కలిసి మాట్లాడండి. అప్పుడే సమస్యలు తెలుస్తాయి. మీరు క్షేత్రస్థాయికి వెళ్లకపోతే నేను మొదలుపెడతా'
>
> –రాజమహేంద్రవరం, శ్రీకాకుళం ఘటనలపై సమీక్షలో సీఎం చంద్రబాబు

బాధితులకు మెరుగైన వైద్యం అందిస్తున్నాం: శ్రీకాకుళం కలెక్టర్

రెండు ఘటనల్లో ప్రస్తుత పరిస్థితులను శ్రీకాకుళం, తూర్పుగోదావరి జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, వైద్య ఆరోగ్య, మున్సిపల్ శాఖల అధికారులు వివరించారు. 'శ్రీకాకుళంలో 129 డయేరియా కేసులు నమోదయ్యాయి. 107 మందికి చికిత్స అందిస్తున్నాం. పైపుల ద్వారా నీటి సరఫరాను నిలిపేసి ట్యాంకర్లతో అందిస్తున్నాం. నాలుగు ఇంజినీరింగ్ బృందాలు 40 లీకులను గుర్తించి యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాయి. విశాఖ నుంచి మొబైల్ టెస్టింగ్ ల్యాబ్‌లు రప్పిస్తున్నాం. ప్రభావిత ప్రాంతాల్లో వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నాం. రిమ్స్, కిమ్స్, శ్రీకాకుళం జెమ్స్‌లో ప్రత్యేక వార్డుల్లో చికిత్స అందిస్తున్నాం. నెఫ్రాలజీ నిపుణులు, ఇతర వైద్యనిపుణులు అందుబాటులో ఉన్నారు. డయేరియా వ్యాప్తికి కారణంపై విచారణ చేస్తున్నాం. ఇంటింటి సర్వే నిర్వహించి శానిటేషన్ కిట్‌లు అందిస్తున్నాం' అని శ్రీకాకుళం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ వివరించారు. 'స్థానికులు నీళ్లట్యాంకులు శుభ్రం చేయకపోవడం, పైపులైన్లు కాలువలు క్రాస్ అవ్వడంతో పాటు వాటర్ ప్రెజర్ లేదని మోటార్లు పెట్టి నీటిని తీసుకోవడంతో కలుషిత నీరు ఇళ్లకు చేరింది' అని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు.



శ్రీకాకుళం, తూర్పుగోదావరి జిల్లాల అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్షిస్తున్న సీఎం చంద్రబాబు

నిపుణులతో వైద్యసేవలు: తూర్పుగోదావరి కలెక్టర్

కల్తీ పాల ఘటన, బాధితులకు అందిస్తున్న చికిత్సలపై ముఖ్యమంత్రికి తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి వివరించారు. 'పాల కల్తీ కారణంగా ఐదుగురు మృతిచెందారు. మరో 15మంది చికిత్స పొందుతున్నారు. చౌడేశ్వరినగర్, స్వరూపనగర్‌లో తొమ్మిది వైద్య బృందాలను ఏర్పాటుచేశాం. 315 మంది నుంచి రక్తన మూనాలు సేకరించి విశ్లేషిస్తున్నాం. కల్తీ పాలు తాగిన 957 మందిని రోజూ పరీక్షిస్తున్నాం. మృతుల కుటుంబాలకు రూ.10లక్షల ఆర్థికసాయం అందించాం. నిందితుడైన పాల సరఫరాదారు అడ్డాల గణేశ్వరరావుపై క్రిమినల్ కేసు నమోదుచేసి కస్టడీకి తీసుకుని విచారిస్తున్నారు. 8 మంది పరిస్థితి ఇప్పటికీ విషమంగా ఉంది. నిపుణులైన వైద్యులతో చికిత్సలు అందిస్తున్నాం. మిగిలిన ప్రాణాలు కాపాడేందుకు అన్నిరకాల ప్రయత్నాలు చేస్తున్నాం' అని కలెక్టర్ సీఎంకు వివరించారు. సమీక్షలో మంత్రులు నారాయణ, కొండపల్లి శ్రీనివాస్, నిమ్మల రామానాయుడు, ఆయా శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. రెండు జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, ఎమ్మెల్యేలతో పాటు కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు కూడా వర్చువల్‌గా పాల్గొన్నారు.

పసిపాపకు అపురూప వితరణ

- రూ.16 కోట్లు సమకూరుతాయని ఊహించలేదు
- విదేశీయులు సహా లక్షలమంది స్పందించారు
- పునర్వికశ్రీ తల్లిదండ్రుల ఆనందం



భార్య పుష్పావతి, కుమార్తె పునర్వికశ్రీలతో సురేశ్‌కుమార్

ఈనాడు, కర్నూలు: తన కుమార్తెకు వచ్చిన కష్టాన్ని ప్రతి ఒక్కరూ తమ కష్టంగా భావించి తోచిన సాయం చేయడంతో భారీ మొత్తంలో ఆర్థిక సాయం అందిందని వెల్దుర్తికి చెందిన జేఎం సురేశ్‌కుమార్ దంపతులు పేర్కొన్నారు. క్రౌడ్ ఫండింగ్‌తో రూ.16 కోట్ల ఆర్థిక సాయం అందుతుందని తాను కలలో కూడా ఊహించలేదని తెలిపారు. గురువారం కర్నూలులో వారు విలేకరులతో మాట్లాడారు. 'నా కుమార్తె పునర్వికశ్రీకి కోట్లమందిలో ఒకరికి వచ్చే ఎస్ఎంఏ (స్పైనల్ మస్క్యులర్ అట్రోఫి)- టైప్-1 ఉందని, ఎక్కువకాలం బతకదని వైద్యులు చెప్పడంతో తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యాం. పాపకు ఏడాదిన్నర వయసు వచ్చేలోపు రూ.16 కోట్ల విలువైన ఇంజెక్షన్ చేయించాలని సూచించారు. ఏం చేయాలో దిక్కుతోచని పరిస్థితి ఎదురైంది. గతేడాది నవంబరు 29న 'ఈనాడు'లో కథనం ప్రచురితం కావడంతో పలువురు స్పందించారు. 'క్రౌడ్ ఫండింగ్' ద్వారా కూడా ప్రచారం మొదలుపెట్టాం. దీంతో విదేశాల నుంచి లక్షలమంది స్పందించడంతో రూ.పది కోట్ల వరకు విరాళాలు అందాయి. మరో రూ.6 కోట్ల గురించి ఆందోళన చెందుతున్న నేపథ్యంలో మంత్రి లోకేశ్ ఆ మొత్తం సమకూర్చే బాధ్యత తనదని ప్రకటించడంతో మా ఆనందానికి అవధుల్లేవు. నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి ప్రధానమంత్రి సహాయ నిధి నుంచి రూ.50 లక్షలు మంజూరు చేయించారు. దాతలు అందరికీ కృతజ్ఞతలు' అని తెలిపారు.

లైంగిక దాడుల నివారణకు ఆపరేషన్ చిన్నారి-తల్లి

పోస్టర్ ఆవిష్కరించిన డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా



పోస్టర్ ఆవిష్కరిస్తున్న డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా, అదనపు డీజీ(శాంతి భద్రతలు) ఎస్.మధుసూదన్‌రెడ్డి, ఐజీపీ బి.రాజకుమారి తదితరులు

ఈనాడు, అమరావతి: చిన్నారులపై అఘాయిత్యాలకు పాల్పడే నిందితులకు కఠిన శిక్షలు పడేలా 'స్పీడ్ ట్రయల్ మోనిటరింగ్' కార్యక్రమం చేపట్టినట్లు డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా పేర్కొన్నారు. చిన్నారులపై లైంగిక దాడుల నివారణకు మహిళ, శిశు భద్రత విభాగం ఆధ్వర్యంలో 'ఆపరేషన్ చిన్నారి-తల్లి' కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. డీజీపీ కార్యాలయంలో గురువారం ఆయన ఇతర పోలీసు అధికారులతో కలిసి దీనికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. 'సురక్షిత బాల్యం- సుస్థిర భవిష్యత్తు' అనే ట్యాగ్‌లైన్‌తో దీన్ని రూపొందించారు. చిన్నారులు, మహిళలపై లైంగిక దాడులకు పాల్పడే నేరస్థులు, మాదకద్రవ్యాల బానిసలు, అసాంఘిక శక్తులపై కఠిన చర్యలు తీసుకోవడంతోపాటు హానికరమైన ప్రదేశాల్లో నివసించే బాలికలు, వారి తల్లుల్ని అప్రమత్తం చేయడమే ఈ కార్యక్రమం ఉద్దేశం అని డీజీపీ తెలిపారు. పాఠశాలలు, అంగన్‌వాడీలు, వసతిగృహాల్లో గుడ్ టచ్-బ్యాడ్ టచ్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. ఐజీపీ బి.రాజకుమారి పర్యవేక్షణలో తాడేపల్లిలోని మహిళ, శిశు భద్రత కార్యాలయం ఈ కార్యక్రమ అమలును పరిశీలిస్తుందని వివరించారు. కార్యక్రమంలో అదనపు డీజీ(శాంతి భద్రతలు) ఎస్.మధుసూదన్‌రెడ్డి, ఎస్పీ శ్రీదేవిరావు తదితరులు పాల్గొన్నారు.





డ్రోన్ వినియోగం తీరును ఎస్పీ నరసింహ కిశోర్‌కు వివరిస్తున్న విద్యార్థులు ★ మొదటి బహుమతి గెలుచుకున్న కోరుకొండ సిద్ధార్థ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ విద్యార్థినులు కె.అఖిల, వి.లాస్యకు నగదు, ప్రశంసాపత్రాలు అందించి, అభినందిస్తున్న ఏఎస్పీ చెంచురెడ్డి. చిత్రంలో శ్రీ గౌతమి పాఠశాల డైరెక్టర్ రవికుమార్, జిల్లా సైన్స్ అధికారి నెహ్రూ, సైన్స్ ఉపాధ్యాయులు సుసత్యరేఖ, ఆనంద్, అధ్యాపకులు బాలకృష్ణ, కృష్ణసాయి, రాజమహేంద్రవరం 'ఈనాడు' యూనిట్ ఇన్‌ఛార్జి ఐవీ శ్రీనివాస్ సుబ్రహ్మణ్యం

బాలల ఆవిష్కరణలు.. భళా!

- రాజమహేంద్రవరంలో 'ఈనాడు' మెగా వైజ్ఞానిక ప్రదర్శన
- 105 ప్రాజెక్టులతో ఆకట్టుకున్న 210 మంది విద్యార్థులు

ఈనాడు, రాజమహేంద్రవరం, కాకినాడ: అన్నదాతల అవసరాల నుంచి అంతరిక్ష యాత్రల వరకు, పాలల్లో కల్తీ గుర్తింపు నుంచి జీవవ్యర్థాల పునర్వినియోగం వరకు, సుఖమయ ప్రయాణాల నుంచి ప్రమాదాల్లోంచి బయటపడే మార్గాల వరకు.. ఎన్నో అంశాలపై వినూత్న ప్రయోగాలతో ఆకట్టుకున్నారు విద్యార్థులు. 'ఈనాడు', శ్రీగౌతమి స్కూల్ సంయుక్తంగా గురువారం రాజమహేంద్రవరంలోని పోలీసు కన్వెన్షన్ హాలులో నిర్వహించిన మెగా వైజ్ఞానిక ప్రదర్శనకు విశేష స్పందన లభించింది. తూర్పుగోదావరి, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల నుంచి ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన 210 మంది విద్యార్థులు 105 స్మార్ట్ ప్రాజెక్టులను ప్రదర్శించారు. తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి జ్యోతి వెలిగించి సైన్స్ ఫెయిర్‌ను ప్రారంభించారు. ఎస్పీ డి.నరసింహకిశోర్ విచ్చేసి, ప్రాజెక్టులను తిలకించారు. ముగింపు వేడుకల్లో అదనపు ఎస్పీ చెంచురెడ్డి పాల్గొని విజేతలకు బహుమతులు అందించారు.

ప్రశ్నించే తత్వాన్ని సైన్స్ నేర్పుతుంది

కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ 'దేన్నీ గుడ్డిగా నమ్మకుండా ఎందుకు, ఎలా అని ప్రశ్నించే తత్వాన్ని నేర్పడంతో పాటు ఆలోచనా శక్తిని రేకెత్తించేదే సైన్స్. నేడు మార్కులు, సర్టిఫికెట్ల కంటే నైపుణ్యాలకు విలువ పెరిగింది. మన చుట్టూ ఉన్న సమస్యలకు మనమే పరిష్కారం కనిపెట్టాలన్న ఆసక్తితో విద్యార్థులు రూపొందించిన ఎగ్జిబిట్లు బాగున్నాయ'ని కితాబిచ్చారు. పలు ఎగ్జిబిట్లను పరిశీలించి, వాటి తయారీ, వినియోగం, ఉపయోగాలను తెలుసుకున్న ఎస్పీ డి.నరసింహకిశోర్.. అమలాపురం వాగ్దేవి పాఠశాల విద్యార్థి ఓంకార్ తయారుచేసిన మెడికల్ ఎయిర్ యూనిట్ డ్రోన్‌ను నిశితంగా పరిశీలించారు. ఈ డ్రోన్‌ను అత్యవసర వైద్యసేవలకు ఎలా ఉపయోగించవచ్చో ఓంకార్ వివరించాడు. ఎస్పీ ఆ విద్యార్థి ఫోన్‌నంబర్ తీసుకున్నారు. బహుమతి ప్రదానోత్సవంలో అదనపు ఎస్పీ చెంచురెడ్డి మాట్లాడుతూ తల్లిదండ్రుల ఆలోచనలు, ఆసక్తులు, అభిరుచులు పిల్లల ఎదుగుదలపై ప్రభావం చూపుతాయని పలు ఉదాహరణలు వివరించారు.

ఉత్తమ ఎగ్జిబిట్లకు బహుమతులు

✦ పాలల్లో కల్తీని ఇంట్లోనే సులువుగా గుర్తించేలా కోరుకొండ సిద్ధార్థ పాఠశాల విద్యార్థులు అఖిల, లాస్య తయారుచేసిన ప్రాజెక్టుకు ప్రథమ బహుమతి లభించింది. పాల శాంపిల్స్‌లో పసుపు వేసినపుడు ఎర్రగా, అయోడిన్ సొల్యూషన్ మూడు చుక్కలు వేస్తే నీలం, నలుపు రంగుగా మారితే కల్తీ జరిగినట్లు తెలుసుకోవచ్చని చేసి చూపించారు.



మాట్లాడుతున్న కలెక్టర్ కీర్తి చేకూరి

✦ వంట కోసం కోడిగుడ్డు పగలగొట్టాక పెంకులను పారేయకుండా వాటితో ఆరోగ్య సమస్యలకు మందులు తయారు చేయొచ్చని, పొలాల్లో కీటక నాశినిగా వాడుకోవచ్చని, కొన్ని రసాయనాలు కలిపి చర్మవ్యాధులకు వినియోగించవచ్చంటూ గొల్లప్రోలు మండలం చెందుర్తి జడ్పీ పాఠశాల విద్యార్థులు అభినవ్, అఖిలేశ్ తయారుచేసిన ప్రాజెక్టుకు ద్వితీయ బహుమతి లభించింది.

✦ బస్సుల్లో సీట్లను హైడ్రాలిక్ సిస్టంతో తయారుచేస్తే ప్రమాదాలు జరిగినప్పుడు సులువుగా తప్పించుకోవచ్చు. మంటలు, పొగ వ్యాపించినప్పుడు డ్రైవర్ దగ్గర ప్రత్యేకంగా అమర్చే బటన్ నొక్కినప్పుడు స్మోక్ అలారం మోగుతుంది. తద్వారా ప్రయాణికులు కూర్చున్న స్థానం పక్కనున్న ద్వారంలోంచి బయటపడొచ్చు. బస్సుకు పైభాగంలో అమర్చిన కిటికీ ద్వారా కార్బన్‌డయాక్సైడ్ బయటకు వెళ్లి ఆక్సిజన్ లోపలికి వస్తుంది. అమలాపురం మండలం సమనసలోని శ్రీరామ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు మేఘన, ప్రశాంతి తయారుచేసిన ఈ ప్రాజెక్టుకు తృతీయ బహుమతి లభించింది.

స్వీట్ షాప్ వ్యర్థాలతో కల్తీ నెయ్యి

20 కిలోలు స్వాధీనం చేసుకున్న అధికారులు





నిందితులతో అధికారులు ★ స్వాధీనం చేసుకున్న కల్తీ నెయ్యి, డస్ట్

ఆత్మకూరు, ఆత్మకూరు పట్టణం, న్యూస్‌టుడే: నంద్యాల జిల్లా ఆత్మకూరులో కల్తీ నెయ్యి కేంద్రంపై విజిలెన్స్ అధికారులు గురువారం దాడులు చేశారు. కావేటిరాజు అనే వ్యక్తి వివిధ ప్రాంతాల్లోని పాలకోవా, మిఠాయిల కేంద్రాల్లో పదార్థాల తయారీ పూర్తయిన తర్వాత చివర్లో మిగిలిన గసి సేకరించేవాడు. దానికి పామాయిల్ కలిపి వేడి చేసి చివర్లో నెయ్యి ఫ్లేవర్ కలిపి నెయ్యిగా మార్చేవాడు. ఈ దందాపై సమాచారం రావడంతో జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారులు వెంకటరాముడు, ఖాసీంవలి, విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ పవన్ కిషోర్, ఆత్మకూరు సీఐ మహేశ్వర్‌రెడ్డి దాడులు జరిపారు. 20 కిలోల కల్తీ నెయ్యి, 4 కిలోల డస్ట్‌ను స్వాధీనం చేసుకుని, కావేటిరాజు, మరో వ్యక్తిని అరెస్టు చేసి పోలీసుస్టేషన్‌కు తరలించారు.

అమరావతిలో ఫాల్స్ సీలింగ్- డ్రైవాల్ టెక్నాలజీ ల్యాబ్

సెయింట్‌గోబైన్, నాక్ మధ్య ఒప్పందం

ఈనాడు, అమరావతి: అమరావతిలో ఫాల్స్ సీలింగ్, డ్రైవాల్ టెక్నాలజీ ల్యాబ్ ఏర్పాటు కానుంది. వృత్తి, నిర్మాణ రంగ నిపుణులకు, యువతకు ఇక్కడ శిక్షణ ఇస్తారు. రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్(నాక్), సెయింట్‌గోబైన్ ఇండియా లిమిటెడ్ మధ్య ఈమేరకు గురువారం అవగాహన ఒప్పందం జరిగింది. సెయింట్- గోబైన్ ఇండియా ప్రతినిధి బృందం నాక్‌ను సందర్శించి, ఆధునిక నిర్మాణ సాంకేతికతలు, పరిశ్రమ-ప్రభుత్వ భాగస్వామ్యానికి సంబంధించిన అంశాలపై నాక్ డైరెక్టర్ జనరల్ జి.గణేష్‌కుమార్, ఇతర అధికారులతో చర్చించారు. నిర్మాణ రంగంలో డ్రైవాల్, ఫాల్స్ సీలింగ్ నైపుణ్యం ఉన్న శ్రామికులకు డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో ఈ ల్యాబ్ ఎంతో ఉపయోగపడుతుందని సెయింట్- గోబైన్ ప్రతినిధులు వెల్లడించారు. సాంకేతిక నైపుణ్యం, శిక్షణ మాడ్యూల్స్, పరిశ్రమ ప్రమాణాల విషయంలో నాక్‌కు పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. నాక్ డీజీ గణేష్‌కుమార్ మాట్లాడుతూ పరిశ్రమలతో భాగస్వామ్యం ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు.

స్వచ్ఛందంగానే రాజీనామా చేశారా?

- ఎమ్మెల్సీలు కల్యాణ చక్రవర్తి, రాజశేఖర్‌ను ప్రశ్నించిన మండలి ఛైర్మన్ మోషేనురాజు
- రాజీనామాలను ఆమోదించాలన్న ఎమ్మెల్సీలు

ఈనాడు, అమరావతి: ఎమ్మెల్సీల రాజీనామాలపై గురువారం రెండోరోజూ శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేనురాజు విచారణ కొనసాగించారు. ఎమ్మెల్సీ పదవులకు రాజీనామా చేసిన వైకాపాకు చెందిన మర్రి రాజశేఖర్, బల్లి కల్యాణచక్రవర్తిలను గురువారం విడివిడిగా విచారించారు. ఎమ్మెల్సీలు తమ రాజీనామాలను ఆమోదించాలనే కోరారు. మర్రి రాజశేఖర్‌తో మాట్లాడినపుడు.. 'మీరు స్వచ్ఛందంగానే రాజీనామా చేశారా? మీపై ఏదైనా ఒత్తిడి ఉందా? రాజీనామా చేశాక మరో పార్టీలో చేరారా? చేరితే, ఆ కొత్త పార్టీ తరఫున రాజకీయాల్లో చురుగ్గా ఉంటున్నారా? రాజీనామాపై పునరాలోచనలో ఉన్నారా?' అని ఛైర్మన్ ప్రశ్నించినట్లు తెలిసింది. రాజశేఖర్ స్పందిస్తూ.. 'స్వచ్ఛందంగానే రాజీనామా చేశా. చేసి పది నెలలైంది. నా రాజీనామాను ఆమోదించండి' అని కోరినట్లు సమాచారం. కల్యాణచక్రవర్తితో మాట్లాడినప్పుడు.. 'మీరు పార్టీ మారారా? ఏదైనా ఒత్తిడి కారణంగా రాజీనామా చేశారా?' అని ఛైర్మన్ ప్రశ్నించినట్లు తెలిసింది. ఆయన స్పందిస్తూ.. 'స్వచ్ఛందంగానే రాజీనామా చేశాను. రాజీనామా చేసి ఏడాదిన్నర అవుతోంది. మీరు నిర్ణయం తీసుకోలేదు. నా రాజకీయ మనుగడ కోసం ఒక వేదిక కావాలి కదా? అందుకే మరో పార్టీలో చేరా. ఈ ఆధారాలతో నా రాజీనామాను ఆమోదించండి' అని కోరినట్లు సమాచారం. శుక్రవారం మరో ఇద్దరు ఎమ్మెల్సీలు పోతుల సునీత, కర్రి పద్మశ్రీల రాజీనామాలపై ఛైర్మన్ విచారించనున్నారు.

3,700 మంది విద్యార్థులు అసెంబ్లీని సందర్శించారు

- వారికి పోలవరం ప్రాజెక్టు చూపిస్తాం
- స్పీకర్ అయ్యన్నపాత్రుడు

ఈనాడు, అమరావతి: ప్రస్తుత సమావేశాల్లో ఇప్పటి వరకూ 107 పాఠశాలల నుంచి 3,700 మందికి పైగా విద్యార్థులు అసెంబ్లీకి వచ్చి సభా కార్యక్రమాలను ప్రత్యక్షంగా వీక్షించారని స్పీకర్ అయ్యన్నపాత్రుడు తెలిపారు. గురువారం నర్సీపట్నంకు చెందిన రిషి వ్యాలీ పాఠశాల విద్యార్థులు అసెంబ్లీ సందర్శనకు వచ్చారు. వారితో స్పీకర్ సరదాగా కాసేపు ముచ్చటించారు. అసెంబ్లీ సందర్శనకు వచ్చిన విద్యార్థులను త్వరలో పోలవరం ప్రాజెక్టుకూ తీసుకువెళ్లేందుకు ఏర్పాట్లు చేస్తామని స్పీకర్ తెలిపారు. చదువులు, ఉద్యోగాలకే పరిమితం కాకుండా రాజకీయాల్లోకి కూడా రావాలని విద్యార్థులకు సూచించారు.

పది పరీక్షలకు హాజరవుతున్నా.. అమ్మ చంకలో బిడ్డనే!



తల్లి, సోదరుడితో పరీక్ష రాసేందుకు వచ్చిన సుమిత

ఈ చిత్రంలో అమ్మ చంకలో ఉన్న బాలిక పేరు సుమిత. పుట్టుకతోనే మూగ, వినికిడి లోపంతో బాధపడుతోంది. ఎత్తు 1.5 అడుగులు మాత్రమే. అయినా నిరాశకు గురికాకుండా బంగారు భవిష్యత్తును నిర్మించుకోవాలనే సంకల్పంతో చదువుకుంటోంది. ఒడిశాలోని ఢెంకనాల్ జిల్లా కామాక్షినగర్ సమితి మహుల్‌పాల్ పంచాయతీకి చెందిన సుమిత నిగమానంద ఉన్నత పాఠశాలలో చదువుతోంది. ప్రస్తుతం పదో తరగతి పరీక్షలకు హాజరవుతోంది. ఆమె సైగలు ద్వారా తెలియపరిచే సమాధానాలను వరుసకు సోదరుడైన తొమ్మిదో తరగతి విద్యార్థి ప్రతాప్‌నాయక్ రాసేలా అధికారులు అవకాశం కల్పించారు. సుమిత తండ్రి సంజునాయక్ 12 ఏళ్ల క్రితమే చనిపోయారు. తల్లి సంజుకొనాపుర బాలికకు అండగా నిలుస్తున్నారు. –న్యూస్‌టుడే, రాయగడ పట్టణం



స్మార్ట్ మల్టీపర్పస్ ఛైర్‌ను రూపొందించిన విద్యార్థులు

ఈ వీల్‌ఛైర్ ఉంటే.. దివ్యాంగుల జీవనం సులువిక

సరిగా నడవలేని వృద్ధులు, దివ్యాంగులు వీల్‌ఛైర్ వాడటాన్ని మనం చూస్తూనే ఉంటాం. ఈ తరహా సాధారణ వీల్‌ఛైర్‌ని ఉపయోగించేవారు తప్పనిసరిగా ఒకరి సాయం తీసుకోవాల్సిందే. అయితే మరో మనిషి సాయం లేకుండా దివ్యాంగుల జీవన ప్రయాణాన్ని మరింత సులభం చేసేలా 'స్మార్ట్ మల్టీపర్పస్ ఛైర్'ను పాఠశాల విద్యార్థులు రూపొందించారు. మంత్రి నారా లోకేశ్ ప్రాతినిధ్యం వహిస్తున్న మంగళగిరి నియోజకవర్గంలోని చింతక్రింది కనకయ్య ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న ఎం.మాన్యశ్రీ, ఎ.కౌశిక్‌లు ఉపాధ్యాయుడు బి.టైటస్ పర్యవేక్షణలో దీన్ని తయారుచేశారు. ఇది సోలార్‌తో నడుస్తూ అవసరమైతే స్ట్రెచర్‌లా మారిపోతుంది. ఈ ఛైర్‌లో కూర్చున్న వ్యక్తిలో చలనం లేకుంటే వెనుక దిండులో ఉండే బజర్ మోగుతుంది. అనారోగ్య సమస్యలు తలెత్తినప్పుడు ఆక్సిజన్ అందించేలా సిలెండర్ ఉంటుంది. మలమూత్రవిసర్జనకు సైతం సీటు కిందనే ఏర్పాటు చేశారు. ఏదైనా తినడానికి వీలుగా చిన్నబల్ల, పక్కనే గ్లాస్ పెట్టగానే ఆటోమేటిక్‌గా తాగునీరు నింపేలా ఏర్పాటు, చేతులు కడుక్కోవడానికి చిన్న ట్రే, సెల్‌ఫోన్ ఛార్జింగ్, ఫ్యాన్, లైట్ ఇలా ఒకటేమిటి అన్ని రకాల సదుపాయాలు అమర్చారు. ఎవరైనా వీరి నిస్సహాయతను గమనించి దాడి చేయడానికి వస్తే తక్కువ స్థాయిలో ఎలక్ట్రిక్ షాక్ ఇచ్చేలా చేతికర్ర కూడా తయారుచేశారు. దివ్యాంగుల రోజువారీ అవసరాలు, భద్రతను దృష్టిలో పెట్టుకొని చేసిన ఈ ఆవిష్కరణ విద్యార్థుల సృజనాత్మకతకు నిదర్శనంగా నిలుస్తోంది. – ఈనాడు, అమరావతి



స్మార్ట్ మల్టీపర్పస్ ఛైర్‌లో ఉన్న సదుపాయాలివీ..

1.సోలార్ ప్యానెల్ 2.ఎలక్ట్రిక్ షాక్ ఇచ్చే చేతికర్ర 3.ఫ్యాన్ 4.లైట్ 5.ఆక్సిజన్ మాస్క్ 6.దిండులో ఉంచిన బజర్ 7.స్ట్రెచర్‌లా మారే ఏర్పాటు 8.సెల్‌ఫోన్ ఛార్జింగ్ పాయింట్ 9.అత్యవసర సైరన్ స్విచ్ 10.గ్లాస్ పెట్టగానే ఆటోమేటిక్‌గా తాగునీరు నింపడం 11.తినడానికి వీలుగా బల్ల 12.మలమూత్ర విసర్జనకు అనుకూలమైన సీటు 13.చేతులు కడుక్కోడానికి ట్రే 14.స్ట్రెచర్‌లా మారేటప్పుడు కాళ్లకు అనువుగా ఉండేలా అదనపు సౌకర్యాలు 15.స్మార్ట్ ఛైర్ ముందుకు.. వెనక్కు కదిలేలా స్విచ్ కంట్రోల్.

సెప్టిక్ ట్యాంకుల శుద్ధిలో స్మార్ట్ సాంకేతికత

- దేశంలో తొలిసారిగా డీస్లడ్జింగ్ ట్రక్ సిద్ధం
- ఏలూరు జిల్లాలో త్వరలో ప్రయోగాత్మకంగా అమలు

ఈనాడు, అమరావతి: మల మురుగు (సెప్టిక్ స్లడ్జ్) సమస్య పరిష్కారంలో కొత్త ఆవిష్కరణకు రాష్ట్రం వేదిక కానుంది. దేశంలోనే మొదటిసారి 'స్మార్ట్ డీస్లడ్జింగ్ ట్రక్' అందుబాటులోకి రానుంది. సెప్టిక్ ట్యాంకుల్లో ఘన, ద్రవ వ్యర్థాలను ట్రక్‌లో వేర్వేరుగా శుద్ధి చేయడం దీని ప్రత్యేకత. ఏలూరు జిల్లాలో త్వరలో దీన్ని ప్రయోగాత్మకంగా ప్రారంభించనున్నారు. రాష్ట్ర స్వచ్ఛాంధ్ర సంస్థ, టైడ్ టెక్నోక్రాట్స్, టీపీఎస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సంస్థల భాగస్వామ్యంతో దిల్లీలో స్మార్ట్ డీస్లడ్జింగ్ ట్రక్ సిద్ధమై ట్రయల్ రన్ కూడా విజయవంతమైంది. ◆ ప్రస్తుతం సెప్టిక్ ట్యాంకులు నిండాక ప్రైవేట్ ఆపరేటర్లు ఘన, ద్రవ వ్యర్థాలను ట్రక్‌లో తీసుకెళుతున్నారు. వాటిని శుద్ధి చేయకుండానే సమీపంలోని చెరువులు, నదులు, కాలువలు, సముద్రంలో వదిలేస్తున్నారు. దీనివల్ల నీరు కలుషితం కావడంతో పాటు పర్యావరణంపైనా ప్రభావం చూపుతోంది.



త్వరలో అందుబాటులోకి రానున్న స్మార్ట్ డీస్లడ్జింగ్ ట్రక్

దీనిపై నేషనల్ గ్రీన్ ట్రైబ్యునల్ పలు సందర్భాల్లో రాష్ట్రాలపై ఆగ్రహం వ్యక్తం చేసింది. సెప్టిక్ ట్యాంకుల్లో నీటిని విధిగా శుద్ధి చేశాకే విడిచిపెట్టాలని ఆదేశించింది. ◆ రాష్ట్రంలోని నగరాలు, పట్టణాలన్నీ బహిరంగ మల విసర్జన రహితమైనవిగా కేంద్రం ఇప్పటికే ప్రకటించింది. ప్రతి ఇంట్లోనూ వ్యక్తిగత మరుగుదొడ్లున్నాయి. సెప్టిక్ ట్యాంకుల్లో నీటిని శుద్ధి చేశాకే ప్రైవేట్ ఆపరేటర్లు బయట విడిచి పెట్టాలని ప్రభుత్వం ఆదేశాలిచ్చినా అమలు కావడం లేదు. దీంతో స్వచ్ఛాంధ్ర సంస్థ చొరవ తీసుకుని ప్రముఖ సంస్థల సాంకేతిక సహకారంతో 'స్మార్ట్ డీస్లడ్జింగ్ ట్రక్' తయారీకి సిద్ధమైంది.

సాంకేతికత ప్రత్యేకతలివీ..

◆ సెప్టిక్ ట్యాంకులోని ఘన, ద్రవ వ్యర్థాలను బయటకు తీసి ట్రక్‌లోనే శుద్ధి చేస్తారు.

◆ ఈ ట్రక్‌లో గంటకు 600 లీటర్ల ద్రవాలు వేర్వేరుగా శుద్ధి చేయొచ్చు. రోజూ 2-3 సెప్టిక్ ట్యాంకులు శుభ్రం చేయొచ్చు.

◆ ట్రక్‌పై అమర్చిన ఐదు టన్నుల యంత్రంలో వాక్యూమ్ సక్షన్ ద్వారా పూర్తిస్థాయిలో ట్యాంకులను శుభ్రం చేస్తారు.

◆ శుద్ధి చేసిన ద్రవ వ్యర్థాలను సమీప తోటల్లో అవసరాలకు వదిలేస్తారు.

◆ శుద్ధి చేసిన ఘన వ్యర్థాలను సేంద్రియ ఎరువుల తయారీకి వినియోగించనున్నారు.

ప్రతి రెవెన్యూ డివిజన్‌లోనూ డీస్లడ్జింగ్ ట్రక్

◆ ఏలూరు జిల్లాలో ప్రయోగాత్మకంగా అమలు చేశాక దశల వారీగా అన్ని రెవెన్యూ డివిజన్ కేంద్రాల్లోనూ ట్రక్‌లు ఏర్పాటు చేయనున్నారు. స్వచ్ఛాంధ్ర సంస్థ నిధులతో వీటిని కొనుగోలు చేయనున్నారు. ◆ రాష్ట్రంలో ప్రస్తుతం రెండు చోట్ల మాత్రమే సెప్టిక్ ట్యాంకుల్లోని ద్రవ వ్యర్థాలను శుద్ధి చేసే ప్లాంట్లు ఉన్నాయి. అన్ని జిల్లాల్లోనూ వీటిని ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తున్నా ముందడుగు పడటం లేదు. ప్లాంట్లతో దుర్వాసన వస్తుందని వాటి ఏర్పాటుకు ప్రజలు సహకరించడం లేదు. ట్రక్‌లు అందుబాటులో ఉంచడం ద్వారా తక్కువ ఖర్చుతో వీటిని వినియోగించుకోవచ్చు.

ఐజీ సునీల్ నాయక్ అరెస్టుకు వారంట్.. చివరి నిమిషంలో వాయిదా

- వారంట్ జారీపై నేడు మళ్లీ వాదనలు

గుంటూరు లీగల్, న్యూస్‌టుడే: శాసనసభ ఉపసభాపతి, నరసాపురం మాజీ ఎంపీ రఘురామకృష్ణరాజును కస్టడీలో చిత్రహింసలకు గురిచేసిన కేసులో నిందితుడిగా ఉన్న బిహార్ క్యాడర్‌కు చెందిన ఐపీఎస్ అధికారి సునీల్‌నాయక్ అరెస్టుకు వారంట్ జారీ అయినా.. చివరి నిమిషంలో వాయిదా పడింది. శుక్రవారం దీనిపై తీర్పు వెలువడనుంది. ఐజీ సునీల్‌నాయక్‌ను అరెస్టు చేసేందుకు నాన్ బెయిలబుల్ వారంట్ (ఎన్‌బీడబ్ల్యూ) జారీ చేయాలని పోలీసులు గుంటూరు ప్రత్యేక జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో పిటిషన్ వేశారు. దీనిపై వాదనల అనంతరం.. ఆయన అరెస్టుకు వారంట్ జారీకి అనుమతిస్తున్నట్లు న్యాయమూర్తి జి.స్రవంతి తీర్పు ఇచ్చారు. అయితే వారంట్ పత్రం జారీ కాలేదు. తీర్పు వెలువరించే సమయంలో సునీల్‌నాయక్ తరఫు న్యాయవాదులు కోర్టులో ఉండి అభ్యంతరం వ్యక్తం చేశారు. మార్చి 2వ తేదీ వరకు సునీల్ నాయక్‌ను అరెస్టు చేయవద్దని బిహార్‌లోని పట్నా న్యాయస్థానం ఈ నెల 24న మధ్యంతర బెయిల్ ఇచ్చిందని పేర్కొంటూ వారు సంబంధిత పత్రాలు సమర్పించారు. స్థానిక పబ్లిక్ ప్రాసిక్యూటర్‌కు ఆ పత్రాలు ఇవ్వబోగా ఆయన వాటిని తీసుకునేందుకు నిరాకరించారు. ఈ కేసులో ప్రభుత్వం ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్‌ను నియమించిందని ఆయనకు ఇవ్వాలన్నారు. అనంతరం ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్, ప్రాసిక్యూషన్ జాయింట్ డైరెక్టర్ వి.రాజేంద్రప్రసాద్ కోర్టులో పోలీసుల తరఫున వాదనలు వినిపించి పలు ఉన్నత స్థానాల తీర్పులను న్యాయమూర్తికి అందించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ పట్నా కోర్టు ఉత్తర్వుల గురించి పోలీసులు దాఖలు చేసిన వారంట్ పిటిషన్‌లో ఎందుకు ప్రస్తావించలేదని ప్రశ్నించారు. పట్నా కోర్టు ఇచ్చిన ఉత్తర్వులు తమకు తెలియదని వారు సమాధానమిచ్చారు. అంతకుముందు సునీల్‌నాయక్ తరఫున న్యాయవాదులను కూడా అక్కడి కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను ఇప్పటివరకు తన దృష్టికి ఎందుకు తీసుకురాలేదని ప్రశ్నించారు. కోర్టుకు మెయిల్ చేశామని వారు బదులివ్వడంతో అరెస్టు వారంట్ జారీకి సంబంధించిన నిర్ణయంపై తీర్పును న్యాయమూర్తి శుక్రవారానికి వాయిదా వేశారు. నేడు మళ్లీ వాదనలు జరగనున్నాయి. ఇదిలా ఉండగా కోర్టు జారీచేసిన అరెస్టు వారంట్‌ను రద్దుచేయమని కోరుతూ సునీల్‌నాయక్ తరఫు న్యాయవాదులు గురువారం సాయంత్రం మరో పిటిషన్ వేశారు.

సునీల్‌ను తీసుకొచ్చేలా ప్రయత్నాలు: ఏపీ పోలీసులు బిహార్‌లోనే మకాం వేసి చట్టబద్ధంగా సునీల్ నాయక్‌ను అరెస్టు చేసి తీసుకొచ్చేందుకు అన్ని ప్రయత్నాలూ చేస్తున్నారు. బిహార్ క్యాడర్‌కు చెందిన సునీల్‌నాయక్ అప్పట్లో ఏపీ సీఐడీ డీఐజీగా పనిచేశారు. రఘురామపై జరిగిన దాడిలో ఆయన పాత్ర ఉందని నగరంపాలెం పోలీసులు తేల్చారు. గతంలో ఆయన ఓసారి అక్కడి హైకోర్టు ద్వారా ఈ కేసులో కొంతకాలం రక్షణ పొందారు. తరవాత గుంటూరు రెండో అదనపు జిల్లా కోర్టు ఆయనకు ముందస్తు బెయిలు ఇవ్వడానికి నిరాకరించింది. దీంతో ఎస్పీ దామోదర్ బృందం సునీల్‌నాయక్‌ను అరెస్టు చేసేందుకు పట్నా వెళ్లింది. అక్కడ అతణ్ని అరెస్టు చేసి, ట్రాన్సిట్ వారంట్ జారీ చేయమని స్థానిక కోర్టులో కోరారు. సాంకేతిక కారణాలతో అక్కడి కోర్టు సునీల్‌నాయక్‌ను ట్రాన్సిట్ వారంట్‌పై తరలించేందుకు నిరాకరించింది. దీంతో ఆయన్ను ఏపీ పోలీసుల కస్టడీ నుంచి బిహార్ పోలీసులు తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో సునీల్‌నాయక్ అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. సునీల్‌నాయక్‌ను బిహార్ నుంచి తీసుకొచ్చేందుకు అరెస్టు వారంట్ జారీ చేయాలని గుంటూరు పోలీసులు స్థానిక ప్రత్యేక జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో పిటిషన్ వేశారు.



క్రీడా పోటీల్లో జావెలిన్ త్రో వేస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు, మంత్రులు సంధ్యారాణి, అనిత, ఎమ్మెల్యేలు విష్ణుకుమార్‌రాజు, కామినేని శ్రీనివాస్, బుచ్చయ్య చౌదరి, శ్రీరాం తాతయ్య, గద్దె రామ్మోహన్, కావలి గ్రీష్మ

స్పీకర్ కోచింగ్... హోంమంత్రి జావెలిన్ త్రో

- క్రికెట్‌లో రేసుగుర్రాల్లా.. కబడ్డీలో చిరుతల్లా
- మూడో రోజూ రెట్టింపు ఉత్సాహంతో ఉరకలు
- దక్షిణాది రాష్ట్రాల ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో పోటీలు పెడతాం: స్పీకర్

ఈనాడు-అమరావతి, న్యూస్‌టుడే-విజయవాడ క్రీడలు: స్నేహపూర్వక పోటీలే అయినా ఎవరూ తగ్గలేదు. క్రికెట్, కబడ్డీ, జావెలిన్ త్రో, షాట్‌పుట్.. అన్నింట్లోనూ ఒకరిని మించి ఒకరు పోటీపడ్డారు. తొలి రెండు రోజులు చూపిన ఉత్సాహాన్ని మించి మూడో రోజు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు క్రీడా పోటీల్లో దుమ్ము రేపారు. క్రికెట్ మైదానంలో రేసుగుర్రాలను తలపించారు. కబడ్డీలోనూ చిరుతల్లా కదిలారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు, గోరంట్ల బుచ్చయ్యచౌదరి, కామినేని శ్రీనివాస్, విష్ణుకుమార్‌రాజు జావెలిన్ త్రో విసిరి భళా అనిపించారు. మహిళా సభ్యులు పరిటాల సునీత, అనిత, సంధ్యారాణి, కావలి గ్రీష్మ, సింధూరరెడ్డి, బండారు శ్రావణి శ్రీ, తోయక జగదీశ్వరి జావెలిన్ బలంగా విసిరి సత్తాచాటారు. మ్యూజికల్ ఛైర్స్‌లో మహిళా సభ్యులు మ్యాజిక్ చేశారు. మూడోరోజు గురువారం ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల 'ఆటవిడుపు' ఉత్సాహంగా సాగింది. విజయవాడలోని ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియం, దండమూడి రాజగోపాలరావు ఇండోర్ స్టేడియంలో ఫైనల్ మ్యాచ్‌లు నిర్వహించారు.

త్వరలో విశాఖ కేంద్రంగా దక్షిణ భారతదేశంలోని ఆరు రాష్ట్రాల ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో సౌత్ ఇండియన్ ప్రీమియర్ లీగ్ నిర్వహిస్తామని స్పీకర్ అయ్యన్నపాత్రుడు తెలిపారు. మధ్యాహ్నం క్రీడాపోటీల ప్రారంభం సందర్భంగా ఆయన మాట్లాడారు. క్రికెట్‌తో పాటు అవసరమైతే బీచ్ వాలీబాల్, బీచ్ ఫుట్‌బాల్ నిర్వహిస్తామని తెలిపారు. "దక్షిణాది రాష్ట్రాలు ఐక్యంగా ఉన్నాయని, రాజకీయంగా ఎలాంటి సమస్య వచ్చినా కలిసి పోరాడుతాయనే సందేశాన్ని ఈ క్రీడల ద్వారా దేశానికి అందిద్దాం. దీనికి రాష్ట్ర ప్రజలతో పాటు ఏసీఏ సహకారం అందించాలి" అని అయ్యన్నపాత్రుడు కోరారు. విశాఖలో ఏసీఏ ఆధ్వర్యంలో ఈ లీగ్‌ను నిర్వహిస్తామని, దీనికి కావాల్సిన సదుపాయాలు కల్పిస్తామని అసోసియేషన్ అధ్యక్షుడు, ఎంపీ కేశినేని చిన్ని తెలిపారు. ఈ లీగ్‌కు శాప్ తరఫున అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తామని శాప్ ఛైర్మన్ రవి నాయుడు హామీ ఇచ్చారు.

రెండు మూడు రోజుల్లో రఘురామ కోలుకుంటారు

"వచ్చేసారి నేనూ క్రీడల్లో పాల్గొంటాను. నా శరీరం పెద్దది అయిపోయింది. ఉపసభాపతి రఘురామకృష్ణరాజుతో కూడా మనకెందుకులే బాబూ ఇవన్నీ అని చెబుతూనే ఉన్నాను. అయినా క్రీడాస్ఫూర్తితో వెళ్లారు. గాయమైంది. మైనర్ సర్జరీ చేస్తున్నారు. రెండు, మూడు రోజుల్లో తిరిగి వస్తారు" అని విష్ణుకుమార్ రాజు తెలిపారు.

క్రికెట్ ఫైనల్ మ్యాచ్ హోరాహోరీ

అచ్చెన్నాయుడు, నాదెండ్ల మనోహర్ జట్ల మధ్య క్రికెట్ ఫైనల్‌మ్యాచ్ 'నువ్వా-నేనా' అన్నట్లు సాగింది. తొలుత బ్యాటింగ్ చేసిన మనోహర్ జట్టు 12 ఓవర్లలో 108 పరుగులు సాధించింది. అచ్చెన్న జట్టుపై నాదెండ్ల మనోహర్ జట్టు 6 పరుగులతో విజయం సాధించింది. గతేడాదీ మనోహర్ జట్టే క్రికెట్ విజేతగా నిలిచింది. విజయం అనంతరం మనోహర్‌ని జట్టు సభ్యులు భుజాలపైకి ఎత్తుకుని సంబరాలు చేసుకున్నారు. అచ్చెన్న జట్టు సభ్యులు వారిని అభినందించి క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల క్రికెట్ ఫైనల్ మ్యాచ్‌కు ముందు మీడియా సభ్యులతోనూ మ్యాచ్ ఆడారు.

కబడ్డీలో ఓ పట్టు పట్టిన శ్రీరాం తాతయ్య

కబడ్డీ ఫైనల్ మ్యాచ్‌లో సత్యకుమార్ యాదవ్, విజయకుమార్ జట్లు పోటాపోటీగా తలపడ్డాయి. సత్యకుమార్ యాదవ్ జట్టులో శ్రీరాం తాతయ్య అవతలి జట్టు సభ్యులను ఓ పట్టు పట్టారు. తమ జట్టు విజేతగా నిలవడంలో కీలకంగా వ్యవహరించారు.

పాట రెండు నిమిషాలైనా ఉంచండయ్యా

మహిళా సభ్యులకు మ్యూజికల్ ఛైర్స్ పోటీల్లో గుమ్మిడి సంధ్యారాణి గెలుపొందారు. సింధూర రెడ్డి రెండో స్థానంలో నిలిచారు. అయ్యన్నపాత్రుడు వీటిని పర్యవేక్షించారు. సీరియస్‌గా ఆడాలని సభ్యులకు సూచనలిస్తూనే... తనదైన శైలిలో నవ్వులు పూయించారు. పాట 30 సెకన్లకే ఆగిపోతుండడంతో 'రెండు నిమిషాలైనా ఉంచండయ్యా... వాళ్లను కొంచెం పరిగెత్తనివ్వండి' అంటూ ఛలోక్తులు విసిరారు.





క్యారమ్స్ ఆడుతున్న మంత్రి సుభాష్, ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా. చిత్రంలో ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ ★ మ్యూజికల్ ఛైర్ ఆడుతున్న మహిళా ప్రజాప్రతినిధులు

శ్రీవారి తెప్పోత్సవాలు ప్రారంభం



శ్రీవారి పుష్కరిణిలో తెప్పోత్సవం

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవేంకటేశ్వర స్వామివారి వార్షిక తెప్పోత్సవాలు తిరుమలలో గురువారం సాయంత్రం వైభవంగా ప్రారంభమయ్యాయి. విద్యుద్దీపాలు, పుష్పాలతో సర్వాంగసుందరంగా అలంకరించిన తెప్పపై శ్రీ సీతాలక్ష్మణ ఆంజనేయ సమేత శ్రీరామచంద్రమూర్తిగా దర్శనమిచ్చారు. స్వామివారి శోభాయమాన రూపాన్ని తిలకించిన భక్తులు తన్మయత్వంతో పులకించారు. కార్యక్రమంలో జీయంగార్లు, తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో ఎం.రవిచంద్ర, అదనపు ఈవో వెంకయ్యచౌదరి పాల్గొన్నారు. శుక్రవారం రుక్మిణీ సమేత శ్రీకృష్ణస్వామి అవతారంలో శ్రీవారు దర్శనమిస్తారు.



తెప్పపై కొలువుదీరిన సీతారామలక్ష్మణులు

శ్రీవారికి నాణేల బదులు ముడుపు పత్రాలు

- పరిమిత సంఖ్యలోనూ అన్నదానానికి అవకాశం
- అమలుకు సిద్ధమవుతోన్న తితిదే

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి భక్తుల సౌకర్యార్థం తితిదే ధర్మకర్తల మండలి అనేక మార్పులు దిశగా కసరత్తు చేస్తోంది. శనివారం స్థానిక అన్నమయ్య భవనంలో తితిదే ధర్మకర్తల మండలి సమావేశం ఛైర్మన్ బీఆర్ నాయుడు అధ్యక్షతన జరగనుండగా ఇందులో కీలక ప్రతిపాదనలు ప్రవేశపెట్టనున్నట్లు తెలిసింది. ఇప్పటివరకు భక్తులు మొక్కు రూపంలో శ్రీవారి హుండీలో చిల్లర నాణేలు వేస్తున్నారు. ఇకపై నాణేలకు బదులు ముడుపు పత్రాల రూపంలో వేసేందుకు వీలుగా తిరుపతి, తిరుమలలో తితిదే కేంద్రాలు ఏర్పాటు చేయడంపై సమావేశంలో చర్చించనున్నారు. భక్తులు ఫోన్‌పే, గూగుల్‌పే, పేటీఎం, నెఫ్ట్ ద్వారా నగదును పంపితే అందుకు తగిన ముడుపుపత్రాలు అందిస్తారు. వాటిని నేరుగా హుండీలో వేయవచ్చు. దీంతో భక్తులకు భారీగా నాణేలను, నగదును తీసుకెళ్లడంలో ఉన్న ఇబ్బందులు తొలగుతాయి.



ముడుపుపత్రం నమూనా

◆ స్థానిక మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద కేంద్రంలో రోజూ లక్షలమంది భక్తులు అన్నప్రసాదం స్వీకరిస్తుండగా ఈ యజ్ఞంలో దాతలు పెద్ద ఎత్తున పాలుపంచుకుంటున్నారు. ఒకరోజు మొత్తం అన్నప్రసాద వితరణకు రూ.44 లక్షలు, ఉదయం అల్పాహారానికి రూ.10 లక్షలు, మధ్యాహ్నం భోజనానికి రూ.17 లక్షలు, రాత్రి భోజనానికి రూ.17 లక్షల చొప్పున విరాళం ఇచ్చే వెసులుబాటు ప్రస్తుతం ఉంది. అయితే ఇంత పెద్ద మొత్తంలో విరాళం ఇవ్వలేని సామాన్య భక్తుల కోసం పదిమంది, వందమంది భక్తులకు సరిపడా విరాళం ఇచ్చినా వారిపేరున అన్నదానం చేస్తారు. ఈ విధానాన్ని త్వరలో అందుబాటులోకి తీసుకురావడంపై చర్చించి తీర్మానించనున్నారు. అలాగే తితిదే లడ్డూ విక్రయ కేంద్రంలో జనపనార బ్యాగులను అందుబాటులోకి తీసుకురానున్నారు. ఈ నిర్ణయం పర్యావరణహితంగా ఉండటంతో పాటు ఈ ఉత్పత్తులను తయారు చేసే రైతులకు ఉపయోగకరంగా ఉంటుందని భావిస్తున్నారు.



సవాళ్లను ఆహ్వానించేవారిదే భవిష్యత్తు

ఎవ్వరైతే కార్యాచరణలో ముందుంటారో, సవాళ్లను స్వీకరిస్తారో, కొత్త ఆవిష్కరణలు చేస్తారో వారిదే భవిష్యత్తు అంతా. అలాంటి వారే చరిత్రను సృష్టిస్తారు. గాలివాటంగా సాగిపోయేవారు చరిత్ర వీక్షకులుగా మిగిలిపోతారు.

– అదితి చౌదరి, ఇన్‌ఫ్లుయెన్సర్

రూ.125 కోట్లు, 37 ఎకరాల హక్కుపత్రాలు డిపాజిట్ చేయండి

- రాకియా కేసులో నిమ్మగడ్డ ప్రసాద్‌కు సుప్రీం కోర్టు ఆదేశం

ఈనాడు, దిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో పోర్టులు, ఎయిర్‌పోర్టుల అభివృద్ధి కోసం 2008లో రస్‌అల్ ఖైమా ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీ (రాకియా)తో కుదుర్చుకున్న ఒప్పంద వివాద పరిష్కారం కోసం రూ.125 కోట్ల నగదు, తెలంగాణలో ఉన్న 37 ఎకరాల భూహక్కు పత్రాలను సుప్రీంకోర్టు రిజిస్ట్రీ వద్ద డిపాజిట్ చేయాలని సర్వోన్నత న్యాయస్థానం పారిశ్రామికవేత్త నిమ్మగడ్డ ప్రసాద్‌ను ఆదేశించింది. ఈ వివాదంలో యూఏఈ కోర్టు రాకియాకు అనుకూలంగా, నిమ్మగడ్డ ప్రసాద్ ఆధ్వర్యంలోని మాట్రిక్స్ కార్ప్ ఫార్మాకు వ్యతిరేకంగా తీర్పు ఇచ్చింది. ఆ తీర్పును వ్యతిరేకిస్తూ నిమ్మగడ్డ ప్రసాద్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరపాలంటే రూ.600 కోట్ల ష్యూరిటీ డిపాజిట్ చేయాలని ఫిబ్రవరి 12న ఇచ్చిన ఆదేశాలకు అనుగుణంగా తాజా ఆదేశాలు జారీచేసింది. కోర్టు ఇచ్చిన గత ఉత్తర్వులను దృష్టిలో ఉంచుకొని సమర్పించబోయే ష్యూరిటీలపై నిమ్మగడ్డ ప్రసాద్ దాఖలు చేసిన ఎఫిడవిట్‌ను పరిశీలించిన సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్య బాగ్చి, జస్టిస్ వీఎం పంచోలీల నేతృత్వంలోని ధర్మాసనం అందులో పేర్కొన్న కొన్ని ఆస్తులు కోర్టుల ఎటాచ్‌మెంట్ కింద ఉన్న నేపథ్యంలో వాటికి బదులు రూ.125 కోట్ల నగదు, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ఉన్న 37 ఎకరాలకు సంబంధించిన హక్కుపత్రాలను సుప్రీంకోర్టు రిజిస్ట్రార్ వద్ద డిపాజిట్ చేయాలని ఆదేశించింది.

పసిపిల్లల హృదయాలయం

- సత్యసాయి సంజీవని హార్ట్‌కేర్‌లో ఉచిత శస్త్రచికిత్సలు
- సిద్దిపేట జిల్లా కొండపాకలో కేంద్రం

కల్లాకపటం తెలియని పసి మనసులు.. హృద్రోగ సమస్యలతో తల్లడిల్లుతుంటే.. మేమున్నాం అంటూ అక్కున చేర్చుకుంటోంది సిద్దిపేట జిల్లా కొండపాకలోని శ్రీసత్యసాయి సంజీవని సెంటర్ ఫర్ ఛైల్డ్ హార్ట్ కేర్ అండ్ రీసెర్చ్. రూ.లక్షల విలువైన అత్యాధునిక వైద్యాన్ని పూర్తి ఉచితంగా అందిస్తూ బాధితులకు సాంత్వన చేకూర్చుతోంది. తీవ్ర మనోవేదనకు గురైన కన్నవాళ్లను ఓదార్చుతూ పిల్లల ఆరోగ్య భవిష్యత్తుకు భరోసానిస్తోంది. ఇప్పటివరకు భారత్‌తోపాటు మరో 14 దేశాలకు చెందిన 233 మంది చిన్నారులకు ఓపెన్ హార్ట్ సర్జరీలు, 103 మంది పిల్లలకు కార్డియాక్ ఇంటర్వెన్షన్లు విజయవంతంగా పూర్తి చేసి 336 మంది ప్రాణం నిలిపినట్లు సంస్థ ఛైర్మన్ డా.సి.శ్రీనివాస్ తెలిపారు.





చికిత్స పొందిన చిన్నారులతో సంస్థ ఛైర్మన్ శ్రీనివాస్, వైద్యులు తదితరులు

అంతా ఉచితమే...

మనదేశంలో ఏటా 3.5 లక్షల మంది చిన్నారులు గుండె సంబంధిత సమస్యలతో జన్మిస్తున్నారు. సరైన వైద్యం అందక సుమారు లక్ష మంది ప్రాణాలు కోల్పోతున్నారు. ఇలాంటి వారికి శ్రీసత్యసాయి సంజీవని సెంటర్ ఫర్ ఛైల్డ్ హార్ట్‌కేర్ అండ్ రీసెర్చ్ వరదాయినిగా నిలుస్తోంది. సిద్దిపేట జిల్లాలోని కొండపాకతో పాటు నయా రాయ్‌పుర్(ఛత్తీస్‌గఢ్), పల్వాల్ (హరియాణా), నవీ ముంబయి(మహారాష్ట్ర)లలోనూ వైద్యాలయాలు నెలకొల్పి పూర్తి ఉచితంగా శస్త్రచికిత్సలు చేస్తున్నారు. సత్యసాయి హెల్త్ అండ్ ఎడ్యుకేషనల్ ట్రస్టు ఆధ్వర్యంలో నడుస్తున్న ఈ ఆసుపత్రుల్లో పుట్టుకతోనే గుండె సంబంధ వ్యాధులతో జన్మించిన శిశువులకు శస్త్రచికిత్స మొదలుకొని ఔషధాల వరకు అంతా ఉచితమే. చిన్నారితోపాటు ఇద్దరికి భోజనం, వసతి సౌకర్యం కల్పిస్తున్నారు. ఈ ఆసుపత్రి వలంటీర్లు మారుమూల గ్రామాలు, గిరిజన తండాల్లో శిబిరాలు నిర్వహించి మరీ లోపాలున్న చిన్నారులను గుర్తిస్తున్నారు. కొండపాకలో 2024 నవంబరు 23న హృదయాలయాన్ని ప్రారంభించారు. వంద పడకల సామర్థ్యం ఉన్న ఈ ఆసుపత్రిలో ఆధునిక వైద్య పరికరాలు, నిష్ణాతులైన వైద్యులు, పూర్తిస్థాయి డిజిటల్ ల్యాబ్ ఏర్పాటు చేశారు. 24 గంటలపాటు వైద్యసేవలు అందుబాటులో ఉంటాయి. ఇక్కడ అత్యాధునిక క్యాథ్ ల్యాబ్(క్యాథెటరైజేషన్ లాబొరేటరీ) ఉంది. సాధారణ శస్త్రచికిత్సలలో శరీరాన్ని పెద్దగా కోయాల్సి ఉండగా.. దీనితో కనీస కోతతో చికిత్స చేస్తారు. శరీరంలోని రక్తనాళాల ద్వారా (చేయి లేదా కాలు) నుంచి సన్నని గొట్టాన్ని (క్యాథెటర్) గుండె వరకు పంపించి పరీక్షలు నిర్వహిస్తారు.

పుట్టుకతో వచ్చే లోపాలకే...

పుట్టుకతో వచ్చే గుండె లోపాలకు మాత్రమే ఇక్కడ చికిత్స అందిస్తారు. సర్జరీలు చేస్తారు. గుండెకు రంధ్రం, వాల్వ్‌ల పనితీరు దెబ్బ తినడం, వ్యవస్థ సరిగా లేకపోవడం, ప్రతిస్పందనలు కొరవడడం, రక్తసరఫరాలో తేడాలు.. ఇలా 100 రకాల సమస్యల్ని సరిచేస్తారు. తల్లి గర్భంలోనే ఉత్పన్నమయ్యే ప్రమాదకరమైన గుండె సమస్యలు (కంజెనిటల్ హార్ట్ డిఫెక్ట్స్)కు మెరుగైన చికిత్సలు అందిస్తున్నారు.

– ఈనాడు, సంగారెడ్డి



సిద్దిపేట జిల్లా కొండపాకలో సత్యసాయి సంజీవని హార్ట్‌కేర్ సెంటర్



సత్యసాయి సంజీవనిలో అత్యాధునిక ల్యాబ్‌లు, శస్త్రచికిత్స యూనిట్లు

ఇలా సంప్రదించాలి

80101 19000 నంబరుకు కాల్ చేసి లేదా 70751 37733 వాట్సప్ నంబర్‌లో చాట్‌చేసి అపాయింట్‌మెంట్ పొందవచ్చు.

ఎస్సీ వర్గీకరణ సీఎం చంద్రబాబు చలవే

మంద కృష్ణమాదిగ

గుంటూరు (మిర్చియార్డు), న్యూస్‌టుడే: ఎస్సీ వర్గీకరణ ముఖ్యమంత్రి చంద్రబాబు చలవేనని, పోరాటం జాతీయ స్థాయికి వెళ్లేందుకు.. వివిధ దశల్లో ఎదురైన అవరోధాలను అధిగమించేందుకు ఆయన వెన్నంటి ఉన్నారని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ పేర్కొన్నారు. మార్కెటింగ్ శాఖ డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన కాకుమాను శ్రీనివాసరావుకు గుంటూరులోని మార్కెటింగ్ శాఖ కమిషనరేట్‌లో గురువారం అభినందన సత్కార కార్యక్రమం నిర్వహించారు. ఈ సభలో మందకృష్ణ మాదిగ మాట్లాడుతూ.. 'రెండు దశాబ్దాల కిందట అమలైన ఎస్సీ వర్గీకరణ ద్వారా పదోన్నతి పొందిన ఎంతోమంది మాదిగ జాతి ఉద్యోగులు ఉన్నత స్థానాల్లోకి చేరడాన్ని ఎల్లకాలం గుర్తుంచుకుంటారు. వర్గీకరణ మధ్యలో ఆగకుండా అమలు జరిగితే ఎక్కువ మంది ఫలాలు పొందే అవకాశం ఉండేది. జగన్ ప్రభుత్వం ఏమాత్రం సహకారం అందించలేదు' అని తెలిపారు.



కాకుమాను శ్రీనివాసరావును అభినందిస్తూ మాట్లాడుతున్న మంద కృష్ణమాదిగ

EENADU Vol: 52, Issue: 198 Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. Founder Ramoji Rao

ఈనాడు సినిమా

'పెద్ది'... రై రై రారా


రామ్‌చరణ్

కథానాయకుడు రామ్‌చరణ్.. దర్శకుడు బుచ్చిబాబు సానా కలయికలో రూపొందుతున్న పాన్ ఇండియా చిత్రం 'పెద్ది'. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వెంకట సతీశ్ కిలారు నిర్మిస్తున్నారు. జాన్వీ కపూర్ కథానాయిక. ప్రస్తుతం ముగింపు దశలో ఉన్న ఈ సినిమా ఏప్రిల్ 30న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే ప్రచార పర్వంలో భాగంగా ఈ చిత్ర రెండో గీతాన్ని విడుదల చేసేందుకు సిద్ధమవుతున్నారు. "రై రై రారా" అంటూ సాగే ఆ పాటను మార్చి 2న విడుదల చేయనున్నట్లు గురువారం ప్రకటించారు. ఈ మేరకు ఓ కొత్త పోస్టర్‌ను నెట్టింట పంచుకున్నారు. అందులో చరణ్ మాస్ లుక్‌లో ఆసక్తికరంగా కనిపించారు. ఉత్తరాంధ్ర నేపథ్యంలో సాగే పీరియాడిక్ యాక్షన్ డ్రామా ఇది. క్రీడా నేపథ్య అంశాలతో మిళితమై ఉంటుంది. ఇందులో చరణ్ ఆట కూలీగా అలరించనున్నారు. ఇందులో శివ రాజ్‌కుమార్, జగపతిబాబు, దివ్యేందు శర్మ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి సంగీతం: ఏఆర్ రెహమాన్, ఛాయాగ్రహణం: రత్నవేలు.

వచ్చే సంక్రాంతి హీరోలు వీళ్లే!

- వెంకటేశ్ - కల్యాణ్‌రామ్‌లతో మల్టీస్టారర్ చిత్రం
- అనిల్ రావిపూడి దర్శకత్వం


వెంకటేశ్


కల్యాణ్‌రామ్

ఈ సంక్రాంతికి చిరంజీవి - వెంకటేశ్‌లతో కలిసి 'మన శంకరవరప్రసాద్‌గారు' చిత్రంతో ప్రేక్షకుల్ని అలరించారు దర్శకుడు అనిల్ రావిపూడి. ఇప్పుడాయన వచ్చే ముగ్గుల పండగ కోసం మరో ఆసక్తికర కలయికను తెరపైకి తెచ్చారు. కథానాయకులు వెంకటేశ్ - నందమూరి కల్యాణ్‌రామ్‌లతో ఓ మల్టీస్టారర్‌ను రూపొందించనున్నారు. ఈ విషయాన్ని గురువారం సామాజిక మాధ్యమాల వేదికగా అధికారికంగా ప్రకటించారు. "మొదటిసారి బొమ్మ తీసే అవకాశమిచ్చిన హీరో కల్యాణ్‌రామ్, మొదటి రూ.వందకోట్ల బొమ్మ కొట్టిన హీరో వెంకటేశ్‌తో కలిసి 2027 మొదటి పండక్కి మీ ముందుకొస్తున్నా" అని అనిల్ పోస్ట్‌లో పేర్కొన్నారు. అనంతరం వెంకటేశ్ స్పందిస్తూ.. "నేను.. అనిల్ కలిసి పని చేసిన ప్రతిసారీ సరదాగా, సానుకూలంగా స్వచ్ఛమైన వినోదంతో ఇంటికి తిరిగొచ్చినట్లు అనిపిస్తుంది. ఇప్పుడాయనతో ఐదో సినిమా కోసం తిరిగి కలిశాను. ఈ ప్రయాణంలో కల్యాణ్‌రామ్ చేరడం ఆనందంగా ఉంది. పండక్కి కలుద్దాం" అని ట్వీట్ చేశారు. "పటాస్' తర్వాత మీతో తిరిగి కలవడం ఇప్పటికీ ప్రత్యేకంగా అనిపిస్తుంది అనిల్. ఈసారి మా ప్రియమైన వెంకటేశ్‌తో ఓ సూపర్ ఎంటర్‌టైనర్ కోసం. చిత్రీకరణ ప్రారంభించేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నా" అని కల్యాణ్‌రామ్ తన పోస్ట్‌లో రాసుకొచ్చారు. ఇది అనిల్ శైలికి తగ్గట్లుగా స్వచ్ఛమైన వినోదం, బలమైన కుటుంబ భావోద్వేగాలతో అందర్నీ అలరించే ఎంటర్‌టైనర్‌గా ఉంటుందని.. ప్రస్తుతం స్క్రిప్ట్‌కి తుది మెరుగులు దిద్దుతున్నారని.. పూర్వ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని చిత్ర వర్గాలు తెలిపాయి.

విరోష్... పెళ్లి జోష్





దేవ దేవుడే పంపగా... ఇలా దేవతే మా ఇంట అడుగే పెట్టేనంట...

అంటూ కథానాయిక రష్మికని ఉద్దేశించి ఎప్పుడో పెళ్లి పాట పాడుకున్నారు కథానాయకుడు విజయ్ దేవరకొండ. అదంతా అప్పుడు సినిమా కోసమే! ఇప్పుడు అదే నిజమైంది. తెరపైన కలిసి ఏడడుగులు వేసిన దృశ్యం... అందమైన ఈ జంట వ్యక్తిగత జీవితంలో నిజంగానే సాక్షాత్కారమైంది. వెండితెరపై భలే జోడీ అనిపించుకున్న విజయ్ దేవరకొండ - రష్మిక మందన్న గురువారం వివాహ బంధంతో ఒక్కటయ్యారు. 'నా ప్రాణ స్నేహితురాలు నా భార్య అయ్యింది...' అంటూ పెళ్లి తర్వాత విజయ్ దేవరకొండ ఆనందం వ్యక్తం చేయగా, 'నా భర్త విజయ్...' అంటూ ప్రపంచానికి పరిచయం చేశారు రష్మిక. స్వతహాగా ఎవరికి వారు ప్రేక్షకుల్లో ప్రత్యేకమైన గుర్తింపుని సాధించిన విజయ్, రష్మికలు సినిమాల ద్వారా దగ్గరయ్యారు. కలిసి నటించిన ఈ ఇద్దరూ గత కొన్నేళ్లుగా ప్రేమలో ఉన్నారు. పెద్దల అంగీకారంతో పెళ్లి పీటలెక్కారు. రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో గురువారం విజయ్, రష్మిక మూడు ముళ్ల బంధంతో ఒక్కటయ్యారు. 'విరోష్' పేరుతో జరిగిన ఈ వివాహ వేడుకకి ఇద్దరికీ సన్నిహితులైన పలువురు సినీ ప్రముఖులు, కుటుంబ సభ్యులు హాజరయ్యారు. పెళ్లి కొడుకుగా ముస్తాబైన విజయ్ గుర్రంమీద పెళ్లి మండపానికి చేరుకోగా, వధువు బృందం ఎదుర్కోలు వేడుకతో ఆహ్వానం పలికింది. తెలుగు సంప్రదాయం ప్రకారం గురువారం ఉదయం 10 గంటల 10 నిమిషాలకు జీలకర్ర, బెల్లం తంతుతో కొత్త జంట ఒక్కటైంది. అదే రోజు సాయంత్రం వధువు ఇంటి కొడవ సంప్రదాయం ప్రకారం వివాహ వేడుకని నిర్వహించారు. అనంతరం కొత్త జంట సామాజిక మాధ్యమాల్లో ఫొటోలతో పాటు, ఒకరి గురించి మరొకరు తమ అంతరంగాన్ని పంచుకోగా, పలువురు ప్రముఖులు, అభిమానుల నుంచి అభినందనలు వెల్లువెత్తాయి. మార్చి 4న హైదరాబాద్‌లో వివాహ విందు వేడుక జరగనుంది.

రష్మిక నా పక్కనుంటే ఆనందం.. ఆరోగ్యం: విజయ్‌దేవరకొండ

"ఆమె నా పక్కన ఉన్న రోజులన్నీ ఎంతో బాగుండేవి. ఆమె నా ఎదురుగా కూర్చుంటే నా భోజనం మరింత తృప్తిగా, ఆరోగ్యంగా ఉండేది. ఆమె నాతో కలిసున్నప్పుడు నేను కఠినమైన వ్యాయామం చేసినా అదెంతో సరదాగా ఉండేది. నేను ఎక్కడున్నా ఇంటి అనుభూతిని, ప్రశాంతతని పొందడానికి ఆమె నా పక్కనే ఉండాలి. అందుకే నా ప్రాణ స్నేహితురాలినే నా భార్యగా చేసుకున్నా" అంటూ రష్మికని ఉద్దేశించి విజయ్ దేవరకొండ ఇన్‌స్టాలో ఓ పోస్ట్‌ని పంచుకున్నారు.

విజ్జూ... నా జీవితంలో అన్నింటా నువ్వే: రష్మిక



"నా భర్త విజయ్ దేవరకొండని పరిచయం చేస్తున్నా. నిజమైన ప్రేమ ఎలా ఉంటుందో నాకు నేర్పిన వ్యక్తి తను. ప్రశాంతంగా ఉండటం ఎలాగో నాకు చూపించిన వ్యక్తి. మన కలలు, లక్ష్యాలు గొప్పగా ఉండాలని రోజూ నాకు చెప్పే వ్యక్తి. నేను ఊహించినదానికన్నా ఎక్కువ సాధించగలనని నన్ను నిత్యం ప్రోత్సహించిన వ్యక్తి... నా భావాలను నిర్భయంగా వ్యక్తపరిచినా ఎప్పుడూ అర్థం చేసుకున్న వ్యక్తి. స్నేహితుతో కలిసి చేసే ప్రయాణం ఎంత బాగుంటుందో నేర్పిన వ్యక్తి. నేను తన గురించి ఓ పుస్తకం రాయగలనంటే నమ్మండి. ఒక మహిళగా నేనెలా ఉండాలని ఇన్నేళ్లుగా కలలు కన్నానో, అలా ఇప్పుడు మారినందుకు దానికి కారణం నువ్వే విజ్జూ నీ గురించి బాహాటంగా వ్యక్తం చేయడానికి మాటలు సరిపోవు. ఆ విషయం నీకు ఎప్పుడూ చెబుతుంటా. జీవితంలో నేను అందుకున్న విజయాలు, కష్టాలు, సంతోషాలు, విచారాలు, ఆనందం అన్నీ నీకు తెలుసు. ఇకపై ప్రతిదీ అద్భుతంగా ఉంటుంది, ఎందుకంటే నువ్వు నాతో ఉన్నావు. నా జీవితంలో అన్నింటా నువ్వు అతి పెద్ద భాగం. నేను నీ భార్య అని పిలిపించుకోవడానికి, నీ భార్యగా ఉండటానికి ఎంతో ఉత్సాహంగా ఉన్నా. మనం కలిసి అత్యుత్తమ జీవితాన్ని గడుపుదాం" అంటూ విజయ్‌ని ఉద్దేశించి రాసుకొచ్చారు రష్మిక.

యాక్షన్ మోడ్‌లో అగ్రతారలు


మోహన్‌లాల్, మమ్ముట్టి

మహేశ్ నారాయణన్ దర్శకత్వంలో అగ్ర కథానాయకులు మోహన్‌లాల్, మమ్ముట్టి ప్రధానపాత్రలో తెరకెక్కుతున్న మలయాళ చిత్రం 'పేట్రియాట్'. ఈ సినిమాలో ఫహాద్ ఫాజిల్, నయనతార, కుంచకో బోబన్, గౌతమి తదితరులు కీలకపాత్రలు పోషిస్తున్నారు. స్పై యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందుతున్న ఈ సినిమా ఏప్రిల్ 23న థియేటర్లలో విడుదల కానుంది. తాజాగా ఈ సినిమా సెకండ్ లుక్ పోస్టర్‌ని ఇన్‌స్టా వేదికగా ఆవిష్కరించింది చిత్రబృందం. ఈ పోస్టర్.. కుంచకో నడుపుతున్న కారులో అగ్ర హీరోలిద్దరూ తుపాకులు చేతపట్టి యాక్షన్ మోడ్‌లో ఆకట్టుకుంటున్నారు. దేశభక్తి నేపథ్యంతో ఈ చిత్రాన్ని తీర్చిదిద్దుతున్నట్లు ఇప్పటికే విడుదలైన ట్రైలర్‌తో స్పష్టమైంది.

మనలో ఒకడిలా కనిపిస్తాడు శ్రీవిష్ణు. మన చుట్టూ జరిగేవే ఆయన సినిమాల్లో కథలు. వరుస విజయాల వెనక రహస్యం అదేనేమో! ఇంటిల్లిపాదీ హాయిగా నవ్వుకునే సినిమాలకు చిరునామాగా నిలుస్తున్న శ్రీవిష్ణు ఈరోజు 'విష్ణు విన్యాసం'తో ప్రేక్షకుల ముందుకొస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన గురువారం విలేకర్లతో ముచ్చటించారు.

షూటింగ్ లేకపోతే రోజూ ఒక్క కథైనా వింటా!


శ్రీవిష్ణు

సినిమాలో హీరో విష్ణు జాతకాలు, గ్రహాలు అంటున్నాడు. వ్యక్తిగతంగా మీకూ అలాంటి నమ్మకాలు ఉన్నాయా?

అదే పనిగా అనుసరించను కానీ, ముహూర్తం ప్రకారం సినిమాల్ని ప్రారంభించడం, చిన్నప్పట్నుంచీ ఇంట్లో పెద్దవాళ్లు చెబుతున్నవి అందరితోపాటే నమ్మడం వరకూ ఉంటుందంతే. వ్యక్తిగతంగా మాత్రం ఫలానా సమయమే బయటకు వెళ్లాలి, ఫలానా సంఖ్యే కావాలనైతే ఉండదు.

ఈ సినిమాలో విష్ణు... శ్రీవిష్ణుకీ మధ్య కనిపించిన సారూప్యతలు ఏమిటి?

తెరపైన కనిపించే విష్ణులా ఎవ్వరూ ఉండరేమో (నవ్వుతూ). అతనికి జాతకాలపై పిచ్చి మరో స్థాయిలో ఉంటుంది. సమయం, అంకెలకు సంబంధించిన లెక్కలు, రంగులు, గ్రహాలు... ఇలా అన్నీ ముఖ్యమే తనకి. పేరుకు అధ్యాపకుడు కానీ, క్లాస్ రూమ్‌లో విద్యార్థులకు హాజరు వేసేటప్పుడు కూడా తనకి నచ్చిన అంకెల్నే పలుకుతాడు. మా రోల్ నెంబర్ పిలవలేదేమిటి అంటే నీది రైజింగ్ నంబరు కాదు, లక్కీ నంబరు కాదు అంటుంటాడు. కథ, పాత్ర అందరికీ కనెక్ట్ అయ్యేలా ఉంటాయి. రెండు గంటలపాటు ప్రేక్షకులు హాయిగా చూసి నవ్వుకునేలా సినిమా ఉంటుంది.

మీరు సంపాదించిన 'కింగ్ ఆఫ్ ఎంటర్‌టైన్‌మెంట్' అనే పేరు మీకు బలమా లేక, మీపై ఒత్తిడిని పెంచుతోందా?

ఎంటర్‌టైన్‌మెంట్ అనగానే కామెడీ మాత్రమే అనుకుంటారంతా. దాంతో నా ప్రతి సినిమాలోనూ కామెడీనే ఆశిస్తారు. డ్రామాతో కూడిన ఇతరత్రా కొత్త కథలు చేసినా, అందులో ప్రేక్షకులు నా నుంచి కోరుకునే ఫన్ మాత్రం తప్పక ఉండేలా జాగ్రత్తలు తీసుకోవల్సి వస్తోంది. కామెడీ టైమింగ్‌లోనూ మార్పు కనిపించేలా జాగ్రత్తలు తీసుకొంటున్నా. 'సామజవరగమన'లో ఒక తరహా టైమింగ్ ఉంటే, 'సింగిల్' మరోలా ఉంటుంది. 'విష్ణు విన్యాసం'లో ఆ రెండు సినిమాలకి భిన్నమైన టైమింగ్‌ని ప్రదర్శించా.

ట్రైలర్ చూస్తుంటే హీరోయిన్ ఆధిపత్యమే ఎక్కువగా కనిపిస్తోంది...

ప్రేక్షకులకు బాగా నచ్చే అంశం అదే. హీరోని ఇరకాటంలో పెడుతున్నకొద్దీ థియేటర్లలో నవ్వులే. హీరో, హీరోయిన్... ఆ రెండు పాత్రలూ చాలా కొత్తగా ఉంటాయి. సినిమా ఆరంభమే నవ్వులతో మొదలవుతుంది. ఆ తర్వాత ఫ్యామిలీ డ్రామాలోకి వెళుతుంది. వీరి వీరి గుమ్మడిపండు... అంటూ వచ్చే ఓ ఎపిసోడ్ ప్రథమార్ధానికి ప్రధాన ఆకర్షణగా నిలుస్తుంది. మొదట అనుభవం ఉన్న నటినే కథానాయికగా ఎంచుకోవాలనుకున్నాం. కానీ 'ఆయ్' చూశాక నయన్ సారిక కామెడీ టైమింగ్ చాలా నచ్చేసింది. అప్పటికే ఆమె తెలుగు కూడా నేర్చుకుని చాలా బాగా నటించింది.

కొత్త దర్శకులతో ఎక్కువగా సినిమాలు చేస్తుంటారు. ఆ విషయంలో మీకున్న సౌలభ్యం ఏమిటి?

కొత్తవాళ్ల నుంచే కొత్తదనం వస్తుందనే విషయాన్ని నేను బలంగా నమ్ముతా. నా సినిమాలతో ఎంత మంది కొత్త దర్శకులు పరిచయవుతున్నా, నేను ఇంకా చాలా మందిని మిస్ అవుతుంటా. చిత్రీకరణ లేకపోతే రోజుకి ఓ కొత్త కథైనా వింటుంటా. తదుపరి నేను చేయబోయే చాలా సినిమాలు కొత్త దర్శకులతోనే.

కొత్త సినిమాల సంగతులు చెబుతారా?

'కామ్రేడ్ కళ్యాణ్' అనే సినిమా చేస్తున్నా. నక్సలిజం నేపథ్యంలో సాగే హాస్య ప్రధానమైన కథ అది. చాలా కొత్తగా ఉంటుంది. రామ్ అబ్బరాజుతో ఓ సినిమాని త్వరలోనే ప్రారంభిస్తున్నా. అది 'సామజవరగమన' సినిమాకి కొనసాగింపు అయితే కాదు. కొత్త కథని సిద్ధం చేశారు సాయి. అది పూర్తయిన తర్వాత 'సామజవరగమన 2' చేస్తాం. సితార సంస్థలో సన్నీ అనే ఓ కొత్త దర్శకుడితో సినిమా చేయబోతున్నా. అది కూడా చాలా ఆసక్తికరమైన కథ. 'సింగిల్'కి కొనసాగింపు కథ కూడా సిద్ధం అవుతోంది.

నాకు భయమేంటి.. రాముడొస్తాడు


అక్షయ్ కుమార్

భవిష్యత్తులో రాముడొచ్చి మంచి చేస్తాడు.. నాకేం భయమంటూ దెయ్యాలతో కలిసి ధైర్యంగా స్టెప్పులేస్తున్నాడు బాలీవుడ్ కథానాయకుడు అక్షయ్ కుమార్. ఆయన ప్రధాన పాత్రలో తెరకెక్కుతోన్న చిత్రం 'భూత్ బంగ్లా'. ప్రియదర్శన్ దర్శకత్వం వహిస్తున్నారు. హారర్ కామెడీగా రూపొందుతున్న ఈ సినిమా ఏప్రిల్ 10న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో చిత్ర బృందం సామాజిక మాధ్యమాల వేదికగా 'రామ్ జీ ఆకే భలా కరేంగే' అనే పాటని విడుదల చేసింది. ఇందులో భిన్నమైన లుక్స్‌లో అక్షయ్.. భూతాలతో డ్యాన్స్ చేస్తున్న సన్నివేశాలు ఆకట్టుకునేలా ఉన్నాయి. ఈ గీతానికి కుమార్ సాహిత్యమందించగా అర్మాన్ మాలిక్, అర్వన్ కలిసి ఆలపించారు. ఈ చిత్రానికి ప్రీతమ్ స్వరాలు సమకూరుస్తున్నారు. టబు, వామికా గబ్బి, మిథిలా పాల్కర్, పరేశ్ రావల్ తదితరులు ఈ సినిమాలో నటిస్తున్నారు.

రజనీ సినిమాలో.. బసిల్


బసిల్

వైవిధ్యమైన చిత్రాలతో సినీప్రియులను అలరించడమే కాకుండా.. ఇతర సినిమాలలో తెరపై అతిథి పాత్రలలో మెరిసి ప్రేక్షకులలో నవ్వులు పూయిస్తుంటారు నటుడు, దర్శకనిర్మాత బసిల్ జోసెఫ్. ఇటీవలే 'పరాశక్తి'లో కనిపించిన ఆయన ఖాతాలో.. 'అతిరథి' చిత్రమున్న సంగతి తెలిసిందే. ఈ సినిమాతో వేసవి వినోదానికి సన్నద్ధమవుతున్నారు బసిల్. ఇప్పుడాయన తదుపరి చిత్రం కోసం అగ్ర కథానాయకుడు రజనీకాంత్‌తో కలిసి నటించనున్నట్లు తెలుస్తోంది. రజనీ కాంత్ హీరోగా కమల్ హాసన్ తన సొంత నిర్మాణసంస్థ రాజ్‌కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ పతాకంపై నిర్మించనున్న చిత్రం రజనీ 173(వర్కింగ్ టైటిల్). ఈ సినిమాలో బసిల్.. రజనీ కొడుకు పాత్రలో కనిపించనున్నారని సమాచారం. 'డాన్' ఫేమ్ దర్శకుడు శిబి చక్రవర్తి ఈ సినిమాని తెరకెక్కించనున్నారు. ఇప్పుడాయన బసిల్‌తోపాటు.. ఈ సినిమాలో కీలకపాత్రలో నటించేందుకు ప్రియాంక అరుళ్ మోహన్ పేరును పరిశీలిస్తున్నట్లు జోరుగా ప్రచారం జరుగుతోంది. దీనిపై స్పష్టత రావాలంటే చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన వచ్చేంత వరకు వేచి ఉండాల్సిందే.

ఈ చిత్ర వసూళ్లు ధైర్యాన్నిచ్చాయి


గోపీ అచ్చర, శివానీ నాగారం, సుహాస్, వంశీ నందిపాటి, బి.నరేంద్ర రెడ్డి

"అంబాజీపేట మ్యారేజి బ్యాండు' సినిమా తర్వాత నా చిత్రాలకి ఆశించిన స్థాయిలో వసూళ్లు కనిపించకపోవడంతో భయమేసింది. కానీ, 'హే బల్‌వంత్' వసూళ్లు చూశాక మళ్లీ ధైర్యం వచ్చింది" అన్నారు హీరో సుహాస్. ఆయన.. శివానీ నాగారం జంటగా నటించిన ఈ సినిమాని గోపీ అచ్చర తెరకెక్కించారు. బి.నరేంద్ర రెడ్డి నిర్మించారు. ఈ చిత్రం ఇటీవల విడుదలైన నేపథ్యంలో గురువారం హైదరాబాద్‌లో థాంక్స్ మీట్‌ని నిర్వహించారు. ఈ సందర్భంగా సుహాస్ మాట్లాడుతూ.. "మా చిత్రానికి ఓవర్సీస్ నుంచి మంచి వసూళ్లు దక్కాయి. చాలా రోజుల తర్వాత నా సినిమాకి ఓటీటీ నుంచి మంచి ఫ్యాన్సీ రేటు వచ్చింది" అన్నారు. "చాలా తక్కువ మంది మాత్రమే మా సినిమా బ్రేక్ ఈవెన్ అయిందని ధైర్యంగా చెప్తారు. ఆ కోవలో మా 'హే బల్‌వంత్' నిలిచినందుకు ఆనందంగా ఉంది. త్వరలోనే దర్శకుడు గోపీతో మరో సినిమా చేస్తున్నాం" అన్నారు నిర్మాత వంశీ నందిపాటి. ఈ కార్యక్రమంలో బి.నరేంద్ర రెడ్డి, శివానీ, గోపీ తదితరులు పాల్గొన్నారు.

ఆ ఆకలి ఎప్పుడూ ఉంటుంది!


సంయుక్త మేనన్

భాషలతో సంబంధం లేకుండా కథానాయికగా పాన్ ఇండియా స్థాయి చిత్రాలతో తెరపై సందడి చేయడానికి సన్నద్ధమవుతోంది సంయుక్త మేనన్. ఇండస్ట్రీలో వరుస విజయాలతో జోరుమీదున్న ఈ భామ తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాత్రల ఎంపికతోపాటు తను నటిస్తున్న 'బెంజ్' సినిమా గురించి ఆసక్తికరమైన సంగతుల్ని వెల్లడించింది. "మంచి కంటెంట్.. మంచి పాత్రలు ఏవైనా ఇంకా బాగా చేయాలనే ఆకలి ఎప్పుడూ ఉంటుంది. నన్ను ఆకర్షించేది మంచి సినిమా. దాని విజయానికి కథను చెప్పడంతోపాటు అందులోని ఆత్మ, పాత్రల ప్రభావం కూడా కారణమవుతాయి. అలానే ఒక సినిమాకి సంబంధించిన కథాంశం సమాజంలో ఎంత పాతుకుపోయి ఉంటే అది అంత ప్రభావం చూపిస్తుంది అనిపిస్తుంది. ప్రస్తుతం లోకేశ్ సినిమాటిక్ యూనివర్స్(ఎల్‌సీయూ)లో భాగంగా రూపొందుతున్న 'బెంజ్'లో నటిస్తున్నాను. ఇందులో ఇతర సినిమాల పాత్రలు వస్తూ పోతూ ఉంటాయి. ఇందులో నేను ఎలాంటి యాక్షన్ సన్నివేశాలు చేయడం లేదు"ని చెప్పింది.

'ది కేరళ స్టోరీ 2' విడుదల వాయిదా

'ది కేరళ స్టోరీ 2' సినిమా సెన్సార్ సర్టిఫికేట్‌ను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లను విచారించిన కేరళ హైకోర్టు గురువారం సినిమా విడుదలపై స్టే విధించింది. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్(సీబీఎఫ్‌సీ) తన మార్గదర్శకాలను పాటించడంలో విఫలమైనట్లు కనిపిస్తోందని పేర్కొంది. దీంతో సినిమాను పునః పరిశీలించాల్సిందిగా జస్టిస్ కురియన్ థామస్ సీబీఎఫ్‌సీకి సూచించారు. అప్పటివరకూ సినిమా విడుదలపై స్టే విధిస్తున్నట్లు ఉత్వర్వులు జారీ చేశారు. గురువారం నుంచి 13 రోజులపాటు ఈ సినిమా విడుదల కాకుండా చూసుకోవాలని సీబీఎఫ్‌సీ, నిర్మాతలను ఆదేశించింది. ఇటీవల విడుదలైన టీజర్‌లో కేరళను తప్పుగా చూపించారని, మతపరమైన ఉద్రిక్తతలకు దారితీసే అంశాలున్నాయనే విమర్శలతో ఈ సినిమా న్యాయపరమైన చిక్కుల్లో పడిన సంగతి తెలిసిందే. దీంతో నేడు విడుదల కావాల్సిన ఈ సినిమా హైకోర్టు ఉత్తర్వుల మేరకు వాయిదా పడింది. కామాఖ్య నారాయణ్ సింగ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని విపుల్ అమృత్‌లాల్ షా నిర్మించారు. ఉల్కా గుప్తా, అదితి భాటియా, ఐశ్వర్య ఓజా కీలక పాత్రలు పోషించారు.

ఈనాడు బిజినెస్

ప్రైవసీ డిస్‌ప్లేతో శామ్‌సంగ్ గెలాక్సీ ఎస్26

ధరలు రూ.87,999-1,39,999 నుంచి ప్రారంభం



శాన్ ఫ్రాన్సిస్కో, కాలిఫోర్నియా: గెలాక్సీ ఏఐ సిరీస్ ఫోన్ ఎస్26ను శామ్‌సంగ్ ఎలక్ట్రానిక్స్ విడుదల చేసింది. గెలాక్సీ ఎస్26, ఎస్26+, ఎస్26 అల్ట్రా రకాల్లో ఇవి లభ్యం కానుంది. ఎస్26 ధర రూ.87,999 నుంచి, ఎస్26+ ధర రూ.1,19,999, అల్ట్రా ధర రూ.1,39,999 నుంచి ప్రారంభం కానుంది. ప్రపంచంలోనే తొలిసారిగా ఈ ఫోన్లో ప్రైవసీ డిస్‌ప్లే అమర్చినందున, పక్క నుంచి చూసేవారికి ఈ ఫోన్ తెరపై అంశాలు కనపడవు. ఎస్26 అల్ట్రా 7.9 మి.మీ. మందంతో లభించనుంది. స్నాప్‌డ్రాగన్ 8 ఎలైట్, జెన్ 5 మొబైల్ ప్లాట్‌ఫామ్ వల్ల ప్రాసెసింగ్ అత్యంత వేగంగా ఉంటుందని సంస్థ సీఈఓ, టీఎం రో తెలిపారు. సూపర్‌ఫాస్ట్ ఛార్జింగ్ 3.0 వల్ల 30 నిమిషాల్లోనే 75% ఛార్జ్ అవుతుంది. ఏఐ (కృత్రిమమేధ) సంబంధించిన అంశాలు బ్యాక్‌గ్రౌండ్‌లో పనిచేస్తున్నా, ఫోన్ వేగంగా పనిచేయడం వీలుపడుతుంది. ఈ మాస పోస్టుకు ముందస్తు బుకింగ్‌లు మొదలయ్యాయి.

ప్రారంభ స్థాయి స్మార్ట్‌ఫోన్లలోనూ ఏఐ: ప్రారంభ స్థాయి స్మార్ట్‌ఫోన్లలోనూ ఏఐ సాంకేతికతను అంతర్భాగం చేయనున్నామని శామ్‌సంగ్ ఇండియా సీనియర్ వైస్ ప్రెసిడెంట్ రాజు పుల్లన్ తెలిపారు. రూ.15,000 ప్రారంభ ధరతో తీసుకొచ్చిన గెలాక్సీ ఏ07 5జీ స్మార్ట్‌ఫోనుతో రోజువారీ కార్యకలాపాలకు ఉపయోగపడే ఏఐ ఆధారిత ప్రత్యేకతలను అందిస్తున్నామని వివరించారు. మరిన్ని మోడళ్లకు ఈ సదుపాయాలు విస్తరించడం ద్వారా, ఈ ఏడాదిలోనే 10 కోట్ల విక్రయాల మైలురాయిని అందుకుంటామనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. 'ఫైనాన్స్ ప్లస్' ద్వారా గెలాక్సీ స్మార్ట్‌ఫోన్లను సులువుగా రుణ సదుపాయం కలిగించినట్లు వెల్లడించారు.

డబ్ల్యూఈఎఫ్ అధ్యక్షుడు బర్గే బ్రెండా రాజీనామా

సెక్స్ కుంభకోణంలో ప్రధాన నిందితుడైన జెఫ్రీ ఎప్‌స్టీన్‌తో సంబంధాలపై ఒత్తిడి ఎదుర్కొంటుండటంతో ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యూఈఎఫ్) అధ్యక్ష పదవికి బర్గే బ్రెండా రాజీనామా చేశారు. 'డబ్ల్యూఈఎఫ్ ప్రెసిడెంట్, సీఈఓగా బాధ్యతలు నిర్వహించడంలో నాకు సహకరించిన ఉద్యోగులు, భాగస్వాములకు ధన్యవాదాలు. ఎలాంటి అంతరాయాలు లేకుండా ఫోరమ్ తన ముందున్న కీలక విధులను కొనసాగించాలి. అందుకే అన్ని విషయాలను నిశితంగా పరిశీలించిన తర్వాత, నా రాజీనామా నిర్ణయం తీసుకున్నా'నని బ్రెండా తెలిపారు. డబ్ల్యూఈఎఫ్ మేనేజింగ్ డైరెక్టర్ అలోయిస్ జ్వింగ్, తాత్కాలిక ప్రెసిడెంట్, సీఈఓగా వ్యవహరించనున్నారు.

గూగుల్ మ్యాప్స్‌లో ఆధార్ సెంటర్లు

దేశంలోని పౌరులు తమ సమీపంలోని ఆధార్ కేంద్రాల గురించి సులువుగా తెలుసుకునే లక్ష్యంతో, గూగుల్ మ్యాప్స్‌లో అధికృత ఆధార్ కేంద్రాలను చూపించడానికి భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ (యూఐడీఏఐ), గూగుల్ భాగస్వామ్యం కుదుర్చుకున్నాయి. అడ్రెస్ ఎన్‌రోల్‌మెంట్, చైల్డ్ ఎన్‌రోల్‌మెంట్ లేదా కేవలం చిరునామా, మొబైల్ నంబర్ అప్‌డేట్ వంటి సేవలకు అనుగుణంగా.. పౌరులు తమకు దగ్గరలోని ఆధార్ కేంద్రాలను గుర్తించడానికి ఇది సహాయపడుతుందని యూఐడీఏఐ తెలిపింది. ఆధార్ కేంద్రం వద్ద లభించే సేవలు, పార్కింగ్ సౌకర్యం, పనివేళలు వంటి వివరాలు కూడా లభిస్తాయి. ఈ సదుపాయం రాబోయే కొన్ని నెలల్లో అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.

కోడి గుడ్డు

27న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (వంద రూపాయల్లో)


హైదరాబాద్	470
వరంగల్	472
విజయవాడ	500
తూ/పగోదావరి	480
విశాఖపట్నం	485
చిత్తూరు	533

ఐఐటీ పరిశోధనలకు జీసీసీ నిధులు

- అమెరికా తరహాలోనే మనదేశంలోనూ
- సరికొత్త ఆవిష్కరణలు, వినూత్నతకు వీలు



కిరణ్ చెరుకూరి



ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థల్లో పరిశోధనలు ఎక్కువగా జరుగుతుంటాయి.. తగిన నిధులుండవు. కంపెనీలు స్థాపిస్తున్న గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ల (జీసీసీ)లో నిపుణులు - నిధులు అధికం, పరిశోధనలు తక్కువ. ఈ రెండూ కలిస్తే, వినూత్న ఆవిష్కరణలు త్వరగా - అధికంగా సాకారమవుతాయి. అమెరికాలో ఇదే జరుగుతోంది. అక్కడి ఎంఐటీ, స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ వంటి ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థల్లో పరిశోధనలకు ప్రభుత్వం కంటే, జీసీసీలు ఇచ్చే నిధులే ఎక్కువ. మనదేశంలోనూ దాదాపు 1800 కంపెనీల జీసీసీలు కార్యకలాపాలు సాగిస్తున్నాయి. అమెరికా తరహాలో ఇక్కడా ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలు-పరిశ్రమ మధ్య భాగస్వామ్యాన్ని నెలకొల్పేందుకు కాన్పూర్ ఐఐటీతో కలిసి ముందడుగు వేసినట్లు హెచ్‌సీఎల్ టెక్ జీసీసీ గ్లోబల్ హెడ్ కిరణ్ చెరుకూరి 'ఈనాడు'తో చెప్పారు. ఈ పరిణామ ప్రభావం ఎలా ఉంటుందంటే..

మారుతున్న జీసీసీల తీరు

అమెరికా ఐటీ కంపెనీలు తొలుత వ్యయాలు తగ్గించుకునేందుకు మనదేశంలోని జీసీసీలకు సాధారణ ఐటీ పనులు కేటాయించేవి. తదుపరి సాఫ్ట్‌వేర్ అభివృద్ధి, అనలిటిక్స్ వంటివి చేపట్టారు. అనంతరం వినూత్నత, అంతర్జాతీయ టెక్నాలజీ కార్యకలాపాలకు, వ్యూహాలకూ ఇవి నిలయమయ్యాయి. ఫలితంగా డొమైన్ నిపుణులు, సీనియర్ స్పెషలిస్టులు జీసీసీల్లో విధులు నిర్వహిస్తుంటే, సీటీఓ, సీఐఓ స్థాయి ఉన్నతాధికారులు వీటికి నేతృత్వం వహిస్తున్నారు. తదుపరి ఐఐటీ, ఐఐఎస్‌సీ వంటి దేశీయ ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలతో కలిసి వినూత్న ఆవిష్కరణలు సాధించే దిశగా అడుగులు పడుతున్నాయి.

భాగస్వామ్యం ఎవరికి మేలు?

ఐఐటీల వంటి ప్రీమియం విద్యాసంస్థలు - జీసీసీలు సంయుక్తంగా పెట్టుబడులు పెట్టి చేసే పరిశోధనా ఫలితాలపై మేధోహక్కులూ సంయుక్తంగా ఉంటాయి. ఉత్పత్తులను సత్వరం వాణిజ్యీకరించొచ్చు. పీహెచ్‌డీ చేసేవారు కూడా జీసీసీల్లో ఎదురవుతున్న వాస్తవ సమస్యలను గుర్తించి, పరిష్కార మార్గాలు అన్వేషిస్తారు. అత్యంత అధునాతన, భవిష్యతరం సాంకేతికతలు, ఉత్పత్తుల ఆవిష్కరణకు ఇది వీలు కల్పిస్తుంది.

ఖాతాదార్లకూ ప్రయోజనమే

సాధారణంగా ఐటీ కంపెనీలకు కావాల్సిన సిబ్బందిని వెండర్లు అందిస్తుంటారు. విద్యాసంస్థల భాగస్వామ్యం వల్ల అధునాతన సామర్థ్యాలు కలిగినవారు, యాక్సెలరేటర్లు, ఆర్కిటెక్టులు లభిస్తారు. ఫలితంగా కొన్ని పనులు నెలలకు బదులు వారాల్లోనే పూర్తయ్యే అవకాశం ఉంది. ఏఐ టూల్స్, ఏఐ ఫోర్స్ ఫర్ సాఫ్ట్‌వేర్ ఇంజినీరింగ్ అండ్ ఐటీ ఆపరేషన్స్ వంటి వాటివల్ల హెచ్‌సీఎల్ టెక్ జీసీసీల ఖాతాదార్లు నేరుగా ఏఐ (కృత్రిమమేధ) వినియోగించుకుంటున్నారు. ఆర్థిక సేవలు, ఆరోగ్య సంరక్షణ, తయారీ, వినియోగం, టెలికాం వంటి డొమైన్ ప్రత్యేక యాక్సెలరేటర్లు అతి త్వరగా వినియోగించే అవకాశం ఏర్పడుతోంది.

నిపుణులకు ఇదీ ఉపయోగం

జీసీసీల తీరును ఏఐ 3 విధాలుగా మారుస్తోంది. ఏఐ టూల్స్ వల్ల ఉత్పాదకత 30-50% మెరుగుపడుతోంది. వేగంగా కోడ్ రూపొందుతుండగా, టెస్టింగ్, తరచు చేసే పనులు ఆటోమేట్ అవుతున్నాయి. ఏఐ సెంటర్స్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఏర్పాటవుతున్నాయి. ప్రాంప్ట్ ఇంజినీర్లు, ఎంఎల్ ఆపరేషన్స్ ఆర్కిటెక్టులు, ఏఐ సేఫ్టీ ఎవాల్యుయేటర్స్, ఏఐ ప్రోడక్ట్ మేనేజర్స్ వంటి కొత్త ఉద్యోగాలొస్తున్నాయి. క్లినికల్, ఆర్థిక, ఇంజినీరింగ్ అంశాల్లో ఏఐ వెల్లడించిన అంశాలను.. ఆయా రంగాల నిపుణులు (డొమైన్స్ ఎక్స్‌పర్ట్స్) పరిశీలించాకే నిర్ధారిస్తున్నారు.

2030 నాటికి జీసీసీలు ఎలా రూపాంతరం చెందొచ్చు

తరచు చేసే ఫైనాన్స్ ప్రాసెసింగ్, నిబంధనలకు అనుగుణంగా చేసేవి, ఐటీ హెల్ప్‌డెస్కులు, ప్రాథమిక ప్రశ్న-సమాధానాలు, డేటా పైప్‌లైన్ పర్యవేక్షణ పనులు పూర్తిగా ఆటోమేట్ కావచ్చు. అయితే సిబ్బందికి తగిన శిక్షణ ఇప్పించకుండానే, ఏఐ స్వీకరించడం వల్ల వినూత్నత రాకపోగా, ఉత్పాదకతా సరిగా ఉండదు. సరైన మార్గదర్శకాలు ఏర్పరచుకుని, తగిన నిపుణులను నియమించుకుంటేనే ఏఐ ఫలితం సాకారమవుతుంది. 2030 కల్లా జీసీసీలకు ఏఐ ప్రాథమిక వనరుగా మారుతుంది. సిబ్బంది, విధులు, ఉత్పత్తులు కూడా ఏఐ ఆధారితంగానే ఉంటాయి. ప్రీమియం విద్యాసంస్థలు, అంకురాలు, సర్వీస్ ప్రొవైడర్లతో బంధం బలోపేతం అవుతుంది. డెలివరీ కేంద్రాల నుంచి అంతర్జాతీయ కార్యకలాపాలకు వేదికగా మనదేశ జీసీసీలు నిలుస్తాయి.

హైదరాబాద్‌లో తొలి కార్యక్రమం

ఏఐపైన దృష్టితోనే అడ్వాన్స్‌డ్ ఇంజినీరింగ్, డీప్‌టెక్, రోబోటిక్స్, భవిష్యతరం సాంకేతికతలపై పరిశోధనలకు హెచ్‌సీఎల్ టెక్, ఐఐటీ (కాన్పూర్) అవగాహనా ఒప్పందం చేసుకున్నాయి. హైదరాబాద్‌లో గురువారం జరిగిన కార్యక్రమంలో ఐఐటీ డైరెక్టర్ మహీంద్రా అగ్రవాల్, హెచ్‌సీఎల్ టెక్ చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ జిల్ కౌరీ, ప్రెసిడెంట్ స్వపన్ జోహ్రి పాల్గొన్నారు.

- ఈనాడు వాణిజ్య విభాగం

మ్యూచువల్ ఫండ్ పథకాల వర్గీకరణలో సెబీ మార్పులు

- లైఫ్ సైకిల్ ఫండ్స్ పేరుతో కొత్త విభాగం
- సొల్యూషన్ ఓరియంటెడ్ పథకాల రద్దు



మ్యూచువల్ ఫండ్ పథకాలను, మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ పునఃవర్గీకరించింది. సొల్యూషన్ ఓరియంటెడ్ పథకాల విభాగాన్ని తొలగించడంతో పాటు కొత్తగా లైఫ్ సైకిల్ ఫండ్స్ తీసుకొచ్చింది. ఆయా విభాగాల ఫండ్ పథకాలను మదుపర్లు సులువుగా గుర్తుపట్టేలా, పథకాల పేర్లు ఏకరీతిలో ఉండాలని సూచించడంతో పాటు, మదుపర్ల ప్రయోజనాల పరిరక్షణకు వెల్లడి నిబంధనలను కఠినం చేసింది. తప్పుదోవ పట్టించేలా రిటర్న్ - క్లెయిమ్‌లతో ఫండ్ పథకాల పేర్లను రూపొందించడాన్నీ సెబీ నిలిపి వేసింది.

5 విభాగాలుగా: మ్యూచువల్ ఫండ్‌లను ఐదు విభాగాలుగా సెబీ వర్గీకరించింది. అవి.. ఈక్విటీ, డెట్, హైబ్రిడ్, లైఫ్ సైకిల్, ఇతర పథకాలు. ఫండ్ ఆఫ్ ఫండ్ పథకాలు, ఇండెక్స్ ఫండ్స్ లేదా ఎక్స్ఛేంజీ ట్రేడెడ్ ఫండ్స్ (ఈటీఎఫ్) లాంటి పాసివ్ పథకాలను ఇతర పథకాల కిందకు చేర్చింది.

✦ ఫండ్ పథకాల పేర్లు... సదరు ఫండ్ విభాగం పేరు మాదిరిగానే ఉండాలి. మదుపర్లు ఫండ్ పథకాలను సులువుగా గుర్తించేందుకు, ఆయా విభాగాల ఫండ్ పథకాల పేర్లలో ఏకరీతిని తీసుకొచ్చే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకుంది. ప్రతిఫలం లేదా రాబడిని ప్రస్తావించే పదాలు ఫండ్ పథకం పేరులో ఉండకూడదని సెబీ తెలిపింది.

వీటికి చరమగీతం: పదవీ విరమణ, పిల్లల చదువులు, పెళ్లి లాంటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని మదుపు చేసే సొల్యూషన్ ఓరియెంటెడ్ పథకాల విభాగాన్ని తక్షణమే ఆపేయనున్నట్లు సెబీ తెలిపింది. ఈ విభాగంలోని ప్రస్తుత పథకాల్లోకి కొత్త వారిని చేర్చుకోవడం ఆపేయాలని తెలిపింది. ఈ పథకాల తరహాలో కేటాయింపులు, రిస్క్ ప్రొఫైల్ ఉండే వాటిల్లో వీటిని విలీనం చేయాలని తెలిపింది.

లైఫ్ సైకిల్ ఫండ్స్ అంటే.: లైఫ్ సైకిల్ ఫండ్స్.. లక్షిత కాలపరిమితితో కూడిన ఓపెన్ ఎండెడ్ పథకాలివి. ఈ పథకాల్లోకి వచ్చే పెట్టుబడులను ఈక్విటీ, డెట్, ఇన్విట్, ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ కమొడిటీ డెరివేటివ్స్ (ఈటీసీడీ), బంగారం, వెండి ఈటీఎఫ్‌లు (ఎక్స్ఛేంజీ ట్రేడెడ్ ఫండ్) ఇలా పలు విభాగాల్లో కేటాయింపులు చేస్తారు. లైఫ్ సైకిల్ ఫండ్స్‌ను కనిష్ఠంగా 5 ఏళ్లు, గరిష్ఠంగా 30 ఏళ్ల కాలపరిమితితో (మెచ్యూరిటీ టెన్యూర్) ఫండ్ సంస్థలు తీసుకు రావచ్చని సెబీ తెలిపింది.

పసిడి, వెండి ఈటీఎఫ్‌ల విలువ లెక్కింపు ఇలా..

మ్యూచువల్ ఫండ్ సంస్థల వద్ద ఉన్న భౌతిక పసిడి, వెండి విలువ లెక్కింపు విధానాన్ని సెబీ సవరించింది. వీటి విలువను లెక్కించేందుకు ఎక్స్ఛేంజీలు వెల్లడించే స్పాట్ ధరలను ఉపయోగించడాన్ని తప్పనిసరి చేసింది. ఈ లెక్కింపు విధానాన్ని 2026 ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి తేనుంది. ప్రస్తుతం లండన్ బులియన్ మార్కెట్ అసోసియేషన్ నిర్ణయించిన ధరల ఆధారంగా పసిడి, వెండి ఈటీఎఫ్‌ల విలువను లెక్కగడుతున్నారు.

సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేస్తే ఇది తప్పనిసరి: తన నియంత్రణలోని సంస్థలు, వాటి ఏజెంట్లు సామాజిక మాధ్యమాల్లో సెక్యూరిటీస్ మార్కెట్‌కు సంబంధించిన సమాచారాన్ని పోస్ట్ చేసినప్పుడు రిజిస్ట్రేషన్ పేరు, రిజిస్ట్రేషన్ సంఖ్య తప్పనిసరిగా వెల్లడించాలని సెబీ ఆదేశించింది. స్టాక్ బ్రోకర్లు, మ్యూచువల్ ఫండ్ సంస్థలు, అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీలు, పెట్టుబడుల సలహాదార్లు, పరిశోధనా విశ్లేషకులు, ప్రత్యామ్నాయ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్‌లు, పోర్ట్‌ఫోలియో మేనేజర్లకు ఇది వర్తించనుంది.

ఎన్ఎస్ఈ రూ.23,000 కోట్ల ఐపీఓకు ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకులకు ఆహ్వానం



నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ (ఎన్ఎస్ఈ) తొలి పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ)కు వేగంగా అడుగులు పడుతున్నాయి. ఇందుకోసం ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకుల నుంచి ప్రతిపాదనలను ఎన్ఎస్ఈ కోరినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. మార్చి మధ్యకల్లా సలహాదారులను ఎంపిక చేయాలని ఎన్ఎస్ఈ భావిస్తోంది. నమోదు ప్రక్రియను పర్యవేక్షించడానికి ఒక కమిటీని ఎన్ఎస్ఈ ఏర్పాటు చేసింది. స్వతంత్ర సలహాదారుగా రోత్స్‌చైల్డ్ అండ్ కోను నియమించింది. లీడ్ బ్యాంకర్లు, లీగల్ కౌన్సిల్, ఇతర ఇంటర్మీడియరీస్ ఎంపిక బాధ్యతలను రోత్స్‌చైల్డ్ చూసుకోనుంది. బ్లూమ్‌బర్గ్ న్యూస్ ప్రకారం. . ఈ ఐపీఓ పూర్తిగా ఆఫర్ ఫర్ సేల్‌గా రానుంది. ఇందులో ప్రస్తుత వాటాదార్లు, కంపెనీ ఈక్విటీలో దాదాపు 4- 4.5% వరకు విక్రయించే అవకాశం ఉంది. అన్‌లిస్టెడ్ మార్కెట్‌లో ధరల ఆధారంగా, ఈ ఐపీఓ ద్వారా 2.5 బిలియన్ డాలర్లు (దాదాపు రూ. 22,700 కోట్లు) సమీకరించే అవకాశం ఉంది.

డెరివేటివ్స్ ట్రేడింగ్‌కు కనీస అర్హత ప్రమాణాలు ఉండాలి: ఎన్ఎస్ఈ సీఈఓ



ముంబయి: డెరివేటివ్స్ ట్రేడింగ్ చేసేవారికి కనీస అర్హత ప్రమాణాలు ఉండాలని ఎన్ఎస్ఈ ఎండీ, సీఈఓ ఆశిష్ కుమార్ చౌహాన్ పేర్కొన్నారు. స్పెక్యులేషన్ (అంచనాల ఆధారంగా చేసే ఈ వ్యాపారం)లో సామాన్య మదుపర్లు తమ డబ్బు పోగొట్టుకోకుండా నిరోధించడానికి ఇది అవసరమని అభిప్రాయపడ్డారు. ఏ అభివృద్ధి చెందుతున్న దేశం కూడా, తమ పౌరులు డబ్బు, శక్తి, వనరులను స్పెక్యులేషన్ కోసం వృథా చేయడాన్ని అనుమతించదని స్పష్టం చేశారు. అందుకే డెరివేటివ్స్ ట్రేడింగ్‌కు సింగపూర్, అమెరికా వంటి దేశాల్లో ఉన్న నిబంధనల తరహాలోనే, మన దేశంలోనూ కనీస అర్హత ప్రమాణాలను ఆయన ప్రతిపాదించారు. డెరివేటివ్స్ ట్రేడింగ్‌లో 90 శాతానికి పైగా ట్రేడర్లు నష్టపోతున్నారని సెబీ వెల్లడించిన విషయం తెలిసిందే.

అనిల్ అంబానీ, ఆర్‌కామ్‌పై సీబీఐ తాజా కేసు

రూ.2,220 కోట్ల బ్యాంకు 'మోసం' కేసులో




దిల్లీ: రిలయన్స్ గ్రూప్ ఛైర్మన్ అనిల్ అంబానీ, రిలయన్స్ కమ్యూనికేషన్స్(ఆర్‌కామ్)పై కేంద్ర దర్యాప్తు సంస్థ(సీబీఐ) తాజాగా ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. 2013-17 మధ్య బ్యాంక్ ఆఫ్ బరోడా(బీఓబీ)ను మోసం చేయడం ద్వారా ఆ బ్యాంకుకు రూ.2,220 కోట్ల నష్టాన్ని కలిగించారన్నది ఆరోపణ. మంగళవారం బ్యాంకు నుంచి అందిన ఫిర్యాదు మేరకు ఈ కేసు నమోదు చేసినట్లు అధికార వర్గాలు తెలిపాయి. 'కేసు నమోదయ్యాక, అనిల్ అంబానీ నివాసం, ఆర్‌కామ్ కార్యాలయాల్లో సోదాలు జరిపి, రుణానికి సంబంధించిన పలు పత్రాలను రికవరీ చేసిన'ట్లు సీబీఐ అధికార ప్రతినిధి వెల్లడించారు. 'సీబీఐ ఇప్పటికే ఎస్‌బీఐ సహా 11 బ్యాంకుల కన్సార్షియం ఫిర్యాదు మేరకు ఆర్‌కామ్‌పై కేసు నమోదు చేసింది. ఈ కన్సార్షియంలో బీఓబీ భాగంగా లేద'ని వివరించారు.

9 గంటలు విచారించిన ఈడీ: మనీలాండరింగ్ కేసులో రెండో దఫా హాజరైన అనిల్ అంబానీని గురువారం ఈడీ 9 గంటలకు పైగా విచారించింది. మనీ లాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) కింద అనిల్ స్టేట్‌మెంట్‌ను రికార్డు చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. యెస్ బ్యాంకు కేసులో శుక్రవారం (నేడు) మరోసారి హాజరుకావాలని అనిల్‌కు తెలిపినట్లు వివరించారు. 2025 ఆగస్టులో తొలిసారిగా అనిల్‌ను ఈడీ ప్రశ్నించింది. రూ.40,000 కోట్ల బ్యాంకు మోసం కేసులో అనిల్ అంబానీ, ఆయన గ్రూప్ కంపెనీ ఆర్‌కామ్‌పై దర్యాప్తు జరుగుతోంది.

ఏఐ కూడా వై2కే లాంటిదే

- కంపెనీలకు ప్రయోజనమే
- ఉద్యోగాలేమీ పోవు: కేంద్ర మంత్రి గోయల్



ముంబయి: కృత్రిమ మేధ(ఏఐ) రాక వల్ల భారత ఐటీ రంగంలో ఉద్యోగాలు పోవచ్చన్న భయాలను కేంద్ర వాణిజ్య మంత్రి పీయూశ్ గోయల్ కొట్టివేశారు. ఈ కొత్త సాంకేతికత వల్ల భారత కంపెనీలకు అవకాశాలు పెరుగుతాయన్నారు. ఉద్యోగాల తీరులో మార్పు వస్తుంది మినహా, ఏఐ ప్రభావం వల్ల దేశంలో ఉద్యోగాలపై తీవ్ర ప్రభావం పడుతుందన్న ఆందోళనేమీ తమకు లేదని ఆయన అన్నారు. 'వై2కే సమయంలో ఆకాశం జారి మీద పడుతుందనుకున్నాం. కంప్యూటర్లేవీ పనిచేయవు అనుకున్నారు. 2000 జనవరి 1 తర్వాత భారత ఐటీ వెనుతిరిగి చూడలేదు. ఏఐ కూడా అటువంటి మలుపుగానే భావించాల'ని ఆయన అన్నారు. 'మెరుగైన సమాజానికి ఏఐ అనేది శక్తిమంత విప్లవం. టెక్నాలజీతో ఎంత స్నేహం చేస్తే, అంతగా మన నైపుణ్యాలు పెరుగుతాయి. కొత్త అవకాశాలు కనిపిస్తాయి. ఏఐతో మరిన్ని అవకాశాలు, మెరుగైన లాభాలు, భారీ ప్రాజెక్టులు, అధిక ఎగుమతులు సాధ్యమవుతాయని భావిస్తున్న'ట్లు తెలిపారు.

చైనా నుంచి నేర్చుకోవాలి: 'ప్రాజెక్టుల విషయంలో చైనాను చూసి మనం నేర్చుకోవాలి. బులెట్ రైలు ప్రారంభించడానికి మనకు ఇంకా 4-5 ఏళ్ల సమయం పడుతుంది. అక్కడ ఇప్పటికే వేల కిలోమీటర్ల మేర బులెట్ రైళ్లు పరుగులు తీశాయి. ఇలాంటి అంశాల్లో చైనా నుంచి నేర్చుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆ దేశంతో అనుబంధాన్ని మరో స్థాయికి తీసుకెళ్లాల్సిన అవసరం ఉంద'న్నారు.

అమెరికాను 2040లో.. చైనాను 2060లో

అధిగమించనున్న భారత ఇంధన గిరాకీ



దిల్లీ: అంతర్జాతీయ ఇంధన వ్యవస్థలో భారత్ కీలక పాత్ర పోషించనుంది. 2040ల్లో అమెరికాను, 2060ల్లో చైనాను ఇంధన గిరాకీలో భారత్ అధిగమించగలదని, షెల్ ఇండియా విడుదల చేసిన 'ఇండియాస్ ఎనర్జీ ట్రాన్సిషన్ ఇన్ ఏ సెక్యూరిటీ ఫోకస్డ్ ఏజ్' నివేదిక అంచనా వేస్తోంది. దీని ప్రకారం..

భారత ఇంధనాల్లో సంప్రదాయ ఇంధన వాటా ఈ దశాబ్దంలో గరిష్ఠ స్థాయికి చేరుకుంటుంది. ఆ తర్వాత ఈ వాటా కాస్త తగ్గొచ్చు. వచ్చే రెండు మూడు దశాబ్దాల్లో మొత్తం మీద ఇంధన గిరాకీ రెండింతలు అయ్యే అవకాశాలున్నాయి. గత దశాబ్దంలో దూసుకెళ్లిన ఆర్థిక, జనాభా వృద్ధి కారణంగా భారత ఇంధన గిరాకీ 40% పెరిగింది. 2015లో మొత్తం విద్యుత్ వినియోగంలో సౌర, పవన విద్యుత్ వాటా 3% దరిదాపుల్లో ఉండగా.. ప్రస్తుతం అది 20% పైగా చేరింది. 2050 కల్లా అది 59 శాతానికి మించొచ్చు. వచ్చే దశాబ్దంలో సహజ వాయువు, ఎల్ఎన్‌జీ కీలక పాత్ర పోషించనున్నాయి. వీటి గిరాకీ 50% లేదా అంతకంటే ఎక్కువ పెరగొచ్చు. పారిశ్రామికాభివృద్ధి, ఏఐ ఆధారిత విద్యుత్ వినియోగం ఇందుకు దోహదం చేయవచ్చు.

భారత్‌లో యాపిల్ పే సేవలు!

ఐసీఐసీఐ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్‌తో చర్చలు



ఐఫోన్ల తయారీ అమెరికా కంపెనీ యాపిల్, మనదేశంలోనూ చెల్లింపుల సేవలు ప్రారంభించడానికి సమాయత్తమవుతోంది. ఇందు కోసం ఐసీఐసీఐ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్‌తో పాటు వీసా, మాస్టర్‌కార్డ్‌తోనూ చర్చలు జరుపుతోన్నట్లు ఒక ఆంగ్ల వార్తా సంస్థ పేర్కొంది. అన్నీ సవ్యంగా కుదిరితే గూగుల్ పే, ఫోన్‌పే, అమెజాన్ పే, పేటీఎంకు పోటీగా ఈ ఏడాది మధ్య కల్లా యాపిల్ పే సేవలు మొదలు కావొచ్చు. ఈ విషయంపై ఆయా సంస్థల ప్రతినిధులు ఇంకా స్పందించలేదు. యూపీఐతో పాటు కార్డు ఆధారిత చెల్లింపులకూ యాపిల్ పే మద్దతునివ్వొచ్చని అంచనా.

మన మార్కెట్ ఎందుకంటే: భారత్‌లో 75 కోట్ల మందికి పైగా స్మార్ట్‌ఫోన్ వినియోగదార్లుండడం, వారి వద్ద అందుబాటు ధరలో డేటా ఉండడం యాపిల్ పే దృష్టిసారించడానికి కారణం. ఆండ్రాయిడ్ ఆధిపత్యం ఉన్నా, మన దేశంలో యాపిల్ తన తయారీ కేంద్రాలను, రిటెయిల్ నెట్‌వర్క్‌ను విస్తరిస్తోంది. తన ఆరో స్టోరును ముంబయిలో గురువారమే సంస్థ ప్రారంభించింది. యాపిల్ పే వల్ల యాపిల్ వాచీలు, ఐఫోన్‌లు, ఐప్యాడ్‌లు, మ్యాక్‌లకు గిరాకీ పెరిగే అవకాశమూ ఉంది. భారత స్మార్ట్‌ఫోన్ విక్రయాల్లో 10% వాటా ఉన్న యాపిల్‌కు మరింత వృద్ధి అవకాశాలున్నాయి.

కొత్త సిరీస్ జీడీపీ లెక్కింపునకు జీఎస్‌టీ, ఇ-వాహన్ వివరాలు

నేడే విడుదల



దిల్లీ: 2022-23 ఆధార సంవత్సరంతో, కొత్త సిరీస్‌లో విడుదలయ్యే జీడీపీ వృద్ధి గణాంకాల్లో జీఎస్‌టీ, ఇ-వాహన్ గణాంకాల వివరాలనూ చేర్చనున్నారు. వంట మనిషి, డ్రైవరు సహా ఇంట్లో పనివాళ్లు అందించే సేవలను కూడా జీడీపీ లెక్కింపునకు పరిగణనలోకి తీసుకున్నారు. తద్వారా ఆర్థిక వ్యవస్థ వృద్ధిపై మరింత కచ్చితత్వంతో కూడిన గణాంకాలు ఇవ్వాలన్నది ప్రభుత్వ ఉద్దేశం. ఈ ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికి (2025 అక్టోబరు- డిసెంబరు) కొత్త సిరీస్‌లో జీడీపీ గణాంకాలను శుక్రవారం ప్రభుత్వం విడుదల చేయనుంది. కొత్త సిరీస్ గణాంకాలకు సంబంధించిన ప్రశ్నలకు సమాధానాల (ఎఫ్ఏక్యూ) ప్రకారం.. సంవత్సరాల పాటు ఆర్థిక వ్యవస్థలో చోటుచేసుకుంటున్న మార్పుల ప్రకారం, ఎప్పటికప్పుడు ఆధార సంవత్సరాన్ని మారుస్తుంటారు. ఇంతకు ముందు జీడీపీ గణాంకాల లెక్కింపునకు 2011-2012 ఆధార సంవత్సరంగా ఉండేది. ఇప్పుడు దీనిని 2022-23కు సవరించారు. అయిదేళ్లకోసారి ఆధార సంవత్సరాన్ని మార్చాల్సి ఉన్నా.. కొవిడ్ పరిణామాలు, జీఎస్‌టీ అమలు కారణంగా.. ఇంతకుముందు ఆ పని ప్రభుత్వం చేయలేదు. పాత సిరీస్ గణాంకాలను 2026 డిసెంబరు కల్లా విడుదల చేస్తామని కేంద్ర గణాంకాలు, కార్యక్రమ అమలు మంత్రిత్వ శాఖ తెలిపింది. టోకు ధరల సూచీ (డబ్ల్యూపీఐ) ఆధారిత ద్రవ్యోల్బణం గణనకు కూడా ఆధార సంవత్సర సవరణపై కసరత్తు జరుగుతోంది. ఇప్పటికే రిటెయిల్ ద్రవ్యోల్బణ గణాంకాలను కొత్త సిరీస్‌లో విడుదల చేశారు.

ఆద్యంతం ఒడుదొడుకులమయం



రోజంతా ఒడుదొడుకుల మధ్య సాగిన గురువారం ట్రేడింగ్‌లో, దేశీయ సూచీలు మిశ్రమంగా ముగిశాయి. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఇతర బ్లూచిప్ షేర్లకు అమ్మకాల ఒత్తిడి ఎదురైంది. అమెరికా- ఇరాన్ అణు చర్చలకు ముందు మదుపర్లు అప్రమత్తత పాటించారు. కృత్రిమ మేధ ఆధారిత పరిణామాలు, టారిఫ్ ఆందోళనలు ఇందుకు తోడయ్యాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయి 90.91 వద్ద ముగిసింది. బ్యారెల్ ముడిచమురు ధర 0.95% నష్టంతో 70.18 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లలో షాంఘై, హాంకాంగ్ నష్టపోగా, కొరియా, జపాన్ లాభపడ్డాయి. ఐరోపా మార్కెట్లు మెరుగ్గా ట్రేడయ్యాయి.

✦ బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.1.11 లక్షల కోట్లు పెరిగి రూ.468.49 లక్షల కోట్ల (5.15 లక్షల కోట్ల డాలర్ల)కు చేరింది.

✦ సెన్సెక్స్ ఉదయం 142 పాయింట్ల (క్రితం ముగింపు 82,276.07) లాభంతో 82,418.78 పాయింట్ల వద్ద ప్రారంభమైంది. రోజంతా పరిమిత శ్రేణిలో కదలాడిన సూచీ, 82,579.16 వద్ద గరిష్ఠాన్ని, 81,970.47 వద్ద కనిష్ఠాన్ని నమోదుచేసింది. చివరకు 27.46 పాయింట్లు తగ్గి 82,248.61 వద్ద ముగిసింది. నిఫ్టీ 14.05 పాయింట్లు పెరిగి 25,496.55 దగ్గర స్థిరపడింది. ఇంట్రాడేలో ఈ సూచీ 25,400. 95- 25,572.95 పాయింట్ల మధ్య కదలాడింది.

సెన్సెక్స్ ▼ 28	నిఫ్టీ ▲ 14
82249	25497

✦ సెన్సెక్స్ 30 షేర్లలో 19 నీరసపడ్డాయి. ట్రెంట్ 1.79%, ఎటర్నల్ 1.54%, పవర్ గ్రిడ్ 1.20%, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 0.98%, ఏషియన్ పెయింట్స్ 0.86% డీలాపడ్డాయి. బీఈఎల్ 2.21%, అదానీ పోర్ట్స్ 1.45%, సన్‌ఫార్మా 1.18%, మారుతీ 1.02%, భారతీ ఎయిర్‌టెల్ 0.78% రాణించాయి. రంగాల వారీ సూచీల్లో.. హాస్పిటల్స్ 1.35%, పీఎస్‌యూ బ్యాంక్ 0.98%, టెలికాం 0.96%, యంత్ర పరికరాలు 0.88%, టెలికాం 0.75% పెరిగాయి. ఎఫ్ఎంసీజీ, ఆర్థిక సేవలు, యుటిలిటీస్, మన్నికైన వినిమయ వస్తువులు, విద్యుత్ తగ్గాయి. బీఎస్ఈలో 2124 షేర్లు నష్టపోగా, 2080 స్క్రిప్‌లు లాభపడ్డాయి.

✦ బంధన్ బ్యాంక్‌లో 9.99% వరకు వాటా కొనుగోలు చేయాలన్న ఎస్‌బీఐ మ్యూచువల్ ఫండ్ ప్రతిపాదనకు ఆర్‌బీఐ అనుమతి ఇచ్చింది.

✦ బాండ్ల విక్రయం ద్వారా రూ. 5000 కోట్లు సమీకరించినట్లు కెనరా బ్యాంక్ తెలిపింది. 10 ఏళ్ల కాలవ్యవధి కలిగిన టైర్-2 బాండ్లపై సంస్థ 7.24% కూపన్ రేటు ఇవ్వనుంది.

మార్చి 4 నుంచి సెడెమాక్ ఐపీఓ

పవర్‌ట్రైన్ కంట్రోల్స్, వాహన విడిభాగాల తయారీ సంస్థ సెడెమాక్ మెక్ట్రానిక్స్ రూ.1087 కోట్ల ఐపీఓ, మార్చి 4న ప్రారంభమై 6న ముగియనుంది. ఇందుకు ధరల శ్రేణిగా రూ.1287-1352ను నిర్ణయించారు. గరిష్ఠ ధర వద్ద కంపెనీ విలువ రూ.6000 కోట్లుగా ఉండే అవకాశం ఉంది. యాంకర్ మదుపర్లు మార్చి 2న బిడ్లు దాఖలు చేసుకోవచ్చు. రిటెయిల్ మదుపర్లు కనీసం 11 షేర్లకు దరఖాస్తు చేసుకోవాలి.

ఐఆర్ఎఫ్‌సీ ఓఎఫ్ఎస్‌కు స్పందన అంతంతే

ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ (ఐఆర్ఎఫ్‌సీ)లో 2% వాటా (26.13 కోట్ల షేర్ల)ను ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్)లో విక్రయించేందుకు ప్రభుత్వం ప్రయత్నించినా, చివరి రోజైన గురువారం కూడా పూర్తి స్పందన లభించలేదు. సంస్థాగత మదుపర్లకు 23.52 కోట్ల షేర్లు రిజర్వ్ చేయగా, 22.34 కోట్ల షేర్లకు బిడ్లు వచ్చాయి. గురువారం రిటెయిల్ మదుపర్లకు 3.79 కోట్ల షేర్లను ఆఫర్ చేయగా, 5.9 లక్షల షేర్లకు బిడ్లు వచ్చాయి.

ఓడరేవుకు టాటా మోటార్స్ 40 హరిత హైడ్రోజన్ ట్రక్కులు

ట్యూటికోరిన్‌లోని వీఓ చిదంబరనార్ పోర్ట్‌కు హరిత హైడ్రోజన్‌తో నడిచే 40 హెవీ డ్యూటీ ట్రక్కులను టాటా మోటార్స్ అందించనుంది. ఇందుకోసం వీఓ చిదంబరనార్ పోర్ట్ అథారిటీతో టాటా మోటార్స్ ఒప్పందం కుదుర్చుకుంది. కేంద్ర ఓడరేవులు, షిప్పింగ్, జలమార్గాల మంత్రి శర్బానంద సోనోవాల్ సమక్షంలో కుదిరిన అవగాహన ఒప్పందంలో భాగంగా, టాటా మోటార్స్ మొదట హైడ్రోజన్ ఆధారిత ప్రైమ్ మూవర్‌తో ట్రయల్స్ ప్రారంభిస్తుంది.

ఈనాడు ప్రతిభ

శుక్రవారం, ఫిబ్రవరి 27, 2026

17 • https://pratibha.eenadu.net • https://eenadupratibha.net

విద్య, ఉద్యోగ పరీక్షల ప్రత్యేకం!

కరెంట్ అఫైర్స్

మాదిరి ప్రశ్నలు

❖ 2026, జనవరిలో భారత్‌లో పర్యటించిన యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) అధ్యక్షుడు ఎవరు? (ఈ పర్యటన సందర్భంగా రెండు దేశాల మధ్య పెట్టుబడి, రక్షణ, అంతరిక్షం, ఇంధనం, వాణిజ్యం, కృత్రిమ మేధస్సు, అణు సహకారం, సాంస్కృతిక సంబంధాలపై కీలక ఒప్పందాలు కుదిరాయి.)



జ: షేక్ మహమ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్

❖ ఇటీవల వార్తల్లోకి వచ్చిన బెంబ్లా నది నీటిపారుదల ప్రాజెక్టు ఏ రాష్ట్రంలో ఉంది?

జ: మహారాష్ట్ర (52,423 హెక్టార్లలో నీటి పారుదల విస్తరణ కోసం ఈ రాష్ట్రంలోని యావత్మల్ జిల్లాలో రూ.4,775 కోట్ల వ్యయంతో ఈ నీటిపారుదల ప్రాజెక్టు నిర్మాణానికి ఇటీవల ఈ రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది.)

❖ కేంద్ర వాణిజ్య శాఖ విడుదల చేసిన గణాంకాల ప్రకారం భారత దేశ ఎలక్ట్రానిక్స్ ఎగుమతులు 2025లో ఎంత మొత్తానికి చేరుకున్నాయి?

జ: 47 బిలియన్ డాలర్లు (2024లో ఇది 34.93 బిలియన్ డాలర్లుగా ఉంది. 2025లో మొత్తం ఎలక్ట్రానిక్స్ ఎగుమతుల్లో మూడింట రెండొంతులు పీఎల్ఐ ఆధారిత స్మార్ట్‌ఫోన్ ఎగుమతుల నుంచే వచ్చాయి.)

మరింత సమాచారం

TENTH Biological Science
HOW DO ORGANISMS REPRODUCE

Final Exams-2026 IMPORTANT Q & A

1 Mark

1. **What is meant by fertilization?**
A: The union /fusion of male gamete with the female gamete is called fertilization.

2. **Define puberty.**
A: The period during adolescence where the reproductive maturity occurs is called puberty.

3. **Define tissue culture.**
A: The development of new plants from a cell or a tissue under lab conditions is called tissue culture.

4. **What is the effect of DNA copying which is not perfectly accurate in the reproduction process?**
A: The DNA copying which is not perfectly accurate in the reproduction process results in variations in the populations for better survival of the species.

5. **Write the various methods of cross-pollination.**
A: Various methods of cross pollination are entomophily (insect pollination), Anemophily (wind pollination), Hydrophily (water pollination) and Zoophily (animal pollination).

6. **What is gametogenesis?**
A: Formation of sperms in testes and ova in ovary is called gametogenesis.


7. **How does Plasmodium reproduce? Is this method sexual or asexual?**
A: Plasmodium reproduces by multiple fission. This method is an asexual means of reproduction.

8. **What is the funeral of unfertilized egg?**
A: Menstruation is also called funeral of egg since it is not fertilized.

9. **What is gestation?**
A: The period of development of foetus in the uterus till birth is called gestation. It is of 9 months duration in human beings.

10. **Give reason for the statement.**
Since the ovary releases one egg every month, the uterus also prepare itself every month by making its lining thick and spongy.
A: The lining of uterus becomes thick for nourishing the embryo if fertilization takes place and egg reaches the uterus.

For more IMP Q & A



Writer: M.S.N. Murthy

జనరల్ స్టడీస్ - పర్యావరణ అంశాలు

కనిపించదు.. కానీ ప్రాణాంతకం!

ప్రకృతిలో శక్తి అనేక రూపాల్లో ప్రవహిస్తుంటుంది. అందులో అత్యంత శక్తిమంతమైన కంటికి కనిపించని ప్రవాహమే వికిరణం. సూర్యుడి నుంచి వచ్చే వెచ్చటి కిరణాలు, స్మార్ట్‌ఫోన్ నుంచి వెలువడే తరంగాలు, రాత్రి వేళల్లో నగరాలను ముంచెత్తే విద్యుత్తు కాంతులు తదితరాలన్నీ శక్తి ఉద్గారాలే. అయితే అవి పరిమితి దాటినప్పుడు పర్యావరణానికి అదృశ్య శత్రువుగా మారతాయి. అనవసరమైన కాంతి వికిరణాలు మనుషులకు నక్షత్రాలను దూరం చేయడమే కాకుండా, భూమిపై ఉన్న జీవరాశిపై కూడా తీవ్రమైన ప్రతికూల ప్రభావాన్ని చూపుతాయి. మానవులకు పలు ఆరోగ్య సమస్యలను కలిగిస్తాయి. పర్యావరణంలో రేడియోధార్మిక పదార్థాల చేరికతో ఏర్పడే ఈ ప్రమాదకరమైన కాలుష్యం గురించి పోటీ పరీక్షార్థులు తెలుసుకోవాలి. అణు వికిరణంలోని వివిధ రకాల కిరణాలు, పర్యావరణం, జీవరాశులపై వాటి ప్రభావం, అణు వ్యర్థాల శాస్త్రీయ నిర్వహణతోపాటు ఉష్ణ కాలుష్యంతో జలచరాలకు పొంచి ఉన్న ప్రమాదం గురించి తెలుసుకోవాలి.

వికిరణ ప్రభావాలు

(కాంతి కాలుష్యం)

గాలిలో ప్రసరించే శక్తిని వికిరణం అంటారు. సాధారణంగా గాలిలో నియంత్రిత స్థాయి రేడియేషన్ ఉంటుంది. కొన్ని సందర్భాల్లో పరిమితికి మించిన స్థాయిలో ఇది గాలిలోకి విడుదలవడం వల్ల మనిషి, ఇతర జీవులపై ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రభావాన్ని ప్రదర్శిస్తుంది. సాధారణంగా వికిరణాన్ని రెండు రకాలుగా విభజిస్తారు.

1) విద్యుదయస్కాంత వికిరణం: ఇది సూర్యుడి నుంచి విడుదలయ్యే వికిరణం. దీనిలో కాస్మిక్ కిరణాల నుంచి రేడియోధార్మిక కిరణాల వరకు అనేక భాగాలు ఉన్నప్పటికీ, ప్రమాదకరంగా గుర్తించినవి మాత్రం - కాస్మిక్ కిరణాలు, గామా కిరణాలు, ఎక్స్-కిరణాలు, అతినీలలోహిత కిరణాలు.

2) అణు వికిరణం: రేడియోధార్మిక కేంద్రకాల నుంచి ఈ వికిరణం విడుదలవుతుంది. సాధారణంగా అణు ఖనిజ నిక్షేపాలు ఉన్న ప్రాంతాల్లో ఈ రకమైన వికిరణ ప్రభావం ఉంటుంది. అయితే అణు ప్రమాదాలు, విస్ఫోటాలు, అణ్వస్త్ర పరీక్షల సమయాల్లో గాలిలోకి అధిక మొత్తంలో హానికర అణు వికిరణం విడుదలవుతుంది. రియాక్టర్లలో ఎప్పటికప్పుడు పుట్టే అణు వ్యర్థం కూడా అణు వికిరణాన్ని వెలువరిస్తుంది. అణు వికిరణంలోని ఆల్ఫా, బీటా, గామా కిరణాలు ప్రమాదకరమైనవి. అణు వికిరణాలను వాటి ప్రభావాల ఆధారంగా రెండు రకాలుగా విభజిస్తారు.

ఎ) నాన్-అయోనైజింగ్ రేడియేషన్: ఇది అయోనైజేషన్‌కు కారణం కాని వికిరణం. దీని ప్రభావం జీవుల శరీర ఉపరితలానికి మాత్రమే పరిమితం.



దీనికి చొచ్చుకుపోయే సామర్థ్యం చాలా తక్కువ. శరీరంలోని ప్రొటీన్‌లు, కేంద్రకామ్లాల్లాంటి జీవరసాయనాల విచ్ఛిన్నానికి ఇది కారణం కాదు. దీంతో చర్మ క్యాన్సర్ ప్రమాదం ఉంటుంది. ఉదా: అతినీలలోహిత కిరణాలు.


బి) అయోనైజింగ్ రేడియేషన్: ఇది అయనీకరణకు కారణమయ్యే వికిరణం. అణువికిరణంలోని ఆల్ఫా, బీటా, గామా కిరణాలు అదే విధంగా సౌరకాంతిలోని కాస్మిక్, ఎక్స్‌రే, గామా కిరణాలు అయోనైజింగ్ రేడియేషన్‌కు ఉదాహరణలు.

ఆల్ఫా కిరణాలు(α): ఇవి హీలియం కేంద్రకంతో సమానం. యురేనియం, బేరియం లాంటి సహజ, అనేక ఇతర మానవ నిర్మిత రేడియోధార్మిక మూలకాల కేంద్రకం నుంచి ఆల్ఫా కిరణాలు విడుదలవుతాయి. వీటి అయనీకరణ శక్తి అధికం. అయితే చొచ్చుకుని పోయే సామర్థ్యం తక్కువ కావడంతో ప్రభావాలన్నీ ఉపరితల శరీర భాగాలకే పరిమితమవుతాయి. వీటిని విడుదల చేసే రేడియోధార్మిక పదార్థాలు ఒకవేళ శరీరంలోకి ప్రవేశిస్తే అత్యంత ప్రమాదకరమవుతాయి.



బీటా కిరణాలు(β): ఇవి వేగంగా సాగే ఎలక్ట్రాన్‌లతో సమానం. ఆల్ఫా కిరణాల కన్నా వీటికి చొచ్చుకుపోయే సామర్థ్యం ఎక్కువ. అయితే కొన్ని మిల్లీమీటర్ల కలప లేదా అల్యూమినియం వీటిని అడ్డుకోగలుగుతాయి. శరీరంలోకి చొచ్చుకుపోయినప్పటికీ గామా వికిరణాలతో పోలిస్తే వీటి ప్రభావం తక్కువ. చర్మం కాలినట్లు అవుతుంది. ఇలాంటి గాయం మానడానికి చాలా సమయం పడుతుంది.

గామా కిరణాలు(γ): ఇవి చాలా శక్తిమంతమైనవి. చొచ్చుకుపోయే సామర్థ్యం అధికం. వీటికి అయనీకరణ శక్తి ఎక్కువగా ఉండటంతో డీఎన్ఏలో ఉత్పరివర్తనాలకు కారణమయ్యే క్యాన్సర్లకు దారితీస్తాయి. పిండ వైపరీత్యాలకు కారణమవుతాయి. వీటి ప్రభావంతో శిశువులో శారీరక, మానసిక మాంద్యత వస్తుంది. శిశు మరణరేటు పెరుగుతుంది.



కాస్మిక్, ఎక్స్-కిరణాలు: ఇవి సౌర విద్యుదయస్కాంత వికిరణంలోని భాగాలు. కాస్మిక్ కిరణాల మిక్కిలి ప్రభావంతో వ్యక్తి మరణించే ప్రమాదం ఉంటుంది. అధిక స్థాయిలో ఎక్స్ కిరణాల ప్రభావానికి గురైతే క్యాన్సర్‌లు, ట్యూమర్‌లతోపాటు డీఎన్ఏలో వివిధ రకాల ఉత్పరివర్తనాలు సంభవిస్తాయి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు: హానికర వికిరణం విడుదలవుతున్న ప్రాంతాల్లో పనిచేసేవారు రేడియేషన్ సూట్లు ధరించాలి. రేడియేషన్ ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో పరిమితికి మించిన సమయం వరకు ఉండకూడదు. వికిరణం విడుదల చేసే అవకాశం ఉన్న పరిశ్రమలు, అణుకేంద్రాలను జనావాసాలకు దూరంగా నిర్మించాలి. ఆ కేంద్రాల చుట్టూ వికిరణాన్ని అడ్డుకోగలిగే కవచాలను ఏర్పాటు చేయాలి. పూర్తి రక్షణతో కూడిన కంటైనర్లలో మాత్రమే రేడియోధార్మిక పదార్థాలను రవాణా చేయాలి. రేడియేషన్ ప్రమాదాలు సంభవించినప్పుడు నీటిలో ఉండటం ద్వారా కూడా ప్రమాదం నుంచి తప్పించుకోవచ్చు.



ముఖ్యమైన అంశాలు

- ❖ రేడియోధార్మిక పదార్థాల ప్రభావం వందల, వేల సంవత్సరాల పాటు ఉంటుంది.
- ❖ భారతదేశంలో అణుశక్తికి సంబంధించిన అంశాలను అటామిక్ ఎనర్జీ రెగ్యులేటరీ బోర్డు పర్యవేక్షిస్తుంది.
- ❖ రేడియోధార్మిక కాలుష్యం అనేది కనిపించదు. కానీ ప్రాణాంతకమైన ప్రమాదం. దీని నిర్వహణలో అత్యంత జాగ్రత్తలు పాటించడం తప్పనిసరి.

ఉష్ణ కాలుష్యం

జలాశయాల్లోకి పరిమితికి మించి ఉష్ణరాశి చేరడంతో మానవుడికి, జంతువులకు, జలచరాలకు తీరని నష్టం కలగడమే కాకుండా జలాశయాల్లో ఉండే జీవరాశుల సాధారణ ప్రక్రియల్లో మార్పులు వస్తాయి.

ఉష్ణకాలుష్య ప్రధాన జనకాలు



అణు విద్యుత్తు కేంద్రాలు: అణు విద్యుత్తు కేంద్రాలు, అణు ప్రయోగాలు, పేలుళ్లు, పరిశోధనా సంస్థల నుంచి వినియోగం కాకుండా మిగిలే ఉష్ణరాశి స్వల్ప పరిమితి రేడియోధార్మికతతో పరిసరాల్లోని జల ప్రవాహాల్లోకి చేరుతుంది. అణు రియాక్టర్లలో అణుఇంధనం శుద్ధి ప్రక్రియలో వెలువడే ఉష్ణం కూడా జలాశయాలను కలుషితం చేస్తుంది.

థర్మల్ విద్యుత్తు కేంద్రాలు: బొగ్గును ఇంధనంగా వాడే థర్మల్ కేంద్రాల్లో కండెన్సర్లను సమీప వనరుల్లోని జలాలతో చల్లబరుస్తారు. ఈ క్రమంలో నీటి ఉష్ణోగ్రత సుమారుగా 15 డిగ్రీల సెంటీగ్రేడ్ పెరుగుతుంది. వేడి వ్యర్థాలు జలాశయాల్లో కలవడం వల్ల వాటిలో కరిగి ఉన్న ఆక్సిజన్ పరిమాణం తగ్గుతుంది. దీనివల్ల జలాశయాల్లోని చేపలు, ఇతర జలచరాలు మరణిస్తాయి.

గృహ సంబంధిత వ్యర్థాలు: ఎక్కువ ఉష్ణోగ్రత ఉన్న గృహ సంబంధిత వ్యర్థాలన్నీ కాలువలు, చెరువులు, నదులు, సెలయేరుల్లో కలుస్తాయి. దీంతో ఆ జలాల ఉష్ణోగ్రత పెరగడమే కాకుండా, వాయు రహిత పరిస్థితులతో దుర్వాసన, విషవాయువులు వెలువడతాయి. ఫలితంగా నీటిలో కరిగి ఉన్న ఆక్సిజన్‌పై ఆధారపడి బతికే సముద్ర జీవరాశులు నశించిపోతాయి.

జల విద్యుత్తు శక్తి: జల విద్యుత్తు ఉత్పత్తిలోనూ ఉష్ణం వెలువడుతుంది.

ఉష్ణ కాలుష్య ప్రభావాలు: నీటిలో కరిగి ఉన్న ఆక్సిజన్ తగ్గిపోయి నీటి సహజ ధర్మాల్లో మార్పులు వస్తాయి. జలచరాలు, జీవ వైవిధ్యం దెబ్బతినడంతో పాటు శైవలాల వృద్ధిలో ప్రతికూల మార్పు జరుగుతుంది. దీని నివారణకు కృత్రిమ జలాశయాలను ఏర్పాటు చేయడం ఒక పరిష్కారం. పరిశ్రమల నుంచి వెలువడే వేడి నీటిని చల్లార్చి, రీసైక్లింగ్ చేసి అదే పరిశ్రమలో ఉపయోగించాలి.

రచయిత: ఈదుబిల్లి వేణుగోపాల్

వేద సాహిత్యం

అన్నింటిలో అదే అత్యంత ఆదర్శ వివాహం!


ప్రాచీన భారతీయ సంస్కృతి, ఆధ్యాత్మికత, విజ్ఞానానికి మూలాధారమే వేద సాహిత్యం. రుగ్వేదం, సామవేదం, యజుర్వేదం, అధర్వణ వేదం అనే నాలుగు ప్రధాన సంహితాలు, బ్రాహ్మణాలు, అరణ్యకాలు, ఉపనిషత్తులతో కూడిన ఈ వాఙ్మయ సంపద భౌతిక, ఆధ్యాత్మిక జ్ఞానాన్ని అందిస్తుంది. యజ్ఞ యాగాదుల నుంచి సామాజిక విధుల వరకు మనిషి సంపూర్ణ జీవితం కోసం పాటించాల్సిన విధులను ప్రబోధిస్తుంది. భారతీయ జీవన విధానానికి, జ్ఞాన సంపదకు పునాది అయిన వేదసాహిత్యం, అందులోని ప్రధానాంశాల గురించి పోటీ పరీక్షార్థులకు అవగాహన ఉండాలి. వేదకాలంలో దేశంలో ఆర్యుల ఆధిపత్య పరిణామక్రమం, నాటి సామాజిక పరిస్థితులు, రాజ్యాల ఏర్పాటు గురించి తెలుసుకుని మూలాలను అర్థం చేసుకోవాలి.



జనరల్ స్టడీస్ - భారతదేశ చరిత్ర

1. కింది వాక్యాలను పరిగణించి, సరైన సమాధానాన్ని గుర్తించండి.
   - ఎ) వేద అనే పదం విద్ అనే సంస్కృత పదం నుంచి వచ్చింది.
   - బి) విద్ అంటే జ్ఞానం అని అర్థం.
   - సి) వేదాలు రాసిన కాలం వైదిక యుగం.
   - డి) రుగ్వేదం వేదాల్లో మొదటిది.
   - 1) ఎ, బి, సి 2) ఎ, సి, డి 3) ఎ, బి, సి, డి 4) ఎ, బి, డి

2. కింది వాక్యాలను పరిగణించి, సరైన సమాధానాన్ని గుర్తించండి.
   - ఎ) సంస్కృతం, యూరోపియన్ భాషల మధ్య సంబంధం నిరూపించడానికి ప్రయత్నించినవారు - విలియం జోన్స్
   - బి) 'ఆర్యులు సప్తసింధు ప్రాంతంవారు' అని గంగానాథ్ ఝా, డి.ఎస్. త్రివేదిలు అన్నారు.
   - సి) ప్రాచీన భారతీయ చరిత్ర సంప్రదాయాలు - స్వామీ దయానంద.
   - డి) ఆర్యన్ అనే పదానికి అర్థం - గొప్పవారు.
   - 1) ఎ, బి, డి 2) ఎ, బి, సి 3) ఎ, బి, సి, డి 4) బి, సి



విలియం జోన్స్

3. కింది వాక్యాల్లో సరికానిది గుర్తించండి.
   - 1) వేదాంగాలు... శిక్ష, కల్ప, వ్యాకరణ, నిరుక్తి, చాన్ద, జోతిష్య.
   - 2) వేదాలను అర్థం చేసుకోవడానికి వేదాంగాలు ముఖ్యమైనవి.
   - 3) షడ్ దర్శనాలు మొతం - 16.
   - 4) శ్రేతసూత్రం- ధర్మాల గురించి వివరిస్తుంది.

4. కింది వాటిలో సరైన వాక్యాలను గుర్తించండి.
   - ఎ) తొలి వేదకాలం నాటి విషయాలను రుగ్వేదం వివరిస్తుంది.
   - బి) తొలి వేదకాలంలో ఆర్యులు ఏడు నదుల ప్రాంతమైన సప్తసింధు వద్ద నివసించారు.
   - సి) తొలి వేదకాలంలో ఆర్యుల రాజకీయ సంస్థలు ఆటవిక/గిరిజన స్వభావం కలిగి ఉండేవి.
   - డి) తొలి వేదకాలంలో గ్రామాలకు అధిపతి - గ్రామణి
   - 1) ఎ, బి, సి 2) ఎ, బి, డి 3) ఎ, బి, సి, డి 4) ఎ, సి, డి

5. కింది వాక్యాలను పరిగణించి, సరైన సమాధానాన్ని గుర్తించండి.
   - ఎ) ఆర్యులది పశువుల పెంపకం, వ్యవసాయం రెండింటిపై ఆధారపడిన మిశ్రమ ఆర్థిక వ్యవస్థ.
   - బి) యవ అనే ధాన్యం బార్లీని సూచిస్తుంది.
   - సి) రుగ్వేదంలో గవిష్టి అంటే గోవులను కొనడం.
   - డి) నిష్క అనే నాణెం రుగ్వేద కాలంలో ఉండేది.
   - 1) ఎ, బి, సి సరైనవి; డి సరికాదు.
   - 2) ఎ, బి, డి సరైనవి; సి సరికాదు.
   - 3) ఎ, బి, సరైనవి; సి, డి సరికావు.
   - 4) ఎ, బి సరికావు; సి, డి సరైనవి.

6. కింది వాటిలో సరికానిది గుర్తించండి.
   - 1) వేదకాలంలో మాతృస్వామ్య కుటుంబం ఉండేది.
   - 2) కుటుంబ పెద్దను 'గృహపతి' అనేవారు.
   - 3) వేదకాలంలో అపల, విశ్వవర, ఘోష, లోపాముద్ర ప్రముఖ మహిళలు.
   - 4) సతీసహగమనం రుగ్వేద కాలంలో ఉండేది.

7. కింది వాటిలో తెగలు, వారి పనులను గుర్తించండి.
   - ఎ) దాసు - వ్యవసాయదారులు
   - బి) దస్యులు - బానిసలు సి) పాణి - వర్తకులు
   - 1) ఎ, బి, సి సరైనవి. 2) ఎ, బి, సి సరికావు.
   - 3) ఎ సరైంది; బి, సి సరికావు.
   - 4) ఎ, బి సరైనవి; సి సరికాదు.

8. కింది వాక్యాలను పరిశీలించి సరైన సమాధానాన్ని గుర్తించండి.
   - ఎ) దశ రాజన్య యుద్ధం పరుష్ని నది ఒడ్డున జరిగింది.
   - బి) భరత తెగ కుల గురువు వశిష్టుడు.
   - సి) భరత వంశం, కురు వంశం కలిసి పాండు వంశంగా అవతరించాయి.
   - డి) ఈ యుద్ధంలో ఐదు ఆర్య తెగలు, ఐదు అనార్య తెగలు ఉన్నాయి.
   - 1) ఎ, బి, డి 2) ఎ, బి, సి, డి 3) ఎ, సి, డి 4) ఎ, డి

9. కింది వాక్యాలను పరిశీలించి, సరైన సమాధానాన్ని గుర్తించండి.
   - ఎ) తొలి వేదకాలంలో - కుటుంబ అధిపతి దంపతి.
   - బి) తొలి వేదకాలంలో రాజన్‌ను గోపజనస్యగా పిలిచేవారు.
   - సి) తొలి వేదకాలంలో ధనవంతుడు - గోమత్.
   - డి) తొలి వేదకాలంలో గవిష్టి అంటే గోవులు.
   - 1) ఎ, బి, సి, డి 2) ఎ, బి, సి 3) ఎ, బి, డి 4) బి, సి, డి

10. వధువుకు డబ్బు ఇచ్చి కొనుక్కునే వివాహ పద్ధతి? (2012- గ్రూప్-I)
    - 1) అసుర వివాహం 2) పైశాచ వివాహం 3) ప్రజాపత్య వివాహం 4) రాక్షస వివాహం

11. గ్రీకులు హైడాస్పస్ అని పిలిచింది? (2012- గ్రూప్-I)
    - 1) రావి 2) సట్లెజ్ 3) జీలం 4) చీనాబ్




12. ప్రాచీన కాలంలో భారతదేశంలో ఉన్న ఎనిమిది వివాహాల్లో అత్యంత ఆదర్శంగా పరిగణించేది? (2003-గ్రూప్-I)
    - 1) బ్రహ్మ వివాహం 2) దైవ వివాహం 3) అర్ష వివాహం 4) గాంధర్వ వివాహం

13. కింది వాక్యాలను పరిశీలించి సరైన సమాధానాన్ని గుర్తించండి.
    - ఎ) అనులోమ వివాహం - అగ్రవర్ణ వరుడు దిగువ స్థాయి వధువును వివాహం చేసుకోవడం.
    - బి) ప్రతిలోమ వివాహం - అగ్రవర్ణ వధువు దిగువ స్థాయి వరుడిని వివాహం చేసుకోవడం.
    - సి) నియోగ పద్ధతి - సంతానం లేని స్త్రీ తన భర్త సోదరుడితో సంతానం పొందడం.
    - 1) ఎ, సి సరైనవి; బి సరికాదు.
    - 2) ఎ, బి, సి సరైనవి. 3) ఎ, బి, సి సరికావు.
    - 4) ఎ, బి సరైనవి; సి సరికాదు.

14. వన్యావాహనుడిగా పేరొందినవారు?
    - 1) ఇంద్రుడు 2) అగ్ని 3) వాయువు 4) సూర్యుడు

15. తొలివేద కాలంలో ప్రధాన దేవతలు?
    - 1) ఇంద్రుడు 2) అగ్నిదేవుడు 3) సోమదేవుడు 4) పైవన్నీ

16. కింది వాటిలో సరైనవి?
    - ఎ) రుగ్వేద ఆర్యుల ప్రధాన దేవతలు ఇంద్ర, అగ్ని.
    - బి) మారుత్ అనే తుపాను దేవత ఇంద్రుడికి యుద్ధాల్లో సహాయం చేసేది.
    - సి) సావిత్రి (సూర్య భగవానుడు)కి అంకితమైన మంత్రం- గాయత్రి మంత్రం.
    - డి) గాయత్రిమంత్రం రుగ్వేదంలో 3వ మండలంలో ఉంది.
    - 1) ఎ, బి 2) ఎ, బి, సి, డి 3) ఎ, సి, డి 4) బి, సి, డి




17. మలి వేద కాలంలో ప్రాముఖ్యతను సంతరించుకున్న రాజ్యాలు?
    - ఎ) కాశి బి) కోసల సి) విదేహ డి) మగధ
    - 1) ఎ, బి, సి, డి 2) ఎ, సి, డి 3) ఎ, బి, సి 4) బి, సి, డి

18. కింది వాటిలో మలి వేద కాలానికి సంబంధించి సరికానిది?
    - 1) ఈ కాలంలో విశాలమైన రాజ్యాలు ఆవిర్భవించాయి.
    - 2) ఈ కాలంలో పురోహితుడు, సేనాని, 'గ్రామణి' లాంటి అధికారులు ఉన్నారు.
    - 3) ఈ కాలంలో సభ, సమితి ప్రధాన పాత్ర వహించాయి.
    - 4) ఈ కాలంలో ఇనుము అధికంగా వాడుకలో ఉంది.

19. కింది వాటిని పరిగణించండి.
    - ఎ) వేదకాలంలో గ్రామాల సమూహానికి అధిపతిగా 'విష్పతి' ఉండేవారు
    - బి) తెగ నాయకుడిని 'రాజన్' అంటారు.
    - సి) గణతంత్రాన్ని సూచించే 'గణ' అనే పదం రుగ్వేదంలో 46 సార్లు ఉంటుంది.
    - డి) రుగ్వేద కాలంలో స్త్రీలు ప్రజాసభలైన సభ, సమితిలో పాల్గొనేవారు కాదు.
    - 1) ఎ, బి సరైనవి; సి, డి సరికావు.
    - 2) ఎ, బి, సి సరైనవి; డి సరికాదు.
    - 3) ఎ, బి, సి సరికావు; డి సరైంది.
    - 4) ఎ, బి, డి సరైనవి; సి సరికాదు.

20. కింది వాటిలో సరికానిది?
    - 1) వర్ణం అనే పదానికి మొదటి అర్థం రంగు.
    - 2) ఆర్యుల చేతిలో ఓడినవారిని దాస్యులు, బానిసలు, శూద్రులుగా చూసేవారు.
    - 3) రుగ్వేదం ప్రారంభంలో శూద్రులనే 5వ వర్గం ఉండేది.
    - 4) వృత్తుల వారీ విభజన గురించి రుగ్వేదంలోని పదో అధ్యాయం పురుష సూక్తంలో ఉంది.

21. మలి వేద కాలంలో మహిళల గురించి సరైనవి గుర్తించండి.
    - ఎ) మహిళలకు సభ, సమితిలో ప్రాధాన్యం లేదు.
    - బి) బహుభార్యత్వం ఉండేది.
    - సి) మహిళలు స్వాతంత్ర్యం కోల్పోయారు.
    - డి) స్వయంవరం లాంటివి ఆచరణలో లేవు.
    - 1) ఎ, బి, సి 2) బి, సి, డి 3) ఎ, బి, సి, డి 4) ఎ, సి, డి



22. వేదాలు, వాటిని చదివే బ్రాహ్మణుడిని జత చేయండి. (జేఎల్.-2011)

1) రుగ్వేదం	ఎ) అధర్వ
2) సామవేదం	బి) బ్రహ్మ
3) యజుర్వేదం	సి) హోత్రి
4) అధర్వణ వేదం	డి) ఉద్గాత్రి

   - 1) 1-ఎ, 2-బి, 3-సి, 4-డి 2) 1-సి, 2-డి, 3-ఎ, 4-బి
   - 3) 1-సి, 2-ఎ, 3-బి, 4-డి 4) 1-ఎ, 2-డి, 3-సి, 4-బి

23. రుగ్వేదంలో ఉన్న మండలాల సంఖ్య?
    - 1) 8 2) 9 3) 10 4) 12

24. రుగ్వేదంలోని మండలాలను జత చేయండి.

1) 3వ మండలం	ఎ) గాయత్రి మంత్రం
2) 7వ మండలం	బి) దశరాజు యుద్ధం
3) 9వ మండలం	సి) సోమపానీయం
4) 10 వ మండలం	డి) పురుష సూక్తం

   - 1) 1-ఎ, 2-బి, 3-సి, 4-డి 2) 1-డి, 2-సి, 3-ఎ, 4-బి
   - 3) 1-డి, 2-ఎ, 3-సి, 4-బి 4) 1-ఎ, 2-సి, 3-బి, 4-డి


25. సంగీత మూలాలున్న వేదం? (2012-గ్రూప్-II)
    - 1) రుగ్వేదం 2) సామవేదం 3) యజుర్వేదం 4) అధర్వణ వేదం



26. వేదాలు, వాటి బ్రాహ్మణాలను జత చేయండి.

1) రుగ్వేదం	ఎ) జైమని బ్రాహ్మణం
2) సామవేదం	బి) శతపథ బ్రాహ్మణం
3) యజుర్వేదం	సి) ఐతరేయ బ్రాహ్మణం
4) అధర్వణ వేదం	డి) గోపథ బ్రాహ్మణం

   - 1) 1-ఎ, 2-బి, 3-సి, 4-డి
   - 2) 1-సి, 2-ఎ, 3-బి, 4-డి
   - 3) 1-బి, 2-సి, 3-ఎ, 4-డి
   - 4) 1-సి, 2-ఎ, 3-డి, 4-బి



రచయిత: గద్దె నరసింహారావు

సమాధానాలు

1-3; 2-3; 3-3; 4-3; 5-2; 6-4; 7-1; 8-1; 9-2; 10-1; 11-3; 12-2; 13-2; 14-3; 15-4; 16-2; 17-1; 18-3; 19-2; 20-3; 21-3; 22-2; 23-3; 24-1; 25-2; 26-2.

ఆమ్లాలు - క్షారాల వర్గీకరణ

ఆమ్లాలు, క్షారాలు రసాయనశాస్త్రంలో అత్యంత ముఖ్యమైన పదార్థాలు. నీటిలో కరిగినప్పుడు హైడ్రోజన్ అయాన్లు (H^+) ఇచ్చే పదార్థాలను ఆమ్లాలు అని, హైడ్రాక్సైడ్ అయాన్లు (OH^-) ఇచ్చే పదార్థాలను క్షారాలు అని అంటారు. ఆమ్లాలు, క్షారాలను వాటి స్వభావం, లభ్యత, బలం, ద్రావణీయత ఆధారంగా వివిధ రకాలుగా వర్గీకరించారు. వీటితో రసాయన స్వభావం, ధర్మాలు, క్రియాశీలత వినియోగం, ఉపయోగాలను సులభంగా అర్థం చేసుకోవచ్చు. ఆమ్లాలు, క్షారాల వర్గీకరణ రసాయనశాస్త్ర అధ్యయనంలోనే కాకుండా పరిశ్రమలు, పర్యావరణం, దైనందిన జీవితంలో ఎంతో ప్రాముఖ్యతను కలిగి ఉంటుంది.



అయనీకరణే ఆధారం.. అయాన్ల విడుదలతో వ్యత్యాసం!

ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం
కెమిస్ట్రీ

ఆమ్లాల వర్గీకరణ

1. మూలం/ లభ్యత ఆధారంగా వర్గీకరణ

ఆమ్లాల లభ్యత, మూలం ఆధారంగా రెండు రకాలుగా వర్గీకరించారు. అవి:

ఖనిజ ఆమ్లాలు: వీటిని భూమిలోని ఖనిజాల నుంచి తయారు చేస్తారు. ఇవి సాధారణంగా బలమైన ఆమ్లాలు.

ఉదా: హైడ్రోక్లోరిక్ ఆమ్లం (HCl), సల్ఫ్యూరిక్ ఆమ్లం (H_2SO_4), నైట్రిక్ ఆమ్లం (HNO_3) మొదలైనవి.

సేంద్రియ ఆమ్లాలు: మొక్కలు (పండ్లు, కూరగాయలు), జంతువుల నుంచి సహజంగా లభిస్తాయి. ఇవి సాధారణంగా బలహీన ఆమ్లాలు.

ఉదా: సిట్రిక్ ఆమ్లం (నిమ్మరసం), మాలిక్ ఆమ్లం (ఆపిల్), లాక్టిక్ ఆమ్లం (పాలు, పెరుగు), టార్టారిక్ ఆమ్లం (ద్రాక్ష, చింతపండు) మొదలైనవి.

2. అయనీకరణ ఆధారంగా వర్గీకరణ

నీటిలో ఆమ్లాల అయనీకరణ ఆధారంగా రెండు రకాలుగా వర్గీకరించారు. అవి:

బలమైన ఆమ్లాలు: ఇవి నీటిలో (జల ద్రావణంలో) పూర్తిగా (100 %) అయనీకరణం చెంది ఎక్కువ హైడ్రోజన్ అయాన్లను (H^+) విడుదల చేస్తాయి.

ఉదా: హైడ్రోక్లోరిక్ ఆమ్లం, సల్ఫ్యూరిక్ ఆమ్లం, నైట్రిక్ ఆమ్లం, పర్‌క్లోరిక్ ఆమ్లం ($HClO_4$) మొదలైనవి.

బలహీన ఆమ్లాలు: ఇవి జల ద్రావణంలో పాక్షికంగా అయనీకరణం చెంది తక్కువ H^+ అయాన్లను విడుదల చేస్తాయి.

ఉదా: ఎసిటిక్ ఆమ్లం (CH_3COOH), కార్బానిక్ ఆమ్లం (H_2CO_3), హైడ్రోసయనిక్ ఆమ్లం (HCN), హైడ్రోఫ్లోరిక్ ఆమ్లం (HF) మొదలైనవి.

3. ఆమ్లక్షారత ఆధారంగా వర్గీకరణ

ఒక ఆమ్ల అణువు అయనీకరణం చెంది ఎన్ని హైడ్రోజన్ అయాన్లను ఇవ్వగలదో, దాన్ని ఆ ఆమ్లం క్షారత అంటారు. ఆమ్లక్షారత ఆధారంగా ఆమ్లాలను మూడు రకాలుగా వర్గీకరించారు. అవి:

ఏకక్షార ఆమ్లాలు (Monobasic Acids): ఒక ఆమ్ల అణువు ఒక హైడ్రోజన్ అయాన్‌ను మాత్రమే ఇస్తుంది.

ఉదా: HCl, HNO_3, CH_3COOH మొదలైనవి.

$$CH_3COOH \rightarrow H^+ + CH_3COO^-$$

ద్వికక్షార ఆమ్లాలు (Dibasic Acids): ఒక ఆమ్ల అణువు రెండు హైడ్రోజన్ అయాన్లను ఇస్తుంది. అంటే ఇవి రెండు అయనీకరణయోగ్య హైడ్రోజన్ అణువులు కలిగిన ఆమ్లాలు.

ఉదా: H_2SO_4, H_2CO_3, ఆక్సాలిక్ ఆమ్లం ($H_2C_2O_4$) మొదలైనవి.

$$H_2SO_4 \rightarrow 2H^+ + SO_4^{2-}$$

త్రిక్షార ఆమ్లాలు (Tribasic Acids): ఒక ఆమ్ల అణువు మూడు హైడ్రోజన్ అయాన్లను ఇస్తుంది. అంటే, ఇవి మూడు అయనీకరణయోగ్య హైడ్రోజన్ అణువులు కలిగిన ఆమ్లాలు.

ఉదా: ఫాస్ఫారిక్ ఆమ్లం (H_3PO_4)

$$H_3PO_4 \rightarrow 3H^+ + PO_4^{3-}$$

4. గాఢత ఆధారంగా వర్గీకరణ

ఆమ్ల ద్రావణంలో ఉన్న ఆమ్లం, నీటి పరిమాణం ఆధారంగా వీటిని రెండు రకాలుగా వర్గీకరించారు. అవి:

గాఢ ఆమ్లాలు: ద్రావణంలో నీటిశాతం చాలా తక్కువగా, ఆమ్లం శాతం ఎక్కువగా ఉంటుంది.

ఉదా: గాఢ హైడ్రోక్లోరిక్ ఆమ్లం, గాఢ ఎసిటిక్ ఆమ్లం మొదలైనవి.

సజల ఆమ్లాలు: ఆమ్లం కంటే నీటి శాతం ఎక్కువగా ఉన్న ద్రావణాలను సజల ఆమ్లాలు అంటారు.

ఉదా: సజల హైడ్రోక్లోరిక్ ఆమ్లం, సజల ఎసిటిక్ ఆమ్లం మొదలైనవి.

క్షారాల వర్గీకరణ

1. అయనీకరణ ఆధారంగా వర్గీకరణ

నీటిలో క్షారాల అయనీకరణ ఆధారంగా రెండు రకాలుగా వర్గీకరించారు. అవి:

బలమైన క్షారాలు: ఇవి నీటిలో (జల ద్రావణంలో) పూర్తిగా (100%) అయనీకరణం చెంది ఎక్కువ హైడ్రాక్సైడ్ అయాన్లను (OH^-) విడుదల చేస్తాయి.

ఉదా: సోడియం హైడ్రాక్సైడ్ ($NaOH$), పొటాషియం హైడ్రాక్సైడ్ (KOH), కాల్షియం హైడ్రాక్సైడ్ ($Ca(OH)_2$), బేరియం హైడ్రాక్సైడ్ ($Ba(OH)_2$), స్ట్రాన్షియం హైడ్రాక్సైడ్ ($Sr(OH)_2$) మొదలైనవి.

బలహీన క్షారాలు: జల ద్రావణంలో పాక్షికంగా మాత్రమే అయనీకరణం చెంది తక్కువ హైడ్రాక్సైడ్ అయాన్లను (OH^-) విడుదల చేస్తాయి.

ఉదా: అమ్మోనియం హైడ్రాక్సైడ్ (NH_4OH), అల్యూమినియం హైడ్రాక్సైడ్ ($Al(OH_3)$, మెగ్నీషియం హైడ్రాక్సైడ్ ($Mg(OH)_2$), అమైన్లు ($R\text{-}NH_2$) మొదలైనవి.

2. ద్రావణీయత ఆధారంగా వర్గీకరణ

క్షారాలు: నీటిలో పూర్తిగా కరిగే క్షారాలను 'ఆల్కలీలు' అంటారు. అన్ని ఆల్కలీలు క్షారాలే, కానీ అన్ని క్షారాలు ఆల్కలీలు కావు.

ఉదా: $NaOH$, KOH, NH_4OH మొదలైనవి.

నీటిలో కరగని క్షారాలు: ఇవి నీటిలో కరగవు లేదా చాలా తక్కువగా కరుగుతాయి.

ఉదా: కాపర్ హైడ్రాక్సైడ్ [$Cu(OH)_2$], ఐరన్ హైడ్రాక్సైడ్ [$Fe(OH)_3$], అల్యూమినియం హైడ్రాక్సైడ్ [$Al(OH)_3$], జింక్ హైడ్రాక్సైడ్ [$Zn(OH)_2$] మొదలైనవి.

3. క్షారఆమ్లత ఆధారంగా వర్గీకరణ

ఒక క్షార అణువు అయనీకరణం చెంది ఎన్ని హైడ్రాక్సైడ్ అయాన్లను ఇవ్వగలదో, దాన్ని క్షారఆమ్లత అంటారు. ఇందులో క్షారాలను మూడు రకాలుగా వర్గీకరించారు. అవి:

ఏకఆమ్లత క్షారాలు (Monoacidic Bases): ఒక క్షార అణువు ఒక హైడ్రాక్సైడ్ అయాన్ (OH^-)ను మాత్రమే కలిగి ఉంటుంది **ఉదా:** $NaOH$, KOH, NH_4OH మొదలైనవి.

$$NaOH \rightarrow Na^+ + OH^-$$

ద్విఆమ్లత క్షారాలు (Diacidic Bases): ఒక క్షార అణువు రెండు OH^- అయాన్లను ఇస్తుంది.

ఉదా: $Ca(OH)_2$, $Mg(OH)_2$ మొదలైనవి.

$$Mg(OH)_2 \rightarrow Mg^{+2} + 2OH^-$$

త్రికఆమ్లత క్షారాలు (Triacidic Bases): ఒక క్షార అణువు మూడు OH^- అయాన్లను ఇస్తుంది.

ఉదా: $Al(OH)_3$, $Fe(OH)_3$ మొదలైనవి.

$$Al(OH)_3 \rightarrow Al^{+3} + 3OH^-$$



రచయిత
డా. పి. భానుప్రకాష్
అసిస్టెంట్ ప్రొఫెసర్

934 Word of the Day

Mirthful

Telugu meaning: ఉల్లాసమైన, ఆనందమైన

English meaning: The word 'mirthful' (మిర్థ్‌ఫుల్) is an adjective that describes someone full of joy, laughter, or happiness.

Synonyms: Cheerful, Joyful

Antonyms: Sad, Gloomy

Usage: **1.** The children's mirthful laughter echoed throughout the park as they played together on the swings.

2. Her mirthful personality made every gathering lively and enjoyable for everyone present.

నోటిఫికేషన్స్

ఎన్‌ఎస్‌ఎస్‌ఎన్‌ఈటీ 2026

నవయుగ్ స్కూల్, సరోజినీ నగర్ (న్యూదిల్లీ)లో 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి 6, 7వ తరగతుల్లో ప్రవేశం కోసం ఎన్‌టీఏ ఈ నోటిఫికేషన్ విడుదల చేసింది. దరఖాస్తు ఫీజు లేదు. అర్హులైన అభ్యర్థులు 2026, మార్చి 18లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

వర్క్స్ ఇంజినీర్ ఉద్యోగాలు

రైల్వే మంత్రిత్వ శాఖ పరిధిలోని నవరత్న ప్రభుత్వ రంగ సంస్థ అయిన ఇర్కాన్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ (ఇర్కాన్), కాంట్రాక్ట్ ప్రాతిపదికన వర్క్స్ ఇంజినీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులను కోరుతోంది. మొత్తం పోస్టుల సంఖ్య 13. ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ 13 మార్చి 2026.

దరఖాస్తు చేశారా..? కింది ఉద్యోగాలకు నేడే (ఫిబ్రవరి 27) చివరి తేదీ

- యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్, ఐఎఫ్ఎస్ నోటిఫికేషన్స్- 2026 - 1013 పోస్టులు. డిగ్రీ ఉత్తీర్ణులు అర్హులు.
- ఎన్ఐటీ జలంధర్‌లో 101 ఫ్యాకల్టీ ఉద్యోగాలు. పీజీ, పీహెచ్‌డీలో ఉత్తీర్ణులు అర్హులు.

పూర్తి వివరాలు, మరిన్ని నోటిఫికేషన్ల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

పోటీ పరీక్షల్లో వర్తమాన అంశాలు ఎంతో కీలకం. ఈనాడు ఈప్రతిభ వెబ్‌సైట్/ యాప్ 'మంత్లీ కరెంట్ అఫైర్స్'ను వీడియో రూపంలో యూట్యూబ్ ఛానల్‌లో అందుబాటులో ఉంచింది. వీటితోపాటు జనరల్ స్టడీస్‌కి సంబంధించిన మరిన్ని పాఠాలూ ఉన్నాయి. టాపిక్‌పై అవగాహన పెంచుకోవడానికి, సులభంగా నేర్చుకోవడానికి ఇవి మీకు సాయం చేస్తాయి.

- కన్‌ఫ్యూజ్ చేసే ప్రశ్నలకు పోల్స్ రూపంలో క్లారిటీ ఇస్తూ.. క్విజెస్‌తోపాటు జాబ్ నోటిఫికేషన్స్ సమాచారాన్ని రీల్స్‌గా.. ముఖ్యమైన జనరల్ నాలెడ్జ్ కంటెంట్‌ను షార్ట్స్ రూపంలో అందిస్తూ మీ సన్నద్ధతకు తోడుగా, సరైన సమాచారానికి వేదికగా ఈనాడు ఈప్రతిభ యూట్యూబ్ ఛానల్ నిలుస్తోంది. మీరు జాబ్ కొట్టాలని బలంగా కోరుకుంటే ఇప్పుడే మా ఛానల్‌ను సబ్‌స్క్రైబ్ చేసుకోండి.

అంతర్జాతీయ ధ్రువపు ఎలుగుబంటి దినోత్సవం

ఫిబ్రవరి 27
చరిత్రలో ఈనాడు

పర్యావరణ కాలుష్యం వల్ల మానవాళితోపాటు అనేక ఇతర జంతువులు ప్రభావితమవుతున్నాయి. అలా నష్టపోతోన్న జాతుల్లో ధ్రువపు ఎలుగుబంటి ఒకటి. ఇటీవలి కాలంలో వీటి జనాభా వేగంగా క్షీణిస్తోంది. ధ్రువ ప్రాంతాల్లో మంచు కరగడం, వాతావరణ మార్పుల వల్ల వేగంగా తరిగిపోతోన్న ధ్రువపు ఎలుగుబంట్లను రక్షించే లక్ష్యంతో ఏటా ఫిబ్రవరి 27న 'అంతర్జాతీయ ధ్రువపు ఎలుగుబంటి దినోత్సవం'గా (International Polar Bear Day) నిర్వహిస్తారు. వీటి సంరక్షణకు, అవి ఉండే



ఆవాసాల పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యల గురించి ప్రపంచవ్యాప్తంగా అవగాహన కల్పించడం ఈ రోజు ముఖ్య ఉద్దేశం.

ధ్రువపు ఎలుగుబంటి – ముఖ్యాంశాలు


- శాస్త్రీయ నామం ఉర్సస్‌మారిటిమస్ (Ursus maritimus). ప్రస్తుతం ఉన్న ఎలుగుబంటి జాతుల్లో అతి పెద్దది. దీన్ని సముద్ర క్షీరదంగా వర్గీకరించారు. ఇలా పరిగణించే ఏకైక ఎలుగుబంటి జాతి ఇదే.
- ఇవి ఉత్తర ధ్రువం చుట్టూ ఉన్న ఆర్కిటిక్ ప్రాంతాల్లో నివసిస్తాయి. ఇవి ప్రధానంగా గడ్డ కట్టే ఉష్ణోగ్రతల్లో జీవనం సాగిస్తాయి. ముఖ్యంగా సముద్ర మంచు తీరప్రాంతం కలిగిన కెనడా, అమెరికా (అలస్కా), రష్యా, గ్రీన్‌లాండ్, నార్వే (స్వాల్‌బార్డ్)లో ఇవి కనిపిస్తాయి.
- 40 % కంటే ఎక్కువ ధ్రువపు ఎలుగుబంట్లు కెనడాలోని ఉత్తర ప్రాంతంలో నివసిస్తాయి.
- ధ్రువపు ఎలుగుబంట్లు మాంసాహార జంతువులు. ప్రధానంగా సముద్రాల్లో నివసించే సీల్స్‌ను వేటాడి తింటాయి.
- ఈ ఎలుగుబంట్లు దాదాపు 8 అడుగుల ఎత్తు, 300 నుంచి 700 కిలోల బరువు కలిగి ఉంటాయి. మొత్తం శరీర బరువులో 50 % కొవ్వు ఉంటుంది. ఇదే వాటి శరీరానికి వెచ్చదనాన్ని ఇస్తుంది. ఆడ ధ్రువపు ఎలుగుబంట్లు శీతాకాలంలో పిల్లలకు జన్మనిస్తాయి. పుట్టినప్పుడు వాటి బరువు 700 గ్రాములు ఉంటుంది.

వీటిని కాపాడుకోవాల్సిన ఆవశ్యకత, గత పరీక్షల్లో అడిగిన ప్రశ్నలు సహా పూర్తి సమాచారం కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

జనరల్ స్టడీస్ - బయాలజీ

ఆవరణ కారకంగా ఉష్ణోగ్రత

వేడి లేదా చల్లదనం స్థాయిని సూచించే ఒక భౌతిక పరిమాణమే ఉష్ణోగ్రత. దీన్ని వస్తువులోని అణువుల కదలిక శక్తి ఆధారంగా నిర్ణయిస్తారు. ఉష్ణోగ్రతను సెల్సియస్ (°C), ఫారెన్‌హీట్ (°F) లేదా కెల్విన్ (K) యూనిట్లలో కొలుస్తారు. ఇది జీవుల జీవక్రియ, పెరుగుదల, పునరుత్పత్తి, పంపిణీని నిర్ణయిస్తుంది.



జీవులపై ఉష్ణోగ్రత ప్రభావం

ప్రతి జీవికి ఒక నిర్దిష్ట ఉష్ణోగ్రత పరిధి ఉంటుంది. దీన్నే సహన శీలత అంటారు.

మొక్కల జీవన ప్రక్రియలు – ఉష్ణోగ్రత ప్రాథమిక ప్రభావం

మొక్కల జీవన విధానంలో ఉష్ణోగ్రత కీలకమైన ఆవరణ కారకం. ఇది పెరుగుదల, జీవక్రియ, పునరుత్పత్తి, సహనశీలతను నిర్ణయిస్తుంది. మొక్కలు ఎక్టోథర్మ్ జీవులుగా ఉంటాయి. బాహ్య వాతావరణంపై ఆధారపడి ఇవి తమ శరీర ఉష్ణోగ్రతను నియంత్రిస్తాయి.

- ఉష్ణోగ్రత మొక్కల్లో జరిగే కిరణజన్య సంయోగక్రియ, శ్వాసక్రియ, బాష్పోత్సేకం లాంటి ప్రక్రియలను ప్రభావితం చేస్తుంది.

ఎక్టోథర్మ్‌లు, ఎండోథర్మ్‌లపై ఉష్ణోగ్రత ప్రభావం, గ్లోబల్ వార్మింగ్ మొదలైన అంశాలతో పాటు మాదిరి ప్రశ్నలతో సహా పూర్తి సమాచారం ఈనాడు ఈప్రతిభ వెబ్‌సైట్‌లో 'జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో ఈ-బుక్ రూపంలో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Dokriani Glacier is located in the...

Current Affairs

1. Which of the following statements is correct regarding the 'Padhai with AI' initiative?

A) The initiative was launched by the Union Education Minister in New Delhi.

B) It is a defence-related AI programme for armed forces training.

C) Himachal Pradesh Chief Minister Sukhvinder Singh Sukhu launched 'Padhai with AI', an AI-based digital education initiative, at Barthin in Bilaspur district.

D) The programme was introduced by NITI Aayog for rural banking reforms.

2. Which of the following statements is correct regarding the Industrial Relations Code (Amendment) Bill, 2026?

A) The Bill was introduced in the Rajya Sabha by the Finance Minister.

B) It was tabled during Question Hour by the Minister of Commerce.

C) The Bill relates only to environmental regulations.

D) Union Labour and Employment Minister Mansukh Mandaviya introduced the Industrial Relations Code (Amendment) Bill, 2026 in the Lok Sabha during Zero Hour through a supplementary agenda.

3. Which of the following statements is correct regarding Reliance Industries Limited and Venezuelan oil imports?

A) The United States issued a general licence to Reliance Industries Limited allowing it to import Venezuelan oil without violating U.S. sanctions.

B) Reliance Industries was banned permanently from importing Venezuelan oil.

C) The licence was issued by the United Nations Security Council.

D) The agreement allows only export of oil from India to Venezuela.

4. Which of the following statements is correct regarding World Pulses Day 2026?

A) World Pulses Day is observed on 15 October every year.

B) World Pulses Day 2026 observed on 10 February to highlight the importance of pulses in nutrition, sustainable agriculture, and environmental protection.

C) It is observed only in India to promote rice production.

D) The day is celebrated to commemorate the Green Revolution.

SSC Exams Special

General Awareness

Geography

5. Which of the following statements is correct regarding the Jhelum River?

A) The Jhelum River originates from Mansarovar Lake in Tibet.

B) It rises in Himachal Pradesh and flows directly into the Arabian Sea.

C) The Jhelum River originates from a spring at Verinag in the South-Eastern Kashmir Valley and flows Northward into Wular Lake.

D) It is a tributary of the Ganga River.

6. Which of the following correctly describes a Punchbowl waterfall?

A) Water falls vertically from a great height without spreading.

B) Water cascades down in multiple small steps

C) Water flows gently over a wide rock surface

D) Water descends in a narrow, constricted form and then spreads out into a wider pool at the base.

7. Which of the following statements is correct regarding the Dokriani Glacier?

A) Dokriani Glacier is located in the Bhagirathi basin of the central Himalaya in Uttarkashi district of Uttarakhand.

B) Dokriani Glacier is situated in the Zanskar range of Ladakh.

C) It is located in the Teesta basin of Sikkim.

D) Dokriani Glacier lies in Arunachal Pradesh near the China border.

General Science

8. Which of the following statements correctly describes the photoelectric effect?

A) It is the emission of protons when heat is applied to a metal.

B) It is the reflection of light from a shiny surface.

C) It is the emission of electrons from the surface of a metal when light of suitable frequency is incident on it.

D) It is the production of sound waves by electromagnetic radiation.

9. Which of the following statements correctly describes a cyclotron?

A) It is a device used to measure atmospheric pressure.

B) It is an instrument used to detect radio waves

C) It is a machine used to split light into its component colours.

D) A cyclotron, invented by E.O. Lawrence in 1929, is used to accelerate charged particles such as protons, deuterons, and alpha particles to high velocities.

10. Which of the following statements correctly explains the peroxide (Kharasch) effect?

A) The peroxide (Kharasch) effect, discovered by Morris S. Kharasch and Frank R. Mayo, describes the anti-Markovnikov addition of HBr to unsymmetrical alkenes in the presence of peroxides.

B) It explains the Markovnikov addition of HCl to alkenes without any catalyst.

C) It is a reaction in which hydrogen adds to both carbons of a double bond.

D) None of the above

Scan the QR code for Key

These model questions were prepared by subject experts.



పిల్లల చదువుకు ఆదివాసీల తపన

పద్నాలుగేళ్లలోపు పిల్లలకు ఉచిత, నిర్బంధ విద్యను ప్రాథమిక హక్కుగా పరిగణిస్తూ విద్యాహక్కు చట్టం దేశంలో అమలులోకి వచ్చి పదిహేనేళ్లు దాటుతున్నా, నేటికీ చాలా గిరిజన ప్రాంతాలు ఈ హక్కుకు నోచుకోవడం లేదు. మధ్యప్రదేశ్‌లోని బుర్హాన్‌పుర్ జిల్లా నేపానగర్ పట్టణ సమీపంలోని బోమలియపాట్ ఫలియా గ్రామ దుస్థితే ఇందుకు నిదర్శనం. సాధారణంగా గిరిజన గ్రామాల వంటి వెనుకబడిన ప్రాంతాల్లో విద్యావ్యాప్తికి ప్రభుత్వ అధికారులే ప్రజల వెంటపడుతూ ఉంటారు. బోమలియపాట్ ఫలియాలో పరిస్థితి ఇందుకు పూర్తి భిన్నంగా ఉంది. తమ పిల్లలకు చదువు కావాలంటున్న ఇక్కడి గిరిజనులు వాళ్లే ఓ రేకుల షెడ్డులో పాఠశాలను ఏర్పాటు చేసుకున్నారు. ఇందులో 60 మంది పిల్లలకు తొమ్మిదో తరగతి వరకు చదివిన సీమా బడోలే అనే యువతి జీతం లేకుండా పాఠాలు చెబుతోంది. మరింతమంది పిల్లలు ఆసక్తి చూపుతున్నా, తగినంత స్థలం లేదని సీమా బడోలే తెలిపింది. గ్రామంలో తక్షణం పాఠశాల భవనం నిర్మించి, ఉపాధ్యాయులను నియమించాలని స్థానికులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. వచ్చే విద్యాసంవత్సరం నాటి



కల్లా గ్రామ విద్యార్థులకు ఈ సదుపాయాలన్నీ అందుబాటులోకి వచ్చేలా ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపుతామని గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ భారత్ జాంచ్‌పురే తెలిపారు.

ఈటీవీ భారత్
యాప్ స్టోర్ & గూగుల్ ప్లే ద్వారా డౌన్‌లోడ్ చేసుకోండి

పూర్వీకులకు మోక్షం కోసం.. 4 రోజుల గిరిజన వేడుక

ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ డివిజను పరిధిలో గల నారాయణ్‌పుర్ జిల్లా కేరళాపాల్ గ్రామంలో ఈ నెల 22 నుంచి 25 వరకు 'గాయత పఖ్నా' గిరిజన వేడుక ఘనంగా జరిగింది. చనిపోయిన తమ పూర్వీకులకు మోక్షం దక్కాలనే సంకల్పంతో ఉసెండి గిరిజన తెగ నాలుగు రోజులపాటు నిర్వహించే ఈ సంప్రదాయ వేడుక 22 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత జరిగింది. జీవనోపాధి కోసం వేర్వేరు ప్రాంతాలకు వెళ్లిన వారంతా గ్రామానికి తరలివచ్చారు. ఇందులో మేనమామ తరపు కుటుంబికులకు ప్రత్యేక ఆహ్వానం పంపి.. డప్పుల చప్పుళ్లు, సంప్రదాయ పాటలతో ఘనంగా స్వాగతం పలుకుతారు. అనంతరం రాత్రికి ఆలపించే విషాద గీతాల్లో మరణించిన పూర్వీకుల పేర్లు, జ్ఞాపకాలను ప్రస్తావిస్తారు. ఈ పాటలను





వినడానికి వారి ఆత్మలు వస్తాయని గిరిజనుల నమ్మకం. రెండోరోజు.. మహిళలంతా కలశాలు మోస్తూ పూజారి వెంట నడిచి, పూర్వీకుల జ్ఞాపకార్థం పాతిన రాళ్ల దగ్గర దీపపు కుండలతో ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు. మూడోరోజు పురుషులు కొండ పైనుంచి బండరాళ్లను గాయత పఖ్నా స్థలానికి మోసుకొచ్చి పాతిపెడతారు. ఈ రాళ్లకు ఇప్పపూల రసాన్ని నైవేద్యంగా సమర్పిస్తారు. నాలుగోరోజున వస్తుమార్పిడి పద్ధతిలో గ్రామంలో ప్రత్యేక మార్కెటు ఏర్పాటు చేస్తారు. ఈ మార్కెటు తర్వాత సామాజిక విందుతో పండుగ ముగుస్తుంది.

బ్రిటన్ వీసా గడువు పొడిగింపులో భారతీయులే టాప్

లండన్: బ్రిటన్‌లో వీసా గడువు పొడిగింపు పొందుతున్న విదేశీ విద్యార్థులు, నిపుణుల్లో భారతీయులే అత్యధికంగా ఉంటున్నారు. బ్రిటన్ హోంశాఖ కార్యాలయం గురువారం విడుదల చేసిన గణాంకాలు ఈ విషయాన్ని తేటతెల్లం చేశాయి. ఆ వివరాల ప్రకారం- ఆరోగ్య సేవల రంగంలో నిపుణ అత్యధికంగా 1,04,555 మంది భారతీయులు వీసా గడువు పొడిగించుకున్నారు. నిపుణులైన కార్మికుల విషయంలో వీసా పొడిగింపు దక్కించుకోవడంలోనూ మనవాళ్లదే పైచేయి. గతేడాది 90,153 మంది భారతీయులు ఈ కేటగిరీలో వీసా గడువు పొడిగించుకోగలిగారు. గ్రాడ్యుయేట్ల విషయంలో అత్యధికంగా 90,153 మంది భారతీయులు వీసా గడువు పొడిగింపు పొందారు. 2025లో 95231 మంది భారతీయ విద్యార్థులు బ్రిటన్‌లో స్పాన్సర్డ్ స్టడీ వీసా పొందారు.

దిల్లీ అల్లర్ల కేసులో ముగ్గురికి విముక్తి

దిల్లీ: ఈశాన్య దిల్లీలో 2020లో జరిగిన అల్లర్ల, దహన కాండలో పాల్గొన్నారంటూ ముగ్గురిపై దాఖలైన కేసును దిల్లీ అదనపు సెషన్స్ జడ్జి పర్వీన్ సింగ్ కొట్టివేశారు. సాగర్, దేవేందర్ గౌతమ్, ఆదేశ్‌ అనే వ్యక్తులు హింసలో పాల్గొన్నారని పోలీసులు కేసు పెట్టారు. ప్రజా పనుల శాఖ నుంచి సేకరించిన సీసీటీవీ వీడియో ఆధారంగా ఈ కేసు దాఖలైంది. వీడియో దృశ్యాలను సాక్ష్యంగా స్వీకరించలేమని జడ్జి వివరించారు. ఆ వీడియో కూడా లోపభూయిష్టంగా ఉందంటూ ముగ్గురి విడుదలకు మార్గం సుగమం చేశారు.

వివాదాస్పద పాఠ్యపుస్తకంపై ప్రసారాలను ఆపండి

- కేంద్ర సమాచార శాఖకు విద్యాశాఖ లేఖ

దిల్లీ: తీవ్ర వివాదానికి దారితీసిన జాతీయ విద్యా పరిశోధన, శిక్షణ మండలి (ఎన్సీఈఆర్టీ) పాఠ్యపుస్తకంపై ఎలక్ట్రానిక్ మీడియా, డిజిటల్ వేదికల్లో ప్రసారాలను నిలువరించాలని కోరుతూ కేంద్ర సమాచార, ప్రసార శాఖకు గురువారం విద్యాశాఖ లేఖ రాసింది. ఎనిమిదో తరగతి సాంఘిక శాస్త్ర కొత్త పాఠ్యపుస్తకంపై సుప్రీంకోర్టు సంపూర్ణ నిషేధం విధించిన నేపథ్యంలో ఈ సూచన చేసింది. న్యాయవ్యవస్థలో అవినీతి పెద్ద సవాల్‌గా మారిందని పేర్కొన్న అధ్యాయంపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ఆ పాఠ్యపుస్తక ప్రతులను.. ముద్రణ, డిజిటల్ రూపంలో ఉన్నా సరే జప్తు చేయాలని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది.

యజమాని ఇంటి దోపిడీకి పని మనిషి పన్నాగం

- నకిలీ ఈడీ అధికారులను రంగంలోకి దింపిన వైనం

దిల్లీ: యజమాని ఇంటిని దోచుకోవడానికి ఓ పనిమనిషి ఏకంగా నకిలీ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అధికారులను రంగంలోకి దింపింది. ఇంట్లో ఖరీదైన వస్తువులు ఎక్కడెక్కడ ఉంటాయో ముందే ఉప్పందించింది. వారు ఇంట్లో తనిఖీలు చేస్తున్న సమయంలో అక్కడే ఉండి తనకేమీ తెలియనట్లు నటించింది. పథకం ప్రకారమే వారు వస్తువులు దోచుకొని వెళ్లిన వివరాలు పోలీసుల దర్యాప్తులో బయటపడింది. దిల్లీలో జరిగిన ఈ ఘటనకు సంబంధించిన పని మనిషి రేణు దేవి, ఆమె సమీప బంధువు పూజా రాజ్‌పుత్‌లను పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి ఏడు ఖరీదైన గడియారాలు, నగలతో పాటు డిప్యూటీ కమాండెంట్ యూనిఫాం, నకిలీ గుర్తింపు కార్డును స్వాధీనం చేసుకున్నారు. ఈడీ అధికారుల్లా నటించిన పూజా భర్త మనీష్, మరో ఇద్దరు వ్యక్తులు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

పరువు నష్టం కేసులో సంజయ్ రౌత్‌కు ఊరట

ముంబయి: శివసేన(యూబీటీ) ఎంపీ సంజయ్ రౌత్‌కు పరువు నష్టం కేసులో ముంబయి సెషన్స్ కోర్టు గురువారం ఊరట కల్పించింది. మీరా-భయందర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో రూ.100 కోట్ల మరుగుదొడ్ల కుంభకోణంలో రౌత్ చేసిన ఆరోపణలు తమకు పరువు నష్టం కలిగించాయని భాజపా నేత కిరీట్ సోమయ్య భార్య మేధా గతంలో కోర్టును ఆశ్రయించారు. అప్పట్లో మేజిస్ట్రేట్ కోర్టు రౌత్‌ను దోషిగా తేల్చి 15 రోజుల జైలు శిక్ష విధించింది. ఆ తీర్పుపై రౌత్ సెషన్స్ కోర్టులో అప్పీల్ చేయగా, ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయస్థానం ఆయనకు అనుకూలంగా తీర్పునిచ్చింది.

శుద్ధి చేసిన ఆహారంపై దుష్ప్రచారం నిలువరించాలి

- కేంద్రమంత్రి చిరాగ్ పాస్వాన్ పిలుపు

దిల్లీ: శుద్ధి చేసిన (ప్రాసెస్డ్) ఆహార పదార్థాలు ఆరోగ్యానికి హానికరమంటూ సామాజిక మాధ్యమ ప్రభావశీలురు (సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు) తప్పుడు ప్రచారం చేస్తున్నారని కేంద్ర ఆహారశుద్ధి పరిశ్రమల శాఖ మంత్రి చిరాగ్ పాస్వాన్ గురువారం ఆరోపించారు. ఇలాంటి దుష్ప్రచారం ఆ రంగం అభివృద్ధికి ఆటంకంగా మారిందని ఆయన అన్నారు. ఆహార్ - 2026 పేరుతో ఏర్పాటు చేసిన అంతర్జాతీయ సదస్సు ప్రారంభ సమావేశంలో పేర్కొన్నారు. శుద్ధిచేసిన ఆహారం మంచిది కాదని ఆన్‌లైన్ ద్వారా సాగుతున్న విస్తృత ప్రచారాన్ని తిప్పికొట్టాల్సిన అవసరం ఉందని ఆయన నొక్కి చెప్పారు.

ఎప్‌స్టీన్ ఫైల్స్‌తో ప్రధానిపై అమెరికా ఒత్తిడి

- వాణిజ్య ఒప్పందం వల్ల మన రైతులే బలి
- కేంద్రంపై రాహుల్ గాంధీ ధ్వజం

కన్నూర్: వాణిజ్య ఒప్పందంపై సంతకం చేసేలా ప్రధానమంత్రి నరేంద్ర మోదీని బెదిరించడానికి 'ఎప్‌స్టీన్ ఫైళ్ల'ను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఉపయోగించారంటూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ తీవ్ర ఆరోపణలు చేశారు. భారత్-అమెరికా మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందం వల్ల భారత రైతులు బలవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కేరళలోని కన్నూర్ జిల్లాలో ఉన్న పెరవూరులో గురువారం నిర్వహించిన రైతు మహాసభలో రాహుల్ మాట్లాడారు. 'ప్రధానమంత్రి నరేంద్ర మోదీని చిక్కుల్లో పడేసిన రెండు అంశాలను లేవనెత్తాలని యత్నించినందుకే, రాష్ట్రపతి ప్రసంగం తర్వాత పార్లమెంట్‌లో మాట్లాడటానికి నన్ను అనుమతించలేదు. మొదటిది.. 3.5 మిలియన్ల ఎప్‌స్టీన్ ఫైళ్లు ఇంకా బయటకు రాలేదు. అమెరికా ప్రభుత్వం వద్ద రహస్యంగా వాటిలో భారత ప్రధానికి సంబంధించిన సమాచారం ఉందనే ఆరోపణలున్నాయి. రెండోది.. భాజపా, ప్రధానమంత్రికి ఆర్థిక మౌలిక సదుపాయాలను సమకూర్చే అదానీ



గ్రూప్‌పై అమెరికాలో కేసు నమోదైంది. వారి ఆర్థిక వ్యవస్థను రక్షించుకునేందుకు ప్రధానమంత్రి భారత రైతులను బలి చేస్తున్నారు. రైతులే దేశానికి పునాది అనే వాస్తవాన్ని కేంద్రం అర్థం చేసుకోవడం లేదు. అమెరికాతో కుదుర్చుకున్న వాణిజ్య ఒప్పందం రైతులకు నష్టాన్ని కలిగించేలా ఉంది. అమెరికా రైతులకు అధిక యాంత్రీకరణ, విస్తారమైన భూములున్నాయి. ఆ దేశ కంపెనీలకు భారత మార్కెట్లను తెరవడం నేరపూరిత చర్య అవుతుంది'' అని రాహుల్ వ్యాఖ్యానించారు. గతంలో ప్రధానమంత్రులు ఎవరూ అమెరికా రైతులకు భారత్‌లో సోయాబీన్స్, కూరగాయలు, పండ్లు వంటి ఉత్పత్తులను అమ్మడానికి అనుమతించలేదని ఆయన గుర్తుచేశారు.

వయనాడ్‌లో ఉన్న మ్యాజిక్ ఇదే..

కేరళ ప్రజల సమస్యలను ప్రతిబింబించేలా మేనిఫెస్టో సిద్ధం చేస్తున్నామని రాహుల్ తెలిపారు. 2024లో కొండచరియలు విరిగి పడిన ఘటనలో బాధితుల కోసం కాంగ్రెస్ పార్టీ నిర్మిస్తోన్న 100 ఇళ్లకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా తన సోదరి, వయనాడ్ ఎంపీ ప్రియాంకా గాంధీకి, తనకు మధ్య జరిగిన సన్నివేశాన్ని రాహుల్ సరదాగా పంచుకున్నారు. 'చిన్న చిన్న విషయాలకు నేను, ప్రియాంక గొడవ పడుతుంటాం. ఆమె మొన్న నాతో మాట్లాడలేదు. దీంతో అమ్మను ఆశ్రయించి, ప్రియాంక మాట్లాడటం లేదని చెప్పాను. అయితే వయనాడ్‌కు తనను తీసుకెళ్తున్నానని, అక్కడ కచ్చితంగా నాతో మాట్లాడుతుందని అమ్మతో అన్నాను. ఇక్కడికి వచ్చాక ప్రియాంక నాతో మాట్లాడింది. వయనాడ్‌లో ఉన్న మ్యాజిక్ ఇదే' అంటూ రాహుల్ చెప్పుకొచ్చారు.

శిమ్లా, దిల్లీ పోలీసుల మధ్య ముగిసిన వివాదం

- యువజన కాంగ్రెస్ కార్యకర్తలు దిల్లీకి తరలింపు

శిమ్లా: భారత యువజన కాంగ్రెస్(ఐవైసీ)కు చెందిన ముగ్గురు కార్యకర్తల అరెస్టు విషయంలో దిల్లీ, శిమ్లా పోలీసుల నడుమ తలెత్తిన వివాదం 24 గంటల తర్వాత ఎట్టకేలకు ముగిసింది. దిల్లీలో నిర్వహించిన ఏఐ ఇంపాక్ట్ సదస్సులో చొక్కాలు విప్పి నిరసన తెలిపిన ఘటనలో ముగ్గురు కార్యకర్తలపై దిల్లీ పోలీసులు కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే. వారిని శిమ్లాకు సమీపంలోని ఓ రిసార్టు నుంచి ట్రాన్సిట్ రిమాండ్ మీద దేశరాజధానికి తీసుకొస్తున్న దిల్లీ పోలీసులపై శిమ్లా పోలీసులు బుధవారం కిడ్నాప్ కేసు పెట్టారు. వారిని దారిలో మూడు చోట్ల అడ్డుకొని వాగ్వాదానికి దిగారు. చివరకు శోగీ సరిహద్దులో దిల్లీ పోలీసుల వాహనాలను సీజ్ చేసి వారిని ఐదు గంటల పాటు నిర్బంధించారు. దిల్లీ పోలీసుల వద్ద ఉన్న డిజిటల్ ఎవిడెన్సులు, సీజర్ మెమో తమకు సమర్పించాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలో స్థానిక కోర్టులో నిందితులను హాజరు పరచగా, వారిని తీసుకొని వెళ్లేందుకు దిల్లీ పోలీసులకు అనుమతినిచ్చింది. అనంతరం ముగ్గురిని పోలీసులు భద్రతా ఏర్పాట్ల నడుమ దిల్లీకి తీసుకెళ్లి కోర్టులో ప్రవేశపెట్టారు. వారికి కోర్టు మూడు రోజుల కస్టడీ విధించింది.

ఇది ఉత్తర కొరియా కాదు: రాహుల్

చొక్కాలు విప్పి నిరసన తెలిపిన తమ యువజన కాంగ్రెస్ కార్యకర్తలపై పోలీసుల చర్యలను పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ ఖండించారు. "ఇది ఉత్తర కొరియా కాదు. అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం. ప్రధాని పాలనలో శాంతియుత నిరసన నేరంగా మారింది. అధికారంలో ఉన్నవారు నిరసన చేసేవారిని శత్రువులుగా చూడటం మొదలుపెట్టినప్పుడే ప్రజాస్వామ్యం అంతమైపోతుంది" అని రాహుల్ గాంధీ మండిపడ్డారు. యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఉదయ్ భాను చిబ్, కార్యకర్తల అరెస్టుకు వ్యతిరేకంగా సత్యాగ్రహం ప్రారంభించినట్లు ఆ పార్టీ సీనియర్ నేత ఒకరు తెలిపారు.

పార్టీల ఎన్నికల వ్యయం నియంత్రణకు పిల్

దిల్లీ: ఎన్నికల్లో రాజకీయ పార్టీల వ్యయంపై పరిమితులు విధించాలని కోరుతూ సుప్రీంకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలైంది. దీనిపై కేంద్ర ప్రభుత్వానికి, ఎన్నికల సంఘానికి కోర్టు నోటీసులు జారీ చేసింది. ఏప్రిల్ 27లోగా సమాధానం చెప్పాలని ఆదేశించింది. కామన్ కాజ్, సెంటర్ ఫర్ పబ్లిక్ ఇంటరెస్ట్ లిటిగేషన్ అనే స్వచ్ఛంద సంస్థల తరఫున సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ వాదనలు వినిపించారు. పోటీకి నిలిచిన అభ్యర్థుల వ్యయానికి 1951 నాటి ప్రజా ప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 77(1) పరిమితులు విధిస్తోందని, అయితే రాజకీయపార్టీలకు అలాంటి పరిమితులేవీ లేవని పిటిషనర్లు పేర్కొన్నారు. ఇది పోటీలో అసమానతల్ని సృష్టిస్తోందని, 14వ అధికరణం కింద రాజ్యాంగం నిర్దేశించిన సమానత్వ భావనకు విరుద్ధంగా ఉందని విన్నవించారు. అభ్యర్థి, అతణ్ని పోటీకి నిలిపిన పార్టీ చేసే వ్యయాల లక్ష్యం ఒకటే అయినా అభ్యర్థి వ్యయానికి పరిమితి విధించి పార్టీ వ్యయాన్ని వదిలేశారని అన్నారు.

ఉక్రెయిన్‌పైకి 420 డ్రోన్లు, 39 క్షిపణులు

- భీకర దాడులతో విరుచుకుపడ్డ రష్యా

కీవ్: ఉక్రెయిన్‌పై రష్యా దాడులు కొనసాగుతున్నాయి. రష్యా బలగాలు బుధవారం రాత్రి ఉక్రెయిన్‌లోని 8 ప్రాంతాలను లక్ష్యంగా చేసుకొని 420 డ్రోన్లు, 39 క్షిపణులతో విరుచుకుపడ్డాయి. వీటిలో 11 బాలిస్టిక్ క్షిపణులు కూడా ఉన్నాయి. ఈ దాడుల్లో పదుల సంఖ్యలో ఉక్రెయిన్‌వాసులు గాయపడ్డారు. వారిలో చిన్నారులూ ఉన్నారు. తమ దేశంపైకి దూసుకొచ్చిన 17 ఉక్రెయిన్ డ్రోన్లను బుధవారం రాత్రి కూల్చివేసినట్లు రష్యా రక్షణ శాఖ వెల్లడించింది. మరోవైపు- యుద్ధంలో మరణించిన దాదాపు 1,000 మంది ఉక్రెయిన్ సైనికుల మృతదేహాలను ఆ దేశానికి తాము అప్పగించామని రష్యా అధికారి వ్లాదిమిర్ మేదిన్‌స్కీ తాజాగా వెల్లడించారు. ఉక్రెయిన్ కూడా 35 మంది రష్యా సైనికుల మృతదేహాలను అప్పగించిందని తెలిపారు. ఈ అప్పగింత ఎప్పుడు జరిగిందనేది మాత్రం స్పష్టంగా పేర్కొనలేదు.

ఉక్రెయిన్ తరఫున 10 వేల మంది విదేశీ వాలంటీర్ల పోరాటం

తమ దేశంతో కొనసాగుతున్న యుద్ధంలో ఉక్రెయిన్ తరఫున 75 దేశాలకు చెందిన 10 వేల మందికి పైగా వాలంటీర్లు పోరాడుతున్నారని రష్యా ప్రభుత్వరంగ వార్తాసంస్థ 'టాస్' గురువారం ఓ కథనంలో పేర్కొంది. నెలనెలా దాదాపు 600 మంది కొత్త వ్యక్తులు (విదేశీయులు) కీవ్ తరఫున భూతల పోరాటంలో పాల్గొనేందుకు నమోదు చేసుకుంటున్నారని తెలిపింది.

✦ ఉక్రెయిన్ యుద్ధంలో రష్యా తరఫున పోరాడుతూ తమ దేశానికి చెందిన ఇద్దరు వ్యక్తులు ప్రాణాలు కోల్పోయారని దక్షిణాఫ్రికా విదేశాంగ మంత్రి రొనాల్డ్ లమోలా గురువారం తెలిపారు. రిక్రూట్‌మెంట్ పథకం పేరుతో మోసపోయి వారు రష్యాకు వెళ్లారని.. చివరకు మాస్కో తరఫున యుద్ధరంగంలో అడుగుపెట్టి ప్రాణాలు కోల్పోవాల్సి వచ్చిందని వివరించారు.



రష్యా దాడితో ఉక్రెయిన్‌లోని ఖర్కివ్‌లో ఓ ఇంటిని చుట్టుముట్టిన అగ్నికీలలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

జేఎన్‌యూలో ఘర్షణ

- విద్యార్థులకు, పోలీసులకు గాయాలు

దిల్లీ: దేశ రాజధానిలోని జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయంలో (జేఎన్‌యూ) గురువారం విద్యార్థులకు, పోలీసులకు మధ్య ఘర్షణ జరిగింది. ఈ ఘటనలో ఇరువురికీ గాయాలయ్యాయి. విద్యార్థి సంఘం పిలుపు మేరకు విశ్వవిద్యాలయ క్యాంపస్ నుంచి కేంద్ర విద్యాశాఖ కార్యాలయం వరకూ 'లాంగ్ మార్చ్' నిర్వహిస్తుండగా పోలీసులు ఆపేందుకు ప్రయత్నించడం ఉద్రిక్తతలకు దారితీసింది. యూజీసీ నిబంధనల అమలుకు సంబంధించిన ఒక పాడ్‌కాస్ట్‌పై విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ శాంతిశ్రీ ధూళిపూడి పండిత్ చేసిన వ్యాఖ్యలకు వ్యతిరేకంగా గత కొన్ని రోజులుగా విద్యార్థులు నిరసనలు నిర్వహిస్తున్నారు. జేఎన్‌యూ విద్యార్థి సంఘం నాయకుల్ని విశ్వవిద్యాలయం నుంచి తొలగించడం, ప్రతిపాదిత రోహిత్ చట్టం తదితర అంశాలపైనా విద్యార్థులు నిరసన తెలుపుతున్నారు. గురువారం నాటి పోలీసు చర్య కారణంగా పలువురు విద్యార్థులు గాయపడ్డారు. తామూ గాయాలపాలయ్యామని పోలీసులు చెబుతున్నారు. ప్రదర్శనకారులు తమపై కర్రలు, బూట్లు విసరడంతోపాటు భౌతిక దాడికి పాల్పడ్డారని ఆరోపిస్తున్నారు. పోలీసులు తమపై అతిగా బల ప్రయోగం చేశారని నిరసనకారులు తెలిపారు. జేఎన్‌యూ విద్యార్థి సంఘం అధ్యక్షురాలు అదితీ మిశ్ర, మాజీ అధ్యక్షుడు నితీశ్ కుమార్‌లతోపాటు పలువురిని పోలీసులు నిర్బంధించారు. విశ్వవిద్యాలయ క్యాంపస్ బయట ఎలాంటి నిరసన ప్రదర్శనకు అనుమతి ఇవ్వలేదని, విద్యార్థులు కావాలంటే విశ్వవిద్యాలయ ప్రాంగణంలో నిరసనలు చేపట్టవచ్చని వర్సిటీ యాజమాన్యం ప్రకటించినట్లు పోలీసులు పేర్కొన్నారు. అయినా సాయంత్రం 400 నుంచి 500 మంది వరకూ విద్యార్థులు విశ్వవిద్యాలయం గేటు వద్దకు చేరి విద్యాశాఖ కార్యాలయం దిశగా వెళ్లేందుకు ప్రయత్నించారని వెల్లడించారు.

అజిత్ పవార్ మృతిపై సమగ్ర దర్యాప్తు చేయండి

- రోహిత్ పవార్ డిమాండ్

పుణె: మహారాష్ట్ర మాజీ డిప్యూటీ సీఎం, దివంగత నేత అజిత్ పవార్ విమాన ప్రమాదంలో మరణించిన ఘటనపై సమగ్ర దర్యాప్తు జరపాలని ఎన్సీపీ(ఎస్పీ) ఎమ్మెల్యే రోహిత్ పవార్ గురువారం డిమాండ్ చేశారు. ప్రమాదానికి గురైన లియర్‌జెట్-45 విమానాన్ని నడిపిన వీఎస్ఆర్ వెంచర్స్ సంస్థపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని బారామతి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పౌర విమానయాన నియంత్రణ సంస్థ (డీజీసీఏ) ఇటీవల విడుదల చేసిన నివేదికలో వీఎస్ఆర్ వెంచర్స్ నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు పేర్కొందని, కాబట్టి ఆ సంస్థపై కేసు నమోదు చేయాలని వారు కోరారు. విమాన ప్రమాద వాస్తవాలను సభ ముందు పెట్టాలని మహారాష్ట్ర శాసనమండలి ఛైర్మన్ రామ్ శిందే రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించారు.

పగలంతా విద్యార్థులు.. పొద్దుగూకితే గురువులు!

ఈటీవీ భారత్: బిహార్‌లోని నలందా జిల్లాలో గల బిహార్ షరీఫ్ పట్టణానికి చెందిన ఓ ప్రయివేటు పాఠశాల విద్యార్థులు ఆదర్శప్రాయమైన ఆలోచనలతో సమాజ ప్రగతికి కొత్త బాటలు వేస్తున్నారు. రోజంతా తరగతులకు హాజరై పాఠాలు వినే సీనియర్ విద్యార్థులు సాయంత్రమైతే తామే గురువుల అవతారమెత్తి మురికివాడల పిల్లలకు చదువు చెబుతున్నారు. పట్టణంలోని ఖందక్‌పర్‌లో గల ఈ పాఠశాల ఆవరణే ఇందుకు వేదికగా మారుతోంది. పిల్లలు ఎవరూ నిరక్షరాస్యులుగా మిగిలిపోకూడదు అన్నదే తమ లక్ష్యమని ప్రిన్సిపల్ బాబు టి.థామస్ తెలిపారు. 2016లో ఓ చిరు ప్రయత్నంగా ప్రారంభించిన ఈ బోధనా ప్రక్రియ గత పదేళ్లలో ఉద్యమరూపం దాల్చి దాదాపు 800 మంది పేద కుటుంబాల పిల్లల తలరాతలు మారుస్తోంది. అంతకు మునుపు రోజంతా మట్టిలో ఆడుకొంటూ, తరచూ పోట్లాడుకొంటూ, దుర్భాషలు నేర్చుకొంటూ కాలం గడుపుతున్న పిల్లలంతా ఇప్పుడు సాయంత్రమైతే పలకలు, పుస్తకాలు పట్టుకొని సిద్ధమైపోతున్నారు. దాదాపు పందమంది సీనియర్ విద్యార్థులు ఈ బోధనా యజ్ఞంలో పాలుపంచుకొంటున్నారు. ఇక్కడ చదువుకునేందుకు వచ్చే పిల్లలకు వీరు తమ పుస్తకాలు ఇచ్చి, పాకెట్ మనీతో స్కూల్ బ్యాగుల వంటివి సమకూరుస్తున్నారు. క్రమంగా స్థానిక వైద్యులు, వ్యాపారులు, సామాజిక కార్యకర్తలు సైతం ఈ విద్యాయజ్ఞానికి సహకరించి తలో చేయి వేస్తున్నారు.



మురికివాడల పిల్లలతో విద్యార్థినులు

నేడు 'ప్రచండ్'లో రాష్ట్రపతి గగన విహారం



జైసల్మేర్, జంశెద్‌పుర్ : స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన తేలికపాటి యుద్ధ హెలికాప్టర్ (ఎల్‌సీహెచ్) 'ప్రచండ్'లో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము శుక్రవారం గగన విహారం చేయనున్నారు. ఇందుకోసం గురువారం సాయంత్రం ఆమె జైసల్మేర్‌కు చేరుకున్నారు. ఇక్కడి వైమానిక స్థావరాన్ని సందర్శించిన అనంతరం ప్రచండ్‌లో ముర్ము ప్రయాణించనున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఆ తరువాత భారత్- పాకిస్థాన్ సరిహద్దు సమీపంలోని పోఖ్రాన్‌లో వైమానిక దళం ఆధ్వర్యంలో 'వాయు శక్తి' పేరిట నిర్వహించనున్న విన్యాసాలను ఆమె వీక్షించనున్నారు. 'ప్రచండ్' స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన తొలి యుద్ధ హెలికాప్టర్. హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఏఎల్) దీన్ని తయారుచేసింది.

భగవద్గీత బోధనలతో యువతకు నూతన మార్గదర్శనం

భగవద్గీత బోధనలు నేటి యువతకు కొత్త మార్గాలు చూపి, వారి భవిష్యత్తును తీర్చిదిద్దుతాయని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము అన్నారు. ఝార్ఖండ్‌లోని కద్మా వద్ద శ్రీ జగన్నాథ ఆధ్యాత్మిక, సాంస్కృతిక చారిటబుల్ ట్రస్టు నిర్మాణానికి గురువారం ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. భగవద్గీత బోధనలు ఆత్మకు ఆహారం లాంటివన్నారు. "ఆధ్యాత్మిక బోధనలకు, మత సామరస్యానికి ఈ ప్రాంతం కేంద్రంగా నిలుస్తుంది. పేద విద్యార్థులకు విద్య, వసతిని కల్పిస్తుంద"ని ముర్ము చెప్పారు. ఇప్పుడు నిర్మించనున్న ఛారిటబుల్ ట్రస్టు 12వ శతాబ్దానికి చెందిన పూరీ ఆలయాన్ని పోలి ఉంటుందని దీని నిర్వాహక ట్రస్టీ ఎస్.కె.బెహెరా తెలిపారు. దాదాపు రూ.100 కోట్లతో ఖర్కాయి నది సమీపంలో 2.5 ఎకరాలలో దీన్ని నిర్మించనున్నట్లు వివరించారు. అనంతరం ముర్ము బరీడీహ్‌లోని మణిపాల్ టాటా వైద్య కళాశాల విద్యార్థులతో మాట్లాడారు. కళాశాల ఆవరణలో ఒక మొక్కను నాటారు.

సుప్రీంకోర్టు రిజిస్ట్రీని సంస్కరించకుంటే విధుల నిర్వహణలో నేను విఫలమైనట్లే: సీజేఐ

దిల్లీ: ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ)గా పదవీ విరమణ చేసేలోగా సుప్రీంకోర్టు రిజిస్ట్రీలో సంస్కరణలు తీసుకురాలేకపోతే విధుల నిర్వహణలో తాను విఫలమైనట్లేనని జస్టిస్ సూర్యకాంత్ పేర్కొన్నారు. యూపీ గ్యాంగ్‌స్టర్స్ యాక్ట్‌ను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై స్పందిస్తూ సీజేఐ ఈ విషయాన్ని పేర్కొన్నారు. సుప్రీంకోర్టులోని ఇతర ధర్మాసనాలు గతంలో తిరస్కరించినప్పటికీ మళ్లీ అదే వ్యాజ్యాన్ని తన ధర్మాసనం ముందుంచడంపై జస్టిస్ సూర్యకాంత్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదే అంశానికి సంబంధించి మరో పిటిషన్ సుప్రీంకోర్టులోనే ఇంకో ధర్మాసనం వద్ద విచారణలో ఉంది. కోర్టు రిజిస్ట్రీ అధికారుల నిర్లక్ష్యపూరిత చర్యగా కారణంగానే కేసుల లిస్టింగ్‌లో పొరపాట్లు జరుగుతున్నాయని సీజేఐ అభిప్రాయపడ్డారు. స్పష్టమైన ఆదేశాలిచ్చినా వారు పాటించడంలేదని మండిపడ్డారు. ఈ సమస్యను సరిచేయాల్సిన అవసరం ఉందని, పదవీ విరమణలోగా కోర్టు రిజిస్ట్రీని సంస్కరించేలా చర్యలు తీసుకుంటానని చెప్పారు. సీజేఐ ధర్మాసనంలో జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చి, జస్టిస్ విపుల్ ఎం పంచోలీ కూడా ఉన్నారు.

ఠాణాల్లో సీసీటీవీలపై కేంద్రీకృత డ్యాష్‌బోర్డు

- కసరత్తు సమావేశంలో పాల్గొనండి
- కేంద్ర ప్రభుత్వానికి సుప్రీం ఆదేశం



దిల్లీ: పోలీసు స్టేషన్లలో సీసీటీవీ కెమెరాల ఏర్పాటును ప్రామాణీకరించే కేంద్రీకృత డ్యాష్‌బోర్డు ఏర్పాటుపై నిర్వహించే సమావేశంలో పాల్గొనాల్సిందిగా సుప్రీంకోర్టు గురువారం కేంద్ర ప్రభుత్వాన్ని, ఇతరులను ఆదేశించింది. ఈ అంశంపై కోర్టుకు సహకారం అందిస్తున్న సీనియర్ న్యాయవాది సిద్ధార్థ దవే దాఖలు చేసిన అభ్యర్థన మేరకు జస్టిస్ విక్రంనాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం తాజా ఆదేశాలు జారీ చేసింది. కోర్టు జనవరి 29న వెలువరించిన ఆదేశాలకు అనుగుణంగా ఈనెల 21న ఒక సమావేశం జరిగిందని, ఇందులో కేంద్ర ప్రభుత్వం, దిల్లీ ప్రభుత్వం, కొన్ని ఇతర రాష్ట్రాలు పాల్గొనలేదని దవే కోర్టుకు తెలియజేశారు. "కేంద్ర ప్రభుత్వ న్యాయవాది ఇప్పటికే ఈ అంశంపై క్షమాపణ కోరారు. సమాచారం తెలియజేయడంలో జరిగిన పొరపాటు కారణంగా సమావేశంలో పాల్గొనలేకపోయినట్టు తెలిపారు" అని ధర్మాసనం పేర్కొంది. తదుపరి సమావేశంలో పూర్తి సహకారం అందిస్తామని కేంద్ర ప్రభుత్వ న్యాయవాది తెలిపారని ధర్మాసనం తెలిపింది. ఈ అంశంపై తదుపరి విచారణను వచ్చే నెల 23కు వాయిదా వేసింది.

'బహిరంగ జైళ్ల సిబ్బంది నియామకాలకు నిబంధనలు రూపొందించండి'

దిల్లీ: ఖైదీలను సంస్కరించడంతో పాటు విడుదలైన తర్వాత వారు సమాజంలోని ప్రజలతో కలిసిపోయేలా చేయడమే బహిరంగ జైళ్ల లక్ష్యమని సుప్రీంకోర్టు పేర్కొంది. సంస్కరణ కేంద్రాలైన బహిరంగ జైళ్లకు అర్హులైన సిబ్బందిని నియమించే విషయంలో ఇదే విషయాన్ని పరిగణనలోకి తీసుకోవాలని తెలిపింది. దీనికోసం అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు నిర్ణీత కాలవ్యవధితో కూడిన నిబంధనలను రూపొందించుకోవాలని జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతా ధర్మాసనం గురువారం ఆదేశించింది. ఖైదీల గౌరవ మర్యాదలకు జైళ్ల సిబ్బంది భంగంకలిగించరాదని పేర్కొంది. సిబ్బంది ఖాళీల భర్తీకి అనుసరించే విధానాలపై మూడు నెలల్లోగా పర్యవేక్షణ కమిటీలకు నివేదిక సమర్పించాలంటూ ఉత్తర్వులిచ్చింది. ఆ తర్వాత రెండు నెలల్లోగా సిబ్బంది ఖాళీలను భర్తీ చేయాలని తెలిపింది. జైళ్ల సామర్థ్యానికి మించి ఖైదీలను నిర్బంధించరాదంటూ దాఖలైన ప్రజాహిత వ్యాజ్యంపై విచారణ సందర్భంగా ధర్మాసనం ఈ ఆదేశాలిచ్చింది.

తప్పుడు ఫిర్యాదు చేస్తే ఏమవుతుందో అందరికీ తెలియాలి

- సుప్రీంకోర్టులో పిల్ దాఖలు

దిల్లీ: తప్పుడు ఫిర్యాదులు చేస్తే చట్టపరంగా ఎలాంటి పర్యవసానాలు ఎదుర్కోవాల్సి వస్తుందో తెలిపే బోర్డులను పోలీస్ స్టేషన్లు, కోర్టులు, పురపాలక కార్యాలయాలు వంటి ప్రదేశాల్లో అందరికీ కనిపించేలా ప్రదర్శించాలని కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై విచారణ జరిపేందుకు సుప్రీంకోర్టు గురువారం అంగీకరించింది. అత్యున్నత న్యాయస్థాన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్ మల్యా బాగ్చీల ధర్మాసనం దీనిపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు జారీ చేస్తూ ఏప్రిల్ 20లోగా సమాధానం చెప్పాలని ఆదేశించింది. న్యాయవాది అశ్వినీ ఉపాధ్యాయ ఈ వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. అత్యాచారం, లైంగిక వేధింపులు, ఎస్సీ-ఎస్టీ వేధింపుల నిరోధక చట్టాల కింద తప్పుడు ఫిర్యాదులు దాఖలు చేసే ప్రవృత్తి బాగా పెరిగిపోయిందని ఉపాధ్యాయ పేర్కొన్నారు.



సభా సమయం

జలవనరులశాఖ బడ్జెట్‌కు శాసనసభ ఆమోదం

ఈనాడు-అమరావతి: ఆంధ్రప్రదేశ్ శాసనసభ గురువారం జలవనరులశాఖకు బడ్జెట్ కేటాయింపులను ఆమోదించింది. జలవనరులపై చర్చ అనంతరం భారీ నీటిపారుదలకు రూ.17,373.95 కోట్లు, చిన్న నీటి వనరులకు రూ.870.76 కోట్లు కేటాయింపులకు ఆమోదం తెలియజేసింది.

సభ సజావుగా జరగనివ్వడంలేదు

- పంచుమర్తి అనురాధ, శాసనమండలి చీఫ్ విప్


అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అనురాధ. చిత్రంలో కూటమి ఎమ్మెల్సీలు

ఈనాడు, అమరావతి: 'బడ్జెట్ బ్రహ్మాండంగా ఉందని ప్రజలు మెచ్చుకుంటుంటే.. వైకాపా సభ్యులు గత కొద్దిరోజులుగా చర్చ జరగనివ్వడంలేదు' అని శాసనమండలి చీఫ్ విప్ పంచుమర్తి అనురాధ అన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్‌లో ఆమె మాట్లాడుతూ.. 'శాంతిభద్రతలు, వ్యవసాయంపై చర్చ జరగాల్సి ఉండగా.. సమయం అయిపోయిందని ఛైర్మన్ సభ వాయిదా వేశారు. తిరుపతి కల్తీ లడ్డూపైనా లఘు చర్చలో మంత్రి రామనారాయణరెడ్డి స్టేట్‌మెంట్ ఇవ్వడానికి వీల్లేదని అడ్డుకున్నారు. ప్రభుత్వాన్ని, మంత్రిని అవమానించేలా వైకాపా సభ్యుల ప్రవర్తన ఉంది. భాజపాలో సుదీర్ఘకాలం సేవలందించిన ఎమ్మెల్సీ సోము వీర్రాజుపై వైకాపా సభ్యులు దాడికి తెగబడడం సరికాదు' అని అన్నారు.

సభ సజావుగా నడిచేలా చూడు స్వామీ

- పీడీఎఫ్ ఎమ్మెల్సీ బొర్రా గోపీమూర్తి

ఈనాడు, అమరావతి: శాసన మండలిలో ప్రస్తుత పరిణామాలు చూస్తుంటే ప్రజల సమస్యలపై చర్చించే పరిస్థితులు కనిపించడం లేదని పీడీఎఫ్ ఎమ్మెల్సీ బొర్రా గోపీమూర్తి పేర్కొన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్‌లో గురువారం ఆయన మాట్లాడారు. 'మండలిలో అధికార, ప్రతిపక్ష ఎమ్మెల్సీల తీరు బాగోలేదు. ప్రజల సమస్యలను గాలికొదిలేశారు. నిర్దేశిత అంశాలపై చర్చించడం లేదు. లడ్డూలో కల్తీ నెయ్యి వ్యవహారం ఇప్పట్లో తేలే పరిస్థితి కనిపించడం లేదు. అధికార, ప్రతిపక్ష సభ్యుల కలలోకి వచ్చి ఇకనైనా సభ సజావుగా కొనసాగించేలా బుద్ధులు చెప్పాలని ఆ దేవదేవుడు వేంకటేశ్వరస్వామిని వేడుకుంటున్నా' అని వ్యాఖ్యానించారు.

జగన్‌కు దేవుడంటే భక్తి లేదు..

- మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

పులివెందులలో నందీశ్వర ఆలయంలో నూతన విగ్రహ ప్రతిష్ఠ, కుంభాభిషేక మహోత్సవాల్లో పాల్గొన్న మాజీ సీఎం జగన్ పూజారి ఇచ్చిన తీర్థం స్వీకరించకుండా వదిలేశారని మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్‌రాజు ఆరోపించారు. మీడియా పాయింట్‌లో ఆయన మాట్లాడారు. 'గోత్రనామాలు చెప్పకుండా అవహేళన చేశారు. అగ్నిగుండంలో వేయాల్సిన వస్తువుల్ని తిరిగి పూజారికి ఇచ్చారు. ఇవన్నీ చూస్తే దేవుడంటే జగన్‌కు భక్తి లేదని అర్థమవుతోంది. హిందుత్వాన్ని, హిందు మతాన్ని అడుగడుగునా హేళన చేస్తూ భక్తుల మనోభావాలను జగన్ దెబ్బతీశారు. ఇది మహాపాపం. కచ్చితంగా ఆ దేవదేవుడు శిక్షిస్తాడు. దేవుడిపై నమ్మకం లేనప్పుడు గుడికి ఎందుకు వెళ్లాలి' అని ప్రశ్నించారు.

క్రీడాకారులకు ఉద్యోగ అర్హతల్లో సడలింపులు పరిశీలిస్తున్నాం

- క్రీడల శాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి



పోలీస్, ఎక్సైజ్, అటవీ శాఖ ఉద్యోగాల రాతపరీక్షల్లో క్రీడాకారులకు 15 శాతం మార్కులు మినహాయింపునివ్వడంపై సీఎంతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. కూటమి ప్రభుత్వం ఉద్యోగాల్లో 3 శాతం క్రీడా కోటా అమలు చేస్తోందని, దీనివల్ల డీఎస్సీ పోస్టుల్లో 421 పోస్టులు ఆటల్లో నైపుణ్యం ఉన్నవారికి దక్కాయని తెలిపారు. రాతపరీక్షలతో సంబంధం లేకుండా, క్రీడా అర్హతను బట్టి ఈ అవకాశం కల్పించినట్లు చెప్పారు. ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ క్రీడాకారులు నిత్యం ఐదారు గంటలు ప్రాక్టీస్‌కు సమయం కేటాయిస్తారని, రాతపరీక్షల్లో ఇతర అభ్యర్థులతో పోటీపడలేరని తెలిపారు. వీరికి మార్కుల్లో మినహాయింపు ఇవ్వాలని కోరారు.

వైకాపా హయాంలో 'ఫ్రీ హోల్డ్'లో భారీగా అక్రమాలు

- పేదల నుంచి లాగేసుకున్న భూములను స్వాధీనం చేసుకోవాలి
- శాసనసభలో ఎసైన్డ్ భూముల సవరణ బిల్లుపై చర్చలో ఎమ్మెల్యేలు
- ఎసైన్డ్ భూముల్లో ఘోరాలపై త్వరలో నిర్ణయం: మంత్రి సత్యప్రసాద్



ఈనాడు, అమరావతి: వైకాపా హయాంలో 'ఫ్రీహోల్డ్'లో జరిగిన నేరాలు, ఘోరాలపై సమగ్ర విచారణ చేయించి, పేదల నుంచి ఆ పార్టీ నేతలు అక్రమంగా లాక్కున్న 13 లక్షల ఎకరాల భూములను స్వాధీనం చేసుకోవాలని ప్రభుత్వాన్ని కూటమి ఎమ్మెల్యేలు డిమాండ్ చేశారు. పేదలను మోసం చేసి తక్కువ ధరకు ఎసైన్డ్ భూములు సొంతం చేసుకున్నారని వారు ఆరోపించారు. ఆ భూములను రాష్ట్ర పునరుత్పాదక ఇంధన అభివృద్ధి సంస్థకు లీజుకు ఇవ్వడంపై అభ్యంతరం లేదని, వాటిలోని పేదలకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. శాసనసభలో గురువారం రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ప్రవేశపెట్టిన ఏపీ ఎసైన్డ్ భూముల సవరణ బిల్లుపై పలువురు ఎమ్మెల్యేలు మాట్లాడారు.

◆ 'గత ప్రభుత్వంలో ఎస్సీ, ఎస్టీ, బీసీల్లో పేదలు తీవ్రంగా మోసపోయారు. వీరి నుంచి తక్కువ ధరకు వైకాపా నేతలు ఎసైన్డ్ భూములను బలవంతంగా తీసుకుని... వాటిని ప్రైవేటు కంపెనీలకు ఎక్కువ ధరకు అమ్మేశారు. అలాంటివారిపై కేసులు నమోదుచేసి చర్యలు తీసుకోవాలి' అని ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి కోరారు. ◆ 'ఎసైన్డ్ భూముల చట్టాన్ని వైకాపా ప్రభుత్వం దుర్వినియోగం చేసింది. ఫ్రీహోల్డ్ పేరుతో పెద్దఎత్తున అక్రమాలు జరిగాయి. కొన్ని భూములను 22ఏలో చేర్చి ప్రజలను ఇబ్బంది పెట్టారు. అక్రమాలపై ప్రభుత్వం విచారణ చేయించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి' అని ఎమ్మెల్యే పార్థసారధి డిమాండ్ చేశారు. ◆ 'రాష్ట్రాభివృద్ధి దృష్ట్యా ఎసైన్డ్ భూములను రాష్ట్ర పునరుత్పాదక ఇంధన అభివృద్ధి సంస్థకు లీజుకు ఇవ్వడాన్ని సమర్థిస్తున్నాం. బాధిత రైతులకు పరిహారం అందించి ప్రభుత్వం న్యాయం చేయాలి. ఎసైన్డ్ రైతులకు పరిశ్రమల్లో ఉద్యోగ అవకాశం కల్పించాలి. సంస్థలోనూ వాటా ఇవ్వాలి' అని ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ ప్రభుత్వానికి సూచించారు. 'ఎసైన్డ్ భూములు ఎస్సీల నుంచి ఎస్సీలకు, ఎస్టీల నుంచి ఎస్టీలకే బదలాయించేలా చట్టసవరణ చేయాలి' అని ఎమ్మెల్యే కె.మురళీమోహనరావు ప్రభుత్వానికి విజ్ఞప్తిచేశారు.

ఎకరాకు ఏడాదికి రూ.31 వేల లీజు: మంత్రి

పునరుత్పాదక విద్యుత్తు ప్రాజెక్టులకు ఇచ్చే ఎసైన్డ్ భూములపై రైతులకు ఎకరాకు ఏడాదికి రూ.31వేల లీజు వచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని రెవెన్యూమంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. రెండేళ్లకోసారి లీజు 5% పెరుగుతుందన్నారు. భూములిచ్చేవారికి అదే పరిశ్రమల్లో ఉపాధి లభించేలా చూస్తామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 20 లక్షల ఎకరాల ఎసైన్డ్ భూములకు రికార్డులు సరిగా లేనట్లు గుర్తించామని తెలిపారు. దీనిపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటామన్నారు. మంత్రి ప్రవేశపెట్టిన సవరణ బిల్లును సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు.

అన్ని విభాగాల ఉద్యోగులకూ పదోన్నతులు

- గ్రామ, వార్డు స్వర్ణ కార్యాలయాలుగా పేరు మార్పు
- సవరణ బిల్లుపై చర్చలో మంత్రి స్వామి



ఈనాడు, అమరావతి: గ్రామ, వార్డు స్వర్ణ కార్యాలయాల్లో అన్ని విభాగాల ఉద్యోగులకు పదోన్నతులు కల్పిస్తామని రాష్ట్ర గ్రామ, వార్డు స్వర్ణశాఖ మంత్రి శ్రీబాల వీరాంజనేయస్వామి వెల్లడించారు. అర్హులైన వారందరికీ పదోన్నతులు ఇవ్వాలని సీఎం చంద్రబాబు నిర్ణయించారని ఆయన అన్నారు. గ్రామ, వార్డు కార్యాలయాల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందేలా కూటమి ప్రభుత్వం గత 19 నెలల్లో వ్యవస్థలో అనేక మార్పులు చేసిందని మంత్రి వివరించారు. గ్రామ, వార్డు సచివాలయాల పేరును గ్రామ, వార్డు స్వర్ణ కార్యాలయాలుగా మార్పునకు సంబంధించిన సవరణ బిల్లును శాసనసభలో గురువారం మంత్రి ప్రవేశపెట్టారు. ఈ సందర్భంలోనూ, బిల్లు ఆమోదం పొందాక మంత్రి సభలో మాట్లాడారు. 'స్వర్ణ కార్యాలయాల్లో ఉద్యోగుల విధులు, బాధ్యతలపై గందరగోళ పరిస్థితిని తొలగించాం. జిల్లా, మండల, మున్సిపల్ స్థాయిలో పర్యవేక్షణ వ్యవస్థను తీసుకొచ్చాం. జనాభాకి తగ్గట్టుగా కార్యాలయాలను వర్గీకరించాం. స్థలాభావంతో నగరాలు, పట్టణాల్లో ఒకే డివిజన్, వార్డుల్లో రెండు, మూడు కార్యాలయాలు ఉన్నాయి. స్థలం అందుబాటులోకి వచ్చాక విభజిస్తాం. గ్రామాల్లో అవసరాల దృష్ట్యా ఉద్యాన, మత్స్య, వెటర్నరీ కార్యదర్శుల పోస్టులను రేషనలైజేషన్ చేశాం' అని వివరించారు. 'ప్రజల అవసరాల మేరకు స్వర్ణ కార్యాలయాల్లో పోస్టులు భర్తీ చేయాలి. అర్హులైన ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలి' అని ఎమ్మెల్యేలు కాలవ శ్రీనివాసులు, గణబాబు అన్నారు.

ఎమ్మెల్యే సుందరపు తీరుపై స్పీకర్ అసహనం

వార్డు, గ్రామ సచివాలయాల పేరు మార్పునకు సంబంధించిన సవరణ బిల్లుపై చర్చ సందర్భంగా ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ పోలవరం ప్రాజెక్టుపై మాట్లాడే ప్రయత్నం చేయడంతో స్పీకర్ అయ్యన్నపాత్రుడు అసహనం వ్యక్తం చేశారు. 'సభలో ఏ అంశం గురించి చర్చ జరుగుతోంది.. వారేం మాట్లాడుతున్నారు? విప్ గారూ (గణబాబు) ఇదేం పద్ధతి' అని స్పీకర్ వ్యాఖ్యానించారు. పోలవరం ప్రాజెక్టు గురించి మాట్లాడమని తనకు చెప్పారని విజయ్‌కుమార్ సమాధానమిచ్చారు. 'గ్రామ, వార్డు సచివాలయాల గురించి చర్చ జరుగుతున్నది కదా?' అని స్పీకర్ మరోసారి గుర్తు చేశారు. దీంతో పొరబడిన విషయాన్ని ఎమ్మెల్యే గుర్తించారు.

పల్నాడు పులులం.. కామెడీ క్యారెక్టర్లు వేయం!

ఈనాడు, అమరావతి: ''మనం పల్నాటి పులులం.. కామెడీ క్యారెక్టర్లు వేస్తే ఇమేజ్ దెబ్బతింటుంది. వేస్తేగీస్తే పులుల్లాంటి క్యారెక్టర్లే వేయాలి' అని పల్నాడు ఎమ్మెల్యేలు నిర్ణయించుకున్నారు. ఈసారి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల సాంస్కృతిక కార్యక్రమాల్లో కామెడీ స్కిట్లు వేయబోమని తెగేసి చెప్పేశారు. దీంతో మార్చి 6న నిర్వహించనున్న సాంస్కృతిక కార్యక్రమాలకు నటుల్ని వెతికి పట్టుకోవడం సమన్వయకర్తగా వ్యవహరిస్తున్న ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులుకు కష్టంగా మారింది. ఇప్పటికే ఆయన తిరుమల శ్రీవారి దర్శనం సిఫారసు లేఖల కోసం ఎమ్మెల్యేలపై కార్యకర్తలు తెచ్చే ఒత్తిడి, అందరికీ సర్దుబాటు చేయలేక వారు సతమతమవడం వంటి అంశాల ఆధారంగా కొన్ని స్క్రిప్టులు సిద్ధం చేసుకున్నారు. గతేడాది నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో సభ్యులు ప్రదర్శించిన స్కిట్లు విశేషంగా ఆకట్టుకోవడంతో ఈసారి అంచనాలు పెరిగాయి. గతేడాది ఆంజనేయులు ఎమ్మెల్యేగా, మాచర్ల, నరసరావుపేట ఎమ్మెల్యేలు జూలకంటి బ్రహ్మారెడ్డి, చదలవాడ అరవిందబాబు పార్టీ కార్యకర్తలుగా నటించిన స్కిట్ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సహా అందర్నీ కడుపుబ్బ నవ్వించింది. ఆ వీడియోని యూట్యూబ్ వంటి సామాజిక మాధ్యమాల్లో లక్షల మంది వీక్షించారు. అవి విశేష ఆదరణ పొందినా.. అలాంటి కామెడీ క్యారెక్టర్లలో నటించేందుకు ఈసారి ఎమ్మెల్యేలు ససేమిరా అంటున్నారు.

వైకాపా పాలనలో నీటిపారుదల వ్యవస్థ అస్తవ్యస్తం

- జలవనరులశాఖ పద్దుపై చర్చలో ధ్వజమెత్తిన కూటమి ఎమ్మెల్యేలు

ఈనాడు, అమరావతి: నీటిపారుదల రంగాన్ని వైకాపా ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని కూటమి ఎమ్మెల్యేలు ధ్వజమెత్తారు. ప్రాజెక్టుల నిర్వహణకు నిధులివ్వకపోగా.. వరదలకు కొట్టుకుపోయిన ప్రాజెక్టులను పట్టించుకోకుండా గాలికి వదిలేశారని జగన్‌పై మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం 19 నెలల్లో ఈ రంగాన్ని గాడిలో పెట్టడంతోపాటు పోలవరం ప్రాజెక్టు పనులు 80% పూర్తిచేసిందని అన్నారు. శాసనసభలో గురువారం జలవనరులశాఖ పద్దుపై చర్చ సందర్భంగా పలువురు తెదేపా, జనసేన, భాజపా ఎమ్మెల్యేలు మాట్లాడారు.

రాయలసీమ ద్రోహి జగన్: భూమా అఖిలప్రియ

'పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుతో రాయలసీమ ప్రజలకు అన్యాయం జరుగుతుందని చెప్పిన జగన్.. పెద్దిరెడ్డికి చెందిన పీఎల్ఆర్ కంపెనీ ద్వారా అదే ప్రాజెక్టు పనులకు టెండర్లు వేయించి వచ్చేలా చేశారు. రాయలసీమ ద్రోహి అంటే జగన్‌మోహన్‌రెడ్డి, వైకాపాయే.'

అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకుపోతే పట్టించుకోలేదు: జ్యోతుల నెహ్రూ

'అన్నమయ్య ప్రాజెక్టు వరదలకు కొట్టుకుపోతే వైకాపా ప్రభుత్వంలో పట్టించుకోలేదు. ఇదేం పరిపాలన? కూటమి ప్రభుత్వం నీటిపారుదల వ్యవస్థను ముందుకు తీసుకెళ్లడంతో రైతుల్లో నమ్మకం ఏర్పడుతోంది. పోలవరం ప్రాజెక్టు పనులు పరుగులు పెట్టిస్తున్నారు.'

నీటిపారుదలకు రూ.18 వేల కోట్ల కేటాయింపు అభినందనీయం: కామినేని శ్రీనివాస్

'నీటిపారుదల రంగానికి ప్రాధాన్యమిచ్చి కూటమి ప్రభుత్వం పెండింగ్‌లోని అనేక పనులు చేయిస్తోంది. రాష్ట్ర బడ్జెట్‌లో ఈ రంగానికి రూ.18 వేల కోట్లు కేటాయించడం అభినందనీయం.'

శారదా నది ఆధునికీకరణకు నిపుణుల బృందాన్ని పంపాలి: సుందరపు విజయకుమార్

'పోలవరం ప్రాజెక్టు నుంచి వచ్చే సాగునీరు వృథా కాకుండా శారదా నది అభివృద్ధికి నిపుణుల బృందాన్ని పంపాలి. నది ఆధునికీకరణ పనులు చేపట్టకపోతే 83 వేల క్యూసెక్కుల నీరు ఏటా సముద్రంలోకి కలిసిపోయే అవకాశం ఉంది.'

అసమర్థ పాలనకు గత ప్రభుత్వమే నిదర్శనం: వరుపుల సత్యప్రభ

'అసమర్థ నేత పాలకుడైతే రాష్ట్ర పరిస్థితి ఎంత దారుణంగా ఉంటుందో వైకాపా పాలనలో చూశాం. సమర్థుడైన పాలకుడు ఉంటే రాష్ట్రం ఎలా అభివృద్ధి చెందుతుందో చూస్తున్నాం. 80%కి పైగా నిర్మాణం పూర్తయిన పోలవరం ప్రాజెక్టే ఇందుకు నిదర్శనం.'

రాష్ట్రానికి అప్పులిచ్చే స్థాయికి రాయలసీమ ఎదగనుంది: జేసీ అస్మిత్‌రెడ్డి

'హార్టికల్చర్, నీటిపారుదల హబ్‌ల కారణంగా రాష్ట్రానికి అప్పులిచ్చే స్థాయికి రాయలసీమ ఎదగనుంది. కరవు ప్రదేశాన్ని పచ్చని ప్రాంతంగా ఈ ప్రభుత్వం మారుస్తోంది. చెరువులు, రిజర్వాయర్లను నీళ్లతో నింపేస్తున్నారు.'

కాలువల నిర్వహణనూ గాలికొదిలేశారు: భాష్యం ప్రవీణ్

'వైకాపా ప్రభుత్వం కాలువల నిర్వహణను గాలికి వదిలేసింది. నీటిపారుదల రంగానికి బడ్జెట్‌లో రూ.18 వేల కోట్లు కేటాయించడం రైతుల పట్ల కూటమి ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనం. పెదకూరపాడులో సాగునీటి రంగం అభివృద్ధికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యమివ్వాలి.'

పనులు పూర్తిచేయకపోతే నియోజకవర్గాల్లో తిరగలేం: ఆదినారాయణరెడ్డి

'వైకాపా ప్రభుత్వం నీటిపారుదల రంగాన్ని నిర్లక్ష్యం చేసింది. ప్రాజెక్టు నిర్వహణకు నిధులు కేటాయించలేదు. కూటమి ప్రభుత్వంలోనూ చేయాల్సిన పనులు చేయకపోతే నియోజకవర్గాల్లో తిరగలేని పరిస్థితి వస్తుంది. నీటిపారుదల రంగానికి కేంద్రం ఇచ్చే నిధులు వినియోగించుకోవాలి.'

రూ.18వేల కోట్ల బకాయిలు పెట్టి వెళ్లారు: ప్రత్తిపాటి పుల్లారావు

'వైకాపా ప్రభుత్వం నీటిపారుదల వ్యవస్థను భ్రష్టుపట్టించింది. రూ.18వేల కోట్ల బకాయిలు పెట్టి వెళ్లిపోయారు. పోలవరం ప్రాజెక్టును నిర్లక్ష్యం చేశారు. నా నియోజవర్గంలో వైకుంఠపురం-నకిరేకల్ పనులు రూ.6వేల కోట్లతో పూర్తి చేయాలి. మాజీ స్పీకర్ కోడెల హయాంలో పనులకు శంకుస్థాపన చేశారు.'

పారిశ్రామికవేత్తలకు 20 నెలల్లో.. రూ.2 వేల కోట్ల ప్రోత్సాహకాలు ఇచ్చాం

- పరిశ్రమలశాఖ మంత్రి టీజీ భరత్



ఈనాడు, అమరావతి: వైకాపా ప్రభుత్వం ఐదేళ్లలో పారిశ్రామికవేత్తలకు రూ.2 వేల కోట్ల ప్రోత్సాహకాలిస్తే, కూటమి ప్రభుత్వం 20 నెలల్లోనే రూ.2 వేల కోట్లకు పైగా ప్రోత్సాహకాలు విడుదల చేసినట్లు పరిశ్రమలశాఖ మంత్రి టీజీ భరత్ తెలిపారు. ఇందులో ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలకు రూ.270 కోట్లు ఇచ్చామన్నారు. శాసనసభలో గురువారం ప్రశ్నోత్తరాల్లో ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలకు అవకాశాలపై ఎమ్మెల్యేలు అయితాబత్తుల ఆనందరావు, విజయ్‌చంద్ర, కొండ్రు మురళీమోహన్ అడిగిన ప్రశ్నలకు మంత్రి బదులిచ్చారు. 'రాయితీల విషయంలో ఎస్క్రో ఎకౌంట్ మెకానిజం తెచ్చి, దానికి చట్టం చేయాలని యోచిస్తున్నాం. ఎవరి జోక్యమూ లేకుండా నేరుగా పారిశ్రామికవేత్తల ఖాతాల్లోనే ప్రోత్సాహకాలు జమయ్యేలా చూస్తున్నాం. టెండర్లలో ఎస్సీ, ఎస్టీలకు 4 శాతం రిజర్వేషన్ వర్తింపజేస్తున్నాం. కేంద్ర పథకాలన్నీ వాడుకునేలా రూ.100 కోట్ల కార్పస్ ఫండ్ ఏర్పాటు చేయబోతున్నాం. దీనివల్ల 5 వేల ఎంఎస్ఎంఈలకు ప్రయోజనం కలగనుంద'ని మంత్రి తెలిపారు. అంతకుముందు ఎమ్మెల్యేలు మాట్లాడుతూ ఎంఎస్ఎంఈ పార్కుల్లోని భూములకు గరిష్ఠంగా రూ.25 లక్షల వరకే రాయితీ ఉందని, దాన్ని రూ.50 లక్షలకు పెంచాలని కోరారు.

భూయజమాని సంతృప్తి చెందేలా రీసర్వే

- రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్

జగన్ ప్రభుత్వం రూ.700 కోట్లు వెచ్చించి సరిహద్దు రాళ్లు పాతడంపై చూపిన శ్రద్ధ.. భూముల రీసర్వేపై చూపించలేదని రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ విమర్శించారు. కూటమి ప్రభుత్వం అన్ని సమస్యలు పరిష్కరించేలా, అందరికీ ఆమోదయోగ్యంగా రీసర్వే చేస్తున్నట్లు చెప్పారు. పట్టాదారు పాసు పుస్తకాల జారీపై నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్ అడిగిన ప్రశ్నకు మంత్రి సత్యప్రసాద్ బదులిచ్చారు. 'కేంద్రం 2016లో డిజిటల్ ఇండియా ల్యాండ్ రికార్డ్స్ మోడ్రనైజేషన్ ప్రోగ్రాం ఆరంభించింది. అందులో భాగంగా అప్పటి తెదేపా ప్రభుత్వం సమగ్ర సర్వే కోసం 2018 సెప్టెంబరులో జీవో ఇచ్చింది. భూధార్‌లో వివరాలు మార్చేందుకు వీలుగా 2019 ఫిబ్రవరిలో గెజిట్ విడుదల చేసింది. టెండర్ల ప్రక్రియ అప్పుడే పూర్తయ్యింది. వైకాపా ప్రభుత్వంలో తొలి నాలుగేళ్లు దీన్ని పట్టించుకోకుండా, చివరి ఏడాదిలో హడావిడి చేశార'ని విమర్శించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రీసర్వే కోసం గ్రామసభలు, రెవెన్యూ సదస్సులు పెట్టి, లక్షల సంఖ్యలో అర్జీలను పరిష్కరిస్తున్నామని మంత్రి వివరించారు. 'ఇప్పటికే 6,688 గ్రామాల్లో, 86.44 లక్షల ఎకరాల్లో రీసర్వే పూర్తయింది. 19.93 లక్షల పట్టాదారు పాస్‌పుస్తకాలు జారీచేశాం. 14 అంశాలను 223 రోజుల గడువుతో, భూయజమాని సంతృప్తి చెందేలా రీసర్వే చేస్తున్నాం' అని తెలిపారు.

అనర్హుల ఇళ్ల పట్టాలు రద్దుచేస్తాం

- గృహనిర్మాణశాఖ మంత్రి పార్థసారథి



గత ప్రభుత్వంలో ఇళ్లపట్టాల జారీలో అక్రమాలకు పాల్పడ్డారని, నేతలు తమకు నచ్చిన వారికి పట్టాలు ఇచ్చిన వైనంపై విచారణ జరిపించి, అనర్హుల పట్టాలను రద్దు చేస్తామని గృహనిర్మాణ శాఖ మంత్రి పార్థసారథి తెలిపారు. కొన్నిచోట్ల రైతుల నుంచి భూములు కొనుగోలు చేయకముందే, పట్టాలిచ్చేశారని పేర్కొన్నారు. అలాంటి వారికి పట్టణాల్లో 2 సెంట్లు, గ్రామాల్లో 3 సెంట్లు చొప్పున ఇళ్ల స్థలాలు అందజేస్తామని చెప్పారు. కాకినాడ గ్రామీణ ఎమ్మెల్యే పంతం వెంకటేశ్వరరావు పీఎంఏవైపై అడిగిన ప్రశ్నకు మంత్రి పార్థసారథి జవాబిచ్చారు. 'పట్టా ఒకరికిస్తే, అక్కడ వేరొకరు ఇళ్లు నిర్మించుకున్నవి చాలాచోట్ల ఉన్నాయి. ఇద్దరినీ కూర్చోబెట్టి సమస్యలు పరిష్కరించేలా చూస్తాం. ఇందులో అధికారుల నిర్లక్ష్యముంటే వారిపైనా చర్యలు తీసుకుంటామ'ని స్పష్టంచేశారు. అంతకుముందు ఎమ్మెల్యే వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కాకినాడలో గత ప్రభుత్వంలో ఇళ్ల పట్టాల జారీలో అక్రమాలకు పాల్పడ్డారని, ఎన్నికల ముందు నేతలే నకిలీ పట్టాలు ఇచ్చేశారని పేర్కొన్నారు.

రూ.444.75 కోట్లతో బుడగట్లపాలెం ఫిషింగ్ హార్బర్

- పెట్టుబడుల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి



శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల నియోజకవర్గంలోని బుడగట్లపాలెంలో ఫిషింగ్ హార్బర్ నిర్మాణానికి రూ.444.75 కోట్ల సవరించిన అంచనాలతో ప్రతిపాదనలు ఆర్థిక శాఖకు పంపామని, అక్కడి నుంచి ఆమోదం రాగానే టెండర్లు పిలిచి, పనులు చేపట్టనున్నట్లు మౌలిక సదుపాయాలు, పెట్టుబడుల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి తెలిపారు. ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు మాట్లాడుతూ ఫిషింగ్ హార్బర్ నిర్మిస్తే 5 వేల మందికి ప్రత్యక్షంగా, 10 వేల మందికి పరోక్షంగా ఉపాధి లభిస్తుందని తెలిపారు. నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి మాట్లాడుతూ చింతపల్లిలో ఫిష్ ల్యాండింగ్ సెంటర్ నిర్మాణం ఏమైందని ప్రశ్నించారు. దీనికి టెండర్లు పిలిచామని, త్వరలోనే వాటిని తెరవనున్నట్లు మంత్రి జనార్దన్‌రెడ్డి తెలిపారు.

70 వేల కి.మీ. కాల్వల నిర్మాణం

- మంత్రి నాదెండ్ల మనోహర్



రాష్ట్రమంతటా అన్ని పంచాయతీల్లో 70 వేల కి.మీ. అంతర్గత రహదారులు ఉన్నాయని, వీటి పక్కన కాల్వల నిర్మాణం పూర్తి చేస్తామని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. ఇప్పటికే 13,351 పంచాయతీల్లో 39,082 కి.మీ. మేర కాల్వలు నిర్మించినట్లు చెప్పారు. మురుగు కాల్వల్లో పూడిక తీయించే బాధ్యత గ్రామపంచాయతీలకు కూడా ఉంటుందని పేర్కొన్నారు. పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ తన నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో డ్రైనేజీ వ్యవస్థను సరిచేయాలని కోరారు.

పాఠశాల స్థలాన్ని వైకాపా నేతలు కబ్జా చేశారు

- తెదేపా కేంద్ర కార్యాలయంలో ఫిర్యాదు


ఈనాడు, అమరావతి: ప్రభుత్వ పాఠశాల కోసం దానం చేసిన భూమిని స్థానిక వైకాపా నేతలు ఆక్రమించారని, దీని గురించి అధికారులకు ఎన్ని సార్లు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని శ్రీసత్యసాయి జిల్లా నల్లచెరువు మండలం పూలకుంటపల్లికి చెందిన సూర్యనారాయణ వాపోయారు. ఈ మేరకు మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో గురువారం ఆయన ఫిర్యాదు చేశారు. వివిధ సమస్యలతో వచ్చిన బాధితుల నుంచి యాదవ్ అభివృద్ధి, సంక్షేమ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహయాదవ్, శ్రీకాకుళం డీసీఎంఎస్ ఛైర్మన్ అవినాష్‌చౌదరి వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. భూ సమస్యను తేల్చకుండా వేధిస్తున్న వీఆర్వోపై చర్యలు తీసుకోవాలని బాపట్ల జిల్లా చీరాల మండలం దేవాంగపురికి చెందిన సుందరరావు ఫిర్యాదు చేశారు. వైకాపా హయాంలో నిర్వహించిన భూముల రీసర్వేలో తన భూమిని తక్కువగా చూపించారని, మిగిలిన దాన్ని ప్రభుత్వ భూమిగా నమోదు చేశారని పల్నాడు జిల్లా క్రోసూరు మండలం దొడ్లేరుకు చెందిన సీతారామిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.

సెకి నుంచి 300 మెగావాట్ల విద్యుత్తు కొనుగోలుకు అనుమతి

ఈనాడు, అమరావతి: కనెక్టివిటీ అందుబాటులోకి వచ్చిన తర్వాత 2021 డిసెంబరులో కుదిరిన ఒప్పందం ప్రకారం సెకి (సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) నుంచి 300 మెగావాట్ల విద్యుత్తు కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం విద్యుత్తు సంస్థలకు అనుమతిచ్చింది. ఏపీ పవర్ కోఆర్డినేషన్ కమిటీ (ఏపీపీసీసీ) సభ్య కన్వీనర్ అభ్యర్థన మేరకు ఈ నిర్ణయం తీసుకుంది. ప్రస్తుత ఒప్పందాల ప్రకారమే కొనుగోలు చేయాలని, ఎలాంటి ఇంటర్‌స్టేట్ ట్రాన్స్‌మిషన్ ఛార్జీలు, నష్టాలు లేకుండా సరఫరా జరగాలని స్పష్టం చేసింది. ఏపీపీసీసీ, విద్యుత్తు పంపిణీ సంస్థల ఛైర్మన్, ఎండీలు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశిస్తూ ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి విజయానంద్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

వీఎంఆర్‌డీఏ ప్రాజెక్టులను త్వరగా పూర్తిచేయాలి

- అధికారులకు మంత్రి నారాయణ ఆదేశం



ఈనాడు, అమరావతి: విశాఖపట్నం మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ (వీఎంఆర్‌డీఏ) చేపట్టే అభివృద్ధి ప్రాజెక్టుల పనులను త్వరితగతిన పూర్తిచేయాలని మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ అధికారులను ఆదేశించారు. వీఎంఆర్‌డీఏ మాస్టర్‌ప్లాన్‌ను త్వరగా విడుదల చేయాలని సూచించారు. సచివాలయంలో వీఎంఆర్‌డీఏ అధికారులతో ఆయన సమీక్షించారు. వీఎంఆర్‌డీఏకు మొదటిసారి మాస్టర్‌ప్లాన్‌ను ఖరగ్‌పూర్ ఐఐటీ చేత ప్రభుత్వం రూపొందిస్తోందని వెల్లడించారు. విశాఖపట్నం-కాకినాడ పెట్రోలియం కెమికల్ అండ్ పెట్రో కెమికల్ అండ్ పెట్రోకెమికల్ ఇన్వెస్ట్‌మెంట్ రీజియన్ (వీకే పీసీపీఐఆర్) మాస్టర్‌ప్లాన్‌ను కూడా సిద్ధం చేయాలని ఆదేశించారు. విశాఖ నుంచి భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం వరకు టెండర్లు పిలిచిన ఏడు రోడ్ల నిర్మాణాన్ని నిర్దేశిత గడువులోగా పూర్తిచేయాలన్నారు. భోగాపురం నుంచి అనకాపల్లి జిల్లా రాంబిల్లి వరకు విశాఖపట్నం సెమీ రింగ్ రోడ్డు అంశంపై చర్చించారు. వీఎంఆర్‌డీఏ ఆధ్వర్యంలో పబ్లిక్-ప్రైవేట్ భాగస్వామ్యంతో చేపడుతున్న ఆరు ప్రాజెక్టులను అధికారులు మంత్రికి వివరించారు. నియోజకవర్గాల్లో చేపడుతున్న ఇంజినీరింగ్ పనులు, విశాఖ ఎకనమిక్ రీజియన్ పరిధిలోని ప్రాజెక్టులు, కైలాసగిరి మాస్టర్‌ప్లాన్‌పై చర్చించారు. ఈ సమావేశంలో మున్సిపల్ శాఖ కార్యదర్శి సురేష్‌కుమార్, డైరెక్టర్ సంపత్‌కుమార్, వీఎంఆర్‌డీఏ కమిషనర్ తేజ్‌భరత్, పట్టణ ప్రణాళిక విభాగం సంచాలకులు విద్యుల్లత పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రుల్లో అల్ట్రాసౌండ్ స్కానర్లు

- ఏర్పాటు చేసిన సంస్థలను అభినందించిన మంత్రి సత్యకుమార్ యాదవ్

ఈనాడు, అమరావతి: ప్రభుత్వ ఆసుపత్రుల్లో రూ.1.15 కోట్ల విలువైన ఐదు అల్ట్రాసౌండ్ స్కానర్లు ఏర్పాటు చేసిన డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్, గ్లాండ్ ఫార్మా ప్రతినిధులను వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అభినందించారు. ఆయా సంస్థల ప్రతినిధులు రాష్ట్ర సచివాలయంలో మంత్రిని గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. శ్రీకాకుళం జిల్లా కొత్తూరు, పలాస, ఇచ్ఛాపురం సీహెచ్‌సీల్లో ఒక్కొక్కటి చొప్పున, నరసన్నపేట ప్రాంతీయ ఆసుపత్రిలో రెండు చొప్పున అల్ట్రాసౌండ్ స్కానర్లు సీఎస్ఆర్ కింద ఏర్పాటు చేసినట్లు వివరించారు. డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్ డైరెక్టర్ శ్రీనివాస్, గ్లాండ్ ఫార్మా జీఎం గణేష్‌కుమార్‌లను మంత్రి సత్కరించారు.

నూతలపాటి నాగభూషణంకు నివాళి

ఈనాడు, అమరావతి: గుండెపోటుతో మరణించిన తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నూతలపాటి నాగభూషణానికి తెదేపా నేతలు నివాళి అర్పించారు. మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో గురువారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. పార్టీకి ఆయన చేసిన సేవల్ని గుర్తుచేసుకున్నారు.

రంపచోడవరం పరిధిలో పెద్దపులి సంచారం

- పెద్దకొండ గ్రామంలో ఆవు, దూడలపై దాడి


గాయపడిన ఆవు, దూడలకు చికిత్స చేస్తున్న వైద్య సిబ్బంది

రంపచోడవరం, న్యూస్‌టుడే: పోలవరం జిల్లా రంపచోడవరం మండలం పెద్దకొండ గ్రామంలో పెద్దపులి దాడిలో ఆవు, దూడలకు తీవ్ర గాయాలయ్యాయి. ఇటీవల రాజమహేంద్రవరం సమీపంలో చిక్కిన పెద్ద పులిని పాపికొండల అభయారణ్యంలో అటవీ అధికారులు విడిచిపెట్టారు. తిరిగి అది రంపచోడవరం మండలంలోని కాకవాడ, పెదగెద్దాడ, చెరువుపాలెం మీదుగా రంప, మర్రివాడ, పెద్దకొండ గ్రామాల్లో సంచరిస్తోంది. గురువారం తెల్లవారుజామున పెద్దకొండలో పులి గాండ్రింపులకు గిరిజనులు భయాందోళన చెందారు. ఆ సమయంలో అక్కడికి సమీపంలో ఉన్న ఆవు, దూడలపై పులి దాడి చేసింది. వెటర్నరీ ఏడీ డాక్టర్ పడాల బాబూరావు సిబ్బందితో వచ్చి గాయపడిన పశువులకు వైద్యం అందించారు. పెద్దకొండ గ్రామ సమీపంలో పులి సంచరిస్తున్నందున స్థానికులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

3 జిల్లాలోని 37 మండలాలకు 50 అదనపు పనిదినాలు

కేంద్రమంత్రి పెమ్మసాని వెల్లడి



ఈనాడు, దిల్లీ: వర్షాభావ పరిస్థితుల కారణంగా 2025 ఖరీఫ్‌లో రాష్ట్రప్రభుత్వం కరవు ప్రాంతాలుగా ప్రకటించిన అన్నమయ్య, శ్రీసత్యసాయి, ప్రకాశం జిల్లాల్లోని 37 మండలాల్లో ఉపాధిహామీ పథకం కింద 2025-26 ఆర్థిక సంవత్సరంలో 50 రోజుల అదనపు పనిదినాలు కల్పించనున్నట్లు కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ వెల్లడించారు. ఈ మేరకు కేంద్రం జారీచేసిన ఉత్తర్వుల ప్రతులను ఆయన ఎక్స్‌లో పోస్ట్‌చేశారు. గ్రామీణ పేదల సంక్షేమానికి కట్టుబడి ఈ అదనపు ప్రయోజనం కలిగించినందుకు ఆయన ప్రధానమంత్రి నరేంద్రమోదీ, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌లకు ధన్యవాదాలు తెలిపారు.



'అండర్ రోడ్'ట్యాంక్..!

సాధారణంగా ఓవర్ హెడ్ ట్యాంక్ అని వింటాం. మరి అండర్ రోడ్ ట్యాంక్ ఏంటనేగా మీ సందేహం. తెలంగాణలోని యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం కడపగండి తండాలో అధికారులు నిర్లక్ష్యంతో అలానే నిర్మించారు. 2016లో తండాలోని ఓ వీధి మధ్యలో నీటి ట్యాంకు నిర్మించారు. ఆ తరువాత 2023 ఏప్రిల్‌లో ఆ వీధికి సీసీ రోడ్డు మంజూరైంది. అధికారులు ప్రత్యామ్నాయం ఆలోచించకుండా.. ట్యాంకు మధ్య నుంచే వేసుకుంటూ వెళ్లిపోయారు. పక్కనే ఉన్న పంపును కూడా రోడ్డులో కలిపేశారు. గతంలో రోడ్డు లేకపోవడంలో ట్యాంకు నిర్మించారని, ఆ తరువాత అదే మార్గంలో సీసీ రోడ్డు మంజూరు కావడంతో వేయాల్సి వచ్చిందని పంచాయతీ కార్యదర్శి షేక్ పర్వీన్ తెలిపారు.

– న్యూస్‌టుడే, సంస్థాన్ నారాయణపురం

గోదావరి పుష్కరాల పనులన్నీ ఇప్పట్నుంచే ఆరంభించాలి

- సాధారణ ధరలకే టెంట్‌సిటీలు, హోమ్ స్టేలలో వసతి లభించాలి
- జూన్‌లో పుష్కరాల కర్టెన్‌రైజర్ కార్యక్రమం
- మంత్రివర్గ ఉపసంఘం సమావేశంలో మంత్రులు



గోదావరి పుష్కరాలపై మంత్రి వర్గ ఉపసంఘం భేటీలో మాట్లాడుతున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి. చిత్రంలో నిమ్మల రామానాయుడు, గొట్టిపాటి రవికుమార్, బీసీ జనార్దన్‌రెడ్డి, కందుల దుర్గేష్, మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, నారాయణ

ఈనాడు, అమరావతి: వచ్చే ఏడాది జరగనున్న గోదావరి పుష్కరాల పనులన్నీ ఇప్పట్నుంచే ఆరంభించాలని, దీనికోసం శాఖల వారీగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మంత్రులు పేర్కొన్నారు. ముందస్తు ఏర్పాట్ల కోసం బడ్జెట్‌లో రూ.60 కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు. గోదావరి పుష్కరాలపై ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం గురువారం సచివాలయంలో భేటీ అయింది. దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో మంత్రులు నారాయణ, నిమ్మల రామానాయుడు, కందుల దుర్గేష్, బీసీ జనార్దన్‌రెడ్డి, సత్యకుమార్ యాదవ్, గొట్టిపాటి రవికుమార్, మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు. పలు అంశాలపై చర్చించి, నిర్ణయాలు తీసుకున్నారు.

రెండుచోట్ల టెంట్ సిటీలు

✦ రాజమహేంద్రవరం సమీపంలోని బ్రిడ్జిలంక, పిచ్చుకలంకల్లో టెంట్ సిటీలు

✦ సాధారణ ధరలకే టెంట్ సిటీలు, హోమ్ స్టేల్లో వసతి

✦ పుష్కరాలు జరిగే ప్రాంతాల్లో ప్రస్తుతం 4,800 గదులున్నాయి. ఇంకా వసతి కోసం ఖాళీ ప్రదేశాలు, మైదానాలు, ఫంక్షన్ హాళ్లు పరిశీలించాలి.

✦ గతంలో 234 ఘాట్లు ఉండగా, ఈ సంఖ్యను 373 ఘాట్లకు పెంచాలి. 70 పిండప్రదాన ఘాట్ల ఏర్పాటు.

✦ 10కోట్ల మంది వస్తారని అంచనా. తొలిరోజు, వారాంతం, అమావాస్య రోజుల్లో.. సగటున కోటి మంది చొప్పున వస్తారు.

✦ ఏ ఘాట్‌లో స్నానం చేసినా, ఒకేలా పుణ్యఫలం వస్తుందంటూ.. ప్రభుత్వ సలహాదారు చాగంటి కోటేశ్వరరావుతో ప్రజల్లో అవగాహన కల్పిస్తే బాగుంటుంది.

✦ రద్దీ నియంత్రణకు ఏఐ టెక్నాలజీ వినియోగించాలి. ఆర్టీజీఎస్‌తో సమన్వయం చేసుకోవాలి.

రాజమహేంద్రవరంలో కర్టెన్‌రైజర్

✦ పుష్కరాలకు ఏడాది ముందుగా ఈ జూన్‌లో కర్టెన్ రైజర్ కార్యక్రమాన్ని రాజమహేంద్రవరంలో భారీగా నిర్వహించాలి.

✦ 3వేల కి.మీ. మేర రహదారుల పునరుద్ధరణ, విస్తరణ పనులు ఇప్పుడే ఆరంభించాలి.

✦ కొత్త ఘాట్ల నిర్మాణం, పాతవాటికి మరమ్మతులు చేపట్టి, నాణ్యతకు పెద్దపీట వేయాలి.

✦ ఆరు జిల్లాల సంయుక్త కలెక్టర్లు నోడల్ అధికారులుగా అన్ని శాఖలతో సమన్వయం చేసుకొని పనిచేయాలి. ✦ గోదావరి సమీపంలో ఉండే 391 ఆలయాల్లో మరమ్మతులు, 43 ఆలయాల్లో పునర్నిర్మాణ పనులు చేపట్టాలి. ✦ ఈ సమావేశంలో వివిధ శాఖల ఉన్నతాధికారులతో పాటు, ఆరు జిల్లాల కలెక్టర్లు వర్చువల్‌గా పాల్గొన్నారు.





రోడ్లపై కళల ప్రయాణం

- దేశంలోనే తొలిసారిగా 'జీఐ ఆన్ వీల్స్'కు తెలంగాణ ఆర్టీసీ శ్రీకారం

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ సంప్రదాయ కళలు.. మ్యూజియంలు, ఆయా ప్రాంతాలకే పరిమితం కాకుండా..ఇకపై రహదారులపైనా పరుగులు తీయనున్నాయి. ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన వరంగల్ తివాచీలు, పోచంపల్లి ఇక్కత్, నిర్మల్ పెయింటింగ్, చేర్యాల స్క్రోల్ పెయింటింగ్, సిల్వర్ ఫిలిగ్రీ, నారాయణ పేట చీరలు..వంటి ఆరు రకాల జీఐ (జియోగ్రాఫికల్ ఇండికేషన్) కళాకృతులతో అలంకరించిన ఆరు ఎక్స్‌ప్రెస్ బస్సులు ప్రయాణికుల ముందుకు రానున్నాయి. దేశంలోనే మొట్టమొదటిసారిగా తెలంగాణ ఆర్టీసీ 'జీఐ ఆన్ వీల్స్' పేరుతో ఈ వినూత్న కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించనుంది. ఎంజీబీఎస్‌లో జరిగే కార్యక్రమంలో గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డిలు జెండా ఊపి ప్రత్యేక బస్సులను ప్రారంభించనున్నారు. 'కళాకారులకు ప్రోత్సాహం, పర్యాటకానికి ప్రాధాన్యం కల్పించడం ఈ కార్యక్రమం ఉద్దేశం. బస్సులు తెలంగాణ సంస్కృతిని చాటడం ద్వారా పర్యాటకుల్ని ఆకర్షిస్తాయి' అని ఆయా వర్గాలు తెలిపాయి. బస్సులను హైదరాబాద్ వయా పోచంపల్లి, నారాయణ పేట, హనుమకొండ, కరీంనగర్, నిర్మల్‌కు నడపనున్నట్లు తెలుస్తోంది.

- **పోచంపల్లి ఇక్కత్:** యాదాద్రి-భువనగిరి జిల్లాకు చెందిన పోచంపల్లి ఇక్కత్ 2004-05లో జీఐ ట్యాగ్ పొందింది.
- **వరంగల్ తివాచీ:** వెఫ్ట్ ఇంటర్‌లాక్డ్ టెక్నిక్, మన్నికైన పత్తితో నేసిన ఉన్ని తివాచీలు, పూల నమూనాలు ఆ ప్రాంత వారసత్వాన్ని తెలియజేస్తాయి.
- **కరీంనగర్ సిల్వర్ ఫిలిగ్రీ:** సన్నటి వెండి తీగల్ని ముడి పెట్టి లేస్ వంటి ఆభరణాలను తయారుచేయడం వీటి ప్రత్యేకత. రాజపోషణలో పుట్టిన ఈ కళ నేటికీ కుటుంబాల జీవనాధారంగా కొనసాగుతోంది. 2007 జీఐ ట్యాగ్ పొందింది.
- **నారాయణ పేట చీరలు:** చేనేత నైపుణ్యానికి, సంప్రదాయ డిజైన్లకు ప్రసిద్ధి.
- **చేర్యాల పెయింటింగ్:** సిద్దిపేట జిల్లాలో చేర్యాల గ్రామం ఈ రకం పెయింటింగ్‌లో ఖ్యాతి గడించింది.
- **నిర్మల్ పెయింటింగ్:** పర్యావరణ అనుకూలమైన ఈ కళకు నాలుగు వందల ఏళ్ల చరిత్ర ఉంది.

మార్చి 2 నుంచి గ్రాండ్ టెస్ట్, ఎస్‌ఏ-2 పరీక్షలు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో పదో తరగతి విద్యార్థులకు గ్రాండ్ టెస్ట్, తొమ్మిదో తరగతి విద్యార్థులకు ఎస్‌ఏ-2 పరీక్షలు మార్చి 2 నుంచి 12 వరకు నిర్వహించనున్నట్లు పాఠశాల విద్యా శాఖ వెల్లడించింది. ఈ పరీక్షలకు సంబంధించిన పూర్తి షెడ్యూల్‌ను ఆర్‌జేడీలు, డీఈవోలు క్షేత్రస్థాయి సిబ్బందికి చేరవేయాలని సూచించింది. పరీక్షల నిర్వహణలో ఎలాంటి లోపాలకు తావివ్వకుండా జాగ్రత్తలు పాటించాలని ఆదేశించింది.

ఏపీ, ఒడిశా పోలీసుల పరస్పర సహకారంతో మాదకద్రవ్యాల రవాణాకు అడ్డుకట్ట

ఈగల్ విభాగం ఐజీపీ ఆకే రవికృష్ణ

ఈనాడు, అమరావతి: మాదకద్రవ్యాల అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు ఆంధ్రప్రదేశ్, ఒడిశా పోలీసులు పరస్పర సహకారంతో ముందుకు సాగాలని ఏపీ ఈగల్ విభాగం ఐజీపీ ఆకే రవికృష్ణ సూచించారు. రెండు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాల్లో గంజాయి, మాదకద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టే అంశంపై గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా 'బోర్డర్ నార్కోటిక్స్ కన్వర్జెన్స్' సమావేశం నిర్వహించారు. రవికృష్ణ మాట్లాడుతూ.. 'మాదకద్రవ్యాల రవాణాను అడ్డుకోవడానికి రెండు రాష్ట్రాల నుంచి నోడల్ అధికారుల్ని నియమించాలి. సమాచార వినిమయం కోసం ప్రత్యేక కమ్యూనికేషన్ వేదిక ఏర్పాటు చేయాలి. నేరస్థుల వివరాలపై పరస్పర సహకారం, గుర్తించిన హాట్‌స్పాట్లలో సంయుక్త ఆపరేషన్లు, నియమిత సమీక్షా వ్యవస్థ ఏర్పాటు చేయాలి' అని ప్రతిపాదించారు. ఈ సమావేశంలో ఏపీ నుంచి విశాఖపట్నం రేంజ్ ఐజీపీ గోపీనాథ్ జెట్టి, ఎన్‌సీబీ విశాఖపట్నం జోనల్ డైరెక్టర్ పంకజ్ ద్వివేది, ఒడిశా నుంచి ఐజీపీ సార్థక్ సారంగి, సదరన్ రేంజ్ ఐజీపీ నితిశేఖర్, డీఐజీ కన్వర్ విశాల్‌సింగ్, జోనల్ డైరెక్టర్ కుల్దీప్‌శర్మ, ఏపీ ఈగల్ అడ్మిన్ ఎస్పీ నగేశ్‌బాబు తదితరులు పాల్గొన్నారు. అడవులు, అంతర్గత ప్రాంతాల ద్వారా సాగుతున్న రవాణాపై అధికారులు చర్చించారు.

'బెస్ట్ ఎవైలబుల్' స్కాలర్‌షిప్‌ల కేసులో కోర్టు ధిక్కరణ ప్రొసీడింగ్స్‌పై స్టే

- ప్రతివాదులకు నోటీసులు జారీ చేసిన సుప్రీంకోర్టు

ఈనాడు, దిల్లీ: బెస్ట్ ఎవైలబుల్ స్కూళ్లలో చదివే పిల్లలకు ఇచ్చే స్కాలర్‌షిప్‌లను పెంచాలని జిల్లా స్థాయి కమిటీలు సిఫార్సులు చేసినా రాష్ట్ర ప్రభుత్వం ఆ మొత్తాన్ని చెల్లించకపోవడాన్ని సవాల్ చేస్తూ కొన్ని పాఠశాలల యాజమాన్యాలు ఏపీ హైకోర్టు ముందు వేసిన కోర్టు ధిక్కరణ పిటిషన్లపై తదుపరి ప్రొసీడింగ్స్‌ను సుప్రీంకోర్టు నిలిపేసింది. ఈ మేరకు గురువారం జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఉజ్జల్‌భూయాన్‌లతో కూడిన ధర్మాసనం ఉత్తర్వులు జారీచేసింది. రాష్ట్ర ప్రభుత్వం 2021 ఆగస్టు 1న జారీచేసిన జీఓ నం.70 ప్రకారం బెస్ట్ ఎవైలబుల్ స్కూళ్లుగా ప్రకటించిన వాటిలో 3 నుంచి 10వ తరగతి వరకు చదివే విద్యార్థుల సంఖ్యపై తలసరి రూ.12 వేల నుంచి రూ.20 వేల వరకూ స్కాలర్‌షిప్ పొందడానికి వీలుంది. ఈ మేరకు స్కాలర్‌షిప్‌లను రూ.20 వేలకు పెంచాలని కోరుతూ చేసిన ప్రతిపాదనలకు జిల్లాస్థాయి కమిటీ ఆమోదం తెలిపినా రాష్ట్రస్థాయి కమిటీ అందుకు సరైన కారణం చెప్పలేదంటూ రాష్ట్ర ప్రభుత్వం ఆ మొత్తం చెల్లించలేదు. దీన్ని సవాలు చేస్తూ చైతన్య హైస్కూల్‌తోపాటు మరికొన్ని విద్యాసంస్థలు హైకోర్టును ఆశ్రయించగా ఏకసభ్య ధర్మాసనం వారి వాదనలను సమర్థించింది. 3-4 తరగతి విద్యార్థులకు ఇచ్చే స్కాలర్‌షిప్‌లను రూ.15వేలకు, 5 నుంచి 10వ తరగతి వరకు చదివే విద్యార్థుల స్కాలర్‌షిప్‌లను రూ.20వేలకు పెంచాలని చెప్పింది. ఆ తీర్పును రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టు డివిజన్ బెంచ్ ముందు సవాలు చేయగా అక్కడా విద్యాసంస్థలకు అనుకూలంగా తీర్పు వచ్చింది. దీంతో హైకోర్టు తీర్పును సవాల్‌చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో వేసిన పిటిషన్‌పై ధర్మాసనం ఎదుట గురువారం న్యాయవాది ప్రేరణాసింగ్ వాదనలు వినిపించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన విద్యాప్రమాణాలు అందుకున్న స్కూళ్లకే స్కాలర్‌షిప్‌ల పెంపు వర్తిస్తుందన్నారు. ప్రస్తుత కేసులో కొన్ని స్కూళ్ల ప్రతిపాదనలను జిల్లా స్థాయి కమిటీలు ఆమోదించి సిఫార్సుచేసినా రాష్ట్ర స్థాయి కమిటీ ఆమోదించని కారణంగా ఇవ్వలేదన్నారు. అయినప్పటికీ ఏపీ హైకోర్టు ఆ ప్రతిపాదనలను మళ్లీ తాజాగా పరిశీలించమని చెప్పకుండా నేరుగా చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించడం తగదని వాదించారు. ఇది రాష్ట్ర ప్రభుత్వ విచక్షణాధికారాలను హైకోర్టు తన చేతుల్లోకి తీసుకున్నట్లవుతుందని పేర్కొన్నారు. ఈ వాదనలను పరిగణనలోకి తీసుకున్న సుప్రీంకోర్టు ధర్మాసనం ప్రతివాదులకు నోటీసులు జారీచేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. ఇందులో తాము రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా దాఖలుచేసిన కోర్టు ధిక్కరణ పిటిషన్ హైకోర్టు ముందు పెండింగ్‌లో ఉందని ప్రతివాదుల తరఫు న్యాయవాదులు పేర్కొనగా జస్టిస్ బీవీ నాగరత్న అందుకు సంబంధించిన ప్రొసీడింగ్స్‌ను నిలిపివేస్తున్నట్లు స్పష్టం చేశారు.

ఖనిజాల పరిశోధనలకు ఎన్ఎండీసీ, ఐఐటీ భాగస్వామ్యం

ఒప్పందాలపై సంతకాలు చేసిన రెండు సంస్థల ప్రతినిధులు

ఈనాడు, హైదరాబాద్: ఖనిజాల పరిశోధనల కోసం హైదరాబాద్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ)తో జాతీయ ఖనిజాభివృద్ధి సంస్థ(ఎన్ఎండీసీ) పరిశోధన, అభివృద్ధి కేంద్రం ఒప్పందం చేసుకుంది. కృత్రిమ మేధ(ఏఐ), ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్(ఐఓటీ), మైనింగ్ 4.0 ఫ్రేమ్ వర్క్, డ్రోన్ల ద్వారా పర్యవేక్షణ, వాహనాలపై నిఘా వంటి అత్యాధునిక సాంకేతికతను ఖనిజాల పరిశోధనలు, తరలింపులో ఉపయోగించాలనే ప్రధాన ఉద్దేశంతో ఈ రెండు సంస్థలు కలిసి పని చేయనున్నాయి. ఇనుప ఖనిజ శుద్ధి, అగ్లోమరేషన్ రంగాల్లోనూ ఎన్ఎండీసీ, ఐఐటీ కలిసి పరిశోధనలు చేస్తాయి. ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ బి.ఎస్.మూర్తి సమక్షంలో ఎన్ఎండీసీ, ఐఐటీ ప్రతినిధులు ఈ ఒప్పందాలపై సంతకాలు చేశారు. భాగస్వామ్య ఒప్పందంలో భాగంగా స్వదేశీ ముడి పదార్థాలను ఉపయోగించి ప్రత్యామ్నాయ ఇనుము తయారీ పద్ధతులను అభివృద్ధి చేస్తారు. అరుదైన ఖనిజాల వెలికితీతపై కూడా దృష్టి సారిస్తారు. ఐఐటీ పరిశోధన నైపుణ్యాన్ని, ఎన్ఎండీసీ క్షేత్రస్థాయి అనుభవాన్ని జోడించడం ద్వారా మైనింగ్ రంగంలో స్వదేశీ సాంకేతికతను అభివృద్ధి చేయవచ్చని ఒప్పందం సందర్భంగా ఎన్ఎండీసీ ఛైర్మన్, ఎండీ అమితాబ్ ముఖర్జీ పేర్కొన్నారు. ఇది 'ఆత్మనిర్భర్ భారత్'తో పాటు సుస్థిర అభివృద్ధి లక్ష్యానికి దోహదపడుతుందని ఆకాంక్షించారు.

ఇప్పటికే క్రిటికల్ మైనింగ్‌పై ఐఐటీతో కలిసి..

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నేషనల్ క్రిటికల్ మినరల్ మిషన్(ఎన్‌సీఎంఎం) ద్వారా అరుదైన ఖనిజ నిల్వలపై పరిశోధనలు చేపట్టడానికి గతేడాది దేశంలో మొత్తం ఏడు సంస్థలను ప్రయోగాలు, సాంకేతిక అభివృద్ధికి కేంద్ర గనుల మంత్రిత్వ శాఖ గుర్తించింది. ఇందులో హైదరాబాద్‌లోని ఐఐటీ సంస్థ కూడా ఉండడం విశేషం. రాబోయే రోజుల్లో ఈవీలు(ఎలక్ట్రిక్ వాహనాలు) పెద్ద ఎత్తున రానున్నాయి. ప్రతి వాహనంలో లిథియం, నికెల్, కోబాల్ట్ వంటి ఖనిజాలను బ్యాటరీల్లో ఉపయోగించాల్సి ఉంటుంది. 2030 నాటికి ప్రస్తుతం ఉన్న వాహనాల్లో 30 శాతానికిపైగా ఎలక్ట్రిక్ వాహనాలు ఉండే విధంగా కేంద్రం అడుగులు వేస్తోంది. సౌర, పవన విద్యుత్ రంగాల్లోనూ క్రిటికల్ మినరల్స్‌ది ప్రధాన పాత్ర.

యాదగిరి క్షేత్రంలో గరుడోత్సవం

మహావిష్ణువుకు సదా సేవకుడు, వేదస్వరూపుడైన గరుడ ఆళ్వారుడిపై శ్రీలక్ష్మీసమేతుడైన నారసింహుడు శ్రీమహావిష్ణువు రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీయాదగిరి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలలో తొమ్మిదో రోజైన గురువారం ఉదయం గరుడ వాహన సేవ నిర్వహించారు. తొలుత అలంకార సేవకు హారతి నివేదన చేశాక, తిరువీధి పర్వానికి జిల్లా కలెక్టర్ హనుమంతరావు, ఆలయ ఈవో భవానీశంకర్, ధర్మకర్త నరసింహమూర్తి శ్రీకారం చుట్టారు. యాగశాలలో నిత్య పూర్ణాహుతి జరిపారు. డీఈఓ భాస్కరశర్మ, ఆలయ పేష్కార్ రఘు పాల్గొన్నారు.

– న్యూస్‌టుడే, యాదగిరిగుట్ట





మహావిష్ణువు రూపంలో శ్రీలక్ష్మీనరసింహస్వామి ★ కన్నులపండువగా రాత్రి రథోత్సవం

గ్రామ పంచాయతీలకూ ఎల్ఆర్ఎస్, బీపీఎస్ ఆదాయం

ఈనాడు, అమరావతి: అనుమతులు తీసుకోని లేఅవుట్లు, భవనాల క్రమబద్ధీకరణకు ఉద్దేశించిన పథకాల (ఎల్ఆర్ఎస్, బీపీఎస్)పై రుసుముల కింద వచ్చిన ఆదాయం మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీలకు, పట్టణ ప్రణాళిక విభాగానికి కేటాయించడంపై ప్రభుత్వం స్పష్టత ఇచ్చింది. ఇందులోంచి గ్రామ పంచాయతీలకు నిధులివ్వాలని తొలిసారి నిర్ణయించింది. ఈ మేరకు రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి సురేశ్‌కుమార్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

✦ ఎల్ఆర్ఎస్ కింద గ్రామీణ ప్రాంతాల్లో వచ్చిన ఆదాయంలో పట్టణాభివృద్ధి సంస్థలకు 30%, పంచాయతీలకు 50%, మిగిలిన 20% రాష్ట్ర పట్టణ ప్రణాళిక విభాగం సంచాలకుల కార్యాలయానికి కేటాయించనున్నారు. ✦ ఎల్ఆర్ఎస్‌లో పట్టణ ప్రాంతాల్లో వచ్చిన ఆదాయంలో పట్టణాభివృద్ధి సంస్థలకు 10%, పుర, నగరపాలక సంస్థలు, నగర పంచాయతీలకు 25%, మిగిలిన 65% పట్టణ ప్రణాళిక విభాగం సంచాలకుల కార్యాలయానికి కేటాయించాలని నిర్ణయించారు. ✦ బీపీఎస్ కింద గ్రామీణ ప్రాంతాల్లో వచ్చిన ఆదాయంలో పట్టణాభివృద్ధి సంస్థలకు 15%, గ్రామ పంచాయతీలకు 70%, పట్టణ ప్రణాళిక విభాగం సంచాలకుల కార్యాలయానికి మిగిలిన 15% నిధులు కేటాయించనున్నారు. ✦ బీపీఎస్‌లో పట్టణ ప్రాంతాల్లో వచ్చే ఆదాయంలో పట్టణాభివృద్ధి సంస్థలకు 10%, పుర, నగరపాలక సంస్థలకు, నగర పంచాయతీలకు 25%, పట్టణ ప్రణాళిక విభాగం సంచాలకుల కార్యాలయానికి మిగిలిన 65% నిధులు కేటాయిస్తారు.

భాజపా మోర్చాలకు రాష్ట్ర ఇన్‌ఛార్జిల నియామకం

ఈనాడు, అమరావతి: భాజపా రాష్ట్ర భవన నిర్మాణ కమిటీ సభ్యులతో పాటు అనుబంధ విభాగాలకు (మోర్చా) ఇన్‌ఛార్జిలను ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ గురువారం నియమించారు. కొత్తగా ఎంపికైన సభ్యులు ఆయా సామాజికవర్గాలకు మరింత చేరువై.. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. యువ మోర్చాకు కె.అశోక్‌రాజు, మహిళా మోర్చాకు పి.సురేందర్‌రెడ్డి, ఓబీసీ మోర్చాకు కాపు రామచంద్రారెడ్డి, ఎస్సీ మోర్చాకు బొల్లిన నిర్మలాకిశోర్, ఎస్టీ మోర్చాకు గారపాటి సీతారామాంజనేయ చౌదరి, కిసాన్ మోర్చాకు కోలా ఆనంద్, మైనారిటీ మోర్చాకు పైడి వేణుగోపాలం నియమితులయ్యారు. పార్టీ రాష్ట్ర భవన నిర్మాణ కమిటీ సభ్యులుగా విట్టా రమేష్ (కర్నూలు జిల్లా), గట్టి సత్యనారాయణ (కాకినాడ), అంబటి రామకృష్ణారెడ్డి (అనంతపురం), బబ్బూరి శ్రీరామ్ (ఎన్టీఆర్), బోచా సురేష్ (విశాఖపట్నం)లను నియమించారు.

ఆధునిక తెలుగు సాహిత్యంలో దిగ్గజ రచయిత ఇనాక్

కొలకలూరి పురస్కారాల ప్రదానోత్సవంలో ఉస్మానియా వీసీ ఆచార్య కుమార్



పురస్కార గ్రహీతలు నాగేశు, ఎం.వి.రామిరెడ్డి, కెంగార మోహన్, పలమనేరు బాలాజీ, స్వర్ణ కిలారిలతో ఆచార్య చిలుమూరి శ్రీనివాసరావు, ఆచార్య కొలకలూరి ఇనాక్, ఎం.కుమార్, వెలుదండ నిత్యానందరావు, కొలకలూరి మధుజ్యోతి

హైదరాబాద్, న్యూస్‌టుడే: సమాజంపై రచయిత కొలకలూరి ఇనాక్ సాహిత్య ప్రభావం ఎంతో ఉందని, ఆధునిక తెలుగు సాహిత్యంలో ఆయన దిగ్గజ రచయిత అని ఉస్మానియా వర్సిటీ వీసీ ఆచార్య ఎం.కుమార్ అన్నారు. గురువారం తెలుగు విశ్వవిద్యాలయంలోని ఎన్టీఆర్ కళామందిరంలో కొలకలూరి అనితా శ్రీకిరణ్ నిర్వహణలో కొలకలూరి పురస్కారాల ప్రదానోత్సవం ఘనంగా జరిగింది. ద్రావిడ విశ్వవిద్యాలయం(కుప్పం) విశ్రాంత వీసీ ఆచార్య కొలకలూరి మధుజ్యోతి అధ్యక్షతన జరిగిన సభలో వీసీ కుమార్, తెలుగువర్సిటీ వీసీ ఆచార్య నిత్యానందరావు తదితరులు ఇనాక్ సేవలను కొనియాడారు. అనంతరం కొలకలూరి భాగీరథి కథానిక పురస్కారాలు 'ఏకలవ్య కాలనీ(ఎరుకల జీవనగాథలు)' రచయిత పలమనేరు బాలాజీ, 'నల్ల బంగారం' రచయిత్రి స్వర్ణ కిలారికి ప్రదానం చేశారు. కొలకలూరి విశ్రాంతమ్మ నవలా పురస్కారాన్ని 'ఏకుదారం' రచయిత డా.బి.నాగశేషుకు, కొలకలూరి రామయ్య విమర్శన పురస్కారాలు కెంగార మోహన్(చెమట చెక్కిన వాక్యం), ఎం.వి.రామిరెడ్డి(విస్తార)కి ప్రదానం చేశారు.

ఆదాయ పన్ను మినహాయింపునకు పుట్టగొడుగుల్లా పార్టీలు పుట్టుకొస్తున్నాయ్

మద్రాసు హైకోర్టు వ్యాఖ్య

చెన్నై (ప్యారిస్), న్యూస్‌టుడే: ఆదాయ పన్ను మినహాయింపు పొందేందుకు పుట్టగొడుగుల్లా రాజకీయ పార్టీలు పుట్టుకొస్తున్నాయని, కానీ.. ఎన్నికల్లో మాత్రం అవి పోటీ చేయడం లేదని మద్రాసు హైకోర్టు పేర్కొంది. టీవీకే వేసిన పిటిషన్ విచారణ సందర్భంగా కోర్టు ఈ వ్యాఖ్య చేసింది. తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధినేత విజయ్ ప్రచారం సందర్భంగా కరూర్‌లో జరిగిన తొక్కిసలాటలో 41 మంది మృతి చెందిన అనంతరం హైకోర్టు ఆదేశాల మేరకు రాజకీయ నేతల రోడ్ షోలకు ప్రభుత్వం మార్గదర్శకాలను రూపొందించింది. ఈ క్రమంలో ఆ మార్గదర్శకాలను రద్దు చేయాలని కోరుతూ టీవీకే జాయింట్ జనరల్ సెక్రటరీ నిర్మల్‌కుమార్ మద్రాసు హైకోర్టులో పిటిషన్ వేశారు. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎం.ఎం.శ్రీవాస్తవ, జస్టిస్ అరుళ్‌మురుగన్ ధర్మాసనం ముందుకు గురువారం ఇది విచారణకు వచ్చింది. ఈ సందర్భంగా టీవీకే తరఫున న్యాయవాది వాదిస్తూ.. 'బహిరంగ సమావేశాల నిర్వహణకు అనుమతి కోసం 30 రోజుల ముందు దరఖాస్తు చేసుకోవాలన్న నిబంధన ఏకపక్షం. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు ప్రాధాన్యం ఇవ్వడం వివక్షే. పార్టీ కార్యక్రమాలకు భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉంది. ఆ బాధ్యతను పార్టీలపై రుద్దారు' అని పేర్కొన్నారు. దీనికి న్యాయమూర్తులు స్పందిస్తూ.. ఆదాయ పన్ను మినహాయింపు పొందేందుకు పుట్టగొడుగుల్లా పార్టీలు పుట్టుకొస్తున్నాయని, అవి ఎన్నికల్లో మాత్రం పోటీ చేయడం లేదని వ్యాఖ్యానించారు. వివిధ ఎన్నికల్లో పోటీ చేసి ఎంపీలు, ఎమ్మెల్యేలను పొందిన సుదీర్ఘ చరిత్ర కలిగిన పార్టీలకు ప్రాధాన్యం ఇవ్వడంలో తప్పేముందని ప్రశ్నించారు. అనంతరం ప్రభుత్వం సమాధానమిస్తూ.. 'కొత్త మార్గదర్శకాలను అనుసరించి టీవీకే రెండు సమావేశాలను నిర్వహించింది. ఒకే రోజు ఒకే ప్రాంతంలో కార్యక్రమ నిర్వహణకు పలు పార్టీలు దరఖాస్తు చేసుకుంటే గుర్తింపు పొందిన పార్టీలకు ప్రాధాన్యం ఇస్తున్నాం. సేలంలో జరిగిన టీవీకే సమావేశంలో ఎండ తీవ్రతకు ఒకరు మృతి చెందిన తర్వాతే వేలూర్‌లో జరిగిన సమావేశానికి పైకప్పు వేశారు' అని చెప్పింది. న్యాయమూర్తులు మాట్లాడుతూ.. అనుమతుల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు పొందే విషయాన్ని ప్రభుత్వం పరిశీలించాలని సూచించారు. టీవీకే పిటిషన్‌కు మూడు వారాల్లోగా సమాధానమివ్వాలని ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

'స్థానిక' ఎన్నికలు నిర్వహించేలా ఆదేశించండి

హైకోర్టులో పిల్

ఈనాడు, అమరావతి: స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించేలా రాష్ట్ర ప్రభుత్వాన్ని, రాష్ట్ర ఎన్నికల కమిషన్‌ను (ఎస్ఈసీ) ఆదేశించాలని కోరుతూ దాఖలైన ప్రజాహిత వ్యాజ్యంపై హైకోర్టు విచారణ జరిపింది. పూర్తి వివరాలతో కౌంటర్ వేయాలని ఎస్ఈసీ, రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించి విచారణ మూడు వారాలకు వాయిదా వేసింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ ఆర్.రఘునందన్‌రావులతో కూడిన ధర్మాసనం గురువారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చింది. 13,325 గ్రామపంచాయతీలకు, 123 పట్టణ స్థానిక సంస్థల పాలకవర్గాలకు త్వరలో కాలపరిమితి ముగియనుందని, ఎన్నికల నిర్వహణకు ఆదేశించాలని కోరుతూ న్యాయవాది తాండవ యోగేష్ హైకోర్టులో పిల్ వేశారు. గురువారం జరిగిన విచారణలో న్యాయవాది యోగేష్ వాదనలు వినిపిస్తూ.. పంచాయతీలకు ఏప్రిల్ 2తో, పట్టణ స్థానిక సంస్థలకు మార్చి 17తో కాల పరిమితి ముగుస్తుందన్నారు. నిబంధనల ప్రకారం పదవీ కాలం ముగియక ముందే ఎన్నికలు నిర్వహించాల్సి ఉందన్నారు.

కమిషన్‌ను పునర్వ్యవస్థీకరించాం: ఏజీ

రాష్ట్రప్రభుత్వం తరఫున ఏజీ దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపిస్తూ 'సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం ఎన్నికల నిర్వహణకు ముందు బీసీ జనాభా లెక్కింపునకు డెడికేటెడ్ కమిషన్ ఏర్పాటు చేయాల్సి ఉంది. 2023లో ఏర్పాటైన కమిషన్ నివేదిక ఇవ్వలేదు. దీంతో తాజాగా కమిషన్‌ను పునర్వ్యవస్థీకరించాం. బీసీ జనాభా లెక్కింపు పూర్తయ్యాకే స్థానిక ఎన్నికలు నిర్వహించేలా ఆదేశించాలని కోరుతూ హైకోర్టులో ఇప్పటికే మరో పిల్ దాఖలైంది. అన్ని వివరాలను కోర్టు ముందు ఉంచడానికి సమయం ఇవ్వండి' అని కోరారు. అంగీకరించిన ధర్మాసనం విచారణను మూడు వారాలకు వాయిదా వేసింది.